


(తొలితరం యన్నారై స్త్రీల అంతర్మథనం చిత్రించిన కథ)

చాతకపక్షులు (నవల)

తొలి ముద్రణ 2009

2023 ఏప్రిల్ లో సంస్కరింపబడినది.

తొలిపలుకు

గత మూడున్నర దశాబ్దాలలోనూ అమెరికాలో ఉంటున్న తెలుగువారి ఆచారవ్యవహారాల్లో, ప్రవర్తనలలో చాలా మార్పులు వచ్చేయి. డెబ్భైవ దశకంలో వచ్చినవారికి తగిలినంత కల్చర్ షాక్ ఇప్పటివారికి లేదనే నేను అనుకుంటున్నాను. ఇది కేవలం స్త్రీలకే పరిమితం కాదు. అమెరికాకి వచ్చిన మగవారు ఇక్కడి సంస్కృతిలో నిలదొక్కుకుని, అనేక వత్తుడులని తట్టుకుని తమ ధ్యేయాలని సాధించడానికి పడిన అవస్థలు సామాన్యమయినవి కావు. అదే కారణంగా ఇంట్లో ఆడవారిఅవస్థలని మగవారు గమనించలేదు అనడంలో అతిశయోక్తి లేదు.

ఆడవారు ఎదుర్కొన్న వివిధసమస్యలు కొన్నివేల కథల్లో ఆవిష్కరించడం జరిగింది. ఇక్కడ నేను ఆవిష్కరించడానికి ప్రయత్నించింది స్త్రీల అంతర్మథనం.

నేను ఈనవల 80వ దశకంలో మొదలు పెట్టేను కానీ సాగలేదు. తిరిగి 2004లో తీసి పూర్తి చేశాను, అప్పట్లో కొత్తగా పరిచయమయిన కల్పన రెంటాల, ఎపీవీక్లీ.కాం సంపాదకుడు ఇవటూరి సురేష్ ఇచ్చిన సూచనలు ఆధారంగా కొన్ని మార్పులు చేసినతరవాత 2004 అక్టోబరులో ధారావాహికంగా ఎపీవీక్లీ లో ప్రచురించారు. కల్పనకీ, సురేష్ గారికీ ధన్యవాదాలు.

2007లో తెలుగుతూలిక బ్లాగు మొదలు పెట్టినతరవాత పాఠకుల స్పందనలు నాకు గొప్ప ఉత్సాహాన్ని ఇచ్చేయి. నా శైలి కూడా మరింత పరిణతి సాధించింది అనే అనుకుంటున్నాను. ఆ కారణంగా ఈ నవల మరొకసారి క్షుణ్ణంగా పరిశీలించుకుని, శిల్పం దృష్ట్యా విస్తృతమయిన మార్పులు చేసి నా బ్లాగు, తెలుగు తూలిక (www.tethulika.wordpress.com) లో ప్రచురించాను. **ఈ ప్రతికీ ఎపీవీక్లీలో ప్రచురించిన ప్రతికీ మధ్య చెప్పుకోదగ్గ మార్పులే వున్నాయి.**

తెలుగుతూలిక పాఠకులని నేను అభిప్రాయాలు అడిగినప్పుడు, కొందరు ”మాకేం తెలుసండీ, పిల్లకాకులం” అంటారు. నిజానికి ఈపిల్లకాకులే నాకు ప్రేరణ. ఈనాటి పిల్లకాకులే రేపటి కోకిలలూ, పీకాకులూను (peacocks) అని నేను మనసారా నమ్ముతాను.

ఏప్రిల్ 3, 2023

చాతకపక్షులు

కొత్త పెళ్లికూతురు గీత నల్లపూసలసౌరుతో, మేలిమి బంగారుగాజులమెరుపులతో, కొనగోళ్ల వెలవెలబోతూన్న గోరింటాకుతో న్యూయార్క్ airportలో దిగి చుట్టూ చూసింది. మనసూ, మెదడూ కూడా గందరగోళంగా వున్నాయి. "నేనిప్పుడు అమెరికాలో వున్నాను" అని ముప్ఫైమూడోసారి తనకి తనే చెప్పుకుంది. నమ్మశక్యం కావడం లేదు కానీ అది నిక్కచ్చి నిజం.

అసలు తనపెళ్లే హరితో అంత హడావుడిగానూ జరిగిపోయింది. అమెరికాలో వున్న హరి ఆదరా బాదరా రెండువారాలు శలవు తీసుకుని, ఇండియా వచ్చి, వధూపెర్చి చేసి, గీతని చూసి, వెంటనే ఆఅమ్మాయిని చేసుకుంటున్నానని ప్రకటించేసేడు బంధువర్గంలో. అప్పటికి అతను తీసుకున్న రెండువారాల్లో పదిరోజులు అయిపోయాయి. లక్ష్మింవారం పెళ్లి. శుక్రవారం తిరుగుప్రయాణం .... అంతా కలలోలాగ జరిగిపోయింది. ఆతరవాత రెండు నెలలపాటు గీత "నాపెళ్లి అయిపోయింది" అని తనకి తనే కొన్నివందలసార్లు చెప్పుకుంటూ వచ్చింది. రెండునెలల్లో వీసా వచ్చేసింది.

న్యూయార్కు airportలో గీత మరోసారి చుట్టూ చూసింది యంత్రవతుగా ముందుకి సాగుతూ. తనని తోసుకుపోతున్న జనాలతోపాటు ప్రవాహంలో కలిసిపోయి, కన్వేయరు బెల్టు దగ్గరకొచ్చింది. బెల్టుమీద విలాసంగా జారివస్తున్న సూట్ కేసులనీ, వాటికోసం ఆత్రంగా చూస్తున్న ప్రయాణీకులనీ, సామాన్లబండీలు వెతుక్కుంటున్నవాళ్లనీ, పోర్టర్లనీ చూస్తూ, ఇటు తిరిగేసరికి, తన సూట్ కేసులు చాలా ముందుకి వెళ్లిపోయాయి. "అయ్యో, నాసూట్కేసులు" అంటూ గీత తనముందున్న జమాజెట్టీల్లాటి ఇద్దరు ఆసామీలనీ తోసుకు ఒక్క వుదుటున ఎగిరి అందుకోబోయింది. ఆమెచే అలా తోయబడిన ఇద్దరిలో ఒక అమెరికను నవ్వి, ఫరవాలేదు, ఆపెట్టె ఓచుట్టు చుట్టి మళ్లీ వస్తుందని హామీ ఇచ్చి ఆమెని శాంతపరిచేడు. ఆతరవాత ఆ పెట్టె తిరిగి రాగానే, అతనే అందుకుని, గీతకి అప్పజెప్పాడు. గీత కళ్లనిండా కృతజ్ఞతలు నింపుకుని థాంక్స్ అంది. అతను "యూ ఆర్ వెల్కం" అన్నాడు. గీతకి మళ్లీ ఏం అనాలో తెలీక వూరుకుంది. ఆతరవాత మళ్లీ జనప్రవాహంలో కలిసిపోయి, ముందుకి సాగి, 'కస్టము'ల కౌంటరుదగ్గరకి చేరుకుంది. అక్కడ పది వరసలున్నాయి. ఏవరస చూసినా హనుమంతుడి తోకలా అంతూ పొంతూ కనిపించడంలేదు. కనీసం గంట పట్టేట్టుంది అక్కడినుండి బైట పడడానికి. కానీ తాను చెయ్యగలిగిందేమీ లేదు.

మత్తేభయానంతో నెమ్మదిగా కౌంటరుదగ్గరకి చేరింది. అక్కడ కష్టములవాడికి తాను తెచ్చిన కందిపొడీ, కారప్పొడీ, చింతకాయపచ్చడీ, అల్లప్పచ్చడీ ఇత్యాదులు ప్రమాదకరమైన బాంబుపొడులు కావనీ, edible అనీ, preservatives added అనీ నచ్చచెప్పి, ఆ కర్మకాండ అయిందనిపించుకునేసరికి మరో మూడు గంటలు పట్టింది. ఒకొకరే తమకోసం వచ్చినవారిని పట్టుకుని వెళ్లిపోతున్నారు. గీత నెమ్మదిగా తన చక్రాలపెట్టెలు ఈడ్చుకుంటూ తనకోసం వచ్చిన హరిగారు చెప్పిన పీటర్ ఎవరై వుంటారా అని చూస్తోంది.

గీత బయల్దేరడానికి రెండురోజులముందు హరి అమెరికానించి ఇండియాకి ఫోను చేసేడు గీతపక్కింటివాళ్లకి. గీతఇంట్లో ఫోను లేదు. అత్యవసరం అయితే పిలవొచ్చని పక్కింటివారి నెంబరు ఇచ్చింది. ఆ ఇంటాయన అర్థరాత్రి గీతని పిలిచి మీఆయన పిలుస్తున్నాడంటూ చెప్పేరు. గీతకి చచ్చేంత సిగ్గేసింది ఆయన తనచేతికి ఫోనిచ్చి ఆగదిలోనే కాస్త దూరంగా సోఫోలో కూచోడం చూసి. ఏం మాటాడడానికీ తోచలేదు. హరి చెప్పినమాటల సారాంశం, తనకి అనుకోకుండా పెద్ద పని తగిలిందనీ, గీత న్యూయార్కులో దిగేరోజుకి airportకి రాలేననీ, తన ప్రాణస్నేహితుడూ, తెలుగు తెలిసినవాడూ అయిన పీటర్ వచ్చి రిసీవు చేసుకుంటాడనీ... గీత సరేనంది. కొండగుర్తుగా అతను తెల్లగా వుంటాడనీ, పొడుగ్గా వుంటాడనీ, పోల్చుకోడం తేలికేననీ చెప్పేడు.

సరేనంది గీత.

గీత airportలో మరోసారి కలియచూసింది చుట్టూ. ఆజనాల్లో అందరూ తెల్లగానే. పొడుగ్గానే కనిపించేరు గీత కళ్లకి. వారిలో ఎవరు పీటర్ అయివుండొచ్చో ఎలా తెలుస్తుంది?

గీత తికమకగా తనని దాటిపోతున్నవారిమొహాలు ఒకటొకటే చూస్తుండగా వెనకనించి “నమస్కారమండీ” అని వినిపించింది.

గీత వులిక్కిపడి, తెలుగుపలుకు వినిపించినదిక్కు చూసింది. ఆంజనేయుడిలా రెండుచేతులూ జోడించి, చిరునవ్వుతో, చికిలికళ్లతో నిలుచున్నాడతను. గీతకి ప్రాణం లేచొచ్చింది. దేశం కాని దేశంలో ముక్కూ మొహం ఎరగని ఆ పీటర్ సాక్షాత్తు అలనాడు కరీంద్రుని కాపాడిన శ్రీహరివలె తోచాడు ఆ క్షణంలో.

“షమించాలి. తొరగానే బయల్దేరేను కానీ మద్యలో చిన్న ప్రమాదము జరిగినది. కాప్పుని పిలిచి, రిపోర్టు ఇచ్చేపటికి ఆలస్యమయినది” అన్నాడు గబగబా, బట్టీ పట్టిన పాఠం అప్పచెపుతున్నట్టు.

గీత తలకెక్కింది యాక్సిడెంటు అన్నమాట ఒక్కటే. గుండె దడదడలాడింది ఓనిముషం.

తరవాత పీటర్ గీతచేతిలో పెట్టెలు అందుకున్నాడు. గీత ఐ విల్ ఐ విల్ .. అంది కానీ అతను వినిపించుకోలేదు. గీతకి ఇండియాలో చాలామంది స్నేహితులు అంపకాలవేళ గట్టిగా చెప్పేరు అమెరికాలో ఎవరిసామాను వారే మోసుకుంటారని. ఆ విషయం తనకి తెలుసని అతనికి తెలియజేయడానికి తెగ ఆరాటపడింది కానీ ఆతను కూడా తనకి ఇండియాలో ఆచారాలు అంత బాగానూ తెలుసని ఋజువు చేసే యత్నంలో వున్నాడు.

“మీదేశంలో ఆడవారిచేత సామాను మోయించడము అపచారము కదా”.

గీత నవ్వింది ఏంచెప్పాలో తెలీక.

“ఒక రూపాయి ఈండి మేడమ్” అన్నాడు అతనే మళ్లీ.

బయటికొచ్చేక, తనని ఓవార నిలబడమని చెప్పి కారు తీసుకురావడానికి వెళ్లేడు. అతను తీసుకొచ్చిన కారు చూసింతరవాత గీత మరింత గాభరా పడింది. అది చాలా గాలివానలకి తట్టుకు నిలబడిన పెంకుటిల్లులా వుంది. పోనీ టాక్సీలో పోదాం అంటే అతనేం అనుకుంటాడో అని భయం. మామూలుగా ఇండియాలోలాగ వెనకసీటులో కూర్చుందాం అనుకుంటూ కారుపక్కన నిలబడింది. పీటర్ పెట్టెలు ట్రంకులో పెట్టి, తిరిగొచ్చి ముందుసీటు తలుపు తీసి పట్టుకు నిలబడ్డాడు. గీత మాటాడకుండా సీటులో కూర్చుంది, అమ్మనీ, నాన్ననీ, తోబుట్టువులనీ, ప్రాణమిత్రురాళ్లందరినీ తలుచుకుంటూ, రెండోసారి అంపకాలవేళలాగ అనిపించింది ఆక్షణం ఆ అమ్మాయికి.

అతను చుట్టుతిరిగి వచ్చి డ్రైవరుసీటులో కూర్చుని, సీటుబెల్టు పెట్టుకుంటూ, గీతని కూడా వేసుకోమన్నాడు. గీత సరేనంటూ లాగి దాంతో కుస్తీ మొదలుపెట్టింది. పీటర్ నవ్వుతూ కొంచెంసేపు చూసి, మే ఐ అంటూ అందుకుని లాగి, తగిలించేడు ఆ ఆభరణం. ఆమరుక్షణంనించీ గీతకి ఆబెల్టు మెడమీద గీసుకుంటూ, గుండెలమీద బలంగా వత్తుకుంటూ మహ చిరాకు పెట్టసాగింది. ఏమిటో ఇది గొడ్డుని కట్టి పడేసినట్టు అనిపించింది. ఆ సీటుబెల్టు వెనక గీత గింజుకుంటుంటే పీటర్ కి చూడనట్టు నటించడం కష్టంగా వుంది.

“తప్పదాండీ?” అంది గీత ఆతను తనవస్థ గ్రహించేడని.

“తప్పదు. మీరు పెట్టుకోకపోతే, నాకు ఇస్తారు బహుమానం,” అన్నాడతను.

దారి పొడుగునా అతను ఏవో చెపుతూనే వున్నాడు, హరి తనకి ప్రాణమిత్రుడుట, తాను హైదరాబాదులో రెండేళ్లుండి కర్ణాటకసంగీతం నేర్చుకున్నాడు, అప్పుడు హరి పరిచయం అయేడు. హరి పరిచయం కాకపోతే హైదరాబాదులో తాను ఎంతో బాధ పడివుండేవాడో … ఇంకా తనకి తెలుగుదేశం ఎంతగా నచ్చిపోయిందో, అక్కడ జనాల మర్యాదలూ, సాంఘికధర్మాలూ, ఎంత గొప్పగా వున్నాయో ,.. చెప్పుకుపోయేడు.

గీత చదువుకున్న ఇంగ్లీషు అతని అమెరికనుయాస అర్థం చేసుకోడానికి పనికిరాలేదు. ఊఁ కొడుతూ, కిటికీలోంచి చూస్తోంది. రాత్రె అయినా పట్టపగ్గల్లా వుంది మిరుమిట్లు గొలిపే దీపాలవెలుగులో. ఆకాశంలో చుక్కలు కనిపించడంలేదు. మెడ రిక్కించి చూసినా. భవనాలకి కప్పులు ఎక్కడున్నాయో తెలీడంలేదు. రోడ్డుమీద రంగు రంగుల కార్లు దూసుకుపోతుంటే ఎవడు ఎవడికి పెట్టేస్తాడో అనిపించినా, అందరూ ఏదో ఓ పద్ధతి ప్రకారం పోతున్నట్టు కూడా అనిపిస్తోంది. ట్రాఫిక్ దీపాలు తమధర్మాన్ని నిర్విరామంగా నిర్వర్తిస్తున్నాయి.

“ఆదీపాలు ఒక్కసారిగా ఆరిపోతే ఈకార్లగతి ఏమిటో,” అంది సాలోచనగా.

“హైదరాబాదులో ఆటో రిక్షాలకంటే అన్యాయమా?” అన్నాడు పీటర్.

ఇల్లు చేరేసరికి మూడున్నర అయింది. కారు దిగుతుంటే, సూసన్ వచ్చి తలుపుదగ్గర నిలబడి హాయ్ అంది. పీటర్ సూట్కేసులు తీసుకుని, తనవెనక నిలబడితే గీతకి ఎబ్బెట్టుగా అనిపించింది కానీ తాను చేయగలిగింది ఏమీ లేదు.

సూసన్, "ఇది బాత్రూము, ఇది నీగది" అని రెండడుగులు అటూ ఇటూ వేస్తూ ఇల్లు చూపించేసింది. తరవాత, "ఏమైనా తింటారా?" అని అడిగింది.

గీతకి మాచెడ్డ మొహమాటంగా వుంది. "ఏం వద్దు" అంది.

"సరే పడుకోండి. తరవాత చూద్దాం." అన్నాడు పీటర్.

"దాదాపు తెల్లారిపోయింది. ఇప్పుడు నాకు నిద్ర రాదు" అంది గీత.

"కాఫీ తాగుతారా?" సూసన్ అడిగింది.

"ఇప్పుడేం వద్దండీ" అంది మళ్ళీ, ఎవరేనా ఒకప్పు మంచి కాఫీ పోస్తే బాగుండు నన్నమొహం పెట్టి.

పీటర్ నవ్వేడు. "మీరు అలా మొహమాట పడితే లాభం లేదిక్కడ. మాకిక్కడ వద్దు అంటే వద్దనే అర్థం" అన్నాడు.

"కావాలి కదూ" అంది సూసన్ కూడా నవ్వుతూ.

గీత ఇబ్బందిగా మొహం పెట్టి అవునన్నట్టు తలూపింది.

"కాఫీ రెడీగానే వుంది. మీరు కాస్త చన్నీళ్లతో మొహం కడుక్కు రండి" అంది బాత్రూంవేపు చూపుతూ.

గీత మొహం కడుక్కు వచ్చేసరికి మూడు మగ్గుల్లో కాఫీ పోసి, పాలూ, పంచదారా, బల్లమీద సిద్ధం చేసింది సూసన్.

అప్పటికి టైం ఐదున్నర. విజయవాడలో వుంటే ముగ్గులు పెట్టేవేళ.

"కాస్త రెస్టు తీసుకోండి" అన్నాడు పీటర్.

గీత సరేనని చెప్పి, తనకి నిర్ణయించిన గదిలోకి వెళ్లింది. మంచంమీద కూర్చుని చుట్టూ కలియజూసింది. గదినిండా ఊపిరాడకుండా సామానూ, పెచ్చులూడిన గోడలూ, పగుళ్లేసిన గోడలమీద బొద్దింకలూ, ... గీతకి వికారంగా వుంది. తాను ఊహించుకున్న అమెరికాకీ చూస్తున్న దృశ్యానికీ సహస్రాంతం తేడా. సూట్కేసులోంచి మరోచీరె తీసి, మార్చుకుంది. మంచంమీద వాలగానే నిద్ర ముంచుకొచ్చేసింది.

కళ్లు తెరిచేసరికి హరి ఎదురుగా నిలబడి వున్నాడు తనవేపే తదేకదృష్టితో చూస్తూ, నవ్వులు విరజిమ్మే మొహంతో .

"అయిందా నిద్ర" అన్నాడు మంచం అంచున కూచుంటూ.

"ఎంతయిందేమిటి టైము?" అంది గీత గబుక్కున లేచి కూచుని.

"ఫరవాలేదులే. కావలిస్తే కొంచెంసేపు పడుకో. ప్రయాణం బాగా జరిగిందా? మరేం ఇబ్బంది అవలేదు కదా. నిన్ను బొంబేలో ఎవరు ప్లేనెక్కించేరు?" అంటూ ప్రశ్నలమీద ప్రశ్నలు గుప్పిస్తూంటే గీతకి నవ్వొచ్చింది. పడుకో అన్నాడే కానీ వాలకం చూస్తే తనని పడుకోనిచ్చేట్టు లేడు.

"మీప్రశ్నలన్నిటికి జవాబులు చెప్తూ కూచుంటే, ఇవాళే కాదు మరో వారంరోజులవరకూ నిద్ర ఆశ లేనట్టే నాకు."

"నిద్దరోడానికా ఏమిటి మరి నిన్నింత హడావుడిగా రప్పించుకున్నది," అన్నాడు హరి మరింత దగ్గరికి జరుగుతూ.

"ష్ ఉండండి" అంటూనే అతనిచేతుల్లో ఇమిడిపోయింది గీత.

ఇద్దరూ లేచి లివింగ్రూంలోకి వచ్చేరు. సూసన్ బల్లమీద వాళ్లకి breakfast, కాఫీమేకరులో కాఫీ సిద్ధం చేసి ఆఫీసుకి వెళ్లిపోయింది. హరి breakfast చేసేడు. గీత కాఫీ మాత్రం తీసుకుంది. తరవాత ఇద్దరూ airportకి బయల్దేరేరు. పీటర్ అంతకుముందే వాళ్లకి టాక్సీ ఏర్పాటు చేసి వెళ్లిపోయేడు.

"కొంచెం ముందే లేచి వుండేదాన్ని వాళ్లు వెళ్లిపోతారని తెలిస్తే" అంది గీత నొచ్చుకుంటూ.

"ఫరవాలేదులే. ఇక్కడ బతుకులింతే మరి. ఒకే పంచనున్నా ఎవరిబతుకులు వారివే. ఎవరిపనులు వాళ్లవే. లేకపోతే ఏ పనీ అవదు."

airport చేరేసరికి పదకొండయింది. వాళ్ల ఫ్లైట్ పన్నెండుంబావుకి. సూట్కేసులు చెక్ చేసేసి, పచార్లు చేస్తూ హరి గీతకి ఇక్కడి ఆచారాలూ, అలవాట్లమీద పాఠాలు మొదలుపెట్టేడు. "నువ్విక్కడ కూచో, రెండు నిముషాల్లో వస్తాను" అని గీతకి ఓ కుర్చీ చూపించి ఓ చిన్న దుకాణంవేపు వెళ్లేడు.

గీతకి హఠాత్తుగా చెప్పలేనంత నీరసం ముంచుకొచ్చింది. ఉరుకులు, పరుగులుగా అటూ ఇటూ పరుగులెడుతున్న అంతమంది జనాలమధ్య తాను ఏకాకిని అన్న భావం ఉవ్వెత్తుగా పొంగుకొచ్చి తలమునకలైంది రెండునిముషాలపాటు. ఇప్పుడే వస్తానంటూ వెళ్లిన హరి పావుగంట తరవాత తిరిగి వచ్చేడు ఇద్దరికీ చెరో కప్పు కాఫీతో. అతన్ని చూసేసరికి, హమ్మయ్య అంటూ ఊపిరి తీసుకుని, అతని చెయ్యి గట్టిగా పట్టుకుంది. ఇంతటి విశాలప్రపంచంలో తనకి ఆత్మీయుడు అతనొక్కడే!

హరి కూడా అది గ్రహించినట్టు, గీతభుజంచుట్టూ చెయ్యేసి, దగ్గరికి తీసుకున్నాడు. ఆఅమ్మాయి తనమీద అంత గొప్ప నమ్మకం పెట్టుకోవడం అతనికి ఎనలేని ఆనందాన్ని ఇచ్చింది. ఇసుమంత జాలి కూడా కలిగింది. "ఫరవాలేదు, నేనున్నాను కదా" అన్నాడు కళ్లతోనే. అవునన్నట్టు తృప్తిగా నిట్టూర్చింది గీత.

***

అదివో అల్లదివో శ్రీహరి నివాసమూ అన్నాడు హరి మూడంతస్థులమేడ చూపించి, గీత టాక్సీలోంచి దిగి అటువేపు చూసింది. వరసగా నాలుగు కిటికీలు. అతను చూపిస్తున్నది ఏకిటికీవో అర్థం కాలేదు. సరేలే లోపలికెళ్లేక అదే తెలుస్తుందని వూరుకుంది.

అప్పటికి రాత్రి తొమ్మిదయింది. కొత్తకోడలు అత్తారింట అనగా భర్తగారింట అడుగెట్టింది.

తలుపుమీద "వెల్కమ్ హోమ్" అట్టముక్క స్వాగతం చూసి చిన్నగా నవ్వుకుంది. హరి తలుపు తీసి, సామాను గోడవార పెట్టి, "ఇదీ మన స్వర్గసీమ. అదుగో ఎదురుగా కనిపిస్తున్నది వంటగది. దానికి

ఎడమవైపు రెండున్నర అడుగులదూరంలో వున్నది బాతురూము. దాన్నానుకుని బెడ్రూము. ఇది మన భోజనశాల" అన్నాడు ఎదురుగా వున్న బల్లదగ్గరికి గీతని నడిపిస్తూ.

బల్లమీద చిన్నకుండీ, అందులో ముందురోజు హరి స్నేహితులు అమర్చిన పువ్వులు. వంటింట్లో గిన్నెలూ, కాఫీమగ్గులూ చక్కగా ఫాన్సీషాపులోలాగ పేర్చి వున్నాయి. లివింగురూంలో వున్న ఒకే ఒక కిటికీకి వేసిన తెరకీ కాఫీరంగుసోఫాకి వర్ణసఖ్యత బాగానే కుదిరింది. గీత కిటికీవేపు రెండడుగులేసి, తెర తీసి బయటికి చూసింది. కింద అక్కడా అక్కడా ఒకరిద్దరు సైకిళ్లమీద వెళ్తూ కనిపించేరు. కాలి నడకన వెళ్లే జనాలు తక్కువే.

హరి గబుక్కున ఆమెచెయ్యి పుచ్చుకుని, "నో, నో, అది తీయకు" అంటూ అడ్డుకున్నాడు.

"ఏం?" అంది గీత.

"అది తీస్తే, మనం నడివీధిలో వున్నట్టుంటుంది. మనంవిక్కడ జాగ్రత్తగా వుండాలి" అన్నాడు తమ ఇంటిపరిసరాలు చూచాయగా వివరిస్తూ. అంతకంటె ఎక్కువ మాటాడితే, ఆఅర్భకురాలు ఝుడుసుకుని ఇప్పుడే తిరుగుటపా కట్టేస్తుందేమో అనిపించిందతనికి గత పధ్నాలుగ్గంటల్లోనూ ఆవిడవాలకం చూసింతరవాత.

నిజానికి గీతకి కొత్తపెళ్లికూతురు అత్తవారింట అడుగెట్టినట్టు లేదు. సరదాగా శెలవులకి ఏదో వూరెళ్లి ఓ హోటేల్లో దిగినట్టుంది.

ఆఇల్లు రెండుతరాలకి ముందు ఒక సాధారణకుటుంబం కాపురమున్నది. ఇటీవల కుర్ర యజమానికి హక్కుభుక్తం అయింతరవాత, అతను బాత్రూంలో ఓ స్టవ్వూ, వంటింటిలో టాయిలెటూ, మరో బెడ్రూంలో మరో స్టవూ, టాయిలెటూ, .. ఇలా మార్పులూ, చేర్పులూ చేసి మూడు ఎపార్టుమెంటులుగా మార్చేసి అద్దెలకిచ్చేడు.

"బావుందా?" అన్నాడు హరి అర్ధాంగితో.

గీత తలూపింది బావుందని సూచిస్తూ. గీతకింకా అయోమయంగానే వుంది. మెదడు పని చేయడం మానేసి మూర్రోజులయింది. ఆలోచనలనేవి పుట్టేచోట నీలినీడలు దట్టంగా పరుచుకున్నాయి. ఆవిషయం హరిదృష్టి దాటిపోలేదు. ఇరవైనాలుగ్గంటలలో భూగోళానికి ఆచివరినుండీ ఈచివరికి ఒక్కపెట్టున విసిరేసినట్టు వచ్చి పడితే, ఎవరికి మాత్రం గందరగోళంగా వుండదు? నిన్న పడుకున్న మంచానికీ ఇవాళ పడుకోబోయే మంచానికీ మధ్య రెండు సముద్రాలు, పదివేల మైళ్లదూరం. ఎటు చూసినా గుర్తెరగని మొహాలూ, పుట్టి బుద్ధెరిగిన తరవాత ఏనాడూ కనని వస్తుసంచయం, వినని మాండలీకం ...

ఫోను రింగురింగుమంది.

గీతని పడుకోమని చెప్పి, ఫోను తీసుకున్నాడు హరి.

ఊళ్లో పదేళ్లుగా పాతుకుపోయి, ఊరందరికీ పెద్దదిక్కుగా వ్యవహరిస్తున్న భాగ్యంగారు పిలిచారు, "అమ్మాయి వచ్చేసిందా? ప్రయాణం బాగా జరిగిందా? ఏమైనా కావాలా?"

గీత సోఫాలో వాలి, అతనిమాటలనిబట్టి అవతలివారి మాటలు ఊహించుకోడానికి ప్రయత్నిస్తోంది. … ఆతరవాత మరో రెండుగంటలసేపు హరి ఫోనుమీదే వున్నాడు. సగంమంది తనగురించి తనప్రయాణంగురించి అడుగుతున్నట్టే వుంది. మిగతా సగం నిక్సను రాజీనామా చేసేశాడు, తరవాత దేశం గతేంకానూ వంటి చర్చల్లోకి దిగేరు. హరి ఫోను పెట్టేసి, "ఇహ ఫోర్డు పొడిచేసేదేమిటో చూడాలి" అన్నాడు. గీతవేపు తిరిగి. గీతకి మగతగా నిద్రపడుతోంది.

"అలిసిపోయినట్టున్నావు. రా. అన్నం తిని పడుకుందువుగానీ. హాయిగా నిద్దర పడుతుంది."

గీత లేచి బల్లదగ్గరికి వస్తూ, "ఎవరు చేసేరు వంట?" అంది.

"ఏం? నాకు వంట రాదనుకున్నావేమిటి?"

"మామూలుగా అమెరికాలో ఏడాదిపాటు వున్నవాళ్లందరూ పెళ్లి చేసుకుంటాం అంటూ హడావుడిగా ఇండియా రావడానికి కారణం వంట రాకపోవడమే అంది మా సత్యం" అంది గీత నెమ్మదిగా ఉడికిస్తున్నట్టు.

హరి ఫక్కున నవ్వేడు "గట్టిదానివే. మెత్తగా నంగనాచిలా కనిపిస్తావు కానీ," అన్నాడు మొహంలోకి మొహంపెట్టి కళ్లలోకి చూస్తూ. గీత కళ్లు చికిలించి తలూపింది వెక్కిరిస్తున్నట్టు.

తింటున్నంతసేపూ "అదెలా వుంది, ఇదెలా వుంది" అంటూ హరి ఒహటే గొడవ చేసేడు.

ప్రతిసారీ, "బావుంది," "చాలా బావుంది" "ఫరవాలేదు" "ఇదేమిటీ, తోటకూరా? బచ్చలికూరలా వుందే, నువ్వులపొడి వేసి చేస్తే బావుంటుంది" అంటూ గీత జవాబులు చెబుతుంటే, హరి మహ ముచ్చట పడిపోయేడు. ఒక్కపూటలోనే గీతలో ఎంత మార్పు వచ్చేసింది అనుకుని ఉబ్బిపోయేడు. భవిష్యత్తంతా బంగారం!

"ఫరవాలేదులే. నెమ్మదిగా అదే అలవాటయిపోతుంది. అన్నీ బాగానే వుంటాయి." అన్నాడు ఏవిషయమో స్పష్టం చెయ్యకుండా.

గీతకి కూడా మనసు స్థిమితపడింది. ఆక్షణాన అతడు జననాంతరబంధువులా తోచేడే కానీ ఇటొచ్చి పెళ్లాడేసి అటు ప్లేనెక్కేసిన ఎన్నారయ్యీ అనిపించలేదు. ప్రయాణపుబడలిక కూడా కాస్త తగ్గినట్టే వుంది. మంచం ఎక్కితే నిద్దర రాను కాక రానని మొండికేసింది.

జట్లాగన్నాడు హరి ఇదే కాబోలు. శరీరం అమెరికా చేరినా శరీరతత్త్వం ఇంకా తెలుగుదేశం వదలనంటోంది. పన్నెండు దాటింది. తెల్లవారుతుంటే చిన్న కునుకు పట్టింది.

బాగా తెల్లారింతరవాత లేచి. మొహం కడుక్కుని వచ్చేసరికి, హరి కాఫీ పెట్టి వుంచాడు.

గీత చిన్నగా నవ్వుతూ, "అమెరికాజీవితం ఇంత సుఖం అనుకోలేదు" అంది.

"ఇంకా ఇప్పుడే ఏం చూశావు?" అన్నాడు గీత కళ్లలోకి చూస్తూ.

ట్రింగుమంటూ ఫోను …

"తెల్లారిందీ ఫోనులకి? ఇంత పొద్దున్నే ఎవరూ అలా ఫోనులు చెయ్యరన్నారూ …"

“అమెరికనులు చెయ్యరు. మనవాళ్లకలాటి పట్టింపులు లేవు. తొలికోడి కూస్తూనే పిలుపులు మొదలయిపోతాయి” అన్నాడు హరి ఫోను అందుకుంటూ.
అతనన్నమాట నిజమే. అవతల్నించి మాధవ్ పిలిచాడు. తనూ రాధా మరో గంటలో రావచ్చా గీతని పలకరించి, స్వాగతం చెప్పడానికి అని.
“అప్పుడే ఏమిటండీ ఈ అభ్యాగతులు?” అంది గీత. తనకింకా అసలు అమెరికా చేరినట్టే లేదు.
“వాడు అభ్యాగతుడు ఏమిటి? ఇంటివాడికిందే లెక్క. వాడూ నేనూ ఒకే బళ్లో చదువుకుని, ఒకే పంతులిచేతిలో బెత్తపురుచులు చూసినవాళ్లం. నువ్వేం తయారవఖ్కర్లేదులే. రెండునిముషాలు చూసి పోతారంతే. ఈదేశంలో మన మొహాలు ఎక్కడయినా కనిపిస్తాయా అని ఆవురావురుమని ఎదురుచూస్తుంటాం. నీకే తెలుస్తుందిలే క్రమంగా. వాళ్లు వస్తాం అంటే రావద్దని ఎలా చెప్పను?” అన్నాడు హరి గుక్క తిప్పుకోకుండా.
గీత లేచి పెట్టెలోంచి, చీరే జాకట్టూ, లంగా తీసుకుని బాత్రూంలోకి వెళ్లింది. స్నానం ముగించుకు వచ్చేసరికి, రాధా మాధవులు వచ్చేశారు. ఇద్దరు పిల్లలు వాళ్లకి, వయసులు ఎనిమిదీ, పదీ.
“పిల్లలేరీ?” అనడిగేడు హరి తలుపు తీస్తూ.
“మా పక్కింటావిడ వాళ్ల పిల్లలతో County fairకి తీసుకెళ్లింది వాళ్ల పిల్లలతోపాటు. మధ్యాన్నానికి వచ్చేస్తారు. అందుకే హడావుడిగా ఇటొచ్చేశాం ఆకాస్త టైమునీ సద్వినియోగం చేసుకుందాం అని.” అన్నాడు మాధవు.
గీత వాళ్లని చూసి మనసులోనే లెక్కలు కట్టుకుంటూ, ఒదశాబ్దం పెద్దవారు అనుకుంది.
మరో అరగంట అయేసరికి సుమతి, టేషు దిగారు. టేషుకి కారు లేదు. సుమతి అతన్ని తీసుకొచ్చింది తనకారులో. ఆవెంట పాణీ, విశ్వం దిగేరు. వీరంతా బ్రహ్మచారులే.
గీత అందరికీ కాఫీలు పెట్టింది. ఆవిడ ఇండియానించి తెచ్చిన మిఠాయిలూ, తను ముందురోజు బజారులో కొన్న కుకీలూ ప్లేటులలో పెట్టి హరి బల్లమీద అమర్చేడు.
మాధవు కుకీలపళ్లెం పక్కకి తోసేస్తూ, “ఇంతమంచి పుల్లారెడ్డి స్వీటులతో ఆ కుకీలు పెడతావేమిటి?” అన్నాడు. అతనికి తెలుగువంటలంటే జిహ్వ లేచొస్తుంది.
టేషుకి అలాటి పట్టింపులు లేవు. “పేటిరుచి వాటిదే. నీకక్కర్లేకపోతే నువ్వు తినకు” అన్నాడు ఓకుకీ, ఓ లడ్డూ ఒకే చేత్తో పుచ్చుకుని. “అబ్బ, ఇంతమంచి కాఫీ తాగి రెండేళ్లయిందండీ” అన్నాడు కాఫీ చప్పరిస్తూ.
ఉదయం హరి పెట్టిన కాఫీ గీతకి ఆనలేదు. అంచేత కాఫీపొడి రెండింతలు వేసి, చిక్కగా డికాక్షను తీసి, దానికి తగినట్టు పాలూ, పంచదారా కలిపింది.
“నువ్వు కూడా గబగబా ఇండియా వెళ్లి, పెళ్లి చేసేసుకునొచ్చేస్తే, ఎంచక్కా రోజూ మంచికాఫీ తాగొచ్చు” అంది సుమతి నవ్వుతూ.

"నీసలహా బాగానే వుంది కానీ తీరా పెళ్లి చేసుకొచ్చింతరవాత ఆవిడగారు గీతగారంత బాగా కాఫీ పెట్టకపోతే, ఇటుపై నాగతేమీ అని పాడుకోవాలి. రిటర్న్ పాలసీ వుందో లేదో ముందే కనుక్కో" అన్నాడు విశ్వం.

"పెళ్లిచూపులవేళ ఆవిడచేత కాఫీ పెట్టించి పరీక్షించుకో"అంది రాధ.

వివాహము అనబడే ఘనమైన విషయాన్ని వీళ్లందరూ అదేదో బొమ్మలాటకింద జమకట్టి హాస్యాలాడడం గీతకి ఆశ్చర్యంగా వుంది. అవమానకరంగా కూడా తోచింది. ఆమాటే అంది.

"మీకు పెళ్లంటే నవ్వులాటగా వుందే" అని.

సుమతి నవ్వుతూ, "అది కాదండీ. టేషు పెళ్లివిషయంలో ఓ ఫార్ములా తయారు చేసుకున్నాడు. ఓ పెద్ద చిట్టా తయారు చేశాడు తనకి వచ్చిన సంబంధాలన్నీ. వారానికోమారు కూచుని ఆచిట్టా తిరగరాస్తుంటాడు. ఆ అమ్మాయిల అందచందాలూ, విద్యార్హతలూ ... వగైరా.. అంటే డాక్టరయితే పిల్లలకి - అదేలెండి పుట్టబోయేవాళ్లకి -- జలుబు చేసినా జొరం వచ్చినా చూసుకోగలదు, లెక్కలమేజరు అయితే ఇన్వెస్టుమెంటులు చూడగలదూ అలా. స్థూలంగా అతని అభీష్టాలు ఆరోజు గ్రహబలాన్నిబట్టి మారుతూ వుంటాయి" అంది.

టేషు మూతి ముడుచుకుని, "మీకు నవ్వులాటగానే వుంటుంది. పెళ్లంటే నూరేళ్ల పంట గదా. దీర్ఘకాలిక మంచీ చెడూ చూసుకోవద్దా?" అన్నాడు.

"సరే. ఒంటిగంటవుతోంది. పదండి. చైనీస్ రెస్టారెంటుకి వెళ్దాం" అన్నాడు విశ్వం.

"ఛ, అదేం కోరికరా. మాయింటికి తొలిసారి వేంచేశారు. లంచిక్కడే" అన్నాడు హరి.

గీత గుండెలు గుభేలుమన్నాయి.

"నీరెండు గదుల్లోనూ ఆవిడికింకా వంటిల్లేదో తెలిసిందో లేదో అప్పుడే సంతర్పణలేమిట్రా. నాలుగు రోజులు పోయేక మళ్లీ వస్తాంలే" అన్నాడు విశ్వం.

"భయపడకోయ్. మీచెల్లెమ్మనేం కష్టపెట్టనులే. నేనే చేస్తాను" అన్నాడు హరి.

రాధ నవ్వింది, "మీ వంటలు చాలానే తిన్నాం. మేం చేస్తాంలెండి. మీరు అటు రాకుండా వుంటే అదే గొప్ప సాయం" అంటూ లేచి వంటగదిలోకి వెళ్లింది, చనువుగా గీతచెయ్యి పుచ్చుకుని.

సుమతి వారిద్దరినీ అనుసరించింది.

"అన్నట్టు గణపతిగారేరీ?" అన్నాడు మాధవు.

"అవును సుమా, గణపతిగారు లేనిపార్టీ చక్రాల్లేని బండి. ఉండండి, పిలుస్తాను" అని హరి ఫోను తీశాడు.

మరోపావుగంటలో గణపతి వచ్చేడు మరో ఇద్దరు మిత్రులని వెంటేసుకుని. గీతకి మన శుభలేఖల్లో రాసే బంధుమిత్రసపరివారసమేతంగా అన్న పదబంధం గుర్తుకొచ్చింది. అచ్చంగా మనదేశంలో వున్నట్టే వుంది ఆ పూట ఆవిడకి!

రాధ ఇంట్లో మనిషిలాగే స్వతంత్రంగా ఫ్రిజ్ లోంచి కూరలు తీసి, ఓపక్కన పెట్టి, ఓగిన్నెలో బియ్యం మూడు కప్పులూ, నీళ్లూ పోసి వెనక బర్నరుమీద పెట్టింది. మరోపక్కన బాణలిలో నూనె పోసి, అది కాగుతుండగా, బంగాళదుంపలు చక్రాల్లా తరిగింది బజ్జీలకి. మళ్లీ ఇటుతిరిగి ఉల్లిపాయలు కౌంటరుమీద పెట్టింది తరగడానికి,

అంతవరకూ ఏదో సినిమాలో వంటచేయు సీను చూస్తున్నట్టు చూస్తున్న గీత తెలివి తెచ్చుకుని, “ఇటివ్వండి. నేను తరుగుతాను” అంది.

సుమతి అందుకుని, “ఇవాళ్టికి మావంతు. మీరు నవవధువు కదా. ఆమాత్రం గౌరవం మేం వుంచుతాం. ఆ తరవాత కిచెనంతా అచ్చంగా మీదే,” అని రాధచేతిలోంచి కత్తీ, వుల్లిపాయలూ, టొమాటాలూ తీసుకుని తరగడం మొదలుపెట్టింది.

సుమతి తాను తెచ్చిన కొత్త ప్రెషరుకుకరుకి ప్రారంభోత్సవం చేస్తూ పప్పు పడేసింది.

గంటలో వంట అయిపోయింది. పులిహోరా, బజ్జీలూ, సాంబారూ అన్నం. బంగాళదుంపల కూరా. అప్పడాలూ.

“మీరు వంట చేసినట్టులేదు, మాయ చేసినట్టుంది కానీ” అంది గీత సుమతీ, రాధా గబగబా అటూ ఇటూ తిరుగుతూ వంట చేసేస్తుంటే.

“మీకూ వస్తుందిలెండి పాకశాస్త్రప్రావీణ్యం. దేశంలో వున్ననాళ్లూ గిన్నెదో గరిటేదో తెలీనివాళ్లు కూడా ఇక్కడికొచ్చేక ఇట్టే గొప్ప వంటవాళ్లయిపోతారు” అంది సుమతి నవ్వుతూ.

“మీరు మిరపకాయ బజ్జీలు చేస్తారాండి?” అనడిగేడు గణపతి గీతని.

“ఏం, మీకు ఇష్టమా?” అంది గీత, వచ్చో రాదో చెప్పకుండా. నిజానికి తనెప్పుడూ వంటింట్లో అడుగు పెట్టలేదు. ఇంతకుముందు టేషుకోరిక విన్నప్పుడే కాస్త బెరుకు కలిగింది, హరి కూడా కొంపదీసి అలాగే అనుకుంటున్నాడేమోనని. తన వంటవిద్వత్తు చర్చకిది సమయం కాదు.

“మిరపకాయబజ్జీలు ఇష్టం కాకపోతే కష్టపడి అయినా అందరూ తినాలండీ. ఆరోగ్యం” అన్నాడు గణపతి.

“ఏంటీ?” తెల్లబోయింది గీత.

“మిరపకాయల్లో విటమిల్ సీ పుష్కలంగా వుంది. మెదడుకి పదును పెడుతుంది కారం నసాళానికి అంటి. సిగరెట్ అలవాటు మానిపించడానికి ఇది వుత్తమసాధనం” అన్నాడు గణపతి.

“ఎటామిక్ ఎనర్జీ కూడా పుట్టించొచ్చు” అన్నాడు మాధవు.

గీతకి వాళ్లమాటల్లో హాస్యం అంతుబట్టలేదు. వింటూ కూచుంది. ఆ కబురూ ఈ కబురూ చెప్పుకుంటూ భోజనాలయేసరికి రెండున్నర దాటింది. రాధ గిన్నెలు తీస్తుంటే గీత “నేను తీస్తానులెండి. ఆమాత్రం చేతనవు నాకు. మీరు కూర్చోండి” అంది.

“ఫరవాలేదులెండి. రాధ తీసి పెడుతుంది. మీరు కూర్చోండి” అన్నాడు మాధవు భుక్తాయాసంతో సోఫాలో వెనక్కి వాలి.

"ఎవరూ వద్దు. నేను చూసుకుంటాను అవన్నీ. పదండి అందరూ" అంటూ హరి అందర్నీ హాల్లోకి తోలేడు.
గీత మాధవు అన్నమాట ఆలోచిస్తోంది. విచిత్రం. "నేను చేస్తాను" అనడానికీ, "ఆవిడ చేస్తుందిలెండి" అనడానికీ మధ్య తేడా అతను గమనించలేదా, తాను గమనిస్తాను అనుకోలేదా? కానీ అట్టే ఆలోచించలేదు. ప్రయాణపుబడలిక ఇప్పుడు తెలుస్తోంది నెమ్మదిగా. కళ్లు మూతలు పడపోతున్నాయి.
రాధ అది చూసి, "వీళ్లు ఇప్పుడప్పుడే కదలరు. మీరు వెళ్లి పడుకోండి" అంది.
"ఫరవాలేదండీ. నిద్ర కాదు" అంది గీత పట్టుబడిపోయినందుకు సిగ్గు పడుతూ.
"ఫరవాలేదనే మేమూ చెపుతున్నామండీ. ఇక్కడ మాకివన్నీ అలవాటే. జట్లాగు అలాగే వుంటుంది నాలుగు రోజులపాటు. వెళ్లి పడుకోండి" అన్నాడు విశ్వం.
హరి కూడా అదే అనడంతో గీత లేచి పక్కగదిలోకి వెళ్లింది సందేహిస్తూనే.
మంచంమీద వాలిందో లేదో కళ్లు ఠపీమని మూసుకుపోయేయి. వచ్చిన అతిథులు ఎప్పుడు వెళ్లేరో తనకి తెలీనేలేదు.
రెండోరోజుకి జట్లాగు తగ్గి, ఆ రాత్రి బాగా నిద్ర పట్టింది. కళ్లు తెరవాలని లేదు కానీ వరదలా వెలుగొచ్చి గదంతా కమ్మేసింది.
"అబ్బ ఎందుకా లైటు, తీసేయండి బాబూ, నాకింకా నిద్రమత్తుగానే వుంది" అంది గీత.
"నాకూ అలానే వుంది కానీ నేనేం అలనాటి సుమతినా సూర్యుణ్ణాపడానికి" అన్నాడు హరి.
"ఒక్క అయిదు నిముషాలు" అంది అతనికి మరింత దగ్గరికి జరగి దుప్పటి మొహంమీదికి లాక్కుని ముడుచుకు పడుకుంటూ.
"సరే, నువ్వు పడుకో. నేను కునికితే మా బాసురుడు కినుక వహించును" అన్నాడు హరి గీత చెయ్యి సుతారంగా తొలగించి, పక్కన పెట్టి.
మరో నాలుగునిముషాలకి గీత నిద్ర తేలిపోయింది. లేచి మొహం కడుక్కుని వచ్చేసరికి హరి కాఫీ పెట్టి, బౌల్లో సీరియలూ, పాలూ పోసుకుని కూర్చున్నాడు బల్లదగ్గర.
గీత అతనికి ఎదురుగా కూర్చుంది. అతను ఆచల్లటిపాలతో సీరియలు తినడం చూస్తుంటే జాలి ముంచుకొచ్చింది.
"రేపు ఉప్మా చేస్తాను" అంది
హరి ప్చ్ అని చప్పరించి "అదే అలవాటయిపోతుంది నీకూనూ" అన్నాడు.
గీత "నావల్ల కాదు బాబూ సప్తజన్మలెత్తినా" అంది వికారంగా మొహం పెట్టి.
మొన్నటి సంభాషణలు గుర్తుకొచ్చేయి. "అదేమిటండీ ఆ గణపతిగారు మిరపకాయ బజ్జీలకీ సిగరెట్లకీ ముడి పెడతారు." అంది కళ్లు చిట్లించి.
"వాడిమొహం. వాడి రిసెర్చి అది. నువ్వే విషయం మొదలెట్టినా మిరపకాయల్లోకే దింపుతాడు."

“రిసెర్చా?”

"మిరపకాయలలో పోషక గుణాలమీద.”

సూక్ష్మంగా గణపతి కథ ఏమిటంటే, అతను అమెరికా వచ్చి పదేళ్లవుతోంది. అంతకుమున్ను అతని తల్లిదండ్రులు అమెరికాలో వున్నప్పుడు అతను పుట్టేడు. తరవాత అందరూ ఇండియా వెళ్లిపోయారు. అమెరికాలో పుట్టేడు కనక పద్దెనిమిదో ఏట అతనికి అమెరికను సిటిజనుషిప్పు తీసుకోడానికి అవకాశాలున్నాయి. అది వినియోగం చేసుకోడానికి అతన్ని అమెరికా పంపించేరు. వాళ్లనాన్నగారి పినతండ్రి మనవడి తోడల్లుడు అమెరికాలోనే వున్నాడని ఆరా తీసి, వాళ్లింటికి ఆ చిట్టి గణపతిని అంపకాలు పెట్టేశారు. ఆ పి.తం.మ.తో. కూడా కుర్రాడిని ఇంట్లో పెట్టుకుని తప్పకుండా చదివిస్తానని హామీ ఇచ్చేడు. అసలు ఇండియాలో వుండగానే గణపతి తండ్రి అబ్బాయిని వీలయినంత మాలీసు చేసేడు అమెరికాలో నిజమైన సిటిజనుడిగా స్థిరపడడానికి. అయినా గణపతికి అందరిలాగే కొత్తదేశపు ఆచారాలూ వ్యవహారాలూ ఒంట పట్టించుకుని చదువూ వుద్యోగమూ జోడుగుర్రాలస్వారీ చేస్తూ ఓదారికి రావడానికి ఎనిమిదేళ్లు పట్టింది. ప్రస్తుతం స్టూడెంటసిస్టెంటుగా జరుపుకొస్తున్నాడు. అతనికి తగ్గట్టుగానే ఓ ప్రొఫెసరుగారు కూడా దొరికేరు. ఆప్రొఫెసరుగారు చిన్నతనంలో ఆంధ్రాలో కొంతకాలం వున్నారు. ఆయన తండ్రి తెల్లనివాడూ తల్లి తెలుగుతల్లీను. అందుచేత ఆయనకి తెలుగువారన్నా, తెలుగు వంటలన్నా వీరాభిమానం.

“మనవంటలు నిజంగా తింటారా?” అంది గీత. అంతకుముందు కలిసిన పీటర్ గుర్తున్నా, అలాటివారు ఇంకా వున్నారంటే ఆశ్చర్యంగానే వుంది.

“అంటాడు. కబుర్లే. గజందూరంలో మిరపకాయ కనిపిస్తే కుండెడు నీళ్లు తాగుతాడు” అంటూ వాచీ చూసుకుని, “నాకు టైమయిపోతోంది. నీతో ఇలా హస్కేసుక్కూచుంటే ఉజ్జోగానికి నీళ్లధారే. నే వెళ్తున్నా. తలుపు రెండు గడియలూ వేసుకో. ఎవరొచ్చినా తలుపు తియ్యకు. అయినా ఎవరూ రారులే. ఎవరైనా తలుపు తట్టినా తియ్యకు. వాళ్లే పోతారు” అంటూ గబగబా సీరియలుబౌలూ, కాఫీకప్పు సింకులో పడేసి వెళ్లిపోయేడు.

గీతకి జట్లాగు వదిలి మెదడు పని చేయడం మొదలయింది. క్రమంగా సంగతులు క్రమేణా తెల్లమవుతున్నాయి. హరిమాటలు అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తోంది. ఎవరూ రాకపోతే తలుపు తీసే ప్రసక్తి ఎందుకు వస్తుంది? భయం లేకపోతే తలుపులు బిగించుక్కూచోడం ఏమిటీ? ఆలోచనలు ఓ కొలిక్కి రాకుండానే మళ్లీ నిద్ర పట్టేసింది. కూర్చున్న సోఫాలోనే వాలిపోయింది.

హరి సాయంత్రం ఆఫీసునించి వచ్చి గీత అందిచ్చిన కాఫీ చప్పరిస్తూ, శనివారం తన ఆఫీసులో స్నేహితులని నలుగురిని భోజనానికి పిలిచానని చెప్పేడు.

గీత అయోమయంగా చూసింది. తనకి ఇంకా అంతా కొత్తగానే వుంది. ఏం చెయ్యాలో ఎలా చెయ్యాలో పాలుపోలేదు. నిజానికి హరితో చెప్పలేదు కానీ దేశంలో వుండగా తను వంటింట్లో అడుగెట్టలేదు. గత రెండురోజులుగా అమ్మవంటలు తలుచుకుని ఉప్పురుచీ చింతపండు రుచీ ఊహించుకుంటూ తనఊహకి అందిన రుచులప్రకారం వంటలాటిది చేస్తూ గడుపుకొస్తోంది. హరి తెలిసో తెలీకో ఏ వంకా పెట్టకుండా వడ్డించిందేదో తినేసి లేచిపోతున్నాడు.

"నాకింకా అంతా కొత్తగానే వుంది. ఈ విద్యుత్ పొయ్యీ, కత్తులూ, కటార్లూ వీటితో సాముతోనే సరిపోతోంది నాకు. కూరలు తరుక్కోడానికి కత్తి తెమ్మంటే మేకలు నరుక్కునే కత్తి తెచ్చేరు మీరు. నాలుగు రోజులాగి చేసుకుందాం పార్టీలు," అంది.

"ఫరవాలేదులే. నీకెంత వస్తే అంతే చెయ్యి. వాళ్లేం అనుకోరు" అన్నాడు హరి.

"మీ స్నేహితులందరూ మనవంటలు తింటారా?" అంది సందిగ్ధంగా.

"తింటారు. కారాలు మరీ గుప్పించెయ్యకు. అంతే. సింపుల్గా బంగాళదుంపలకూరా, పప్పూ, సాంబారూ చెయ్యి చాలు" అని సలహా ఇచ్చేడు.

"భోజనానికి అంటూ కొత్తవాళ్లని పిలిచి, పప్పూ, ఒకూరతో సరిపెట్టేస్తే బాగుంటుందా?"

"చాలా బాగుంటుంది. వాళ్లు మనలా రెండు కూరలూ, రెండు పచ్చళ్లూ, చారూ, పులుసూ, అన్ని ఆధరువులు అన్నంలో కలుపుకు తినరు. ఒక్క పప్పూ అన్నంచేసినా పరమానందపడిపోతారు" అన్నాడు హరి. అతను తన బ్రహ్మచారి రోజుల్లో వాళ్లకి అలాగే పెట్టేడు.

గీత వాదించడం ఇష్టం లేక సరేలెండి అని సరిపెట్టింది.

అనుకున్న శనివారం వచ్చేలోపున అతిథుల్లో ఇద్దరు ఫోను చేసారు వారి స్నేహితురాలిని లేక స్నేహితుడిని తీసుకురావచ్చా అని అడగడానికి. అందరికీ తప్పకుండానూ అని చెప్పేడు హరి.

గీతకి మాత్రం బెరుగ్గానే వుంది. శుక్రవారం మధ్యాన్నం, హరి ఆపీసుకి వెళ్లేక భాగ్యంగారికి ఫోను చేసింది సలహాలకోసం.

"అమెరికనులు మనవంటలంటే సరదా పడతారు కానీ మనలా పద్ధతిగా కూరలూ, పచ్చళ్లూ, విడివిడిగా ఒకొకటే అన్నంలో కలుపుకు తినేవాళ్లు కోటికొకరిని కూడా కానం. నేనూ కొత్తలో తెలీక పదిరకాలు చేసేదాన్ని. వాళ్లేమో అన్నీ కంచంలో కుప్ప పోసుకుని కలిపేసి కుమ్ముకు తినేవారు. అంచేత నువ్వట్టే హైరాన పడకు. ఫ్రైడ్ రైస్, రైతా, చాలు. ఓపికుంటే ఇడ్లీ సాంబారు. సాంబారులో చింతపండుకి బదులు టొమాటాలు వేసినా చాలు. వాళ్లరుచులకి దగ్గరగా వుంటాయి. dessert కారట్ హల్వా సులువుగా అయిపోతుంది, ఇంకా కావలిస్తే బొబ్బట్లు చెయ్యి," అన్నారావిడ.

"బొబ్బట్లా?" అంది అంతసేపూ లలితసంగీతం వింటున్నట్టు ఫోను పట్టుక్కూచున్న గీత వులిక్కిపడి.

అవతలినుండి గట్టిగా నవ్వు వినిపించింది, "వింటున్నావో లేదో అని అనుమానం వచ్చిందిలే" అన్నారావిడ ఆపూటకి పాఠం ముగించి.

గీతకి ప్రాణం కుదుటపడింది. "ఇడ్లీప్లేట్లు కూడా లేవులెండి," అంది ఆవిడ ఇచ్చిన జాబితాలోంచి ఇడ్లీ కొట్టేస్తూ.

"కావలిస్తే నేను ఇస్తాను."

"వద్దులెండి. హరిగారు కూడా తేలిగ్గా చేసెయ్ అన్నారు. ఈసారికి వేపుడన్నం, రైతాతో కానిచ్చేస్తాను. ఇంకా కొత్త అన్న పేరుంది కదా. అది వున్నంతకాలం వాడుకోడం ఉత్తమం."

అవతలినుండి మళ్లీ నవ్వు వినిపించింది. "అదీ జాణతనం అంటే" అంటూ ఫోను పెట్టేశారు భాగ్యంగారు.

ఆ సాయంత్రం గీతా, హరీ బజారుకి బయల్దేరేరు కావలసిన కూరా, కాయా, పాలూ, పెరుగూ, పళ్లూ, పానీయాలూ, కొనుక్కు రావడానికి. దారిలో హరి అడిగేడు "ఏం చేస్తావు?" అని.

గీత భాగ్యంగారి సలహాలు చెప్పింది.

"అలా కాదులే. రేపు వచ్చేవాళ్లలో మనవంటలు థామస్ కి చాలా ఇష్టం. అతని స్నేహితురాలికి కూడా ఇష్టం అని చెప్పేడు. కొంచెం తింటుందేమో. అంచేత మామూలుగా మనకి వేసే కారాలతో ఒకటో రెండో వంటకాలు చెయ్యి. మిగిలినవాళ్లకి పప్పూ అన్నం చాలు" అన్నాడు హరి ముందురోజు తను చెప్పినమాటలు మర్చిపోయి.

మామూలు కారాలూ, మన కారాలూ, కొంచెం కారాలూ … ఈ స్థాయీబేధాలు లెక్కలేసుకుంటూ మన వంటలు చెయ్యడం ఎలాగ అన్న మీమాంసలో పడిపోయింది గీత చాలాసేపు.

శనివారం తెల్లారి లేస్తూనే, వంట మొదలెట్టి ఒకొకటే, కూరా, పప్పూ, చేస్తూ, గిన్నెలు కడుక్కుంటూ మొత్తం పూర్తి చేసేసరికి నాలుగయింది. నేను సాయం చెయ్యనా అంటూ అప్పుడప్పుడు హరి అడుగుతూనే వున్నాడు. వద్దులెండి అంటూనే గీత వంట పూర్తి చేసింది.

ఆరు అయేసరికి ఒకొకరే రావడం మొదలు పెట్టేరు. ప్రతివారూ అందంగా, రంగుకాయితాల్లో చుట్టిన బహుమతులతో రావడం గీతకి మొదట ఆశ్చర్యంగానూ, తరవాత ఇబ్బందిగానూ తోచింది. తనకి తెలిసి మనదేశంలో పెళ్లో పండుగో అయితే తప్ప ఇలా బహుమానాలు తీసుకురాడం జరగదు.

"ఇప్పుడు ఈ బహుమానాలెందుకండీ" అంది అలవాటయిన తెలుగులో హరితో.

"ఇక్కడి మర్యాదలివి. అయినా కొత్త పెళ్లికూతురివి కదా" అంటూ హరి తెలుగులో చెప్పి, అటు స్నేహితులవేపు తిరిగి గీత అన్నమాటలు వాళ్లకి తర్జుమా చేసేడు. గీతకి కొంత టైము పట్టింది అందులో అంతరార్థం. ఎదుట ఇతరభాషలవారు వున్నప్పుడు వారికి తెలీనిభాషలో మాటాడడం తప్పు!

తనకి పుట్టుకతో వచ్చిన ఏమర్యదలూ ఇక్కడ వర్తిస్తున్నట్టు కనిపించడంలేదు. అంతా పూర్తిగా భిన్నం. ఏ రష్యన్ సినిమావో చూస్తున్నట్టు అయోమయంగా వాళ్లని చూస్తోంది.

"యూ ఎయింట్ టాక్?" అన్నాడొకతను.

“ఆఁ?” అంది గీత అతనివేపు చూస్తూ. అతను ఏం అడిగేడో అర్థం అవడానికి అరనిముషం పట్టింది. తరవాత ఏం చెప్పాలో తోచడానికి మూడు నిముషాలు పట్టింది.

అతను ఈసారి నెమ్మదిగా, “యూ ఆర్ నాట్ టాకింగ్” అన్నాడు.

గీత నవ్వేసి తలాడించింది అవునన్నట్టు. ఈ సంభాషణ అట్టే సాగేట్టు లేదని గ్రహించి అతను నైస్ పార్టీ అనేసి అటు తిరిగి పక్కవారితో కబుర్లు మొదలెట్టేడు.

ఆపూటంతా అక్కడ చేరినవారు తనతో భాషించడానికి రకరకాలుగా ప్రయత్నిస్తూనే వున్నారు. నాలుగు చుట్లు అయేవేళకి ఓ జవాబు సిద్ధం చేసుకుంది నానా తంటాలూ పడి.

“నేను సహజముగా మాటాడే మనిషిని కాను. నాకు కొత్తవారితో మాటాడుట కష్టము.”

దాంతో మరో ప్రశ్న ఎదురైంది. “మీదేశములో ఆడువారు మగవారితో మాటాడకూడదు అని విన్నాను. అందుకేనా మీరు మాటాడడంలేదు?” అని అడిగింది ఒక అమ్మాయి.

గీత మళ్లీ “అదేమీ లేదు. నిజంగా మాటాడడానికి ఏమీ లేకపోతే మాటాడకు అని మా అమ్మ సిద్ధాంతం. నాక్కూడా అదే వచ్చింది. అంతేకాక నేను చదువుకున్న ఇంగ్లీషు బ్రిటిష్ ఇంగ్లీషు. మీ అమెరికన్ఇంగ్లీషు చాలా వేరుగానున్నది” అంది ఒకొకమాటే కూడబలుక్కుని కుస్తీపట్లు పడుతూ,

అవతలిఅమ్మాయికి కూడా అది అర్థం చేసుకోడం అంత కష్టమూ అయింది. చిన్న నవ్వు నవ్వేసి హాఁ అనేసి “క్షమాపణలు కోరుకుని” అటుపక్క స్నేహితుడితో కబుర్లలో పడిపోయింది.

వంటకాలు కూడా బహుబాగు అంటూ తెగ మెచ్చుకున్నారు. “ఇదేమిటి”, “అది ఎలా చేసారు”, “ఈగింజలేమిటి నల్లగా” “ఈవాసన ఏమిటి?” “ఆ రంగేమిటి?” అంటూ బోలెడు వుత్సాహంగా వాళ్లందరూ అడుగుతుంటే గీత మహ సంతోషించేసింది. తనకి వంట రాకపోయినా ఈరోజు బాగా కుదిరాయన్నమాట అనుకుని మురిసిపోయింది.

“ఈ సాంబారు అచ్చు ఆంధ్రాసాంబారులానే వుంది. రెసిపీ ఇవ్వాలి” అన్నాడు థామస్.

గీతకి నిజంగా అతనేం అంటున్నాడో అర్థంకాలేదు.

పక్కనే వున్న హరి “అలాగే తప్పకుండా తరవాత ఇస్తుంది” అని వాళ్లకి హామీ ఇచ్చాడు. తరవాత గీతతో రహస్యంగా “నిజంగా కావాలని కాదు, అదో మర్యాద అంతే” అని స్పష్టం చేసేడు రెసిపీల సంగతులు.

మద్రాసులోనూ హైదరబాదులోనూ పన్నెండేళ్లు గడిపిన థామస్ “ఇంత మంచి తెలుగుభోజనం తిని ఎనిమిదేళ్లయింది.” అన్నాడు గీత ఇండియానించి తెచ్చిన ఆవకాయ ముక్క కొరుకుతూ.

గీత అతనివేపు చూసింది తెల్లబోతూ. అతని మొహం ఆరముగ్గిన రామాఫలంలా వుంది కళ్లంటా ముక్కంటా ఏకధారగా నీళ్లు.

“కొంచెం పెరుగు వేసుకోండి.” అంది పెరుగు అందిస్తూ.

“ఫరవాలేదు. నాకు ఇలాగే ఇష్టం. పెరుగు తింటే నోటిలో ఆ రుచి పోతుంది” అన్నాడు వగరుస్తూ, మరోగుక్క బీరు పుచ్చుకుని. ఉఫ్ అని ఊదుకుంటూ.

గీతకి ఇబ్బంది కలిగించిన రెండోసంగతి ప్రతివారూ తన చీరెనీ, తన అందాన్నీ, మెచ్చుకోడం. నిజానికి తను కట్టుకున్నది సాదా చీరె. ఆవిషయంలో కూడా హరిని అడిగింది పొద్దున్న "ఏచీరె కట్టుకోనూ?" అని,
"ఇదేమీ శ్రావణమంగళవారమో సంక్రాంతిపేడుకో కాదు. వూరికే నలుగురు స్నేహితులు ఓపూట సరదాగా గడపడం కనక చీనిచీనాంబరాలూ, కనకాభరణాలూ ధరించవలసిన అవుసరం లేదు."అన్నాడు.
అంచేత ఉల్లిపొరరంగు సాదా వాయిల్చీరె కట్టుకంది. తన అందం కూడా అంతే. తానేమీ జగదేకసుందరి కాదు. అసలు మనిళ్లలో మనిషి అందం మొహమ్మీద చెప్పరు. అదేదో ఎబ్బెట్టుగా అనిపిస్తుంది. మరీ అంతటి సుందరి అయితే పక్కవారితో "చూడు ఎంత చక్కగా వుందో, చిదిమి దీపం పెట్టొచ్చు" అంటారు. అంతే కానీ మొహమ్మీద యూ ఆర్ బ్యూటిఫుల్ అనడం ఎక్కడా వినలేదు. గీతకి తెలిసిన సాంప్రదాయం అదీ.
వచ్చినవాళ్లు ఆరుగురూ అక్కడ వున్న మూడుగంటల కాలంలోనూ కనీసం పాతికసార్లు తననీ తనచీరెనీ, వంటకాలనీ, మెచ్చుకున్నారు. గీత థాంక్స్, థాంక్స్ అంటూనే వుంది. ఆరోజు ఆ థాంక్స్ రామనామం అయితే రామకోటి అయిపోను అనిపించింది ఆఖరికి. డూ డూ బసవన్న జ్ఞాపకానికొచ్చేడు.
వచ్చిన ప్రతివారూ అడిగిన మరో ప్రశ్న "ఆడవాళ్లు బొట్టెందుకు పెట్టుకుంటారు?"
"అది వారికి పెళ్లి అయినట్టు గుర్తు" అన్నాడు హరి చటుక్కున ఇటు తిరిగి.
గీత ఆశ్చర్యపోయి. "అది కాదనుకుంటాను. పెళ్లికాకముందు కూడా పెట్టుకుంటారు కదా. పైగా బొట్టు పెట్టుకునే మగవాళ్లు కూడా వున్నారు కదా" అంది నెమ్మదిగా తెలుగులోనే.
"అది వేరు" అనేసి అక్కడ్నుంచి వెళ్లిపోయేడతను.
గీతకి పొరపాటు చేసేనేమో, అతనికి కోపం వచ్చిందేమో అనిపించింది. తను తెలుగులో మాటాడినందుకా అతనిమాట తప్పు అన్నందుకా అన్నది మరో బాధ.
హఠాత్తుగా ఎక్కళ్లేని నీరసం వచ్చేసింది అకారణంగా. ఇదంతా ఓ నాటకంలా, తనకి అర్థంకాని పాత్ర ఏదో తను పోషిస్తున్నట్టుగా వుంది. ఇకమీదట కాస్త జాగ్రత్తగా వుండాలి. ఈపూటకి ఇది రెండో పాఠం. నేర్చుకోడానికి చాలా చిన్న విషయం సరిపోయింది!
అతిథులు వెళ్లేసరికి పన్నెండు దాటింది. గీత వంటింట్లో అడుగెట్టి చూసింది. అక్కడ పోగయిన గిన్నెలూ, కంచాలూ చూసేసరికి కళ్లు తిరిగినంత పనయింది.
హరి వెనకే వచ్చి, "నాకు ఇప్పుడే నిద్దర్రాదు. నువ్వెళ్లి పడుకో. నేను తరవాత పెడతాలే డిష్ వాషర్లో" అన్నాడు.
"మీరు అసలు ఎప్పుడూ ఇంత మంచివారేనా, అమెరికా వచ్చేక మంచివారయిపోయారా?" అంది గీత నవ్వుతూ. ఇంతసేపూ పడిన యాతన మరిచి.
"మరేమిటనుకున్నావు. నాస్నేహితులు ఏం అంటున్నారో తెలుసా? నీ అదృష్టంకొద్దీ నేను నీకు దొరికానుట" అన్నాడు హరి చిన్నగా నవ్వుతూ.

"నాస్నేహితులని అడిగితే వాళ్లేం అంటారో మరి" అంది గీత కొంటెగా కన్ను సగం మూసి, చేతిలో గిన్నె సింకులో పడేస్తూ. హరి వద్దంటూన్నా, మిగిలిన వంటకాలు మాత్రం tupperware డబ్బాల్లో పెట్టి రిఫ్రిజరేటర్లో పెట్టి పడకగదిలోకి వెళ్లింది.

అలవాటు లేని పని కావడంతో బాగా అలిసిపోయిందేమో ఇట్టే నిద్ర పట్టేసింది మంచంమీద వాలీ వాలగానే.

తెల్లారి లేచి టైము చూస్తే ఏడు దాటింది. అయ్యో ఇంతసేపు పడుకున్నానా అనుకుంటూ లేచి మొహం కడుక్కుని వంటగదిలోకి వచ్చింది కాఫీ పెట్టడానికి. అక్కడి దృశ్యం చూసి తెల్లబోయింది. నిన్నరాత్రి తాను ఎలా వదిలేసిందో అలాగే వుంది మొత్తం సీను, ఎక్కడిగిన్నెలు అక్కడే వున్నాయి.

"రాత్రి పని చూసుకుంటూంటే టైము తెలీలేదు. నాలుగు దాటిపోయింది. ఇప్పుడు లైబ్రరీకి వెళ్లాలి కొన్ని రిఫరెన్సులకోసం. వచ్చేక చూస్తాలే. నువ్వేం చెయ్యకు. అలా వుండనీ, నేను వచ్చేక చూస్తాను," అంటూ హడావుడిగా బాత్రూంలోకి వెళ్లిపోయేడు హరి.

గీత మాటాడుకుండా, ఓ కప్పులో కాఫీ పోసుకుని కూర్చుంది, ఆ గిన్నెలవేపు చూస్తూ.

హరి బాత్రూంలోంచి వచ్చి గబగబా కాఫీ తాగేసి, మళ్లీ తనగదిలో కంప్యూటరుముందు కూచున్నాడు. మరోగంట తరవాత కారు తీసుకుని లైబ్రరీకి వెళ్లిపోయేడు, గీతని మరోసారి ఎట్టి సందర్భంలోనూ తలుపు తియ్యొద్దనీ, బయటికి వెళ్లొద్దనీ హెచ్చరించి.

ఆతను వెళ్లిపోయిన తరవాత, గీత కంచాలూ, గిన్నెలూ తొలిచి డిష్ వాషర్లో పడేసి, స్నానం చేసి, మరో కప్పు కాఫీ పుచ్చుకు కూచుంది.

చుట్టూ కలయజూసింది ఓమారు. కాఫీబల్లమీద న్యూయార్క్ టైమ్సూ, ఎదురుగా టీవీ, కిటికీ తెరల్లోంచి ఛాయామాత్రంగా కనిపిస్తున్న బయటి ప్రపంచం - గదిలో భరించలేని నిశ్శబ్దం, ఒంటరితనం ... మారీచ సుబాహుల్లా. .... దుఃఖం ఒక్కసారిగా ఉప్పెనలా ముంచుకొచ్చింది. గీత ఆపుకోడానికి ప్రయత్నించలేదు. మనసారా ఏడిచేసింది. పదినిముషాల తరవాత మనసు కుదుటపడింది. .

***

కాలం నత్తనడకలతో సాగుతోంది కానీ అంతూ పొంతూ లేకుండా ఆలోచనలు కందిరీగలపుట్టలా ముసురుకుని రొద పెడుతున్నాయి మనసులో. అమ్మా, తమ్ముళ్లూ, ఇరుగూ పొరుగూ చుట్టాలూ స్నేహితులూ, పదే పదే గుర్తుకొస్తున్నారు. సత్యం అయితే మరీను. కూడా కూడా వున్నట్టే వుంది ఏపని చేస్తున్నా. గుంటూరులో శివం మామయ్యగారూ, కనకమ్మత్తా, ఏసీకాలేజీ చదువూ, తొలివారంలోనే పరిచయం అయి ఆత్మీయురాలయిపోయిన సత్యం -

ఎక్కడ్నుంచి ఎక్కడికొచ్చి పడ్డానూ అనుకుంటూ గతంలోకి జారిపోయింది గీత. ...

ఏనాటిమాట! దశాబ్దం పైమాటే తను యస్సెల్సీ పరీక్ష రాసి.

స్కూల్ ఫైనలు ఫలితాలు వచ్చాయి. స్కూలంతా ఒకటే కోలాహలం.

లిస్టు వేసిన బోర్డుదగ్గర తొడతొక్కిడిగా వుంది. ఫెయిలయినవాళ్లు ఏడుమొహాలతోనూ, వాటిని కప్పుపుచ్చుకుంటూ వెర్రిమొహాలతోనూ వీలయినంత వేగిరం అక్కడినుంచీ పారిపోడానికి ప్రయత్నిస్తున్నారు. పాసయినవాళ్లు పని గట్టుకుని వాళ్లని నిలేసి పలకరిస్తున్నారు. ఫెయిలవుతాం అని ఖచ్చితంగా తెలుసుకున్నవారు స్కూలికి రాలేదు. ఫెయిలవం అనుకుని అక్కడికి వచ్చి ఫెయిలయినట్టు తెలుసుకున్నవాళ్లు "ఎక్కడో పొరపాటు జరిగింది" అనీ, "సప్లిమెంటరీలిస్టు వచ్చితీరుతుంద"నీ నొక్కి వక్కాణిస్తున్నారు. కనీసం పాసయినవాళ్లు పాసవలేదంటూ మరో లిస్టు వచ్చినా బాగుండునని ఆశిస్తున్నారు. అలా ఆశించనవసరం లేనివాళ్లు వీరిని తిలకించి వినోదిస్తున్నారు.

మొత్తంమీద ఆ ప్రదేశం అంతా ఆహ్లాదంగా వుంది. చెదురుమదురుగా కన్నీళ్లు చిలుకుతున్నా.

తరవాతేం చేస్తావన్న ప్రశ్న - ప్రతి ఒక్కరి ఆశలూ, ఆశయాలూ, విధ్యుక్త ధర్మాలూ గగ్గోలుగా వినిపిస్తున్నాయి.

"కాలేజీలో చేర్తాను."

"నేను బయాలజీ తీసుకుంటాను."

"నాక్కూడా బయాలజీ తీసుకోవాలనుంది." అన్నాడు వెంకన్న తప్పు చేస్తున్నవాడిలా తలొంచుకుని.

"అయితే కాలేజీలో చేర్తావన్నమాట,"

ఓవార ఒకమ్మాయి మరొక అమ్మాయిని ఓదారుస్తోంది, "అయినా పాసయినవాళ్లందరూ తెలివైనవాళ్లూ, కష్టపడి చదివినవాళ్లేనేమిటి?" అంటూ.

రెండో అమ్మాయి ఓదారకుండా వెక్కి వెక్కి ఏడుస్తోంది,

"పరీక్ష పోయిందని వింటే మానాన్న డొక్క చీరేస్తాడు" అంటున్నారెవరో ఎవరితోనో.

"... రెండు వందలు తీసుకున్నాడు," ట్యూషను మేష్టరిని దీవించేడు కసి దీరా మరొక అబ్బాయి.

"నా పేపరు వాచరే తీసుకుని బుచ్చిలక్ష్మికి ఇచ్చేడు. ఆ అమ్మాయి పాసయింది. నాది గోవింద కొట్టింది,"

"ప్చ్, అంతే మరి."

రాజుగారి అబ్బాయి రంగారావు పోగ్గా బుచ్చిలక్ష్మి ముందు నిలబడి, "కార్లో వెళ్దాం రారాదూ?" అంటూ ఆహ్వానించేడు.

ఆ అమ్మాయి "అక్కర్లేదు. నువ్వెళ్లు," అంది మొహం చిట్లించి.

రంగారావు విలాసంగా వెన్ను విరుచుకు వెనుదిరిగాడు.

"కారుందని గీర," అంది మరో అమ్మాయి.

"డొక్కు కారు" అంది బుచ్చిలక్ష్మి.

"డొక్కో డోలో ... నీకూ నాకూ అదీ లేదు కదా" ఎడంగా నిలబడిన గుంపులోంచి వస్తున్న మాటలు వింటున్న మరో సుందరి అంది.

"మా అన్నయ్య టైపు నేర్చుకోమంటున్నాడు."

“మా నాన్నగారు హిందీ పరీక్షలకి చదవమంటున్నారు.”

“నేను అమెరికా వెళ్తాను.” అన్నాడు రంగారావు. ఆ ప్రకటనతో అక్కడున్న పదిమందికళ్లూ అతనివేపు తిరిగేయి.

అటువేపున్న ఓ పొట్టికుర్రాడు నవ్వేడు, “అవునౌను .పొద్దున్న బస్టాండులో చూసేను టిక్కెట్టు కొంటుంటే.”

“ఎంతేమిటి టికెట్టు?” ఇంకోడు వంత పాడేడు.

“రూపాయిన్నర కాబోలు” మరో గొంతులో హేళన.

రంగారావు పక్కనే వున్న వెంకటప్పయ్య అలా నిలబడగలిగినందుకు కించిత్ గర్విస్తూ అన్నాడు, “నవ్వకండొరే. వాడు నిజంగానే అమెరికా వెళ్తున్నాడు.”

చుట్టూ వున్నవాళ్లు తలో మాటా మళ్లీ …

“వెళ్లి ఏం చేస్తావక్కడ?”

“అక్కడ చాలా బాగుంటుందిట కదా. కార్లూ, మేడలూ …”

“ఓహ్. ఇంద్రభోగమే అనుకో. ఏ పనికయినా సరే మిషన్లుంటాయి. మనుషులు శుభ్రంగా రాజకుమారుల్లా వుంటారు. ఇళ్లు ధగధగ మెరుస్తూ వుంటాయి. ప్రతివాడికీ ఒకటో రెండో కార్లు.”

“రెండు కార్లే?”

“ఇక్కడలా మేష్టర్లకి భయపడక్కర్లేదు తెలుసా! అక్కడ అందరూ సమానమే.”

“అక్కడ … అక్కడ …” కబుర్లతో, కోరికలతో, కలకలా, గలగలాగా ఆరోజు ఆ ఆవరణ దీపావళిలా వెలిగిపోయింది. ఆనాడు అక్కడ రంగారావుచుట్టూ వెలిగిన ప్రభలు చాలాకాలం అతని స్నేహితులు మరిచిపోలేదు.

పరీక్ష పాసయినందుకు సరోజ అందర్నీ తనయింట్లో పార్టీకి రమ్మని ఆహ్వానించింది. సరోజ అంటే ఇష్టం లేనివాళ్లు సినిమాప్రోగ్రాం వేసుకున్నారు.

***

నెమ్మదిగా కదిలి ఎవరిదారిన వారు పోతున్నారు విద్యార్థులు. గీత మాత్రం ఎవరితోనూ కలవకుండా కొందరికి కొంచెం ముందుగానూ చాలామందికి వెనగ్గానూ నిదానంగా నడుస్తూ, పొరపాటున ఎవరిభుజమేనా తగిల్తే చిరాకు పడుతూ, వాళ్లమాటలు వింటూ, వాటిని నిరసిస్తూ, తన ఆలోచనలేమిటో తనకే తెలీని అయోమయావస్థలో ఇల్లు చేరింది.

“పాసయేవా?” వరండాలో వాలుకుర్చీలో కూర్చున్న తండ్రి పరమేశంగారు అడిగేరు.

“ఆఁ” అంటూ తలూపి గీత ఇంటిలోకి వెళ్లిపోయింది.

“బతికించేవు” అంది వరండాలో కూచుని వత్తులు చేసుకుంటున్న తల్లి కామాక్షి.

గీత లోపలికెళ్లి తనపుస్తకాలగూటిదగ్గర నిలబడింది. ఆపుస్తకాలు నిన్నటివరకూ తనకి ప్రాణప్రదం. ఇప్పుడు వాటితో అవసరం తీరిపోయింది అనుకోగానే దిగులూ ఆనందమూ కలగాపులగంగా ముప్పిరిగొన్నాయి మనసులో.

“కాఫీ తాగుదూ గానీ రావే” తల్లి లేచింది వంటింట్లోకి నడుస్తూ.

“నువ్వు పరీక్ష పాసవుతే నాకు పావలా ఇస్తానన్నావు కదా గాలిపటం కొనుక్కోడానికి,” అన్నాడు తమ్ముడు చిట్టి వెనకనించి వచ్చి.

“ఎప్పుడన్నానూ?” అంది గీత పరధ్యానంగా.

“అల్లప్పుడూ .... మరేమోనూ సరోజక్క మనింటికొచ్చినప్పుడూ, ... నేనేమో డప్పులు వాయించుకుంటుంటేనూ“ ఏడేళ్ల చిట్టి సాగదీస్తూ చెబుతుంటే గీత వాణ్ణి అట్టే చూస్తూ నిలుచుండిపోయింది.

పరమేశంగారు కూడా కాఫీకోసం లోపలికొస్తూ “ఏమిట్రా నీగొడ. తరవాత ఇస్తుందిలే. వెళ్లి ఆడుకో” అన్నారు.

గీత ఉలికిపడి అప్పుడే మేలుకున్నట్టు “తరవాత ఇస్తాలే” అంది తమ్ముడితో.

వంటింట్లోకి వెళ్లి కాఫీ తాగుతుంటే, అమ్మ “నాగమ్మత్తయ్యా వాళ్లింటికెళ్లి రెండు కరివేపాకు రెబ్బలు విరుచుకు రా. పులిహోర కలుపుతాను,” అంది.

గీత తన పుస్తకాల గూటివేపు మరోసారి చూసి గుమ్మం దిగింది. నిన్నటివరకూ ఆపుస్తకాలమీద ఎనలేని మమకారం, ఇవాళ ఇదీ అని చెప్పలేని నిరీహ. ఆ భావం ఎంత విదిలించుకున్నా మనసులోనించి పోవడం లేదు!

***

“అమ్మ కరివేపాకు తెమ్మంది”

పెరటివేపు వసారాలో స్థంభాన్నానుకు కూచుని సీతారామాంజనేయం చదువుకుంటున్న నాగమ్మ తలెత్తి గీతని చూసి, “కోసుకో” అంది.

గీత మాటాడకుండా చెట్టువేపు సాగింది.

“పరీక్షలేశారటగా. పాసయేవా?” అనడిగింది నాగమ్మత్తయ్య.

“ఆఁ, పాసయేను.”

“ఏం చేస్తావయితే?”

కరివేపాకు కొమ్మ వంచి రెమ్మలు దూసుకుంటున్న గీత ఆలోచిస్తోంది. ఆవిడప్రశ్నకి తనదగ్గర సమాధానం సిద్ధంగా లేదు. సరోజ మెడిసన్ చదువుతానంది. నవనీతం సెకండరీ గ్రేడ్ ట్రైనింగుకి వెళ్తానంది. కుముదం తల్లి నర్సు. కుముదం కూడా నర్సే అవుతుంది. తను? పెద్ద ప్రశ్నార్థకం.

దూసిన నాలుగు రెమ్మలు చేత పుచ్చుకుని, “వస్తానత్తా” అంది.

నాగమ్మ తలెత్తి, కళ్లజోడు తీసి పక్కన పెడుతూ, “వెళ్లొచ్చులే, కూచో” అంది.

"అక్కడ పోటీకోలు చెబుతూ కూర్చోక పేగిరం వచ్చేయి అంది అమ్మ" అంది గీత.

"అలాగే వెళ్లూ గానిలే. కాలేజీలో చేర్తావా మరి?"

"ఏమో."

"ఏమో ఏమిటి? చదివింది చాలు. మరింక చదవక్కర్లేదు అందా ఏమిటి మీ అమ్మ?"

"ఊహుఁ. అమ్మేమీ అనలేదు."

"మరి మీ నాన్న అన్నాడా?"

గీత లేదన్నట్టు తల అడ్డంగా వూపి, "వెళ్తాను ఆలస్యం అయిపోతుంది" అంది.

"సరే వెళ్లు గానీ ఏమో, ఏవిటో అంటూ ఆ నంగిమాటలు వదిలెయ్. సుబ్బరంగా కాలేజీలో చేరు. చాకలిపద్దు చూడ్డం వస్తే చాలు అనుకునే రోజులు పోయేయి. ఓ కాయితపుముక్క వుంటే గానీ పుస్తె ముడెయ్యడు ఎవడూ."

గీత మరోమారు తలూపి మెట్లు దిగింది. కనీసం రాత్రయినా అడుగుతారా అమ్మా నాన్నా ఏం చేస్తావని? అడిగితే ఏం చెప్పడం? తనని అడక్కుండా వాళ్లే ఏదో నిర్ణయం చేసేసి ఇది చెయ్యి అంటే ఏం చెప్పడం? - ఆలోచనలతో సతమతమవుతోంది గీత.

గీత అంచనా కొంతవరకూ నిజమే అయింది.

రాత్రి భోజనాలదగ్గర కామాక్షి ఆ ప్రసంగం తెచ్చింది. కూర కంచాల్లో వడ్డిస్తూ, "కాలేజీలో చేరాలంటే చాలా డబ్బవుతుంది కాబోలు" అంది తనలో తను మాటాడుకుంటున్నట్టు.

"వూ" అన్నారు పరమేశంగారు సాలోచనగా.

"కాలర్షిప్పులో ఏవో వుంటాయిట గదా" అందావిడ మళ్లీ.

"సరేలే వదినా! అవన్నీ మనలాటివాళ్లకి కావు. డబ్బున్న ఆసామీలకే ఆ పట్టాభిషేకాలన్నీను" అన్నాడు మరిది భానుమూర్తి.

"ప్చ్" అందావిడ నీరు గారిపోతూ. డబ్బున్నవాళ్లకే స్కాలర్షిప్పులు ఎందుకిస్తారని అడిగేంత అమాయకురాలు కాదు ఆవిడ.

తలొంచుకు అన్నం కూరా కెలుకుతున్న గీతకి అమ్మా, నాన్నా, చిన్నాన్నా తనగురించీ, తన భవిష్యత్తుగురించీ మాటాడుతున్నట్టు అనిపించడంలేదు.

***

శనివారం సరోజ ఇంట్లో పార్టీకి గీత వెళ్లి తిరిగి వచ్చేసరికి పొద్దు పోయింది.

"పార్టీ బాగుందా?" అనడిగింది తల్లి కామాక్షి గీతమొహంలోకి చూస్తూ. అక్కడ ఆపిల్ల ఎలాటి ప్రశ్నలు ఎదుర్కొని వుంటుందో ఆవిడ వూహించుకుని బాధ పడింది.

గీత మౌనంగా తలూపి గదిలోకి వెళ్లింది బట్టలు మార్చుకోడానికి.

భోజనాలయేయి. అలవాటు ప్రకారం, పరమేశంగారు వరండాలో వాలుకుర్చీలో వాలి పేపరు విప్పేరు ఆనాటి విశేషాలు తెలుసుకోడానికి. గీత చాపలూ, పరుపులూ తెచ్చి పరుస్తోంది మధ్యగదిలో. పిల్లలు ఆపక్కలమీదే కూచుని చదువుకుంటారు. పెద్దలు ఆపక్కలమీదే చేరి ఆరోజు విశేషాలు చెప్పుకుంటారు. వాళ్లచదువులూ, వీళ్లకబుర్లూ ముగిసేక గీత లేచి, పుస్తకాలు తీసి దాచి, పిల్లలకి దుప్పట్లు కప్పి, లైటార్పి పడుకుంటుంది.

ఇప్పుడు అందరూ ఆవిధంగా గీత పరిచిన పక్కలమీద ఉపవిష్టులయేక, భానుమూర్తి, “అయితే సరోజ ఏంచేస్తుందిటా?” అని అడిగేడు, దిండు మడత పెట్టి దానిమీద మోచేతులానించి, పాముపడగలా తలెత్తి గీతవేపు చూస్తూ.

గోడనానుకుని కూర్చుని సేద తీర్చుకుంటున్న కామాక్షి, “అలా దిండు విరవొద్దని ఎన్నిమార్లు చెప్పేను, భానూ. కావలిస్తే రెండు దిళ్లు పెట్టుకో,” అంది మరిదితో.

గీత బాబాయి ప్రశ్నకి జవాబుగా, “మెడిసిన్ చదువుతుందిట” అంది.

“దానికి అంత తెలివితేటలు వున్నాయేమిటి?” అన్నాడు భానుమూర్తి హేళనగా. భానుమూర్తి పాలిటెక్నిక్ కాలేజీలో కుస్తీపట్లు పట్టి అత్తెసరు మార్కులతో యాడాదిక్రితం అయింది అనిపించుకున్నాడు,

అతను సరోజని అలా తీసిపారేయడం గీతకి నచ్చలేదు. మనసు చివుక్కుమంది. “దానికెప్పుడూ మంచిమార్కులే వస్తాయి” అంది..

“అవేవో హిందీ పరీక్షలున్నాయిట కట్టకూడదుటే?” అంది బామ్మగారు వాకిట్లో నులకమంచంమీద పడుకుని చుక్కల్లోకి చూస్తూ. ఆవిడ పరమేశంగారి స్వంతతల్లి కాకపోయినా ఇంట్లో వుంది కనక ఇంటిమనిషికిందే లెఖ్ఖ. అంచేత అడిగినా అడక్కపోయినా ఆవిడ అడపా తడపా ఓ సలహా పారేస్తూ వుంటుంది.

గీత గుండెలు చిక్కబట్టుకుని, “నాకు కాలేజీలో చేరాలని వుంది,” అంది.

“కాలేజీ అంటే మాటలా! బియ్యే కావాలన్నా నాలుగేళ్లు పడుతుంది. ఈలోపున మీనాన్న రిటైరవుతాడు,” అన్నాడు భానుమూర్తి.

“హిందీ పరీక్షలు మాత్రం ఇవాళ మొదలెడితే రేపయిపోతాయేమిటి?” అంది గీత అతనివేపు చూడకుండా.

“రేపు కాకపోతే ఎల్లుండి. కనీసం అంత ఖర్చు వుండదు కదా,” అన్నాడు భానుమూర్తి గీతని గుచ్చి చూస్తూ. ఆ అమ్మాయి ఆమాత్రం నోరు విప్పడం అతనికి ఆశ్చర్యంగా వుంది. సరోజ ఇంట్లో పార్టీమహిమ కాదు కదా అనిపించకపోలేదు అతనికి.

కామాక్షిమొహంలో కళ తప్పడం ఎవరూ గమనించలేదు. “కనీసం బియ్యే అయినా అయితే బాగుండు” అందావిడ నిదానంగా. తనకి సాగలేదు కనీసం కూతురయినా బియే కావాలని ఆవిడ ఆకాంక్ష..

పరమేశంగారికి కూడా అంతరాంతరాల ఆ కోరిక వున్నా బాధ్యతలు నెత్తినెక్కి పిండి కొడుతున్నాయి. ఆయన ఎటూ చెప్పలేక మౌనం వహించేరు.

భానుమూర్తికి వదినగారి వరస నచ్చలేదు. “ఆ బాగుండడం ఏమిటో నాక్కూడా అర్థం అయేలా చెప్పు వదినా, తెలుసుకుంటాను,” అన్నాడు.

పరమేశంగారు ఆవులిస్తూ, “చాలు పదండింక. పొద్దున్నే లేవాలి” అంటూ లేచేరు.

గీత భవిష్యత్తు ఎటూ తేలకుండానే ఆపూట చర్చలు ముగిసేయి.

***

కాలేజీలు తెరిచారు. గీత క్లాసుమేటుల్లో కొందరు అనుకున్నట్టు తమ తమ అభిమానవిషయాలు చదవడానికి కాలేజీలో చేరారు. సరోజకంటే ఎక్కువ మార్కులే వచ్చినా వెంకటసుబ్బయ్యకి బయాలజీలో సీటు రాలేదు. ఆర్ట్సులో చేరేడు. శ్రీనివాససుబ్బారావూ, బుచ్చిలక్ష్మీ, సుందరీ, జాన్ గోపాల్ - అందరూ తలో దారీ పట్టేరు.

గీత కూడా తమ పరిస్థితులకి అనుగుణంగా టైపుక్లాసులో చేరింది. కానీ ఎదలో చిన్న నొప్పి. తనకి మంచి మార్కులే వచ్చాయి. నాలుగేళ్లలో తనక్లాసుమేట్సులో కొందరికి డిగ్రీలు వస్తాయి. అందులో కొందరు తనకంటె చురుకైన వాళ్లేమీ కాదు. కేవలం తామున్న పరిస్థితుల బలంతో విద్యావంతులుగా స్థిరపడతారు. డజనుసార్లు డింకీ కొట్టీ, కాపీలు కొట్టీ డబ్బు పారేసి డిగ్రీలు తెచ్చుకోవచ్చు. కష్టపడి చదివి పరీక్షలు రాసి తెచ్చుకోవచ్చు. కానీ ,, కానీ … తను మాత్రం తెలివితేటలుండీ డిగ్రీ లేని ఆడపిల్లగా మిగిలిపోతుంది అనుకోకుండా వుండలేకపోయింది గీత.

కామాక్షి తమ్ముడిదగ్గరనుంచి వచ్చిన వుత్తరం మూడోసారి చదివి కింద పడేసింది. చిట్టి బిక్కమొహం వేసుకుని ఓమూల కూచున్నాడు.

టైపు క్లాసునించి తిరిగొచ్చిన గీత నేలమీద పడివున్న ఉత్తరం చూసింది.

“నువ్వు గానీ రాసేవా మామయ్యకి?” అంది ఆవిడ చిరాగ్గా.

“ఏమిటి రాయడం?”

“యస్సెల్సీ పరీక్ష పాసయినట్టు.”

“రాసేను. ఏం రాస్తే?”

గీతకి సందర్భం అర్థం కాలేదు. కామాక్షి జవాబు చెప్పకుండా వంటింట్లోకి వెళ్లిపోయింది.

గీత ఉత్తరం తీసి చదివింది. రమణమామయ్య రాసేడు. గీతని కావలిస్తే తనదగ్గర పెట్టుకుని చదివించగలనని అందులో ఒక భాగం తెలియజేస్తోంది. అదీ కంటకప్రాయమయిన విషయం.

“వాడో కిరస్తానీదాన్ని కట్టుకుని కులుకుతున్నాడు. వెళ్లు. నీక్కూడా ఓ తెల్లదొరని చూసి పెడతాడు,” అంది బామ్మగారు అక్కసుగా.

రమణ ఇరవైరెండేళ్ల వయసులో చదువుకోసం అమెరికా వెళ్లి, చదువు అయినతరవాత వుద్యోగం చూసుకుని, అమెరికనమ్మాయిని పెళ్లి చేసుకుని, సిటిజన్షిప్పు పుచ్చుకు స్థిరపడిపోయాడు.

వంటింట్లో కూర తాలింపు పెడుతున్న కామాక్షికి అత్తగారి మాటలు వినిపించేయి. ఆవిడకి అరికాలిమంట నెత్తికెక్కింది. అయినా తమాయించుకుని, కూరగరిటెతో నడవలోకి వచ్చి, వీలయినంత సౌమ్యంగానే అంది, "వాడెవర్ని కట్టుకుంటే మనకేల? పన్నెండేళ్ల తరవాత దేశంకాని దేశంనించి ఇంటికొచ్చినవాడికి నట్టింట విస్తరేసి నాలుగుమెతుకులు పెట్టుకునే అర్హత లేకపోయింది నాకు. కానివాడికి వడ్డించినట్టు మధ్యగదిలో పెట్టమన్నారు. వాడు కనక అంత అవమానం భరించి మళ్లీ సాయం చేస్తానని ముందుకొచ్చాడు. వాడు అన్నంతమాత్రాన మనఁవే పిల్లని పంపించటానికి సిద్ధంగా లేం కదా. దీనికి తోచింది ఇది రాసింది. వాడికి తోచిందేదో వాడు చెప్పేడు. దానికింత రాద్ధాంతం ఎందుకూ?"

ఈమాటతో పెద్దావిడ మరీ రెచ్చిపోయింది. "నేనేం కానిమాట అన్నానా? ఇంతకీ మన బంగారం మంచిదయితే."

ఈ రాద్ధాంతం అంతా తిలకిస్తున్న గీత ఇంకా నయం బాబాయి ఇక్కడ లేడు అనుకుంది. కానీ ఆయనగారు రాకపోతాడా, ఈభాగోతం కొనసాగకపోతుందా అని వెంటనే తోచింది. ఆ వెంటనే ఎక్కళ్లేని నీరసం ముంచుకొచ్చింది. ఆపిల్ల అంచనా తప్పలేదు.

ఆరాత్రి భోజనాలయేక భానుమూర్తి తీరిగ్గా గీత పరిచిన పక్కమీదకి ఒరిగి, అనుకున్నదానికంటె ఎక్కువే రభస చేసాడు. 'ఏరోగ్రాం కొనడానికి డబ్బులెక్కడివీ' దగ్గరినుంచీ 'ఫారిన్ వెళ్లాలనే కోరిక మేనమామదగ్గర వెళ్లబోసుకోవటం ఎందుకూ' వరకూ సాగింది చర్చ. వాచ్యం చెయ్యలేదు కానీ గీత మొహానికి అమెరికాయాత్ర కూడానా అని అతడి అభిప్రాయం.

"అసలు నువ్వేం రాసేవే?" పరమేశంగారు అడిగేరు. వాళ్లందరూ చర్చిస్తున్నది తనబిడ్డ విషయం అన్నసంగతి అప్పుడే తట్టినట్టుంది ఆయనకి.

ఆఖరికి అసలువిషయం చెప్పక తప్పలేదు. అసలు కథ ఏమిటంటే సరోజయింట్లో పార్టీవేళ రంగారావు మాటాడుతూ అమెరికాలో మనవాళ్లెవరేనా వుంటే వెళ్లడం చాలా తేలిక అన్నాడు. ఏమిటి తేలికో గీతకి సరీగా బోధపడలేదు కానీ యాదాలాపంగా తన మేనమామ అక్కడే వున్నాడని చెప్పింది.

"ఇంకేం మరి. ఆయనకి రాయి." అని ఓ సలహా పారేసాడు రంగారావు.

గీతకి అదే యావ అయిపోయిందని చెప్పలేం కానీ మర్నాడు కామాక్షి తమ్ముడికి ఉత్తరం రాస్తూంటే తనకి కూడా ఓముక్క రాయాలనిపించింది. తల్లి గీతకి కొంచెం జాగా వదిలి, తను రాసేదేదో రాసి ఎడ్రెసు కూడా రాసి పోస్టు చెయ్యమని చెప్పి కవరు ఇచ్చింది. గీత తను యస్సెల్సీ పాసయినట్టు రాసి పోస్టులో పడేసింది. అంతేగానీ మామయ్య ఇలా తనని ఆహ్వానిస్తూ జవాబు ఇస్తాడని ఊహించలేదు. ఎదురు చూడ్డంమాట అసలే లేదు.

"చెప్పవేం మరి, వదినా, పిల్లదానికి బాగానే మాలీసు చేస్తున్నావు," అన్నాడు భానుమూర్తి వెటకారంగా.

"నా మాలీసు ఏపాటిది నాయనా మీరందరూ ఇన్నివిధాల దానికి రక్షకులుండగా," అంది కామాక్షి అటువేపుకి వొత్తిగిలి.

"పోనీలేవే గీతమ్మా! నువ్వక్కడికి వెళ్లింతరవాత ఈ బాబాయిని కూడా కాస్త కనిపెట్టుకుని వుండు. నాక్కూడా ఏదో ఓ చిన్న అవకాశం ఇప్పించేవంటే నాజన్మ కూడా తరిస్తుంది," అన్నాడు భానుమూర్తి కొస వదలకుండా.

గీతకి మహ సంకటంగా వుంది ఈ రభస. బుద్ధి తక్కువయి రాసేనురా తండ్రీ అనుకుంటోంది మనసులో.

"ఎవరి రాతలు యెలా వుంటాయో ఎవరు చూసారు. నాయనా! నవ్విన నాపచేనే పండుతుందన్న సామెత ఊరికే రాలేదు," అంది కామాక్షి.

000

పరమేశంగారిది బతికి చెడ్డ కుటుంబం. ఆస్తులన్నీ హరించుకుపోగా ఇవాళో రేపో కూలిపోడానికి సిద్ధంగా వున్న పెంకుటిల్లూ, విజయవాడలో ఎలిమెంటరీ స్కూల్లో ఉద్యోగమూ - అంతే ఆయన లోకం. ఇద్దరు మొగపిల్లలూ ఇద్దరు ఆడపిల్లలూ. గీత రెండో సంతానం. ఆయన తమ్ముడు భానుమూర్తి టెలిఫోను కంపెనీలో ఆపరేటరుగా పని చేస్తూ చేదోడు వాదోడుగా ఆఇంటనే కాలం గడుపుతున్నాడు. చేదోడుగా వున్నందున పిల్లల చదువులకి సాయం అవుతోంది. వాదోడుగా అతడు విసిరే విసుర్లు మాత్రం చిరాగ్గా వుంటున్నాయి కామాక్షికీ, గీతకీ. వాళ్లతో పాటు ఆ పంచనే కాలం వెళ్లబుచ్చుకుంటున్న మరో ప్రాణం బామ్మగారు. ఆవిడ పరమేశంగారికి వరసకి పినతల్లి అవుతుంది. వున్న ఒక్క కొడుకూ ఆవిడని ఇంట్లోంచి తగిలేస్తే, పరమేశంగారి తల్లి, అయ్యో నాకు సాక్షాత్తు అక్కలాటిది అంటూ చేరదీసింది. పరమేశంగారి తల్లి పోయినతరవాత ఆవిడకి వారసురాల్లాగా ఆయింట్లోనే కాలం గడుపుతున్నారు బామ్మగారు.

000

శివరావూ పరమేశం చిరకాల మిత్రులు. ఓనమాలనించి బియే వరకూ ఒకే బంకులో టీ తాగి, ఒకే మిత్రుడిదగ్గర చీట్లాటా, సిగరెట్లూ నేర్చుకుని, ఒకే డాక్టరుదగ్గర మందులూ చీవాట్లూ తిని పాతికేళ్లు దాటేక వేరు వేరు జీవితాల్లో స్థిరపడిన నేస్తగాళ్లు. పరమేశం తల్లిదండ్రులు కుదిర్చిన కామాక్షిని పెళ్లి చేసుకుని విజయవాడలో స్కూలుమేష్టరుగా స్థిరపడ్డారు. శివరావు వాళ్లమ్మ ఇష్టప్రకారం మేనమామ కూతురు కనకమ్మని చేసుకుని మామగారి వ్యాపారం చూసుకుంటూ గుంటూరులోనే స్థిరపడ్డారు. ఎవరి వ్యాపకాలు వారివి అయి కొంతకాలంగా పలకరింపులు తగ్గిపోయేయి.

అలాటిది ఓ శుభోదయాన శివరావు పదకొండో తారీకు వస్తున్నానని ఓ కార్డు రాసి పారేసి, పదకొండో తారీకు మధ్యాన్నం ఇంటిముందు వాలేరు తమకారులో. పరమేశంగారు ఆ సమయాన ఇంట్లో లేరు.

కామాక్షి నవ్వుతూ, "రండి అన్నయ్యగారూ! వదినగారూ పిల్లలూ కులాసాయేనా" అంటూ పలకరిస్తూ ఆప్యాయంగా ఆహ్వానించింది. మనయిళ్లలో సర్వసాధారణంగా జరిగేదే. ఏళ్ల తరబడి కనుమరుగైనా మళ్లీ కనిపిస్తే ఆనాటి ఆప్యాయతలు ఇట్టే తన్నుకొస్తాయి పైకి.

"ఏమయ్యా, కనిపించడమే మానేశావు?" అంది బామ్మగారు.

శివరావుగారు ఈజీఛైరులో కూలబడి, వదినగారూ, పిల్లలూ కులాసాయే అని కామాక్షికి చెప్పి, బామ్మగారితో "తీరడంలేదు బామ్మగారూ! వ్యాపారం కదా ఆటూ పోటూను. ఓరోజు బాగుంటే ఓరోజు బాగుండదు. ఎవరినీ నమ్మడానికి వీల్లేని రోజులు. ఒక్క క్షణం ఏమరితే ఏం గలాటా అవుతుందో అని కనిపెట్టుకునుండాలి" అన్నారు.

"అబ్బాయిలు ఎదిగి వచ్చారు కదా. ఆమాతరం చూసుకోరా?" అందావిడ.

హిందీ క్లాసునుండి అప్పుడే వస్తున్న గీత శివరావుగారిని చూసి గుమ్మందగ్గరే ఆగిపోయింది చిన్నగా నవ్వుతూ.

శివరావుగారు కూడా నవ్వుమొహంతో, "అబ్బే, వాళ్లింకా అంత ఎదగలేదు," అని బామ్మగారికి చెప్పి, గీతవేపు తిరిగి, "కాలేజినించా? ఏం చదువుతున్నావు?" అన్నారు.

"లేదండీ, కాలేజీలో చేరలేదు. టైపు నేర్చుకున్నాను. ఇప్పుడు హిందీ విశారద పరీక్షకి చదువుతున్నాను" అంది గీత.

"ఇంతకీ అన్నయ్యగారికి ఇంతకాలానికి మామీద దయ కలిగింది. ఏమిటి విశేషాలు?" అంది కామాక్షి. కలగజేసుకుంటూ.

"ఏంలేదమ్మా, చెప్తున్నా కదా పనులు ఎప్పటికప్పుడే. ఇంతకీ అసలు మాట చెప్పనేలేదు. పెద్దబ్బాయికి పెళ్లి చేస్తున్నాం వచ్చే మాఘమాసంలో."

"ఆలాగా, బాగుందండి. సంబంధం ఎవరేమిటి?" అనడిగింది కామాక్షి.

తాడిపత్రివారి ద్వితీయపుత్రిక అనీ పాతికవేలు కట్నం ఇచ్చి, అల్లుణ్ణి సొంత ఖర్చులతో అమెరికా పంపడానికి మాటలు జరుగుతున్నాయనీ చెప్పి, గీతవేపు తిరిగి, "అయితే నువ్వు ఎందుకు కాలేజీలో చేరలేదూ?" అన్నారాయన మళ్లీ.

వ్యాపారానికి చిన్నా, పెళ్లికి పెద్దా అయిన అబ్బాయి ఎలా వుంటాడో ఊహిస్తున్న గీత వులికిపడి, "విశారదకి చదువుతున్నానండీ," అంది మళ్లీ.

"అదికాదమ్మా, కాలేజీలో ఎందుకు చేరలేదనీ," అని కామాక్షివేపు తిరిగి "ఏమ్మా! మీఆయన కూడబెట్టి ఇచ్చేఆస్తులంటూ ఎలాగా లేవు. కనీసం మంచిచదువులయినా చెప్పించవచ్చుకదా," రెండో అమ్మాయి తెచ్చిన మంచినీళ్లు అందుకుంటూ చనువుగా ప్రశ్నించారు.

"ఆమాట ఆయన్నే అడగండి," అంది కామాక్షి తన తప్పేంలేదు అని స్పష్టం చేస్తూ. పిల్లచదువుకి తనతమ్ముడు సాయం చేస్తానంటే ఆయనతమ్ముడు హేళన చేసిన వైనం ఆవిడ ఎదలో ముల్లై కెలుకుతూ వుంది మరి.

"రానియ్యి. వాణ్ణే అడుగుతాను," అన్నారాయన.

గీత తల్లివెనక చేరి, "అయిన గొడవ చాలదూ? మళ్లీ ఇప్పుడెందుకూ ఆ వూసెత్తడం?" అంది నసుగుతూ.

"బాగుంది. నిన్ను ఎందుకు కాలేజీకి పంపలేదూ అంటే మీనాన్నని అడగమన్నాను. వున్నమాటే కదా?" అంది ఆవిడ అమాయకంగా మొహం పెట్టి.

శివరావుగారు అక్కడికా సంభాషణ ఆపి, "భానుమూర్తి ఏం చేస్తున్నాడు?" అని అడిగారు.

"ఫోస్లకంపెనీలో పని చేస్తున్నాడు."

"ఏమాత్రం వస్తుందేమిటి?"

"మూడు వందలు తెస్తాడు. అదికాక ఓటీలుంటాయి."

శివరావుగారు పరధ్యానంగా వున్నారేమో "ఏవిటీ?" అని అడిగారు మళ్లీ.

"అదేనండీ, ఎక్కువ పని చేస్తే ఎక్కువ డబ్బిస్తారూ."

శివరావుగారు ఆహా అని తల తాటించి, కాళ్లు కడుక్కుని వస్తానంటూ పెరటివేపు నడిచేరు.

పరమేశంగారు ఇంటికొచ్చేవేళకి కనుచీకటి పడుతూంది. అంతకుముస్నే పనుందంటూ వూళ్లోకెళ్లిన శివరావుగారు తిరిగొచ్చేసరికి రాత్రి తొమ్మిది దాటింది.

"బండి దిగీ దిగకముందే పనుందంటూ వూరిమీద పడకపోతే, నిదానంగా చూసుకోకూడదూ ఆ పనులేవో," అన్నారు పరమేశంగారు మందలిస్తున్నట్టు.

"మరే, నేనూ నీలాగే బడిపంతుల్ని ఆయివుంటే, ఠంచనుగా పదింటికి వెళ్లి, నాలుగు కొట్టేసరికల్లా తిరగొచ్చేసి పూలరంగడిలా పవళించేవాడినే. నాది వ్యాపారమయ్యా నాయనా. మాకు పని చేయుకాలమూ, విశ్రాంతిసమయమూ, ఎండాకాలమూ, వానాకాలమూ, రాత్రీ, పగలూ, తిండీ, నిద్రా - ఏమీ వుండవు. సర్వం విష్ణుమయం అన్నట్లుగా మాకు ఎల్లవేళలా ఒకే కార్యక్రమం, వ్యాపారం."

"హుమ్. రాబర్ట్ ఫ్రాస్ట్ చెప్పినట్టు తాను తొక్కనిదారిలో ఏముందో తెలీదు కదా. నువ్వే బడిపంతులివి అయుంటే పూలరంగడూ, పవళింపూ లాటి మాటలు వాడవు," అన్నారు పరమేశంగారు వెలితినవ్వుతో.

"పోనీలే. నావి అపభ్రంశాలు అని ఒప్పేసుగుంటాను. ఇప్పుడు పాఠాలు మొదలెట్టకు" అన్నారు శివరావు తేలిగ్గా నవ్వేసి.

"ఇప్పటికే ఆలస్యం అయింది. భోజనానికి రండి" అంది కామాక్షి వంటగదివేపు దారి తీస్తూ.

భోజనాలదగ్గర మళ్లీ శివరావు గీత చదువు ప్రసక్తి తెచ్చేరు. పరమేశంగారికి అది మాటాడ్డం ఇష్టం లేదు. పెద్దవాడు కాలేజీలో రెండో ఏడు చదువుతున్నాడు. గీత తరవాత ఇంకా పిల్లలున్నారు. వాళ్లకి కూడా నాలుగు అక్షరపుముక్కలు రావాలి కదా. ఆమాటే అన్నారాయన.

శివరావు వూరుకోలేదు, "ఇదే మనవాళ్లతో వచ్చిన చిక్కు. నాపిల్లలకి పట్టెడన్నం పెట్టుకోలేకపోతానా అనో, రాతిలోని కప్పను రక్షించువాడే రక్షిస్తాడనో పిల్లల్ని కనేస్తారు. ఆఖరికి ఆపట్టెడన్నంతోనే సరిపుచ్చుకుంటారు."

"ఏమిట్రోయ్ ఫామిలీప్లానింగు కబుర్లు చెబుతున్నట్టుంది. తమరికెందరేమిటి పిల్లలు? ఇద్దరా లేక ముగ్గురా?" పరమేశం నవ్వుతూ అన్నాడు.
శివరావుకి ఆరుగురు పిల్లలు, అందరూ మొగపిల్లలే. "నాకెందరయినా నేను వాళ్లకి పట్టెడు మెతుకులు చాలనుకోలేదు. ప్రతిఒక్కడికీ చాలినంత సంపాదిస్తున్నాను. సంపాదించగల స్తోమత నాకుంది" అన్నాడు శివరావు తన సామర్థ్యం వెల్లడి చేస్తూ.
కామాక్షి అన్నం మారు వడ్డిస్తుంటే. ఎడంచేత్తో వారిస్తూ, "చాలమ్మా, ఇప్పటికే చాలా ఎక్కువయిపోయింది" అన్నాడు.
ఆవిడ వెళ్లి పెరుగు తీసుకొచ్చింది.
భానుమూర్తి ఇంట్లోకి వచ్చి, కాళ్లూ చేతులూ కడుక్కుని వచ్చి మరో పీట వాల్చుకుని కూర్చున్నాడు.
శివరావు ఆతన్ని పలకరించి కుశలప్రశ్నలు వేశారు. "నువ్వు ఎన్నయినా చెప్పు. ఆడపిల్లలు కూడా చదువుకోవాలనే అంటాను నేను," అన్నాడు చివరిసారిగా.
"అది సాగేమాట కాదులే. నాతరం కాదు. పెద్దవాడికి డిగ్రీ వచ్చేసరికి ఇంకో రెండేళ్లు పడుతుంది. ఇంకా గీత తరవాత మరో ఇద్దరు పిల్లలు వున్నారు. వాళ్లకి కూడా నాలుగు ముక్కలు రావాలి కదా," అన్నారు పరమేశంగారు కటికనిజాలు దృష్టిలో పెట్టుకుని.
శివరావు, "సరే నీయిష్టం" అన్నారు ముక్తసరిగా.
పరమేశంగారికి తానేదో తప్పు చేస్తున్నానని అతను అనుకుంటున్నాడేమో అనిపించి, "పెళ్లి చేసేయాలని చూస్తున్నాను" అని జోడించారు.
"దానికిప్పుడే పెళ్లేమిటి? పదహారయినా నిండేయా?" అన్నారు శివరావుగారు ఆశ్చర్యపోతూ.
పరమేశంగారు వీలయినన్ని కారణాలు చెప్పేరు. గీతేం పసిపిల్ల కాదు అన్నారు. ఆడపిల్లకి పెద్ద చదువులు చెప్పిస్తే ఇంకా పెద్దచదువులు గల అల్లుళ్లని చూడాలన్నారు. వాళ్లకి తగినంత కట్నాలు ఇచ్చుకోవాలి కదా అన్నారు.
"పోనీ, నువ్వు అల్లుడికోసం వెతుకుతూండు. అంతవరకూ చదువుకోనియ్యి"
"మొగుడికింత వండి పెట్టడానికి కాలేజీ చదువులెందుకండీ" అన్నాడు భానుమూర్తి.
"డిగ్రీ వుంటే వండిపెట్టడానికి అడ్డొస్తుందేమిటి?"
"అడ్డొస్తుందని కాదు. అవసరం లేదంటున్నాను. మావదిన్ని చూడండి. ఏం చదివింది? అయినా ఎంత నేర్పుగా సంసారాన్ని ఈదుకొస్తోంది."
"చాల్లే, నామాటే చెప్పుకోవాలి" కామాక్షి విసుక్కుంది.
"అదేమిటి వదినా, ఈరోజు నేనింతవాడిని అయేనంటే అది నీచేతి చలువే కదా."
కామాక్షిమొహంలో చాయామాత్రంగా సంతృప్తి మెరిసి మాయమయింది. మరిది మెచ్చుకున్నందుకు లిప్తపాటు తృప్తి కలిగినా, విషయం పక్కదారి పట్టినందుకు చిరాకు కూడా కలిగింది వెంటనే.

ఆ రెండుభావాలూ శివరావూ, పరమేశం దృష్టి దాటిపోలేదు. ఆవిడ మనసులో మాట ఇద్దరికీ అర్థం అయింది. అదే వరసలో ఒకరికి సంతృప్తీ, రెండోవారికి అసంతృప్తీ కలిగేయి. అదే కారణంగా మొదటివారు ఆ సంభాషణ పొడిగించడానికీ, రెండోవారు తుంచేయడానికీ తలపడ్డారు.

"నామాట విను, పరమేశం. ఆడపిల్లకి చదువు అవసరమా కాదా అన్నమాట అటుంచి. ఈరోజుల్లో అబ్బాయిలు కూడా చదువుకున్న అమ్మాయిలనే ఇష్టపడుతున్నారన్న సంగతి మర్చిపోకు. హీనపక్షం బియే డిగ్రీ అయినా వున్న అల్లుడు కావాలని కోరుకుంటావు నువ్వు. ఈరోజుల్లో బియేలేం వేలకి వేలు సంపాదించటంలేదు కదా. అమ్మాయికి కూడా ఓ కాయితం వుంటే చన్నీళ్లకి వేణ్ణీళ్లు తోడుగా వుంటుందని పెళ్లికొడుకులు అనుకుంటున్నారు. అమ్మాయిని పనిలో పెడతారా లేదా అన్నది వాళ్లిష్టం. కానీ అవసరం అయితే ఆదుకోడానికి పనికొస్తుంది కదా. చెరో నాలుగు రాళ్లూ తెచ్చుకుని సుఖపడతారు," అన్నాడు శివరావు.

"ఆరుగురు మగబిడ్డల తండ్రివి. ఎన్ని కబుర్లు చెప్పినా నీకే తగును. నలుగురుపిల్లల్ని బియేలూ ఎమ్మేలూ చదివించే స్తోమతు నాకు లేదు. వున్నసంగతి అదీ.."

"మరీ అంత లేమి కబుర్లు చెప్పకు."

"పోనీ, మీరు తీసుకెళ్లి దగ్గర పెట్టుకు చదివిస్తారేమిటి? అంత గట్టిగా వాదిస్తున్నారు దాని తరఫున వకాల్తా పుచ్చుకుని," అన్నాడు భానుమూర్తి అమాయకంగా మొహం పెట్టి, ఒక్కొక్క మాటా వొత్తి పలుకుతూ.

హఠాత్తుగా అనుకోకుండా వచ్చిన ఈ ప్రతిపాదనతో లిప్తపాటు పెద్దలంతా స్థబ్ధులయిపోయేరు.

"నువ్వు నోరు మూసుకో" పరమేశంగారు తమ్ముడిని కసురుకున్నారు.

"బాగుంది వరస. అయ్యవారూ, మీసెత్తిన తేలుందంటే మీచేత్తోనే తీసెయ్యండి అన్నట్టు" అంది కామాక్షి.

"బాగా చెప్పేవు" అంది బామ్మగారు ఎవరిని ఉద్దేశించో తెలీకుండా.

శివరావు నోట్లో పెట్టుకున్న ముద్ద మింగి, గుక్కెడునీళ్లు తాగి, "బాగా చెప్పేవు, భానూ. అవునయ్యా, నాతో పంపించు. మాయింట్లో వుండి చదువుకుంటుంది." అన్నారు పరమేశంతో.

"నీకు మరీ వేళాకోళంగా వుందేం?" అన్నారు పరమేశంగారు చిన్నబుచ్చుకుని.

"నేలబోయింది నెత్తిన రాసుకోడం, మీకేందుకు అన్నగారూ" అంది కామాక్షి.

శివరావు ఒప్పుకోలేదు. "ఇందులో వేళాకోళమూ లేదు. నెత్తిన రాసుకున్నదీ లేదు. చిన్నవాడయినా భాను చెప్పినమాట సబబే. అసలు నిజానికి ఆమాట నాకే తోచాల్సింది. మీ వదినగారికీ నాకూ కూడా బాలాత్రిపురసుందరిలా కలకల్లాడుతూ ఆడపిల్ల నట్టింట తిరుగుతూ వుంటే చూడాలని ఎంతకాలంగానో కోరిక. ఆ ముచ్చట కూడా తీరుతుంది గీతమ్మతల్లితో."

"సరేలే, లే. పద చెయ్యి కడుక్కో" అన్నారు పరమేశంగారు ఆ సంభాషణ అక్కడికి తుంచేస్తూ.

ఆయన అభిప్రాయం ఏమిటో ఎవరికీ అంతు బట్టలేదు.

కామాక్షికి కూతుర్ని పరాయివారింటికి పంపడం ఇష్టంలేకపోయినా పిల్లచదువు కొనసాగుతుంది అనుకుంటే సంతోషంగానే వుంది.

తానేదో తమాషాకి అన్నమాట వీళ్లందరూ ఇంత సీరియస్ చేసేశారేమిటి అని గాభరా పడుతున్నాడు భానుమూర్తి.

వెర్రి వెక్కిరించినట్టే వుంది అనుకుంటోంది బామ్మగారు.

మామయ్యగారింట్లో ఆరుగురు మగపిల్లలమధ్య తనకి రోజులు ఎలా గడుస్తాయో ఊహించడానికి ప్రయత్నిస్తోంది గీత.

మంచంమీద వాలగానే నిద్ర ముంచుకొచ్చేసింది శివరావుగారికి. మర్నాడు ఉదయం ఆయన లేచేవేళకి గీత హిందీక్లాసుకి వెళ్లిపోయింది. భానుమూర్తి ఆఫీసుకి వెళ్లిపోయాడు. పరమేశం చెప్పుల్లో కాళ్లు పెట్టుకు గుమ్మం దిగుతున్నారు.

"అప్పుడే నీకు టైం అయిపోయిందేమిటి?" అన్నారు శివరావుగారు మంచంమీంచి లేస్తూ.

"నీకిప్పుడే తొలికోడి కూసింది మరి. సాయంత్రం నేనొచ్చేవరకూ వుంటావు కదూ?" అన్నారాయన.

"ఉంటానులే. మరి గీత నీదగ్గర శలవు పుచ్చుకోకుండా వచ్చేస్తుందా?"

పరమేశం కిందమెట్టుమీద వుంచినకాలు వెనక్కి తీసుకుని, "హాస్యానికన్నావు అనుకున్నాను," అన్నారు.

శివరావు బాల్యస్నేహితుడిదగ్గరకొచ్చి, మొహంలోకి సూటిగా చూస్తూ, "నిన్న చెప్పేను, మళ్లీ చెపుతున్నాను. ఇందులో హాస్యమేమీ లేదు. మనస్ఫూర్తిగానే అంటున్నాను. నేను గీతని తీసుకెళ్లినందువల్ల ఏదైనా హాని వుందని నువ్వు అనుకుంటే చెప్పు," అన్నారు.

"కామాక్షి ఏంవంటుందో," అన్నారు పరమేశంగారు సందిగ్ధంగా.

"ఆవిడ మాత్రం ఏవంటుందీ? అయినా ఆవిడతో కూడా మాట్లాడే చెప్పు. మీ ఉభయులకీ సమ్మతమైతేనే పంపుదువుగానీ. గుంటూరులో ఆడపిల్లలకాలేజీ మంచి పేరున్న కాలేజీ కూడాను. వెళ్లంటావూ? చూస్తూండు. నాక్కూడా ఎవరైనా తటస్థపడితే చెప్తాను."

పరమేశం సరేనన్నట్టు తలూపి మెట్లు దిగి రోడ్డెక్కారు. శివరావు వెనక్కి తిరిగి చూసేసరికి కామాక్షి గుమ్మానానుకుని నిలబడి వుంది.

"ఊళ్లో కాలేజీ లేదూ చదివించదలుచుకుంటే. మధ్య మీకెందుకు లేనిపోని తద్దినం," అందావిడ తల్లికుండే అప్రమత్తతతో. నిన్న గీతకిలాగే ఇవాళ ఆవిడకీ ఆరుగురు మొగపిల్లలు మెదిలేరు మనోవీధిలో!

"అయ్యో అదేమిటమ్మా! అలా అంటావు. మాఇంట్లో కళకళ్లాడుతూ మసిలే ఆడపిల్ల లేదని మాఇద్దరికీ కొరతే. పైగా మన గీత మరీ పసిపిల్ల కాదు గదా, తల దువ్వాలి, బట్టలు తొడగాలి అంటూ మథనపడడానికి. మాతో పాటే తింటుంది. కాలేజీకెళ్లి చదువుకుంటుంది.," అన్నారాయన అభిమానంగా..

"అది బొత్తిగా లోకజ్ఞానం లేని పిల్ల. వదినగారు మాత్రం ఎంతకని కనిపెట్టుకుని వుండగలరు?" అంది మళ్లీ కామాక్షి. ఇప్పుడు ఆవిడ మనసులో లోకంలో మగాళ్లందరూ మెదిలేరు.

శివరావుకి అర్థం అవడానికి రెండు నిముషాలు పట్టింది. "నీ భయం నాకర్థం అయిందమ్మా. జాగ్రత్తగా చూసుకుంటాం. చెప్తున్నా కదా గీత మీకెంతో మాకూ అంతే." అని పెరటివేపు రెండడుగులు వేసి, "మీ యిద్దరికీ నమ్మకం కుదిరితేనే పంపించండి" అన్నారు.

"ఎంతమాట" అంది కామాక్షి వంటింటివేపు నడుస్తూ.

హిందీ క్లాసునించి తిరిగి వచ్చింతరవాత కామాక్షి గీతని అడిగింది, "శివం మామయ్యగారింట్లో వుండి చదువుకుంటావా?" అని.

గీత ఈ ప్రస్తావన మొదలయిన దగ్గిర్నుంచీ ఆలోచిస్తూనే వుంది. తలుచుకుంటే గుండెల్లో దడగా వుంది. అనేకరకాల ఆలోచనలతో కుస్తీ పడుతోంది. ఇప్పుడు అమ్మ ప్రశ్నతో, అది దాదాపు ఖాయమేనని తెలిసింతరవాత, అలా జరక్కపోతే బాగుండునని కూడా అనిపించింది కొంచెంసేపు.

"వాళ్లింటికెందుకు వెళ్లడం? ఇక్కడా వుంది కదా ఆడపిల్లల కాలేజీ?"

"వాళ్లు, వాళ్లు అంటావేమిటి ఎవరో పరాయివాళ్లు అయినట్టు. వాళ్లకీ మనకీ బంధుత్వాలకి మించిన స్నేహం. మూడు తరాలనుంచీ ఎరిగున్నవాళ్లం. వాళ్లిద్దరికీ ఆడపిల్లలంటే ఆపేక్ష. ప్రతి కాన్పుకీ ఆడపిల్ల కావాలని వెయ్యిదణ్ణాలు పెట్టుకునేదావిడ," అంది కామాక్షి అనునయంగా.

అసలు నిజంలో అది సగం మాత్రమే అని ఇద్దరికీ తెలుసు. కానీ ఏ ఒక్కరూ బయటపడలేరు. అదొక చేదు నిజం.

శివరావుగారు ఆరాత్రికి కూడా అక్కడే వుండి మర్నాటికి ప్రయాణం పెట్టుకున్నారు.

గీత పెట్టెలో బట్టలు సద్దుకుంటుంటే 'నేనూ వస్తాను' అంటూ చెల్లీ, తమ్ముడూ ఏడుపు మొదలెట్టేరు. శివరావు చెరో అర్థరూపాయి వాళ్లచేతిలో పెట్టాడు 'బిస్కెట్లు కొనుక్కోండి' అని.

పరమేశంగారు శివరావుని పక్కకి పిలిచి, "నీ ఋణం ఈజన్మలో తీర్చుకోలేనురా" అన్నారు పైపంచెతో కళ్లు ఒత్తుకుంటూ.

"ఛా, అవేం మాటలు పరం, గీత నీకొకటీ నాకొకటీనా?" అన్నారు శివం అప్యాయంగా పరమేశంగారి భుజంమీద చెయ్యేసి.

పరమేశంగారు గీతదగ్గరకి వచ్చి బుద్ధిగా చదువుకోమనీ, ఏం కావాలిసినా శివం మామయ్యనో, కనకమ్మత్తయ్యనో అడగమనీ, మొహమాట పడవద్దనీ పదే పదే చెప్పేరు. శివరావు తండ్రిలాటివాడనీ, కనకమ్మ తల్లిలాటిదనీ, తనో బాబాయో అప్పుడప్పుడు వచ్చి చూస్తూ వుంటామనీ కూడా నొక్కి చెప్పేరు.

గీత అన్నిటికీ తలూపింది. నోట మాట రావడంలేదు.

భానుమూర్తి ఎవరూ చూడకుండా ఓ ఐదురూపాయలనోటు గీతచేతిలో పెట్టేడు. "ఎందుకూ" అంది గీత చప్పున గుప్పిడి మూసి.

తీరా కారు కదలబోతుంటే గీతకి ఉప్పెనగా దుఃఖం వచ్చింది. భానుమూర్తి దగ్గరకొచ్చి తల నిమురుతూ, "ఛ ఏడవడం ఎందుకూ? గుంటూరెంత దూరం కనక. నేను అప్పుడప్పుడు ఫోను చేసి మాటాడతాలే," అన్నాడు.

కారు కదిలింది.

***

గుంటూరులో కారు దిగి, శివరావువెనకే అడుగులో అడుగేసుకుంటూ ఇంట్లోకి అడుగెట్టిన గీతని సాదరంగా ఆహ్వానించింది కనకమ్మ. ఆవిడ బుజంమీద చెయ్యేసి లోపలికి నడిపించుకు పోతుంటే గీత చలించిపోయింది. శివరావుకి ఆదృశ్యం సంతృప్తి కలిగించింది. మంచిపనే చేశాను అనుకున్నాడు.

"కూచో, కాఫీ తెస్తా" అంటూ ఆ అమ్మాయిని సోఫాదగ్గర వదిలి లోపలికెళ్లింది కనకమ్మ.

శివరావు గీతపక్కనే కూచుంటూ, "మీ అమ్మలాగే అనుకో అత్తయ్య కూడా. ఏం కావాలన్నా అడుగు. మొహమాటపడకు. బెంగ పెట్టుకోకు. శలవులకి విజయవాడ వెళ్లొచ్చు, నేనే తీసుకెళ్తాను, సరేనా?" అన్నాడు ప్రేమగా తల నిమురుతూ.

సరేనన్నట్టు తలూపింది గీత. కనకమ్మ ఇద్దరికీ కాఫీగ్లాసులు అందించి, గీతకి రెండోవేపు కూచుంటూ, పేరుపేరునా ఒక్కొక్కరి యోగక్షేమాలూ కనుక్కుంది. తరవాత "స్నానం చేస్తావా?" అని అడిగింది.

గీత తల అడ్డంగా ఆడించింది. కూచున్న చోటునించీ కదలడానికి ఏదో పిరికితనం అడ్డొస్తోంది.

"చెయ్యి. స్నానం చేస్తే ప్రయాణం బడలిక తీరుతుంది," అన్నాడు శివరావు.

గీత మాటాడకుండా లేచి, పెట్టెలోంచి మారు బట్టలూ, సబ్బూ, తువాలూ తీసుకుని కనకమ్మవేపు చూసింది.

"పద," అంటూ ఆవిడ లేచి వెళ్లి ఆపిల్లకి స్నానాలగది చూపించి, మళ్లీ హాల్లోకి వచ్చింది.

అప్పుడు చెప్పేడు శివరావు గీతని తీసుకురావడానికి అసలు కారణం.

అంతా విని ఆవిడ, "ఆలోచించకుండా చేసేరు," అంది.

"అలా అంటావేమిటి? ఆలోచించే చేసేననుకుంటున్నాను. గీత మంచి తెలివితేటలుగల పిల్ల. పరమేశం చదివించలేడు. మనంట్లో ఓ ఆడపిల్ల కలకల్లాడుతూ తిరగడం మనకీ సంతోషమే కదా" అన్నాడాయన.

సాధారణంగా మొగాళ్లకి ఇలాటివిషయాల్లో ముందుచూపు తక్కువ. సభల్లోనూ సంతల్లోనూ ఎంత పాండిత్యం వొలకబోసినా నట్టింట ఆడపిల్ల పరిస్థితులేమిటో గుర్తించలేరు. ఈవిషయంలో ఆడవాళ్లకే చురుకుపాలు ఎక్కువ. వాళ్లకే తడతాయి ఎక్కళ్లేని ఆలోచనలూనూ!

"వయసులో వున్న ఆడపిల్ల తల్లిచాటున వుంటేనే అందం. అన్నీ సవ్యంగా వున్నంతకాలం ఏబాధా లేదు. వుండాలనే మనం కోరుకుంటాం. కీడెంచి మేలెంచమన్నారు. చూసారా? ముందు కీడూ తరవాత మేలూను," అందావిడ.

శివరావు విస్తుపోతూ భార్యవేపు చూసాడు. "కీడెందుకు జరుగుతుంది కనకం, తల్లిలాటి నువ్వుండగా," అన్నాడు.

"అదే నాగోల కూడాను. ముందూ వెనకా చూసుకోకుండా మాటిచ్చేసి, బరువు నానెత్తికెత్తి మీరు చేతులు దులిపేసుకు కూచుంటారు. మనింట అందరూ మగపిల్లలు. ఎప్పుడు ఎవరికి ఏబుద్ధి పుడుతుందో అన్న ఆలోచన మీకేమయినా తట్టిందా?"

ఆవిడ అంతగా చెప్పినా ఆయనకి భయపడవలసినఅవసరమేమీ కనిపించలేదు. "సరే నువ్వన్నట్టు మనింట అందరూ మగపిల్లలే. ఒకవేళ మన రెండోవాడు దాన్ని ఇష్టపడ్డాడనుకో. అందులో తప్పేముంది. మనం పూనుకుని పెళ్లి జరిపించేద్దాం. పరమేశం మాత్రం ఇంతకంటే గొప్ప సంబంధం తేగలడా?"

కనకమ్మ నెత్తి బాదుకోడం తరువాయిగా, "ఎంతసేపూ మీరు 'మనవాడు ఇష్టపడితే' 'పరమేశం మాత్రం' .. అంటూ మీవేపునుంచే ఆలోచిస్తున్నారు. తల్లిని అనవలిసినమాట కాదు కానీ ఆపిల్లకి తగినట్టే వున్నారా మనపిల్లలు?" అంది కనకమ్మ రుసరుసలాడుతూ.

"ఆలూ లేదు, చూలూ లేదు ..." అంటూ ఆగిపోయాడు శివరావు. ఆవిడమాటల్లో అంతరార్థం ఇప్పుడే తట్టింది ఆయనకి. తన పిల్లలెవరూ అదుపాజ్ఞలలో పెరగలేదు. ఆవిషయంలో తనూ కనకమ్మా చేసిన ప్రయత్నాలేమీ ఫలించలేదు. ఆసంగతి కనకమ్మ గ్రహించింది. ఇప్పుడు కనకమ్మ ఎత్తి చూపేవరకూ ఆయనకి తట్టనేలేదు!

***

గీతని తీసుకొచ్చిన మర్నాడు శివరావు కాలేజీనుండి ఎడ్మిషను ఫారాలు తెప్పించి, కాలేజీలో చేర్పించేడు. గీత బెరుకుమొహం చూసి, మొదటిరోజు కాలేజికి కారులో ఆయనే తీసుకెళ్లేడు. దారిలో ఓ చిన్న నాలుగువాటాల ఇంటిముందు ఆపి, "అమ్మాయీ! సత్యం!" అని పిలిచారు.

గుమ్మానికి తెరగా అమర్చిన పాతచీరె తొలగించి, తొంగి చూసి, బయటికి వచ్చింది ఓ అమ్మాయి. గీత ఆ అమ్మాయివేపు పరీక్షగా చూసింది. అట్టే పొడుగు కాదు, చామనచాయ, చంద్రబింబంలా మొహం, చిన్న కళ్లూ, చూపరులని ఆకట్టుకునే తీరు కాదు. కానీ తీక్షణంగా చూస్తున్నట్టు వున్న ఆ రెండు కన్నులు కారణంగా ఎవరైనాసరే మరోమారు తిరిగి చూస్తారు.

"మామయ్యగారూ," అంది సత్యం శివరావునీ, కారులో వెనకసీటులో వున్న గీతనీ చూస్తూ.

"కాలేజీకి వెళ్లడంలేదా?" అన్నారాయన సత్యంతో.

"ఇదుగో బయల్దేరుతున్నానండీ ఇప్పుడే."

"పద, నేనూ అటే వెళ్తున్నాను. నిన్ను కూడా అక్కడ దింపుతాను. ఈ అమ్మాయి గీత, మనఅమ్మాయే అనుకో. నువ్వు కాస్త కాలేజీ చూపిస్తావని ఇటు తీసుకొచ్చేను,"

"అలాగేనండీ మామయ్యగారూ, వుండండి పుస్తకాలు తీసుకు వస్తాను," అంది సత్యం లోపలికి వెళ్తూ. సత్యంతల్లి పాపమ్మ కొంగుతో చేతులు తుడుచుకుంటూ వచ్చి, "బాగున్నారా బాబుగారూ" అంటూ పలకరించింది.
"బాగానే వున్నాం" అని చెప్పి ఆవిడని కూడా క్షేమసమాచారాలు అడిగి, ఏమయినా కావలిస్తే కబురు పెట్టమని చెప్పారు.
సత్యం వచ్చి కారెక్కిన తరవాత, కారు కాలేజివేపు సాగింది.

***

గీతకి క్రమంగా మామయ్యగారి ఇల్లూ, కనకమ్మత్తా, వాళ్ల అబ్బాయిలూ, కాలేజీ వాతావరణం అలవాటవుతున్నాయి. సత్యం చాలా సన్నిహితురాలు అయిపోయింది.
ఇంట్లో అబ్బాయిలు అంతగా కనిపించడంలేదు శ్యాం తప్పిస్తే. అతను అన్నదమ్ముల్లో మూడోవాడు. మొదట్లో లేదు కానీ ఈమధ్య వారం రోజులుగా ఏదో ఒకటి కల్పించుకుని గీతని పలకరిస్తున్నాడు.
ఓరోజు గీత చదువుకుంటుంటే గదిలోకి వచ్చాడు "ఏం చేస్తున్నావు?" అంటూ.
"ఏంలేదు, రేపు తెలుగుక్లాసుకి వ్యాసం రాయాలి," అంది చదువుతున్న పుస్తకంలో ఓకాగితం ముక్క గుర్తు పెట్టుకుని, మూస్తూ.
"మీకాలేజీలో ప్రెసిడెంటు పదవికి నామినేషన్లు కాల్ఫర్ చేశారుట కదా" అన్నాడు.
"ఏమో, నాకు తెలీదు."
"చేశారులే. ఈసారి కూడా రాణీరావు పోటీ చేస్తుందేమో. ఆ అమ్మాయికేం తెలీదు. ఒట్టి మొద్దు. నువ్వు గోవిందమ్మని సపోర్టు చెయ్యాలి," అన్నాడు శ్యామ్.
"ఎందుకు?"
"గోవిందమ్మ మనవాళ్ల అమ్మాయి. రాణీరావుకి పొగరు కూడాను. అసలు ఆ అమ్మాయికి సపోర్ట్ లేదు. ముస్లిములు, క్రిస్టియనులు, అంతా కలిసి 30 శాతం కూడా లేరు మొత్తం కాలేజీలో. గోవిందమ్మతో సెక్రటరి పదవికి పోటీ చేస్తున్న మేరీ ఎంతో మంచి అమ్మాయి. అంచేత నువ్వు గోవిందమ్మని సపోర్టు చెయ్యాలి."
గీత నోరు తెరుచుకు చూడసాగింది అతనివేపు. ఇంట్లో క్రీనీడన మసిలే ఈ కుర్రాడిలో ఇంత ఎన్నికల పరిజ్ఞానం వుండడం, తన కాలేజీ విశేషాలు తనకంటే అతనికే ఎక్కువ తెలియడం ఆపిల్లకి అంతులేని ఆశ్చర్యాన్ని కలిగించింది.
"మరి మేరీ మాత్రం క్రిస్టియను కాదా?" అంది తేరుకుని,
"వాళ్లు అసలు మనవాళ్లే. మూడు తరాలకి ముందు వాళ్లముత్తాత మతం పుచ్చుకున్నారుట. అసలు మేరీకి మన దేవుళ్లన్నా మనమతం అన్నా చాలా ఇష్టం తెలుసా! ప్రతి శనివారం ఆంజనేయస్వామిగుడికి కూడా వెళ్తుంది."

శ్యాం కూడా శనివారం పొద్దున్నే గుడికి వెళ్తాడు. గీతకి అతడిభక్తి అర్థం అయింది.

“ఏవిటి ఇద్దరూ కబుర్లు?” అంటూ కనకమ్మ రావడంతో శ్యామ్ “ఏంలేదూ” అంటూ వెళ్లిపోయాడు.

“వాడొట్టి కబుర్లరాయుడు. నీమానాన నువ్వు చదువుకో. నిన్ను అట్టే చదువుకోనీకపోతే నాతో చెప్పు, నేను వాడికి చెప్తాను,” అంది ఆవిడ గీతతో.

ఆవిడ గదిలోంచి వెళ్లిపోవడం చూసి, శ్యాం మళ్లీ ప్రత్యక్షం. గీత అయోమయంగా చూసింది. మాట్లాడ్డానికీ, మానెయ్యడానికీ వీల్లేని అయోమయావస్థలో చిక్కుకున్నట్టు కటకటగా వుంది.

“చూడు గీతా! మాయింట్లో ఆడపిల్లలు లేరు కదా. అంచేత నాకు నీతో మాట్లాట్టం బాగుంటుంది, అంతే. నాకు నువ్వు చెల్లాయిలా కనిపిస్తావు. అమ్మెందుకు విసుక్కుంటుందో నాకర్థం కాదు,” అన్నాడు.

గీతకి నిజమేననిపించింది. చిన్నగా నవ్వి, “నేనేం అనుకోనులే” అని, “చదువుకోవాల్సింది చాలా వుంది,” అంది, కనకమ్మ హెచ్చరిక గుర్తు తెచ్చుకుని.

శ్యాంని తల్లి పిలిచింది పక్కగదిలోంచి. శ్యాం చప్పున గీతచేతిలో ఓ చీటీ కుక్కి, “ఇది,.. ఇది” అనేసి వెళ్లిపోయాడు గబగబా అక్కడ్నుంచి.

గీతకి ఒళ్లు ఝల్లుమంది. చేతిలో కాయితంముక్క చెమటకి తడిసి ముద్దయింది.

“ఇంకా పడుకోలేదూ?” అంటూ కనకమ్మ వచ్చింది కొంగుతో చేతులు తుడుచుకుంటూ. ఇంచుమించు రోజు గీత ఈవేళకి పుస్తకాలమీద పడి నిద్రపోవడం, ఆవిడ వచ్చి, పుస్తకాలు తీసి పక్కన పెట్టి, లైటార్పి వెళ్లడం అలవాటు.

“నిద్ర రావడం లేదు,” అంది గీత పుస్తకంమీదికి మరింత వంగి.

“పడుకో. లైటు తీసేసి, కళ్లు మూసుకు పడుకుంటే అదే వస్తుంది నిద్దర,” అందావిడ పుస్తకాలు దొంతు పెడుతూ.

గీత పడుకుంది దుప్పటి మీదకి లాక్కుంటూ. చేతిలో చీటీ నలుగుతోంది. తను చదివిన కథలూ, చూసిన సినిమాలూ తలలో గిర్రున తిరుగుతున్నాయి. అందరూ నిద్దపోయేరని నమ్మకం కుదిరేక, బాత్రూంలోకి వెళ్లి, నెమ్మదిగా చీటీ సాపు చేసి చూసింది దడదడ కొట్టుకుంటున్న గుండెలతో.

“రేపుసాయంత్రం మేరీని ఆంజనేయస్వామిగుడికి రమ్మని చెప్పు. అర్జెంటు,”

సంతకం లేదు కానీ తెలుస్తోంది అందులో సందేశం. లిప్తపాటు నిరాశలాటిది కలిగింది గీత మనసులో. తనేమిటి ఎదురుచూసిందో, ఏమిటి ఎదురయిందో అర్థం అవడానికి రెండు నిముషాలు పట్టింది. తరవాత తన కర్తవ్యం తెలుసుకోడానికి రాత్రంతా పట్టింది.

తెల్లారి శ్యాం కనిపించకుండా వుంటే బాగుండునని వెయ్యి దేవుళ్లకి మొక్కుకుంది. వాళ్లు ఆపిల్ల మొర ఆలకించేరేమో శ్యాం కనిపించలేదు. ప్రైవేటు క్లాసుంది అంటూ తెల్లారే వెళ్లిపోయాట్ట.

కాలేజీలో మధ్యాన్నంవరకూ ఆలోచనలతో బుర్ర బద్దలుకొట్టుకుని, ఆఖరికి సత్యాన్ని అడిగింది మేరీ ఎవరని.

"తనతో నీకేం పని?"

గీత కంగారుగా, "నాకేం పనీ లేదు. సెక్రటరీ పదవికి పోటీ చేస్తోందిట కదా, ఎవరో చూద్దాం అని, అంతే," అంది.

"శ్యాం చెప్పేడా?"

"నీకెలా తెలుసు?"

"సరేలే. నువ్వంటే ఇక్ష్వాకులకాలంలోనే వున్నావు ఇంకా. ఈమహానగరంలో అలాటి సంగతులు దాస్తే దాగుతాయా? శ్యామసుందరుడూ తెలుసు, కన్నె మరియమ్మా తెలుసు, ఆంజనేయస్వామిగుడి చుట్టూ వాళ్లిద్దరి ప్రదక్షణాలూ తెలుసు సకలజనులకూ," అంది సత్యం హేళనగా.

విశ్వరహస్యం గుప్పిట్లో దాచుకున్నాననుకున్న గీత తెల్లబోయింది.

"అదుగో మేరీ," అంది వాళ్లకి కాస్త దూరంలో గబగబా నడిచిపోతున్న రివటలాటి అమ్మాయిని చూపించి. గీత అటువేపు వెళ్లబోతుంటే, సత్యం చెయ్యి పుచ్చుకుని ఆపి, "చూడు గీతా, ఇలా చెప్తున్నానని ఏం అనుకోకు. నీకు ఫస్టు క్లాసు మార్కులు తెచ్చుకునే తెలివితేటలు వున్నాయి కానీ ఇలాటి ఉత్తరాలు బట్వాడా చెయ్యడానికి వేరే రకం తెలివితేటలు కావాలి. ఎందుకు దిగుతావూ ఈరొంపిలోకి?" అనేసి లైబ్రరీకి వెళ్లిపోయింది.

గీత ఆలోచిస్తూ నిలబడిపోయింది. సత్యం ఎందుకలా చెప్పిందో అర్థం కాలేదు. సరే చూద్దాం అనుకుని, నాలుగంగల్లో మేరీని కలుసుకుని, "శ్యాం ఇవ్వమన్నాడు," అంది చీటీ అందిస్తూ.

మేరీ ఊఁ కొట్టి గీతవేపు చూడనైనా చూడకుండా ఆ కాయితం లాక్కుని గబగబా వెళ్లిపోయింది. గీతకి సత్యంమాటలు మనసులో మెదిలేయి. "మేరీగురించి దానికే ఎక్కువ తెలుసు" అనిపించింది.

ఇంటిదగ్గర ఆసాయంత్రం శ్యాం కనిపించలేదు. చిన్నతమ్ముడు జగదీశుని అడిగితే సినిమాకి వెళ్లేడని చెప్పేడు. గీతకి అకస్మాత్తుగా తాను ఒంటరిది అయిపోయినట్టు అనిపించింది. ఎవరితోనైనా మాట్లాడాలని వుంది. సత్యంవాళ్లింటికి వెళ్తానంటే కనకమ్మ ఒప్పుకోలేదు చీకటి పడుతోందని.

"పోనీ ఆంజనేయస్వామిగుడికి వెళ్లొస్తాను, పక్కవీధే కదా" అంది.

ఆవిడ "పద నేను కూడా వస్తాను" అంది.

ఆలయంలో ప్రదక్షణాలు చేస్తున్నంతసేపూ గీతకళ్లు నలుదిక్కులా వెదుకుతూనే వున్నాయి.

ఇంటిమీదికి ధ్యాస పోయిందేమో అనుకుంది కనకమ్మ.

***

కాలేజీలో ఎలక్షన్ల జ్వరం మొదలయింది. కాలేజీ ఆవరణ దాటి ఇంటింటికీ పాకిపోయింది. గీతకి శ్యాం ఇచ్చిన ఉపన్యాసాలతోపాటు, తోటి విద్యార్థులమూలంగా కూడా చాలా సంగతులు తెలుస్తున్నాయి. కమ్మవారమ్మాయి రెడ్డివారి చిన్నదానితో పోటీ చేస్తే కమ్మవారంతా ఓపార్టీ. నాయుళ్లు రెడ్లతో కలుస్తారు. బ్రాహ్మలు నాయుళ్లతో కలుస్తారు కానీ కమ్మవారికి మద్దతు ఇవ్వరు. ఎంచేత అని గీత అడిగితే మరేదో

కారణం చెప్పేరు. కలవారి పిల్లల్తో లేనివాళ్లు కలుస్తారు. లేనివాళ్లతో ఎవరూ కలవరు. పోగ్గా ముస్తాబయే సుకుమారివెంట అందరూ పడతారు. ఏవీకూ లేనివాళ్లు వీకుపిల్లలని వేకిరీలంటారు. గీతకి ఈఎన్నికలు ఉపనిషత్తు బ్రహ్మపదార్థం కంటే దుర్గమంగా వుంది.

ఇంటిదగ్గర గీతాచార్యుడు శ్యాం పేరు మరీ చిరాగ్గా వుంటోంది. మేరీ మేరీ అంటూ సంధి కొట్టినవాడిలా అదేపనిగా కలవరింతలు. అతను గీతచుట్టూ గిరికీలు కొట్టడం కనకమ్మకి నచ్చడంలేదు. ఆవిడ గీతమీద నిఘా పెంచింది. అసలు విషయం చెప్పలేకా, ఎలా చెప్పాలో తెలీకా సతమతమయిపోతోంది గీత.

ఓ రోజు శ్యాంని అడిగింది, "నీకు మేరీ అంటే ఎందుకంత యావ," అని.

"అదేమిటి అలా అడుగుతావు కాలేజీలో చదువుతూ. ఆమాత్రం తెలీకపోతే ఎలా? అన్ని విషయాలూ అందరం పట్టించుకోవాలి. అది మనబాధ్యత. మనం పౌరహక్కులు కాపాడుకోవాలి. ఇది మనదేశం." అన్నాడు ఊకదంపుగా.

"కానీ నీ ఆరాటం అంతా మేరీ గురించే."

"నువ్వు సంకుచితంగా ఆలోచిస్తున్నావు. మేరీ ఆడపిల్ల కాకపోతే నువ్విలా అడిగేదానివా?"

"మేరీ ఆడపిల్ల కాకపోతే నువ్వింత ఆరాటపడేవాడివా?"

శ్యాంకి చురుగ్గానే తగిలింది ఆప్రశ్న. ఛాతీ విరుచుకుని, డంబాలు పోతూ, "చూడు చెల్లెమ్మా! నువ్విలా అమ్మాయిలూ, అబ్బాయిలూ అంటూ గిరి గీసుక్కూర్చోడం తగదు. నీ దృక్పథం విశాలం కావాలి. అప్పుడు కానీ నీకు లోకజ్ఞానం సంపూర్ణంగా కలగదు. ఒక అబ్బాయి ఒక అమ్మాయివేపు చూస్తేనే మానభంగం చేసినట్టు మాటాడడం అలవాటయిపోయింది మనవాళ్లకి. అది చాలా సంకుచితం. అదే విదేశాల్లో చూడు. హాయిగా ఆడా మగా చెట్టాపట్టాలేసుకు నిర్భయంగా, స్వేచ్ఛగా తిరుగుతారు. నడిబజారులో ముద్దులు పెట్టుకుంటారు."

గీత అయోమయంగా చూసింది. తను అడిగినదానికీ శ్యాం ఉపన్యాసానికి పొంతన లేదు.

"అయితే నీకు శ్రద్ధ మేరీ మీదా, ఎన్నికలమీదా?" అంది మళ్లీ మొదటికొస్తూ.

శ్యాం విసుక్కున్నాడు, "అదుగో మళ్లీ నువ్వు మేరీ అమ్మాయి, నేను అబ్బాయిని అన్న ప్రాతిపదికమీదే మాటాడుతున్నావు."

"కారా?"

"అది కాదు నేననేది. ఎన్నికలు ఈప్రశ్నకి అతీతం. నా అండదండలు ఒక మనిషికి కాదు, ఒక ఆశయానికి."

"ఓహో" అంది గీత. శ్యాం చాలా గొప్పవాడు కాబోలు, అతని వాదనలు తనలాటి సామాన్యులకి అర్థం కావు కాబోలు అనుకుంది మనసులోనే.

***

ఊళ్లో ఆడపిల్లల కాలేజీలోకంటె ఉధృతంగా సాగుతోంది ఎన్నికల సంరంభం మగపిల్లల కాలేజీలో. నినాదాలతో మొదలయి, వివాదాలు పెరిగి ఒక పార్టీవాళ్లు రెండోపార్టీ నాయకుడిని ఓ అర్ధరాత్రి ఒళ్లంతా బ్లేడులతో గీరేసి బ్రిడ్జికింద పారేశారు. ఆ అబ్బాయి తల్లిదండ్రులకి ఎవరో చెప్తే, వాళ్లు పరుగు పరుగున వెళ్లి గుండెలవిసేలా ఏడుస్తూ ఆ పిల్లవాడిని తీసుకెళ్లి ఆస్పత్రిలో పెట్టేరు.

వూళ్లో కలెక్టరు ఈ వుదంతం విని కాలేజీలలో ఎన్నికలు రద్దు చేసేసి, క్లాసు రిప్రజెంటేటివులు ప్రెసిడెంటుని ఎన్నుకోమని ఉత్తరువులు జారీ చేసారు.

ఇది విన్న దగ్గర్నుంచీ గీతకి మనసు మనసులో లేదు. ఎంతో ధైర్యంగా వుండే సత్యం కూడా డీలా పడిపోయింది. ఆస్పత్రిలో వున్న అబ్బాయిని తనకి తెలుసుట. ఇద్దరూ చిన్నప్పుడు ఒకే స్కూల్లో చదువుకున్నారుట.

"నేను వెళ్లి చూసొస్తాను. నువ్వు కూడా వస్తావా?" అని అడిగింది సత్యం.

గీతకి వెళ్లాలని లేదు కానీ సత్యానికి తోడుగా వెళ్తే బాగుంటుందనిపించి సరే నంది.

ఇద్దరూ వెళ్లేరు ఆస్పత్రికి కాలేజినించే నేరుగా.

వరండాలో ఆ అబ్బాయి తల్లీ తండ్రీ కుమిలిపోతూ కూర్చున్నారు. ఒక్కడే కొడుకుట. పుస్తె పూసా అమ్మి చదివిస్తున్నారుట కనీసం బియే అయినా అయితే, తరవాత తమని ఆదుకుంటాడని.

లోపల గదిలో మంచంమీద ఒళ్లు తెలీకుండా పడున్నాడు ఆ అబ్బాయి. ఒంటినిండా కట్లతో. గీత చూడలేక గిరుక్కున తిరిగి బయటికి వచ్చేసింది. మరో రెండు నిముషాల తరవాత సత్యం కూడా వచ్చేసింది. ఇద్దరూ ఆతల్లిదండ్రులదగ్గర శలవు పుచ్చుకుని బయట పడ్డారు.

ఆస్పత్రి ఆవరణలో వేపచెట్టుకింద కూలబడి వెక్కి వెక్కి ఏడిచింది సత్యం. గీతకి ఏడుపు రాలేదు. మెదడూ మనసూ గడ్డ కట్టుకుపోయేయి.

***

హాల్లో కూర్చుని భాగవతం చదువుతున్న కనకమ్మ పాలిపోయిన మొహంతో ఇంట్లో అడుగెట్టిన గీతని చూసి బెదిరిపోయింది ఏమయింది అంటూ.

గీత ఏం లేదంటూనే కుర్చీలో కూలబడింది కానీ ఏడుపు ఆగలేదింక. వెక్కుతూ జరిగిన సంగతీ, తను సత్యంతో ఆస్పత్రికి వెళ్లిన సంగతీ చెప్పింది.

ఆవిడ నిట్టూర్చి గీతని దగ్గరకి తీసుకుని, "మరీ ఇంత బేలమనసయితే ఎలా అమ్మా? వూరుకో. నువ్వసలు ఆస్పత్రికి ఎందుకు వెళ్లేవు," అంటూ ఆవిడకి తోచిన మాటలేవో చెప్తూ ఓదార్చింది ఆ అమ్మాయిని. సత్యంతో కూడా గట్టిగా చెప్పాలని నిశ్చయించుకుంది ఇలా గీతని ఎక్కడికి పడితే అక్కడికి తీసుకెళ్లొద్దని.

ఆరాత్రి గీతకి అన్నం సయించలేదు. కనకమ్మ పక్కన కూర్చుని బలవంతాన నాలుగు ముద్దలు తినిపించింది ఆపిల్లచేత.

ఆతరవాత గీతకి కొంతకాలం పట్టింది కోలుకోడానికి. పుట్టి బుద్ధెరిగి తన సాటి పిల్లల్లో ఇంతటి కక్షలూ, కార్పణ్యాలూ ఎప్పుడూ చూడలేదు ఆ అమ్మాయి. కనకమ్మకి కూడా కడుపు తరుక్కుపోతోంది కానీ ఏం చెయ్యాలో తోచడంలేదు. "నేను చెప్పలేదూ" అంటూ భర్తమీద కూడా విసుక్కుంది ఒకటి, రెండు సార్లు. సినిమాలకి తీసుకెళ్లేరు. ఏదో కల్పించి పండుగ చేసారు నలుగురిని పిలిచి.

వాళ్ల ఆరాటం చూసి గీత చదువుమీద శ్రద్ధ పెంచుకుంది. పుస్తకాలు ముందేసుకు కూచుంటే వాళ్లకీ తనకీ కూడా తెరిపి అనిపించి.

అలాటిరోజుల్లోనే భానుమూర్తి ఫోను చేశాడు శుక్రవారం గీతని ఓమారు ఇంటికి పంపమని. శివరావు ఇంట్లో లేడు. కనకమ్మ ఫోను తీసుకుని "ఏమీ, వదినగారు బెంగ పెట్టుకున్నారేమిటి? అమ్మాయి బాగానే వుందని చెప్పు," అంది తేలిగ్గా నవ్వుతూ.

"లేదండీ, మీదగ్గరుంటే అమ్మాయి ఇనప్పెట్టిలో వున్నట్టే కదా. పెళ్లిసంబంధం ఒకటి వచ్చింది. పిల్లని చూసుకోడానికి సోమవారం వస్తాం అంటున్నారు" అన్నాడు భానుమూర్తి.

"అదేమిటి? అడుగులోనే హంసపాదు. ఇటు కాలేజీ మొదలయిందో లేదో అప్పుడే పెళ్లిచూపులా?" అంది ఆవిడ. అవిడకి అప్పుడే పిల్లమీద అధికారం వచ్చేసినట్టుంది.

"ఇంకా ఖాయం చేయలేదు కదండీ. చూడగానే అయిపోతాయేమిటి?"

"అయేది కాదనుకుంటూ చూట్టం మాత్రం ఎందుకూ?"

"మాఅన్నయ్యకి కూడా అందరూ మొగపిల్లలే అయితే మేం కూడా ఇలాగే మాట్టాడేవాళ్లమేమో."

"సరేలే, ఆయన వచ్చేక చెప్తాను" అని ఆవిడ ఫోను పెట్టేసింది. సాయంత్రం శివరావు వచ్చేక భానుమూర్తి సందేశం అందించింది ఆయనకి.

"ఇప్పుడే కదా కాలేజీలో చేరింది" అన్నారు ఆయన కూడా.

"వాళ్ల పిల్ల, వాళ్ల ఇష్టం," అంది కనకమ్మ చిరాకును దాచుకుంటూ. భానుమూర్తి ఎత్తిపొడుపు ఇంకా బాధిస్తూనే వుంది.

"అది సరేలే. అంతేనా, ఇంకా ఏమయినా చెప్పేరా?"

"త్వరగా పిల్లని ఓ అయ్యచేతిలో పెట్టి బరువు దింపుకోవాలని ఎవరికి వుండదు? వాళ్లని అనడానికి మాత్రం ఏముంది?"

"ఇప్పట్నుంచీ పెళ్లిచూపులంటూ మొదలెడితే ఆపిల్లకి చదువుమీద శ్రద్ధ ఏముంటుంది?"

"పదహారు వెళ్లి పదిహేడు నడుస్తోంది. వాళ్ల ఆత్రం వాళ్లది. మనమేమైనా ఆరుస్తామా తీరుస్తామా?"

శివరావు ఆలోచిస్తూ, గీతని పిలిచి, "మీ బాబాయి ఫోను చేశాడు. ఇంటికి వెళ్తావా?" అని అడిగేడు.

చేటంత మొహం చేసుకుని తలాడించింది గీత.

కనకమ్మ మనసు చివుక్కుమంది. తామెంత గోముగా చూసినా తల్లి సాటి కాదు.

“ఇక్కడ నేను బస్సెక్కిస్తాను. మీబాబాయి వచ్చి అక్కడ దింపుకుంటాడు” అన్నాడు శివరావు.
గీత సరేనంది కానీ కనకమ్మ “పొరుగూరు ఒక్కదాన్నీ పంపిస్తే వాళ్లేం అనుకుంటారో, మీరు కూడా వెళ్లి దింపరాదూ” అంది.
“నాకు కుదరదు. పోనీ శ్యాంని తోడిచ్చి పంపుదామా?”
“వాడెందుకు?” అంది కనకమ్మ వెంటనే. ఈమధ్య శ్యాం గీతచుట్టూ తెగ తిరుగుతున్నాడు. అది ఆవిడకి నచ్చడంలేదు.
ఆఖరికి నాలుగోఅబ్బాయి జగదీశుని తోడిచ్చి పంపడానికి నిశ్చయం అయింది. తనకంటే పదేళ్లు చిన్నవాడు తనకి తోడు ఎలా అవుతాడో గీతకి అంతుబట్టలేదు కానీ ఆమాట పైకి అనలేదు.

ఆరాత్రి శివరావు భానుమూర్తికి ఫోను చేసి గీత జగదీశుతో శనివారం ఉదయం మొదటి బస్సులో వస్తోందనీ, బస్టాండుకి వచ్చి తీసుకెళ్లమనీ చెప్పేడు.

***

విజయవాడలో బస్సు ఆగుతూనే, చిన్నాన్నా, చిట్టీ, బుజ్జీ తనకోసం ఎదురుచూస్తూ కనిపించేరు గీతకి. వాళ్లని చూడగానే మనసు పరవశించిపోయింది. బస్సు దిగీ దిగకముందే తమ్ముడూ, చెల్లెలూ “అక్కా” అంటూ కాళ్ల చుట్టేశారు. జగదీశు గజందూరంలో నిలుచున్నాడు వాళ్లని చూస్తూ. గీత రమ్మని దగ్గరికి పిలిచి, పరిచయాలు చేసింది. ఆక్షణంలో వాడు తనకి అంగరక్షకుడుగా కాక మరో చిట్టితమ్ముడిలా తోచేడు.
గీత మానసికంగా ఓ చూపువాసి ఎదిగింది ఆపూట.
భానుమూర్తి వెళ్లి రిక్షా మాటాడి తీసుకొచ్చాడు. చిట్టీ, బుజ్జీ గీతతో రిక్షా ఎక్కేరు. జగదీశుని సైకిలుమీద వెనకసీటులో ఎక్కించుకున్నాడు భానుమూర్తి. రథాలు కదిలేయి ఇంటివేపు.
ఆతరవాత అరగంటలో పెళ్లిసంబంధంగురించి చెప్పింది కామాక్షి గీతని పక్కన కూచోపెట్టుకుని.
గీత కొంచెంసేపూరుకుని, తలొంచుకుని, “చదువుకుంటున్నాను కదా” అంది సందేహిస్తూ.
“పెళ్లయితే చదువుకోకూడదేమిటి?”
“వాళ్లు చదువుకోనిస్తారో లేదో!”
“మీ చిన్నత్తయ్య కూతురు పెళ్లయింతరవాత బియే చేసి, యమ్మే కూడా చెయ్యలేదూ?”
“పెద్దత్తయ్యకూతురు చదువు చెట్టెక్కేసింది పెళ్లిమూలానే కదా.”
“సరేలే. కనుక్కుందాం వాళ్ల ఆలోచనలేమిటో. సాంప్రదాయకమయిన కుటుంబం. అబ్బాయి బుద్ధిమంతుట్ట. డాక్టరీ చదువుతున్నాడు. బాగా సంపాదిస్తాడు. కట్నం అక్కర్లేదంటున్నారు. పిల్ల నచ్చితే చాలుట.”
డాక్టరీ చదువుతూ, బుద్ధిమంతుడయిన, బాగా సంపాదించే. కట్నంఅక్కర్లేని పెళ్లికొడుకుగురించి

ఆలోచిస్తూ గడిపింది ఆరాత్రంతా గీత.

అనుకున్న ఆదివారం వచ్చింది. తెల్లార్తూనే ఇల్లంతా ఒహటే సందడీ, వేళాకోళాలూ ...

"ఫీజిచ్చుకోలేను. ఈ బీద బాబాయిని ఓకంట కనిపెట్టి వుండేం."

"అక్కా, నువ్వు మరి పెళ్లి చేసుకు వెళ్లిపోతే మళ్లీ ఇక్కడికి రావా?"

"ఏవమ్మా, పెళ్లికూతురా, మాలాటివాళ్లం కనిపిస్తామా ఇక" పక్కింటి దొరమ్మ పంచదార అప్పుకొచ్చి మేలమాడింది.

"మాపిల్ల శుక్కురారప్పూటా పుట్టింది, సాక్షాత్తు శ్రీమహాలక్ష్మే. అది మెట్టినింట సిరులొలకవా," అంది బామ్మ కణతలు పుణికి.

గీతకి వాళ్లమాటలు వింటుంటే ఏదోగా వుంది - పిరికితనమో, ఆనందమో. వెగటో - ఏదీ సరిగా తెలీడంలేదు. లేచి వెళ్లి పెరట్లో పారిజాతం చెట్టుకింద నిలబడి కొమ్మమీద చెయ్యేసింది. పారిజాతాలు జలజల రాలేయి. దూరంగా ఏదో పిట్టకూత తీయగా చెవుల సోకింది. తలెత్తి చూస్తే కొమ్మల్నంటుకుని గొంగళీపురుగులు! ఒళ్లు జలదరించింది. గీత వెనక్కి తిరిగి అడుగులో అడుగు వేసుకుంటూ ఇంట్లోకి వచ్చింది.

కామాక్షి కేకేసింది, ''ఇంకా అలానే వున్నావేమిటి? పద, మొహం కడుక్కుని ఆ వూదారంగు జార్జెట్ చీరె కట్టుకో. మల్లెలూ, కనకాంబరాలూ దండ కట్టి పెట్టేను దేవుడిమంటపం దగ్గర. గౌరిదేవికి దణ్ణం పెట్టుకుని చెండు జడలో తురుముకో. వాళ్లు వచ్చే వేళవుతోంది.''

''ఇంకా ఎక్కడమ్మా మూడేనా కాలేదు. అప్పుడేం ఏం తొందర. అయిదు దాటేక కానీ రాం అన్నారు కదా. వర్జ్యం అని.'' అంది గీత బాత్రూంవేపు నడుస్తూ.

మొహం కడుక్కొచ్చి ముస్తాబయి, మరోమారు అద్దంలో చూసుకుంది. తీర్చి దిద్దుకున్న తిలకం, కళ్లని కాటుకా, అప్పుడే మొహం కడుక్కోడంచేత మెరుస్తున్న పెదాలూ, జారిపోతున్న జార్జెట్ చీరా, .. సిగ్గు ముంచుకొచ్చి కొత్త అందాల్ని తెచ్చిపెట్టేయి. నాగమ్మత్త రావడం గమనించనేలేదు.

ఆవిడ వస్తూనే గీతగదిలోకి వచ్చి, చూసి, ''అదేం చీరె కట్టడమే పిల్లా, కాలేజిపిల్లలా కట్టాలి గానీ,'' అంటూ ద్రౌపదీవస్త్రాపహరణంలో దుశ్శాసనుడిలా ఆచీరె లాగేసి మళ్లీ కట్టసాగింది గీత గోల పెడుతున్నా వినిపించుకోకుండా.

''ఇప్పుడు చూడు. ఏమాత్రం కళ్లున్నవాడేనా దాసోహం అనడో'' అంది ఆవిడ ఆ చీరె కట్టడం అయేక.

''ఫో అత్తా'' అంది గీత సిగ్గు పడిపోతూ.

''పోక వుండిపోతానేమిటి. నాకే ఈడయిన కొడుకుంటే ఇలా పొమ్మందువా అసలు?'' నాగమ్మత్త నవ్వుకుంటూ అమ్మాయి బుగ్గ గిల్లి వంటింట్లో కామాక్షిని పలకరించడానికి వెళ్లింది.

భానుమూర్తి హడావుడిగా వచ్చి పెళ్లివారు వస్తున్నారని చెప్పేడు. పరమేశం రొప్పుకుంటూ వచ్చి చేతిసంచీ కామాక్షికి అందించారు. పళ్లూ, ఆకులూ, వక్కపొట్లాలూ అంటూ. ఆవెంటనే వెనుదిరిగి ఎదురేగి

పెళ్లివారిని 'రండి, రండి' అంటూ ఆహ్వానించేరు సగౌరవంగా.

పెళ్లికొడుకూ, తల్లిదండ్రులూ, మూడు సంఖ్య మంచిది కాదని అతని అన్నగారూ, మరో ఆడతోడుంటే బాగుంటుందని వదినగారితో పాటు మధ్యవర్తీ, మేమూ వస్తాం అంటూ వెంటబడిన ఇద్దరు పిల్లలూ - వెరసి ఎనిమిదిమంది వేంచేశారు పిల్లని చూడ్డానికి.

"బాగుంది. మొత్తం మగపెళ్లివారంతా వచ్చేసినట్టున్నారు. ఇప్పుడే పెళ్లి చేసేస్తే సరి" అంది వంటింట్లో నాగమ్మ కామాక్షితో.

"ఊరుకో వదినా. వాళ్లు వింటే బాగుండదు," అంది కామాక్షి ఫలహారాలపళ్లెంతో హాల్లోకి వస్తూ.

కాఫీలవుతుండగా, గీతని పిలుచుకొచ్చింది తల్లి. గీత తలొంచుకు కూర్చుంది.

"మరీ అంత సిగ్గయితే ఎలా అమ్మా! కాస్త తలెత్తు. అంతా మనవాళ్లేలే. తప్పులేదు తల్లీ" అన్నాడు మధ్యవర్తి.

పెళ్లికొడుకు తల్లి అడిగింది, "ఏం చదివింది అన్నారూ?"

"యస్సెల్సీ పాసయిందండీ. టైపు కూడా నేర్చుకుంది. హిందీ విశారద పాసయింది. ఇప్పుడు ఇంటరు చదువుతోంది గుంటూరులో" అన్నారు పరమేశం కూతురి అర్హతలు ఏకరువు పెడుతూ.

"గుంటూరులో ఎందుకు పెట్టేరు ఊళ్లో కాలేజీ వుండగా?"

"ఆడపిల్లల కాలేజీ అనీ"

"ఇక్కడ కూడా వుంది కదండీ?" పెళ్లికొడుకు తండ్రి అడిగేడు.

అన్నగారు అందుకున్నాడు, "దానికేం గానీ. పెళ్లిమాట తలపెట్టేరు. మరి చదువు మానేస్తుందా అమ్మాయి?"

"దాన్దేవుందండీ. మీరెలా అంటే అలాగే. మాటవరసకి అబ్బాయి యంబీబీయస్సయేవరకూ మీరు తీసుకెళ్లం అంటే అమ్మాయి మాదగ్గరే వుండి బియే పూర్తి చేస్తుంది. లేదంటారా మానేస్తుంది." అన్నారు పరమేశంగారు.

ఈ "మాటవరస" కామాక్షికి చిరాకేసింది కానీ తమాయించుకుంది. గీతకి ఏమనిపించిందో ఎవరికీ పట్టలేదు.

"ఆమాట ఇప్పుడే ఎందుకులెండి" అన్నాడు పెళ్లికొడుకు నీళ్లు నములుతూ.

"అవునవును. తరవాత చూసుకోవచ్చు," అంది వదినగారు.

"మరి పెళ్లి వెంటనే చేసెయగలరా? ఈనెల దాటితే మూఢం" అంది పెళ్లికొడుకు తల్లి.

"మేం చేసేసే వుద్దేశంలోనే వున్నామండీ. పెద్దది మాపిన్ని కళ్లముందే ఆముచ్చట తీరాలని మాకోరిక" అన్నారు పరమేశంగారు.

మరో అరగంట ఆమాటా ఈమాటా మాటాడి మొగపెళ్లివారు కదిలేరు. పరమేశంగారు వాళ్లని కారెక్కించి వెనక్కి వచ్చేరు.

"ఏం అన్నారు?" కామాక్షి అడిగింది.

"త్వరలోనే ఉత్తరం రాస్తాం అన్నారు".

గీత "సరోజా వాళ్లింటికి వెళ్లొస్తానమ్మా" అని బయల్దేరబోతుంటే కామాక్షి "ఇప్పుడెందుకూ? రేపెళ్లొచ్చులే" అంటూ గీతని కదల్నియ్యలేదు.

గీత మూతి ముడుచుకుని, కట్టుకున్న జార్జెట్ చీరె విప్పి పారేసి, సాదా నూలుచీరె కట్టుకుని మంచం ఎక్కింది ఓ పాతపత్రిక పుచ్చుకుని.

***

సోమవారం గుంటూరులో బస్సు దిగేవేళకి టైము దాటిపోయిందని కాలేజీకి వెళ్లలేదు. మర్నాడు ఆవరణలో అడుగెడుతూనే సత్యం ఎదురయింది.

"నిన్న కాలేజీకి రాలేదేం?"

"ఏం లేదు. వూరికే."

"ఒంట్లో బాగులేదా?"

"అదేంలేదు. ఇంటికెళ్లేను."

"శనివారం వెళ్తే ఆదివారం వచ్చేయొచ్చు కదా."

"రాలేదు."

"పెళ్లిచూపులా?"

గీత ఉలిక్కిపడింది. "ఎందుకలా అనుకున్నావూ?"

"అంతకంటే నీకూ నాకూ ఏం వుంటాయిలే రాచకార్యాలు. నీ మొహం చూస్తే అనిపించింది. ఇదే మొదలు కూడానేమో," అంది సత్యం నిరామయంగా.

పెళ్లంటే సత్యానికి ఎందుకంత కాతరభావమో గీతకి అర్థం కాలేదు.

"ఏం చేస్తున్నాడు పెళ్లికొడుకు?"

గీత చెప్పింది.

సత్యం కొంచెంసేపు ఊరుకుని, నెమ్మదిగా అంది, "మాఇంట్లో ఈ పెళ్లిచూపులమేళం ఎన్నేళ్లుగా జరుగుతోందో నాకే జ్ఞాపకంలేదు. ముందు మాపెద్దక్క - ప్రతివాడూ రావడం, కాఫీలూ, టిఫిన్లూ, తాంబూలాలూ సేవించి, ఉత్తరం రాస్తాం అంటూ వెళ్లిపోవడం. ఆతరవాత ఉత్తరం, 'మావాడు ఇప్పుడే పెళ్లి చేసుకోనంటున్నాడు' అంటూ. అక్కడికి మన మొహాలు చూడగానే పెళ్లిమీద విరక్తి పుట్టినట్టు. లేకపోతే అమ్మాయికి పొట్టిజడ అనో చీపికళ్లు అనో వంకలు పెట్టడం. .. "

గీత మాట్లాడలేదు.

సత్యమే మళ్లీ అంది, "మా అక్క చచ్చిపోయింది ఈ పెళ్లికొడుకులపోరు పడలేక. హుం. .. మళ్లీ ఇప్పుడు

మాచిన్నక్కతో మొదలు రెడ్డొచ్చే మొదలాడు.''

గీతకి కడుపులో దేవినట్టు వుంది ఆమాటలు వింటుంటే. సత్యం ఇలా మాటాడకుండా వుంటే బాగుండును అనిపిస్తోంది.

''క్లాసుకి టైమ్ అయింది, పద,'' అంది గబగబా అడుగులేస్తూ.

పదిరోజులపాటు ఫోను మోగినప్పుడల్లా ఉలికిపడుతూనే వుంది గీత. పోస్టుమేను గేటుదగ్గర ఆగినా, ఆగకుండా దాటిపోయినా కలవరంగానే వుంది. మామయ్యో, అత్తయ్యో ఇంటికి ఫోను చేసి కనుక్కుంటే బాగుండును కానీ తనకు తానయి అడగలేదు కదా. తనకి మరీ చిరాగ్గా వున్నది ఆ ఇంట్లోనూ ఈ ఇంట్లోనూ కూడా అందరూ తన ప్రమేయం ఏమీ లేనట్టు ప్రవర్తించడం. ఆమాట గట్టిగా అడిగే గుండెబలం ఇంకా రాలేదు. ఆతరవాత మరో నాలుగురోజులకి గీతపేరున ఉత్తరం వచ్చింది సరోజదగ్గర్నుంచి.

ప్రియమయిన గీతకి,

ఇక్కడ మేం అందరం బాగానే వున్నాం. కాలేజీ లెక్చరర్లేం చెబుతున్నారో విద్యార్థులకి పట్టదు. ఆసంగతి లెక్చరర్లకి అక్కర్లేదు కూడా. ఏదో గడిచిపోతున్నాయి రోజులు. నువ్విక్కడ వుంటే బాగుండును అనిపిస్తోంది నాకు. ఆమధ్య నువ్వు వచ్చి వెళ్లేవని మీ అన్నయ్య బజారులో కనిపించి చెప్పేడు. మాయింటికి రాలేదేం?

ఇంతకీ అసలు సంగతి. అనుకోకుండా అర్జెంటుగా నాపెళ్లి కుదిరిపోయింది. ఈనెల పదిహేనో తారీకున ముహూర్తం. పెళ్లికొడుకు మాకు దూరపుచుట్టంలే. చిన్నప్పుడు కలిసి ఆడుకునేవాళ్లం కూడా అంటోంది మా అమ్మ. ఫారిన్ నించి వచ్చేడు పెళ్లి చేసుకోడానికి. అంచేత అట్టే టైం లేదు. నువ్వు తప్పకుండా రావాలి.

ప్రేమతో.

నీ సరోజ.

గీత ఆ వుత్తరం పదిసార్లు చదువుకుంది. సరోజ ఎదురుగా వుండి మాటాడుతున్నట్టే వుంది. చదువుతుంటే ఆనందమూ, విచారమూ, ఇంకా ఏదో చెప్పలేని వెలితీ ముప్పేటగా పెనవేసుకు ఉక్కిరిబిక్కిరి చేసేయి గీతని. అత్తయ్యతో పెళ్లి సంగతి చెప్పి వెళ్తానంది. ఈసారి కూడా జగదీశుని వెళ్లమన్నారు కానీ వాడు ఒప్పుకోలేదు. తప్పనిసరిగా శివరావు గీతని ఒక్కదాన్నీ బస్సెక్కించి, బాబాయి బస్టాండుకి వస్తాడనీ, భయంలేదనీ బస్సు కదిలేవరకూ ధైర్యం చెబుతూనే వున్నాడు. గీత సరే, సరే అంటూనే వుంది.

స్వల్పవ్యవధి అయినా పెళ్లి వేడుకలు బాగా జరిపించేరు సరోజ తల్లిదండ్రులు. సరోజని అంటిపెట్టుకు తిరుగుతున్న గీతని చూసి చాలామందే ముచ్చట పడ్డారు. ''నీవంతూ వస్తుంది'' అంటూ మేలమాడేరు. ''నిన్ను కల్యాణతిలకంతో చూడకుండానే పోతాను కాబోలు'' అంటూ బామ్మ కళ్లొత్తుకుంది. పెళ్లి అయిన

మర్నాడు పెళ్లికొడుకు చనువుగా, "నీక్కూడా చూడమన్నావేమిటి మాఊళ్లోనే ఓ అబ్బాయిని" అన్నాడు.
పెళ్లి అయిన మర్నాడు సరోజ భర్తతో మద్రాసు వెళ్లింది అతనితో ఓపూట గడిపి ప్లేను ఎక్కించడానికి. సరోజ వెళ్లిపోయినతరవాత గీతకి అక్కడ వుండబుద్ధి పుట్టలేదు. "శనివారమే కదా, ఈ ఒక్కపూటా వుండి రేపు వెళ్లు" అని కామాక్షి ఎంత చెప్పినా వినకుండా, "చదువుకోవాల్సింది చాలా వుంది" అంటూ బస్సెక్కేసింది.
ఓరోజు ముందుగానే వచ్చేసిన గీతని చూసి కనకమ్మ సంతోషించింది. గీత సీరియస్గా చదువులో పడిపోయింది. శ్యాంతో ముభావంగా వుంటోంది. కనకమ్మ ముందు కంగారు పడినా, సరిగ్గానే అర్థం చేసుకుంది ఆ అమ్మాయిని. గీత ఎదుగుతోంది మానసికంగా. ఆవిడ ఇప్పుడు సంసారంగురించీ, బాధ్యతలగురించీ కూడా ముచ్చటిస్తోంది గీతతో.
గీతకి ఇప్పుడు కనకమ్మ పిల్లలందరూ చిట్టీ, బుజ్జీలాగే అనిపిస్తున్నారు.

***

గీత ఇంటరు పూర్తయేవేళకి నలుగురు పెళ్లికొడుకులు చూసి వెళ్లడం అయింది. పెళ్లికొడుకులవిషయంలో సత్యంతత్త్వం తనకి కూడా ఒంటబడుతోంది. ఇంట్లో పెద్దలమీదా, ఊళ్లో పెళ్లికొడుకులమీదా ఎక్కళ్లేని కసీ, అసహ్యం కలుగుతున్నాయి మనసులో.
మళ్లీ బి.యే. చదవడానికి గుంటూరు వచ్చింది. శలవుల్లో చాలా విశేషాలే జరిగేయి. మేరీ వాళ్లచర్చిలోనే కలిసిన మరో క్రిస్టియనుఅబ్బాయిని పెళ్లి చేసుకుని కలకత్తా వెళ్లిపోయింది. సత్యం చదువుకి చుక్క పెట్టేసింది. శివంగారు సత్యాన్ని శ్యామ్ కిచ్చి పెళ్లి చెయ్యమని వాళ్లమ్మకి కబురు చేశారు. ఇంకా నిశ్చయం కాలేదు కానీ అయేట్టే వుంది.
గీతకి అంతా అయోమయంగా వుంది. కనకమ్మతో చెప్పి, సత్యాన్ని చూడడానికి వాళ్లింటికెళ్లింది. సందుమొగలో శ్యామ్ కనిపించాడు కాని పలకరించలేదు. చిన్నగా నవ్వి పక్కకి తప్పుకున్నాడు.
గీత వెళ్లేసరికి సత్యం వసారాలో కూర్చుని దిండుగలేబుమీద పువ్వులు కుడుతోంది. గీత వెనకనించి వచ్చి ఉఫ్మని వూదింది మెడమీద.
సత్యం వులిక్కిపడి, సూది వేలికి గుచ్చుకుని, కెవ్వుమని కేకేసి, "అబ్బ, ఎన్నాళ్లకి కనిపించేవే?" అంది స్నేహితురాలి చెయ్యి ఆప్యాయంగా అందుకుని.
గీత కూడా పున్నమిచంద్రునిలా వెలిగిపోతూన్న మోముతో సత్యంపక్కనే చతికిలబడింది. ఇద్దరిమనసులూ మహదానందంతో ఊగిపోయేయి. సృష్టిలో తీయనిది స్నేహమేనోయి అని ఇందుకే అన్నారేమో అనిపించింది ఆపూట వారికి.
"విశేషాలు చెప్పు," అంది సత్యం.
"నువ్వే చెప్పాలి" అంది గీత చిలిపిగా,

“నాసంగతులు నీకు తెలుసు. ఆ సంగతి నాకు తెలుసు. అంచేత ఏం చెప్పినా నువ్వే చెప్పాలి.
ఏం చేశావు శలవుల్లో?”

గీత జవాబు చెప్పలేదు.

ఇద్దరూ తలలొంచుకు కూర్చున్నారు, ఏదో ఏకాంతం అనుభవిస్తూ. రెండో మనిషి పక్కన వున్నట్టూ వుంది. లేనట్టూ వుంది. ఇదీ అని చెప్పడానికి కారణం లేకపోయినా ఇద్దరిమనసులూ బరువెక్కేయి.

మెల్లిగా గీతే నోరు విప్పింది, “మీ అమ్మగారు సంకోచిస్తున్నారుట శ్యాంతో నీపెళ్లివిషయం. ఎంచేత?”

సత్యం అవునన్నట్టు తలాడించింది.

“ఎందుచేత?” గీత మళ్లీ అడిగింది. నిజం తెలిసినా సత్యం మాటల్లో తెలుసుకోవాలని వుంది.

“కలవారితో చేతులు కలపడం కదా.”

“మరి నీకిష్టమేనా?”

సత్యం నవ్వి ఓ మొట్టికాయ వేసింది గీతతలమీద, “బాగుంది నీవరస. మాఅమ్మ ఒప్పుకోకపోతే ఎందుకు ఒప్పుకోలేదు అంటావు. నేను ఒప్పుకుంటే ఎందుకు ఒప్పుకున్నాను అంటావు.”

గీత కూడా నవ్వి, “ఏంచెయ్యను మరి? నాకంతా అయోమయంగా వుంది. ఏమనుకోవాలో తెలీడం లేదు.”

సత్యం చాలాసేపు మాటాడలేదు. తరవాత నెమ్మదిగా, అతినెమ్మదిగా, అంది, "నీకు తెలివితేటలున్నాయి కానీ లోకజ్ఞానం లేదు, గీతా. నాలుగేళ్ల పాపాయిలా ఆకలేస్తే అన్నం తింటావు. నిద్దరొస్తే పడుకుంటావు. అంతే కానీ, కంచంలోకి అన్నం ఎలా వచ్చిందీ, పడుకుంటే పనులెలా అవుతాయి అన్న ప్రశ్నలు తోచవు నీకు."

గీత వింటూ కూచుంది. నిజమే. చాలా విషయాలు తనకి పట్టవు. యాంత్రికంగా జరిగినవి చూస్తూ, జరగనివి అవే జరిగిపోతాయనుకుంటూ, తానొక ప్రేక్షకురాలయిట్టు, జరుగుతున్న సంఘటనలలో తాను పోషించవలసిన పాత్ర ఏమీ లేనట్టు ఊరుకుంటుంది.

సత్యం ఆడపిల్లల్లో మూడో అమ్మాయి. ఆతరవాత ఇద్దరు మొగపిల్లలు. ఆఖరివాడికి రెండో ఏడు నడుస్తుండగా తండ్రి పోయేడు. అప్పటికి సత్యానికి పదకొండో ఏడు. తల్లి పాపమ్మ అభిమానవంతురాలు. ఆయింటా ఈయింటా చిల్లరపనులు చేసీ, నోటిమంచితనంతోనూ సంసారం గడుపుకొస్తోంది. పాపమ్మగారి తల్లి కూడా వాళ్లతోపాటే ఆ యింటే వుంది. ఆవిడ మధ్యాన్నాల చుట్టుపట్ల చదువురాని ఆడవాళ్లని పోగేసుకుని భారతమో భాగవతమో చదివి అర్థాలు చెప్తూ వుంటుంది. క్రమంగా ఆవిడకో భక్తసంఘం ఏర్పడింది. వాళ్లు తరుచూ కూరా, కాయా, చీరే, రవికెలగుడ్డా, పదీ పరకా డబ్బూ ఇస్తూ వుంటారు.

ఊళ్లోవాళ్లు పాపమ్మ అన్నగారిని ఆడిపోసుకుంటున్నారు తోబుట్టువుని ఆదుకోలేదని. ఆమాటలు పడలేక ఆయన పాపమ్మని వచ్చి తమఇంట్లో వుండమని పిలిచాడు. "ఆయింటా ఈయింటా చేసే పనులు మనింట్లోనే చేసుకోవచ్చు కదా" అంటూ.

పాపమ్మ ఇష్టపడలేదు. "పొరుగిల్లయితే, వాళ్లు మాట తూలితే, పోస్ పొమ్మని చేతిలో గిన్నె అక్కడే పారేసి వచ్చేస్తాను. నీయింట్లో అయితే నువ్వూ నేనూ కక్కలేకా మింగలేకా కుళ్లుకు చావాలి, ఎందుకొచ్చిన గొడవ. ఎక్కడున్నవాళ్లం అక్కడే పడివుంటే మంచిది. అంత్యనిష్ఠూరం కన్నా ఆదినిష్ఠూరం మేలు" అంది.

సత్యం ఈకథంతా చెప్పి, అంది, "మాఅమ్మ నాకేదో అపరశ్రీరాముణ్ణి తీసుకురాగలదన్న భ్రమల్లేవు నాకు. శివం మామయ్యగారూ, అత్తయ్యగారూ కూడా ఉత్తములు. శ్యామ్ కబుర్లపోగే కానీ గుండెబలం లేనివాడు. పైగా నువ్వంటే అతనికి గౌరవం. నీకు నేనంటే ఆపేక్ష. చాలా ఈ కారణాలు."

గీతకి గుండెలమీంచి పెద్ద బరువు దింపినట్టయింది. "ఒప్పేసుగుంటున్నాను. నిజమే. నాకు ప్రపంచజ్ఞానం బొత్తిగా లేదు" అంది.

మరో నెలరోజులకి శ్యాంతో సత్యం పెళ్లి అయిపోయింది. ఇద్దరూ ఊళ్లోనే వేరు కాపురం పెట్టేరు. శివరావు శ్యాంని తన వ్యాపారంలో పెట్టి ట్రైనింగు ఇవ్వడం మొదలెట్టారు.

గీత బియే పూర్తి చేసి, ట్రైనింగయి. విజయవాడలో వాళ్లనాన్నగారు పనిచేసే స్కూల్లోనే టీచరుగా చేరింది. ఈపిల్లకి ఇంక పెళ్లి చెయ్యలేను కాబోలు అని పరమేశంగారూ, కామాక్షీ దిగులు పడుతున్నారు.

ఆ రోజుల్లోనే ఓరోజు శివరావు పరమేశానికి కబురు చేశారు గీతని తీసుకురమ్మని. గీత మొదట ఇష్టపడలేదు కానీ శివంమామయ్యా, కనకమ్మత్తలయందు గల అభిమానంవల్ల సరేనంది. పరమేశం, కామాక్షీ, గీతా సందేహిస్తూనే గుంటూరు వెళ్లేరు.

గీతని చూడగానే కనకమ్మ కన్నకూతురిని చూసినట్టు ఆనందించింది. ఆమెముఖంలో వెలుగు చూసి గీతమనసు పొంగిపోయింది. శివరావు కూడా ఆప్యాయంగా పలకరించారు. "బాగున్నావా అమ్మా. ఉద్యోగం ఎలా వుంది? మరేం చికాకులు లేవు కదా" అంటూ.

గీత జవాబులు చెప్తూ "మామయ్యకీ అత్తయ్యకీ నేనంటే ఎంత ఆపేక్ష" అనుకుంది ఆర్ద్రంగా.

శివరావు పెళ్లికొడుకు భోగట్టా చెప్పేడు - హరి అమెరికానుంచి పనిగట్టుకు పెళ్లి చేసుకునే ఉద్దేశ్యంతోనే వచ్చేడుట. ఇద్దరికీ నచ్చితే వెంటనే పెళ్లి చేసుకుంటాడుట.

ఆసాయంత్రమే పెళ్లిచూపులు. కనకమ్మా, శివరావూ పెద్ద హడావుడి ఏమీ చెయ్యలేదు. హరి తల్లితో వచ్చేడు గీతని చూడడానికి. గీత సాదా వాయిలు చీరె కట్టుకుని, తల్లో నాలుగు మల్లెపూలు పెట్టుకుంది. కాఫీలయేక, శివం పరమేశంతో "నువ్వొక్కసారి యిటురా" అంటూ వీధిలోకి తీసుకెళ్లేడు. కనకమ్మ "రండి వదినగారూ, ఇల్లు చూద్దురు గానీ" అంటూ పిలిచింది. కామాక్షి వారిని అనుసరించింది.

హాల్లో హరీ, గీతా మిగిలేరు. గీతకి ఏం మాటాడాలో తోచలేదు.

హరే మొదలుపెట్టేడు. "అనుకోకుండా అకస్మాత్తుగా జరిగిపోతోంది అంతా. మీకేమయినా సందేహాలుంటే చెప్పండి," అన్నాడు.

"సందేహాలు? దేన్నిగురించి?" అంది గీత నెమ్మదిగా.

హరి నవ్వేడు. "నాకూ తెలీదండీ. అక్కడ బయల్దేరినప్పుడు, పెళ్లిచేసుకు వచ్చేస్తాను అనుకుంటూ

బయల్దేరేను. తీరా ఇక్కడికొచ్చాక, ప్రతివారూ ఇక్కడో అమ్మాయి వుంది, అక్కడో అమ్మాయి వుంది అంటూ వూదర పెట్టేస్తుంటే నాకు గాభరాగా వుంది. మీకెలా వుందో చెప్పండి" అన్నాడు.
అతను అలా దాపరికం లేకుండా మాటాడడంతో గీతమనసు తేలిక పడింది. "అదేనండీ. నేనూ అంతే. 'రా, రా' అంటూ లాక్కొచ్చేరు, వచ్చేశాను. నాక్కూడా ఏం తోచడం లేదు." అంది.
"సరేలెండి. నేనే మొదలెడతాను. మీరు బియేతో చదువు ఆపేశారు. ఇంటరెస్టు లేకనా?"
గీత ఇరకాటంలో పడింది. పైచదువులు చదివించే స్తోమతు తండ్రికి లేదని చెప్తే అతనెలా అర్థం చేసుకుంటాడో అని.
హరి వెంటనే, "సారీ, వూరికే మీ ఇంటరెస్టులేమిటి అన్న ఉద్దేశంతో అడిగేనంతే. ఏపని గానీ చెయ్యడానికయినా చెయ్యకపోవడానికయినా చాలా కారణాలు వుంటాయి. ఇంతకీ మీకు అమెరికా రావడం సమ్మతమేనా?"
గీత కొంచెం ఆలోచించి, "మీరు అక్కడే వుండిపోతారా? మరింక మనదేశం వచ్చే ఉద్దేశం లేదా?" అని అడిగింది.
"చెప్పలేను. ఉద్యోగాన్ని ఆశ్రయించుకునే కదా మనబతుకులు. జీతాలు ఎక్కడికి లాక్కెళ్తే అక్కడే జీవితాలూనూ. కనీసం ఇప్పటికి అక్కడే. మరి మీరు విజయవాడలో ఉద్యోగం వదిలేసి రావాల్సివుంటుంది."
"అందరూ వుద్యోగాలకోసం నానా అవస్థలూ పడుతుంటే నేను చేతిలో వున్న వుద్యోగం వదిలేసుకోడం ఎట్లా?" అంది.

"అదీ నిజమేలెండి. చేతిలో వున్న ఉద్యోగం వదిలేసుకోడం కష్టమే. పోనీ, ఓ యేడాది leave without pay తీసుకోండి. తరవాతిసంగతి తరవాత చూడొచ్చు" అన్నాడు హరి మధ్యేమార్గం ఆలోచిస్తూ.
మరో గంటసేపు ఇద్దరూ అవీ ఇవీ మాటాడుకున్నారు. తరవాత హరి "మా అమ్మ మాటల్లో పడితే నన్ను మర్చిపోతుంది. మీరు వెళ్లి పిలుచుకు రాగలరా?" అన్నాడు.
గీత చిన్నగా నవ్వి లోపలికెళ్లింది ముగ్గురు ఆడవాళ్లని పిలుచుకురావడానికి.
హరి వెళ్లిపోయింతరవాత గీత సీరియస్ గా ఆలోచించసాగింది. అతను తనని "మీరు" అంటూ మన్నించడం, మర్యాదగా ప్రతి విషయంలోనూ "మీరేం అనుకుంటున్నారు" అంటూ తన అభిప్రాయాలు అడగడం గీతకి చాలా సంతృప్తికరంగా వుంది. ఎదటివారి కష్టసుఖాలు గుర్తించే సహృదయుడుగా కనిపించేడు ఆలోచించినకొద్దీ.
కామాక్షి "ఏమంటావు? నీకు నచ్చేడా?" అని అడిగితే, "మంచివారిలాగే వున్నారు" అంది.
"అబ్బాయికి శెలవులేదు. మళ్లీ ఎప్పుడు రాగలడో చెప్పలేం. అట్టే వ్యవధిలేదు. పెళ్లి రెండురోజుల్లో అయిపోవాలి" అంది హరితల్లి.

"పెళ్లంటే మాటలా? రెండురోజుల్లో ఎలా చేస్తాం?" అంటూ బెదిరిపోయారు పరమేశం, కామాక్షీను.

శివరావు "ఫరవాలేదులే నేను చూస్తాను" అని పూనుకుని తనకున్న పరపతి వినియోగించి, కావలసిన ఏర్పాట్లు చేయించి, అట్టే ఆర్భాటంగా కాకపోయినా పదిమందీ శభాష్ అనేలా జరిపించేరు.

పరమేశం, కామాక్షీ, శివరావు, కనకమ్మల దగ్గరికి వచ్చి కళ్లనీళ్లు పెట్టుకున్నారు.

"మేం కన్నాం కానీ దాని చదువూ, పెళ్లీ కూడా మీరే జరిపించేరు, పేరుకే మేం కానీ అది మీకూతురే," అన్నారు పరమేశంగారు పూడుకుపోయిన గొంతుతో.

"ఛ, అదేం మాట. కన్నవారు కన్నవారే. ఎవరు ఎంత చేసినా తల్లిదండ్రులకి సాటి కారు. మేం ఎప్పటికీ శివంమామయ్యా, కనకమ్మత్తలమే." అన్నారు శివరావు గారు.

***

గతకాలపు జ్ఞాపకాలలో ఓలలాడుతున్న గీత ఫోను ట్రింగురింగులతో తృళ్లిపడి ప్రస్తుతంలో కొచ్చి, ఫోను అందుకుంది.

ఎవరో టెలిమార్కెటర్. ఆ మనిషికి నో చెప్పేసి ఫోను పెట్టేసింది. ఇటు తిరిగిందో లేదో మళ్లీ మరో కాలూ. మరో అమ్మకాల్రాయుడు కాబోలు అనుకుంటూ అందుకుంది.

అట్నుంచి హరి "ఏం చేస్తున్నావు?" అన్నాడు.

పూర్వగాధాలహరీ, మార్కెటింగుపోరూ తరవాత ఆ వెంట వినిపించిన హరిగొంతు కమ్మని సంగీతంలా హాయిగా వుంది. తేలిగ్గా ఊపిరి పీల్చుకుని, "ఏంలేదు. వస్తున్నారా? కాఫీ పెట్టనా?" అని అడిగింది ఆత్రంగా.

"లేదు. ఆ మాట చెప్పడానికే పిలిచాను. ఇక్కడ నాపని ఇంకా కాలేదు. ఆలస్యం అవుతుంది నేనొచ్చేసరికి. నువ్వు నాకోసం ఆగకు. భోంచేసేయి." అన్నాడు.

"సరే, అలాగేలెండి" అని ఫోను పెట్టేసింది నీరసంగా.

మళ్లీ ఒంటరితనం. మళ్లీ ఆనాటి తలపులు. ... రెండు కాయితాలు తీసుకుని, సత్యానికి ఉత్తరం రాయడానికి కూర్చుంది. హరిగురించి, అతని స్నేహితులగురించి, తాను చేస్తున్న వంటలూ, ఊరూ, ఊళ్లో విశేషాలూ - అన్నీ పూస గుచ్చినట్టు రాసింది నాలుగు పేజీలు. సత్యం, శ్యాం వేరే కాపురం పెట్టేరని తెలుసు కానీ ఎడ్రెసు ఎప్పుడూ అడగలేదు. కొంచెం ఆలోచించి. శివంమామయ్యగారి ఎడ్రెసు కవరుమీద రాసి పోస్టులో పడేసింది వాళ్లే ఇస్తార్లే అనుకుని.

సత్యం తనవుత్తరం చూసి ఉప్పొంగిపోయి తనలాగే పెద్ద వుత్తరం రాస్తుందని ఎదురు చూసింది కొన్నాళ్లపాటు. ఆ ఎదురుచూపు కార్యక్రమం ముగిసేక, ఇహ జవాబు రాదని నిశ్చయం అయేక, అమెరికాలో కొత్తగడ్డమీద జీవనసరళి గురించిన ఆలోచనలు మొదలయేయి. ఇక్కడ ప్రతిదీ తలకిందులుగానే కనిపిస్తోంది. ఇంటిదగ్గర వున్నప్పుడు బయటికి వెళ్తే "చీకటి పడకుండా ఇంటికి వచ్చేయి" అనేది అమ్మ. ఇక్కడ అందరికీ అసలు జీవితం చీకటిపడిన తరవాతే మొదలు. మనకి

పొద్దున్న లేవగానే కార్యక్రమం పళ్లు తోముకోడం, స్నానం చెయ్యడంలాటివి. ఇక్కడ అవన్నీ రాత్రివేళ. తనకి అన్నం చేత్తో తింటే కానీ తిన్నట్టుండదు. ఆమధ్య భోజనానికి వచ్చిన హరిస్నేహితులు చేత్తో తినడానికి పడ్డ అవస్థ తలుచుకుంటే ఇంకా నవ్వొస్తూనే వుంది. వేళ్లు వంగినట్టు ఫోర్కు వంగదు. చారూఅన్నం చేత్తో తింటంలో సౌలభ్యం ఫోర్కుతో చచ్చినా రాదు.

"దేవుడా ఇంత చేశావా!" అని ఉన్న ఊళ్లోనే పడివుండనందుకు ఒకటి రెండుసార్లు నొచ్చుకుంది కూడా. హరి అది గమనించాడు. అతను ఆ అమ్మాయిపక్కన కూచుని నెమ్మదిగా సంగతులు బోధపరుస్తూ, తనకి కావలిసినట్టు జరపడానికి ప్రయత్నిస్తూ వచ్చాడు కొన్నాళ్లపాటు. కానీ, ఇద్దరికీ ఇదీ అని చెప్పలేని చికాకు మనసులో రొద పెడుతోంది. గీతకి అన్నిటికంటె ఎక్కువ బాధ కలిగిస్తున్నది తలుపులేసుకు ఇనప్పెట్టెలాటి ఆరెండు గదుల్లో ముడుచుకు కూర్చోవలసిరావడం. తనకి ఊపిరాడ్డంలేదు. పోనీ, కొంచెంసేపు ఎటేనా వెళ్లొద్దాం అంటే, హరి ఒకటే కంగారు ఒద్దు, ఒద్దు అంటూ. అతని కంగారు చూస్తే గీతకి "ఈయనకి ఇంత బెరుకేమిటి" అని కూడా అనిపిస్తోంది.

ఆఖరికి ఓరోజు ఉండబట్టలేక, హరి వెళ్లినతరవాత చూద్దాం అనుకుని బయల్దేరింది సందేహిస్తూనే. అంతకుముందు కొన్న పాంటూ, చొక్కా, టెన్నిస్ జోళ్ళూ తొడుక్కుని, గుమ్మంలోంచి వీధిలోకి ఓసారి తొంగిచూసి, లక్ష్మణరేఖ దాటి రెండు మెట్లు దిగింది. మళ్లీ రోడ్డు రెండువేపులా పరికించి చూసి, అక్కడ తనని ఎత్తుకుపోయే రావణబ్రహ్మలు ఎవరూ లేరని నిశ్చయించుకుని, "ఫరవాలేదు, బయల్దేరొచ్చు, తలుపు తాళం వేసి" అని తనకి తనే చెప్పుకున్నప్పుడు తెలిసింది, రోడ్డుమీద పరిస్థితులు అంచనా వేసే సంరంభంలో తాళాలు తీసుకోలేదు. ఇక్కడ తలుపులు వాటంతట అవే పడిపోతాయి అని తెలిసేక, రెండోసారి 'దేవుడా ఇంత చేశావా' అనుకోవాల్సివచ్చింది. 'సరే, ఇంక లోపలికెళ్లే ప్రశ్న లేదు కనక కనీసం రెండు వీధులయినా తిరిగివద్దాం' అనుకుంటూ బయల్దేరింది.

రోడ్డుమీద అట్టే జనం లేరు. కార్లు కూడా మరీ ఎక్కువగా లేవు. నడుస్తుంటే చిన్నచలి. సైకిళ్లమీద పోయేవాళ్లు ఎలా తట్టుకుంటున్నారో అనుకుంది. అలా ఎంతసేపు తిరిగిందో తనకే తెలీలేదు. నాలుగు వీధులు తిరిగేక ఓ చెరువు కనిపించింది. చెరువులో బాతులు బారులు తీరి విలాసంగా తేలియాడుతున్నాయి. రెండు బాతులు మునివరుల్లా మునకలు వేస్తుంటే గమ్మత్తుగా వుంది చూడ్డానికి. కేవలం తనకోసమే ఏర్పాటు చేసిన వినోదప్రదర్శనలా వుంది. దూరంగా కొందరు పడవల్లో షికార్లు కొడుతున్నారు గాలివాలుకి తెరచాపలు ఎత్తి.

ఓ గంటసేపు అలా కాలక్షేపం అయింతరవాత గీతమనసు తేరుకుంది. కళ్లు తడి అయేయి ఆనందంతో. మళ్లీ సత్యం జ్ఞాపకం వచ్చింది. ఒకర్నొకరు వదిలి వుండలేం అనుకున్నారు అప్పట్లో. అనుకున్నంతసేపు పట్టలేదు విడిపోవడం. తనకి ఉత్తరం రాయలేనంత రాచకార్యాలేవిటో ఆవిడగారికి? ప్చ్. ఇప్పుడేం చేస్తూ వుంటుందో. మళ్లీ చప్పున గుర్తొచ్చింది. ఇది వాళ్లకి రాత్రి కదా. నిద్దరపోతూ వుంటుంది. ...

ఆకలేస్తోంది. ఇంక ఇంటికి పోదాం అనుకుని వెనక్కి తిరిగింది. తీరా చూస్తే అన్ని వీధులూ ఒక్కలాగే వున్నాయి. తను బయల్దేరినప్పుడు వీధిచివర రెనబామ్స్ షాపు చూసినట్టు గుర్తు. అది ఆనవాలు పెట్టుకుని తమవీధికోసం చూస్తూ ఓ అరగంటసేపు తిరిగింది. తిరిగి తిరిగి కాళ్లు పీకుతున్నాయి కానీ తమవీధి కనిపించలేదు. ఎవర్నైనా అడుగుదాం అంటే అందరూ కారుల్లోనూ, సైకిళ్లమీదా దూసుకుపోయేవారే కానీ కాలినడకవారు ఎవరూ కనిపించడం లేదు. ఆఖరికి ఎవరో ఒకాయన మెయిల్ బాక్సులో ఉత్తరాలు తీసుకుని, కారు ఎక్కి బయటికి వెళ్లబోతూ దొరికేడు. గీత గబగబా ఆయనదగ్గరికి వెళ్లి అడిగింది "రెనబామ్స్ ఎక్కడ?" అని.

"ఈప్రాంతంలో నాలుగు రెనబాములు వున్నాయి." అన్నాడాయన. గీత అదిరిపడింది. అది చూసి ఆయనే మళ్లీ వీధి పేరు అడిగేడు.

వీధిపేరు గుర్తు తెచ్చుకోడానికి కొంచెం అవస్థ పడాల్సొచ్చింది. ఆలోచించి, "రాండల్" అంది.

"రాండల్ కోర్ట్, రాండల్ అవెన్యూ, రాండల్ డ్రైవ్ - ఏది?" అన్నాడాయన.

గీత తెల్లమొహం వేసి ఏమో అంది.

గీత మొహం చూసి "ఇక్కడ కొత్తా?" అన్నాడు.

"యస్యస్" అంది గీత దిగులుపడిపోతూ. ఆయన మరో నాలుగు ప్రశ్నలు వేశాడు తాను చేయగల సాయం ఏమిటో తెలుసుకునే ప్రయత్నంలో. గీతకి సగం అర్థం అయేయి. సగం అర్థం కాలేదు. తోచిన సమాధానాలు చెప్పింది. గీతని వుండమని చెప్పి, ఆయన లోపలికి వెళ్లి టెలిఫోను బుక్కు తీసుకొచ్చి పేరు అడిగేడు.

తను ఇంకా కొత్త. హరిపేరు చెబితే నయం అనుకుని అతని పూర్తి పేరు చెప్పింది, "ధరణికోట ఆనందవిజయహరనాథరావు."

"లాస్ట్ నేం ప్లీజ్" అన్నాడాయన మళ్లీ.

"లాస్టున వున్న నేము ఆనందవిజయహరనాథరావు"

"ఆయన్ని అందరూ ఏమని పిలుస్తారు?"

"హారి." అంది హా ఒత్తి పలుకుతూ.

ఆపెద్దాయన ఆపేరుతో నానా కుస్తీలు పట్టి ఆఖరికి "రావు, ఎవి.హెచ్," కింద గుర్తించి, ఎడ్రెసు చూసి, "మీరు చాలా దూరం వచ్చేశారు. రండి. నేను అటే వెళ్లాలి. మిమ్మల్ని నాకారులో దింపుతాను" అన్నాడు. గీతకి హరిమాటలు గుర్తుకొచ్చేయి. ముక్కూ మొహంతెలీని ఈ పెద్దమనిషి కారు ఎక్కితే హరి గోలెట్టేస్తాడేమో. కానీ హరి ఏమంటాడో అన్నభయం కంటే ఇల్లు చేరాలన్న ఆతురత ఎక్కువయి, ఏమయితే అదే అవుతుందనుకుంటూ కారెక్కింది.

ఆ పెద్దాయన ఏం మాటాడకుండా, గీతని గుమ్మంముందు దింపేసి వెళ్లిపోయేడు.

ఈసురోమంటూ మెట్లెక్కి తలుపుదగ్గర నిలబడింది. లోపలికి వెళ్లడానికి తాళాల్లేవు మరి. సమయానికి ఇంటి మేనేజరు అటొస్తూ కనిపించేడు. గీత అతనిదగ్గరికి వెళ్లి, "నేను హరి భార్యని. అజ్ఞానంచేత తాళాలు తీసుకోకుండా బయటికి వచ్చేను. తలుపు గడియపడిపోయింది. దయచేసి, తియ్యండి" అని ప్రార్థించింది.

"అద్దెకి తీసుకున్నవారికి తప్ప నేను తలుపులు తీయరాదు," అన్నాడతను నొచ్చుకుంటూ.

"హరి నిజంగా నాభర్తే. నేను అగ్నిసాక్షిగా ఆయనని పెళ్లి చేసుకున్నాను. ఇప్పుడు నేను కూడా ఆయింట్లోనే వుంటున్నాను" అంది మంగళసూత్రాలమీద చెయ్యేసి, ప్రమాణపూర్తిగా.

"అమ్మా, మీవివాహం నాకు చాలా సంతోషదాయకం. మీకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. కానీ కాంట్రాక్టుమీద సంతకం చేసినవారు మాత్రమే తలుపు తీయుట వంటి సర్వీసు పొందుటకు అర్హులు." అన్నాడు మళ్లీ.

ఇంకా "ఇతరులకి తలుపు తీస్తే నాకు తిప్పలు, నా జాబుకి ముప్పులు" అని కూడా చెప్పేడు జాలిగా మొహం పెట్టి.

గీతకి కూడా జాలేసింది. పాపం, అతని కూట్లో ఎందుకు దుమ్ము కొట్టడం అనిపించింది.

అలా ఇద్దరూ ఒకరికోసం ఒకరు బాధపడిపోతూ, ఒకరిమీద ఒకరు జాలి పడిపోతూ రెండు నిముషాలపాటు మౌనం పాటించేరు. వారి మౌన ప్రార్థన ఊరికే పోలేదు.

హరి ప్రత్యక్షమయేడు. ఇంట్లో గీత ఎలా వుందో పిలిచిచూద్దాం అని పిలిచిచూసి, రెండోసారీ, మూడో సారీ కూడా ఫోను తియ్యకపోయేసరికి కంగారు పడి ఇంటికొచ్చాట్ట.

గుమ్మందగ్గర గీత నిలబడి వుంది బిక్క చచ్చిపోయి. హమ్మయ్య అనుకుని తలుపు తీశాడు.

బతుకుజీవుడా అనుకుంటూ అతనివెంట లోపలికొచ్చింది గీత. లోపలికి రాగానే భయం పోయింది. కొంచెం నవ్వు కూడా వచ్చింది. తన సాహసకృత్యాలు హరికి చెప్పి, "మీపేరు మాత్రం గొప్పకథ. యఫ్.బి.ఐ. వాళ్లు కూడా పట్టుకోలేరన్నాడా పెద్దాయన," అంది గలగల నవ్వుతూ.

హరి కూడా నవ్వుతూ, "మా ఆఫీసులో నాపేరు ఎ టు జీ హారీ అంటార"ని చెప్పి, "తింటానికేమైనా వుందా?" అని అడిగేడు.

"రవదోశలు చెయ్యనా?" అంది గీత.

"అంత టైములేదులే. ఆవకాయా అన్నం తినేసి పోతాను," అన్నాడు ఫ్రిజ్ తీస్తూ.

***

క్రమంగా గీతకి ఊరు అలవాటవుతోంది. పాలూ, కూరలూ ఒక్కర్తే వెళ్లి తెచ్చుకుంటోంది.

ఓరోజు కూరలకోసం బజారుకెళ్తే, అక్కడ ఒక తెలుగుమొహం కనిపించింది. గీత ఆగి అట్టే చూసింది ఆవిడవేపు. పొడగరి, పచ్చని పసిమి శరీరచ్ఛాయా, ఒత్తుగా కురులూ, చురుకైన కళ్లూ ఎవరినైనా ఆకట్టుకునే వర్చస్సు ముఖంలో. అట్టే వయసు వున్నట్టు లేదు కానీ హుందాగా వుంది. ఇద్దరికిద్దరూ

మాటాడదామా వొద్దా అన్నట్టు ఓరచూపులు చూసుకుంటూ రెండు నిముషాలు సందిగ్ధావస్థలో గడిపేరు. తరవాత మళ్లీ చెకింగ్ దగ్గర తటస్థపడ్డారు.
ఆ రెండో ఆవిడే చిన్న చిరునవ్వు నవ్వి హలో అన్నట్టు తలూపింది.
గీత జవాబుగా హలో అంది.
"కొత్తగా వచ్చినట్టున్నారు" అంది ఆవిడ.
"నాలుగు నెలలు అవుతోందండీ," అంది గీత
"అనుకున్నానులెండి. యన్నారైమొహం పడడానికి కొంతకాలం పడుతుంది" అంది రెండో ఆవిడ నవ్వుతూ.
గీతకి ఆవిడ అభిప్రాయం అర్థం కాలేదు. నవ్వేసి వూరుకుంది.
గీతకి ఆవిడతో మాటాడాలని వుంది. "నాపేరు గీత" అంది.
"ఆహా" అని "తపతి" అంది రెండోఆవిడ. కొన్నవాటికి డబ్బిచ్చేసి, ప్లాస్టిక్ సంచీ అందుకుని, "వస్తాను" అనేసి వెళ్లిపోయింది త్వరగా అక్కడినుంచి.
గీత దారిపొడుగునా ఆవిడగురించే ఆలోచిస్తోంది. రాత్రి హరితో చెప్పింది ఆసంగతి.
"తపతిగారా? ఆవిడ సాధారణంగా ఎవరితోనూ మాటాడరే. ఆశ్చర్యమే," అన్నాడు హరి.
"ఏమో మరి, నాతో బాగానే మాటాడేరు," అంది గీత.
"నీ ముఖవిశేషం కాబోలు."
"హుం" అంది గీత కళ్లు చికిలించి వెక్కిరిస్తూ.

***

ఆదివారం భాగ్యంగారు గీతనీ, హరినీ పూజకి పిలిచారు. తమ వివాహం అయి 25 సంవత్సారాలు అయిందని, అంచేత ఇది స్పెషల్ పూజ అనీ చెప్పారావిడ.
గీత "హరిగారు వచ్చేక అడిగి చెప్తానండీ," అంది.
ఆవిడ "ఆలానే తరవాతే చెప్పండి. మీరు తప్పక రావాలి. మనవాళ్లు చానామంది వస్తారు. మీరు ఆళ్లని కూడా కలుసుకోవచ్చు." అందావిడ.
రాత్రి హరితో భాగ్యంగారి పిలుపుసంగతి చెప్పి, "నాకలాటి నమ్మకాలు లేవు" అంది
హరి నవ్వి, "నాకూ లేవు. కానీ ఆవిడ పులిహోరా, పెరుగువడా ఊరూ వాడా చెప్పుకుంటారు. మనవూళ్లోలాగ ఇరుగూపొరుగూ వుండరు కదా ఇక్కడ. ఇది మరోరకం ఊసుపోక అన్నమాట. కనీసం ఒకసారి చూద్దువుగానీ పద," అన్నాడు.
మర్నాడు భాగ్యంగారిని పిలిచి 'వస్తున్నాం' అని చెప్పింది. ఆవిడ 'మంచిదమ్మా' అంది సంతోషంగా.

***

ఆదివారం ఇద్దరూ బయల్దేరి రెండుగంటలకి భాగ్యంగారింటికి వెళ్లేరు. గీతకి ఆయింట్లో అడుగు పెట్టగానే మరోలోకంలో వున్నట్టనిపించింది. మనవాళ్లు చెప్పినట్టు అక్షరాలా లంకంత ఇల్లు. ఈమధ్యనే కట్టించుకుని 'ముర్వ'య్యేరుట.

"ముందున్న ఇంట్లో పూజగది లేదు. స్వామివారిని బ్రూమ్ క్లాజెట్టులో పెట్టుకున్నాను. నాకు మనసుకి అది తృప్తి లేదు. ఇంత సంపాయిస్తున్నాం, ఇన్ని సుకాలు అనుభవిస్తున్నాం. సామికి తక్కువ చేయను తగునా? ఏమంటారు? నేనే వోరు పెట్టి స్వామికి వేరే గది కట్టింపించాను," అన్నారు భాగ్యంగారు.

మనవాళ్లకి పూజగదీ, ఇక్కడివాళ్లకి చీపుళ్లగదీ - ఏ సంస్కృతిలో దేనికి ప్రాధాన్యత అన్నది చెప్పడానికి ఇంతకన్నా నిదర్శనం ఏంకావాలి అనుకుంది గీత నవ్వుకుంటూ.

ఇల్లంతా ఇండియానించి తెచ్చిన వస్తువులతో కిక్కిరిసి వుంది. ముక్కోటి దేవతలూ గోడలనిండా కొలువు చేసి వున్నారు. స్టీరియోలో భజనగీతాలు వినిపిస్తున్నాయి.

పార్టీకొచ్చినవాళ్లంతా ఉద్యోగాల్లో స్థిరపడ్డవాళ్లే. ప్రొఫెసర్లూ, డాక్టర్లూ, ఇంజినీర్లూ,. సర్వమానవులూ సమానులే అంటూ గోలెత్తే ఈదేశంలో ఆరోజు అక్కడ గీతకి కనిపించని తెరలు విదితమయేయి. తనూ, హరీ కాక, రాధా, మాధవ్, మరో ఇద్దరూ 30, 40లలో వున్నట్టు కనిపిస్తున్నారు. వారందరూ లివింగ్రూములో ఓమూల ఒదిగి కూర్చుని వాళ్లలో వాళ్లు మాటాడుకుంటున్నారు. యాభైలు దాటినవాళ్లు మరోపక్క చేరేరు. వాళ్ల చర్చలు పిల్లలచదువులూ, మార్కెట్టూ, రిటైర్మెంటు ప్లానులూ…

"మార్కెట్ మెరుగయ్యేట్టు లేదు ఇప్పట్లో. గ్రీన్స్పాన్ చేతిలో మంత్రదండం పవరు ఎలా వుంటదో."

"20 పెర్సెంటు లాస్"

"పేపర్ లాసేలెండి."

"మీ అబ్బాయి గ్రాడ్యేటు అవుతాడేమో. కాలేజీలకి అప్లై చేస్తున్నాడా?"

"బ్రౌనుకి అప్లై చేసేడు. ఏం చదువులో. ఏడాదికి అరవైవేలు."

"మావాడికి ఫుల్ స్కాలర్షిప్పుంది లెండి"

"యేల్లోనే?"

"కాదండీ. జార్జిటౌనుకెల్తాడంట. ఏటో … ఆల్ల సదూలు ఆల్లకే తెలవాల."

ఆడవాళ్లందరూ వంటింట్లోనూ డైనింగురూంలోనూ సర్దుకున్నారు. వారిసంభాషణలు ఇండియా ప్రయాణాలూ, ఇక్కడినుంచీ తీసుకెళ్లే బహుమానాలూ, అక్కడినుంచీ తెచ్చుకునే నగలూ, చీరెలూ, మధ్య మధ్య స్థానిక కుటుంబాల్లో విశేషాలూ, రెసిపీలూ ..

"శాన్నాళ్లయి గౌరి కనపిచ్చట్లేదు. ఊర్ల లేరా ఏమి ఆమె?" అంది నీలి పట్టుచీరెలో మిలమిల మెరిసిపోతున్నావిడ.

"ఊళ్లోనే ఉన్నారు. మొన్న నాకు గ్రోసరీస్టోరులో కనిపించేరు." అంది కంచిపట్టుచీర కట్టుకున్న ఇల్లాలు.

ఆటు పక్కనున్నావిడ ఇటు తిరిగి, "కిందటివారం వాళ్లమ్మాయిని వెస్టాన్ మాల్లో చూశాను. పక్కన ఒక అమెరికను అబ్బాయి వున్నాడు. డేటనుకుంటా." అంది.

"మా పిల్లకాయలకి ఆవోకడలు లేవు. ఆళ్లు నువ్వు చెప్పినఅమ్మాయిల్నే చేసుకుంటం మమ్మీ అంటన్నరు," అంది గౌరిగారిగురించి అడిగిన ఆవిడ.

గోడవార కూర్చున్న మరొకావిడ ఇండియాకి ఏం పట్టుకెళ్తోందో చెప్పి, "ఈసారి రుబ్బురోలు తెచ్చుకుంటాను, కందిపచ్చడి రోట్లో నలిగితే వచ్చే రుచి ఈ బ్లెండరుతో రాదు," అంటోంది.

వారందరికీ కాస్త ఎడంగా ముభావంగా కూర్చున్నావిడని చూసి గీత "ఎక్కడో చూసినట్టుంది, ఎవరై వుంటారు చెప్మా" అని ఆలోచిస్తోంది.

ఆవిడ గీతని చూసి చిన్నగా నవ్వింది. అప్పుడు గుర్తొచ్చింది గీతకి. రెండువారాలకిందట స్టోరులో కనిపించింది ఈవిడే.

ఇంతలో భాగ్యంగారు భజనకి పిలిచారు. ఆడవాళ్లూ, మొగవాళ్లూ అందరూ కుడివేపున్న ఫామిలీరూంలోకి చేరేరు. దాదాపు ముప్పావుగంట పాటలూ. తరవాత మంగళహారతీ ఇచ్చి ముగించేరు. మళ్లీ అందరు హాలూ, కిచెనూ, డైనింగురూమూ ఆక్రమించేరు.

డైనింగురూంలో ఓ మూల నక్కిన తపతి దగ్గరికి ఇందాక గౌరిప్రస్తావన తెచ్చినావిడ పనిగట్టుకుని వచ్చి, "మీవారిని చూపరేమీ? ఆయన ఎప్పుడూ భజనకి వచ్చిందే లేదు?" అని అడిగింది.

తపతి సమాధానం చెప్పకుండా చిన్న నవ్వు నవ్వి మరోవేపు తిరిగింది.

"మీ అబ్బాయి ఆర్మీలో చేరినాడంట గంద?"

తపతి అవునన్నట్టు తలూపింది.

"మీకెంత గుండి దయిరయం. నేనయితే బయంతో సచ్చిపోదును పోరగాని యుద్దానికి అంపి వొప్పిడేం ఐపోతందో అని" అంది నీలిచీరెలో మెరిసిపోతున్నావిడ.

ఈసారి తపతి, "మీ అబ్బాయి మెడిసిన్ చదువుతున్నాడు కదా. భయంలేదులెండి" అంది.

మరొకావిడ, "మీ పాప ఏం చేస్తోంది?" అని అడిగింది.

తపతి "ఇంకా తెలీదండీ" అని అక్కడనుండి లేచి మరో వేపుకి వెళ్లింది.

"మారుమనువు సేస్కుందని సెప్తినే. ఆయమ్మే" అన్న మాటలు వెనకనించి స్పష్టంగా వినిపించేయి.

గీతకి ప్రాణం చివుక్కుమంది. లేచి వెనకగుమ్మంవేపు నడిచింది. పెద్దఅద్దాల తలుపులోంచి విశాలమయిన పెరడు పువ్వులమొక్కలతో కన్నులపండువగా వుంది. నెమ్మదిగా తలుపు పక్కకి తోసుకుని, బయటికి నడిచి, మళ్లీ తలుపు వేసింది దోమలు ఇంట్లోకి జొరబడకుండా. భాగ్యంగారికి తోటపని అంటే అత్యంతప్రీతి అని ఆమొక్కలు చూస్తే తెలిసిపోతుంది ఎవరికైనా. మామూలుగా సర్వత్రా కనిపించే గులాబీలూ, చేమంతులే కాక కొత్తరకాల మొక్కలు కూడా వేసారు. ఓగోలెంలో నిలువెత్తు మందారచెట్టు రెండుపూలు పూసింది అపురూపంగా. అది చూస్తే గీతకి గుంటూరులో తమ పెరడు గుర్తుకొచ్చి దిగులేసింది. మరో వేపు

ఓ పెద్దచెట్టు పెద్దపూలతో విరగబూసింది చూపరుల కన్ను చెదిరేలా. మందారాలంత పెద్దవి, రేకులు తెలుపు, చిగుళ్ల చిన్న ఎర్రటి జీర - అబ్బ ఎంత అందం అనుకుంది గీత కన్నార్పకుండా వాటిని చూస్తూ. ఉల్లము రంజిల్లగా, ఆపూలగుత్తిమీద సుతారంగా చేయి వేయబోతుంటే మనసున సంగీతం తొణికింది. "చివాలున కొమ్మ వంచి గోరానెడు నంతలో పూలకన్నెలు జాలిగ నోళ్లు విప్పి ఆవురమన్నవి ప్రభూ" కూనిరాగం తీస్తున్న గీత వెనక అడుగులచప్పుడు వినిపించి గతుక్కుమని పాట ఆపేసింది.

తపతి నిల్చుని వుంది చిరుహాసం చిప్పిలుతున్న కన్నులతో.

ఇద్దరికీ మాట తోచలేదు ఒక్కక్షణం. గీత గాజుతలుపులలోనించి కనిపిస్తున్న మనుషులవేపు చూసింది. ఆతలుపుకి అటూ ఇటూ దూరం పది గజాలే అయినా వాతావరణంలో ఎంత తేడా!

తపతి చెట్టువేపు చూస్తూ అంది, "మగ్నోలియాలు. అక్షరాలా నాలుగు ఘడియలే వాటి ఆయువు అయినా ఎంతటి సౌందర్యం విరజిమ్ముతున్నాయో చూడండి."

గీత మరోసారి చెట్టువేపు చూసింది. చెట్టంతా పూలే, గుప్పున మతాబాలు వెలిగినట్టు, కొమ్మలు కనిపించడంలేదు.

"పూత కూడా అట్టే కాలం వుండదు. మహా అయితే నెలరోజులు పూస్తాయి. ఆరేకులన్నీ రాలిపోయినప్పుడు కూడా బహుసుందరంగా వుంటుంది చెట్టుకింద అందమయిన తివాసీ పరిచినట్టు, సంక్రాంతివేళ సూర్యరథం ముగ్గు వేస్తాం చూడండి, అలాగే" అని మళ్లీ "మీకు సంగీతం వచ్చులా వుంది" అంది తపతి.

గీత నవ్వి, "నేర్చుకోలేదండి. మన ఇళ్లల్లో సంగీతం రాని ఆడపిల్లలెవరు లెండి" అంది.

"ఎంతవరకూ నేర్చుకున్నారు?"

"ఎంతవరకూ లేదండీ. సరళీస్వరాలూ, జంటస్వరాలూ, ఆతరవాత ఏదో అంటారు స్వరజతులు కాబోలు. అంతే. ఆపైన సినిమా, రేడియో.."

"మీ కంఠం బాగుంది. నేర్చుకోండి."

గీత ఆశ్చర్యంగా, "ఇక్కడా?" అంది తపతివేపు తేరి చూస్తూ.

"ఏం? ఇక్కడా అంటే? ఈ చెట్టుకిందా అనా అమెరికాలోనా అనా?" అంది తపతి వెక్కిరిస్తున్నట్టు.

"అది కాదండీ. ఇక్కడ ఎవరు నేర్పుతారని?"

"నేన్నేర్పుతాను మీరు నేర్చుకుంటానంటే."

గీతకి ఏమనాలో తోచలేదు. నిజానకి నేర్చుకుంటే బాగుంటుంది, మంచి కాలక్షేపంగా వుంటుంది. మరి తపతి నిజంగా అంటోందో, మాటవరసకి అంటోందో ...

అంతలో భాగ్యంగారు వచ్చారు ఎన్ని కాఫీలో, ఎన్ని టీలో లెక్క వేస్తున్నారావిడ.

ఇద్దరూ లోపలికొచ్చారు. నాలుగు నిముషాలాగి గీత తిరిగి చూసింది తపతికోసం. ఆవిడ ఎక్కడా కనిపించలేదు. "తపతిగారేరీ" అని అడిగితే "ఆవిడ వెళ్లిపోయి చాలాసేపయింది" అన్నారెవరో.

‘‘అదేమి తీరో నాకర్థం గాదమ్మా. పిలిస్తే రాదు. వస్తే ఇట్ట కనిపించి అట్ట మాయమయిపోతది. నావల్ల కాదమ్మ అట్టాటి నడతలు’’ అంది అంతకుముందు భర్తని చూపించలేదేం అని తపతిని అడిగినావిడ.

తపతి మనవాళ్లతో ఎందుకు కలవదో గీతకి అర్థం అయింది.

మరో పావుగంట కూర్చుని ఒకొరొకరే లేచారు ఇళ్లకి వెళ్లడానికి.

కారులో హరి అడిగేడు, ‘‘ఎలా వుంది పార్టీ?’’

గీత తపతిగురించే ఆలోచిస్తోంది. ‘‘అచ్చంగా మనవాళ్లని కలుసుకున్నట్టే వుంది,’’ అంది నర్మగర్భంగా.

‘‘ఏం? మనవాళ్లని కలుసుకోడం, తెలుగులో పిచ్చాపాటీ, తెలుగు భోజనం బాగులేదూ?’’ అడిగేడు అతను గీతవేపు చూస్తూ.

చాలాసేపటినుండి తనని బాధిస్తున్న ప్రశ్న చెప్పింది, ‘‘వీళ్లందరూ చాలాకాలంగా ఇక్కడున్నారు అంటున్నారు. ఇక్కడిమర్యాదలు బాగానే ఒంటబట్టించుకుని వుండాలి కదా. మరి ఆ వెకిలి మాటలూ, లేకిప్రశ్నలు ఏమిటి? అవతలిమనిషిని నొప్పిస్తున్నాం అన్న జ్ఞానం వుండక్కర్లేదూ?’’ అంది చిరాగ్గా.

హరికి తికమక అయింది. ‘‘ఏమన్నారు? ఎవరు? నిన్నా?’’ అని అడిగేడు గాభరాగా.

గీత తల అడ్డంగా వూపుతూ, "నన్ను కాదు. తపతి గారిని. ఆవిడ ఎక్కడికీ రారు అన్నారు మీరు. ఇందుకేనేమో. భాగ్యంగారింట్లో అమ్మలక్కల ప్రశ్నలు చూస్తే అసలు ఏం అనుకోవాలో తెలీడం లేదు నాకు."

హరి కొంచెంసేపు ఊరుకుని, ‘‘అందుకేనేమో రారు. నాకు తెలీదు కదా మీ ఆడవాళ్లు ఏం మాటాడుకుంటారో. భాగ్యంగారితో దూరపు బంధుత్వమో, పాత స్నేహమో ఏదో వుంది. అందుకే వాళ్లింటికి అదేనా ఇలా ఏదో స్పెషల్ సందర్భం అయితేనే వస్తారు. యానివర్సరీ అన్నారుకదా అని వచ్చి వుంటారు ఇవాళ.’’

‘‘నాతో బాగా మాటాడారు. నాకు సంగీతం కూడా నేర్పుతానన్నారు కూడా.’’

‘‘చెప్పేను కదా నీ ముఖవిశేషం.’’

గీత చాలా రోజులు తపతిగురించి ఆలోచిస్తూనే వుంది.

***

తరవాత రెండునెలల్లో మరో మూడు పార్టీలు - అమెరికన్లఇళ్లలోనూ, ఇండియనమెరికను ఇళ్లలోనూ అయేయి. తపతి మళ్లీ ఎక్కడా కనిపించలేదు.

క్రమంగా గీతకి ఇక్కడి జీవనసరళి బోధపడసాగింది.. ఓసాయంత్రం రాధ ఫోన్ చేసింది వాళ్లింట్లో పాట్లక్కి పిలవడానికి . హరి ఫోన్ తీసుకుని, సంగతి విని. “అలాగే, వస్తాంలెండి.” అన్నాడు.

“గీతగారికి ఇంకా కొత్త కదా. ఈసారికి వదిలేస్తాం. ఏం తేనక్కర్లేదని చెప్పండి” అంది రాధ.

“అయ్యో. అలా అంటారేమిటండీ. గీతకి కొత్త కానీ నాకు కాదు కదా. నేను చేసి తెస్తాను ఏదైనా,” అన్నాడు హరి.

రాధ నవ్వి, “సరేలెండి. మీఇష్టం. తేకపోయినా మేం అపార్థం చేసుకోం.” అంది.

హరి నవ్వి ఫోను పెట్టేసి, గీత వేపు తిరిగి “రాధ. శనివారం వాళ్లింట్లో పాట్లక్కు అని చెప్పడానికి పిలిచారు” అన్నాడు.

గీతకి భాగ్యంగారింట్లో తపతి అవస్థ చూసినతరవాత పార్టీలంటే ఆసక్తి తగ్గింది.

“ఏమిటండీ ఈపార్టీలు, వారాలు చేసుకున్నట్టు” అంది, చిరాకు దాచుకోడానికి విశ్వప్రయత్నం చేస్తూ.

“చెప్పేను కదా. ఇక్కడ నలుగురూ కలుసుకోడానికీ, మంచీ చెడ్డా మాటాడుకోడానికీ ఇదొక్కటే వెసులుబాటు అని. అయినా రాధఇంట్లో పార్టీ వేరుగా వుంటుందిలే. ఇక్కడి మంద వేరు.”

గీతకి అర్థం కాలేదు. “ఆఁ?”

“భాగ్యంగారింటికి వచ్చినవాళ్లు ఇక్కడ నిలదొక్కుకు స్థిరపడిపోయినవాళ్లు. వాళ్ల తాపత్రయాలు వేరు. రాధఇంటికి వచ్చేవాళ్లంతా యువతరం. వీళ్ల ధోరణి ముందొకసారి చూశావు కదా.”

“ఎప్పుడు?”

“అదే నువ్వు వచ్చినరోజున మనింటికి వచ్చేరు చూడూ, వాళ్లే. సమతీ, టేష్, విశ్వం, గణపతీ,.. ఆకోవలోవాళ్లే మరో నలుగురు వచ్చినా రావచ్చు.”

“ఆహా” అంది గీత అర్థమనస్కంగా.

“తపతిగారు కూడా రావొచ్చు” అన్నాడు హరి.

“రాధగారు చెప్పారా?” అంది. తపతిమాట ఎందుకొచ్చిందో అర్థం కాక.

“లేదు. రాధకి వరసకి మేనత్త అవుతారావిడ. అంటే ఆవిడ వీళ్లకి పెద్ద దిక్కన్నమాట” అన్నాడు హరి నవ్వుతూ.

తపతి వస్తుందేమో అన్నమాటతో గీతకి రవంత ఉత్సాహం వచ్చింది.

“అయితే ఏం చెయ్యను పాట్లక్కుకి?”

“నువ్వింకా కొత్తపెళ్లికూతురివే అన్నారు రాధగారు. ఈసారికి నిన్ను వదిలేశార్ట.”

“ఇంకా పెళ్లికూతురేమిటండీ. నాప్రాణానికి కొన్నియుగాలు అయిపోయినట్టుంది” అని, “బజ్జీలు చెయ్యనా? చులాగ్గా అయిపోతాయి.”

“మిరపకాయ బజ్జీలా?”

గీత తల అడ్డంగా ఆడించింది నవ్వుతూ.

***

శనివారం సాయంత్రం ఐదున్నర అయింది గీతా హరీ రాధా మాధవుల ఇంటికి వచ్చేసరికి.

వాళ్లది మూడుగదుల చిన్నయిల్లు. వూరికి తూర్పుదిక్కున వుంది. అభివృద్ధి అంతా పశ్చిమదిక్కునే. ఆవిధంగా కూడా తరతమ బేధాలు తెలుస్తాయి ఎవరు ఏ దిక్కున వున్నారు అన్నదాన్నిబట్టి. ఇల్లు

చిన్నదయినా ముచ్చటగా వుంది. ముందుగదిలో టీవీ, స్టీరియో వున్నాయి. గోడమీద బాలాజీ బొమ్మ. పిల్లల ఫొటోలూ వున్నాయి.

ఆరు అయేసరికి అందరూ పోగయేరు తలో గిన్నె పుచ్చుకుని. గీత పూరీ, కూరా చేసింది. సుమతి కోక్, టేష్ కేక్ కొని తెచ్చేరు. టేష్ వాళ్ల ప్రొఫెసరుగారు పెసరపప్పు దాల్ తెచ్చారు. రాధ ఫ్రైడ్ రైస్, వైట్ రైస్, రైతా, సాంబారు, వంకాయకూరా చేసింది. భాగ్యంగారు పులిహోరకి నిలయవిద్వాంసులు. ఆవిడ వస్తారంటే మరెవరూ చెయ్యరు ఆ వంటకం. ఇంకా చిప్స్, crackers, ఛీస్ ముక్కలూ, బీరూ, జూసూ కూడా పెట్టేరు బల్లమీద.

అందరూ తలో ప్లేటు పుచ్చుకుని మాటల్లో పడ్డారు.

హరి చెప్పినట్టే ఆరోజు అక్కడ చేరినవారందరూ కుర్రాళ్లే, భాగ్యంగారూ, హనుమయ్యగారూ తప్పిస్తే. చదువుకుంటున్నవాళ్లూ, చదువు అయి వుద్యోగాలవేటలో పడ్డవాళ్లూను. వీళ్లమొహాల్లో రేపెలా అన్న చింత కనిపించదు. భవిష్యత్తుగురించిన బెంగలుండవు. రాజెవరికొడుకన్నంత ధీమా వాళ్లమొహాల్లో. చదువులకయేఖర్చులూ, రిటైరయినతరవాత ఏంచెయ్యాలిలాటి అంశాలు లేవు వాళ్లసంభాషణల్లో. వాళ్లమాటల్లో దొర్లుతున్నవి ప్రొఫెసర్లమీదా, బాసులమీదా జోకులూ, సినిమాలూ, రాజకీయాలూ.

"దాల్ చాలా బాగుంది. మీరే చేసేరా? రిసెపీ ఇవ్వాలి నాకు" అన్నాడు టేష్ వాళ్ల ప్రొఫెసరుతో, బీరు చప్పరిస్తూ.

ఆయన తనప్లేటులోకి పరీక్షగా చూస్తూ, "లెటస్ సీ. మొదట ఒక కప్పు పెసరపప్పు ఒక క్వార్టు గిన్నెలో పోసి, రెండున్నర కప్పులు నీళ్లు పోసి ..." అంటూ పావుగంట సాగదీశాడు.

గీతకి నవ్వొచ్చింది. ఇంత పెసరపప్పు ఉడకపెట్టి ఉప్పూ, జీలకర్రా చల్లితే పోయేదానికి ఆయన ఓ క్రతువులా వివరిస్తున్నాడు. అంతకంటె తమాషా టేష్ అంత ఉత్సాహంగానూ చెవులప్పగించి వినడం.

గీతకి ఎడంవేపు కూర్చున్న భాగ్యంగారు గీతని పలకరించేరు, "మీరేమి తెచ్చారు?" అంటూ.

గీత చెప్పింది. "అలానా. ఈకూర మీరు చేసినదేనా? చాలా బాగుంది. మావారికి ఈపాట్లక్కులూ అవీ పట్టవు. మనింటికి పిలిస్తే మనమే చెయ్యాలి అంటారు." అందావిడ కంచంలో అన్నం పప్పూ కెలుకుతూ.

వారిపల్లెలో వారు సామంతులు. కులపెద్దలుట! ఆవిడ మాటలోనూ తీరులోనూ ఆ రాజసం కనిపిస్తుంది. వాళ్లింట్లో భోజనాలంటే పింగ్పాంగ్ బల్ల నిండిపోతుంది ఆవిడ చేసిన వంటకాలతో. మళ్లీ ఒక్క వస్తువు కూడా ముందురోజు చెయ్యరు. స్వామివారి నైవేద్యానికి పనికిరాదని.

భోజనాలు అవుతుండగానే, టేష్ తను తెచ్చిన జురాసిక్ పార్క్ కెసెట్ పెట్టేడు విసిఆర్లో. గీతకి సైన్సు ఫిక్షను ఆసక్తి లేకపోయినా వాళ్ల ఉత్సాహం చూస్తుంటే సరదాగానే వుంది.

దాదాపు అందరూ తినడం అయిపోయింతరవాత వచ్చింది తపతి. ఆవిడని చూస్తూనే గీత మొహం గుప్పున విప్పారింది. తపతి కూడా నవ్వుమొహంతో దగ్గరికి వచ్చి, "మీరు వస్తారని రాధ చెప్పింది." అంది.

రాధ తపతిని పలకరించి, "రండి. అందరిభోజనాలూ అయిపోయేయి." అంటూ ఆప్యాయంగా బల్లదగ్గరికి తీసికెళ్లింది.

"నాకు ఆకల్లేదు. లంచి ఆలస్యంగా తిన్నాను" అంటూ తపతి పళ్లెంలో కొంచెం అన్నం, కూరా పెట్టుకుని వచ్చి గీత పక్కన కూచుంది.

"సంగీతం నేర్చుకుంటానన్నావు, పిలవలేదేం?" అంది గీతతో చనువుగా.

ఏకవచనంలో సంబోధనకి గీత రవంత అక్కజపడింది. మరోపక్క సంతృప్తిగా కూడా వుంది.

"నేను నేర్చుకుంటాననలేదు. మీరు నేర్పుతానన్నారు," అంది కవ్విస్తూ.

"నువ్వు నేర్చుకోను అనలేదు కదా" అంది తపతి.

ఇద్దరూ తేలిగ్గా నవ్వుకున్నారు. తపతి అలా నిష్కల్మషంగా మాటాడుతుంటే గీతకి విజయవాడలోనో గుంటూరులోనో వున్నంత హాయిగా వుంది.

"మీ ఫోన్నంబరు నాకు తెలీదు," అంది నెమ్మదిగా.

"హరికి తెలుసనుకున్నాను. సరేలే, చెప్తాను రాసుకో" అంది తపతి.

తొమ్మిది దాటేవేళకి హనుమయ్యగారూ, భాగ్యంగారూ లేచి శలవు పుచ్చుకున్నారు తెల్లారి పేరే పనులున్నాయి అంటూ. మరో అరగంటకి తపతి కూడా వెళ్లొస్తానంటూ లేచింది. వెళ్లేముందు గీతచెయ్యి పుచ్చుకుని ఆప్యాయంగా నొక్కి, "తప్పకుండా పిలు" అంది. గీతకి ప్రాణం లేచొచ్చింది.

గణపతీ, మాధవ్, సుమతీ, హరీ పేకాట మొదలు పెట్టేరు. రాధ గీతపక్కన కూర్చుని కబుర్లు మొదలెట్టింది.

ఆరాత్రి హరీ, గీతా ఇంటికి చేరేసరికి ఒంటిగంట దాటింది. అది మర్నాటికిందే లెఖ్క. గీతకి. తన జీవితంలో అర్ధరాత్రి దాటి మేలుకొని వుండడం ఇదే ప్రథమం.

***

హరి ఫిలడెల్ఫియా వెళ్లడానికి ఆయత్తమవుతున్నాడు పనిమీద. మర్నాడే ప్రయాణం. "నాలుగు రోజులపాటు ఒక్కదానివీ వుండగలవా? గణపతినో, టేషునో అడగనా సాయంగా వుంటారేమో?" అని పదిసార్లు అడిగేడు గీతని.

గీతకి ఏం చెప్పాలో తోచలేదు. అతనిమాట నిజమే. పుట్టి బుద్ధెరిగి తనెప్పుడూ ఎక్కడా ఒక్కర్తీ వుండలేదు. వుండవలసిన అవుసరం రాలేదు. అసలు మనదేశంలో అలా ఒక్కరూ వుండడం సాధ్యం కాదు కదా. ఇరవైనాలుగ్గంటలూ ఇంటా బయటా బిలబిల్లాడుతూ జనాలు. ఇక్కడ అలా కాదు. ఇరుగూపొరుగూ అయినా పనిగట్టుకు పిలిస్తే తప్ప పలకరు. ఎవరిగొడవ వారిదే.

హరే మళ్లీ "టేషూ, గణపతీ కూడా పగలు వాళ్లపనుల్లో వుంటారు. రాత్రి వచ్చి పడుకోమంటాను సాయంగా." అన్నాడు. గీత సరేనని తలూపింది.

హరి ఇల్లు వదలగానే గీతకి గుండెల్లో గుబులు పెల్లుబికింది. రోజు అతను ఆఫీసుకి వెళ్లడంలేదూ? ఏరోజు అతను ఈ టైములో ఇంట్లో వున్నాడు కనక! కానీ అలా సర్దుకు వూరుకోలేకపోతోంది. పగలంతా వున్న రెండుగదుల్లో కాలు కాలిన పిల్లిలా తిరిగింది. సాయంత్రం ఆరున్నరకి టేషు ఫోను చేసేడు తను వచ్చేసరికి ఎనిమిది దాటుతుందని, తనకోసం ఎదురు చూడొద్దనీ, భోజనం చేసేయమనీ,

హరి ఫిలడెల్ఫియాలో దిగగానే ఫోను చేశాడు. మళ్లీ మీటింగవగానే ఫోను చేసేడు. రాత్రి పడుకోబోయేముందు మళ్లీ చేస్తానని చెప్పేడు. అన్నిటికీ సరే సరేనంటూ ఊఁ కొట్టింది.

టేషు వచ్చేసరికి పదయింది. అతను ఆలస్యం అయినందుకు చాలా నొచ్చుకున్నాడు. గీత 'ఫరవాలేదండీ' అంటూ రెండు కంచాలు పెట్టింది.

"అయ్యో అదేమిటండీ. నేను చెప్పేను కదా మిమ్మల్ని తినేయమని" అన్నాడు మళ్లీ బాధ పడుతూ.

గీత కూడా అంతగానూ నొక్కి చెప్పాల్సొచ్చింది ఫరవాలేదంటూ.

తెల్లారుతూనే, టేషు గబగబా కాఫీ తాగేసి వెళ్లిపోయాడు, గీత breakfast అంటే టైము లేదన్నాడు.

గీతకి అతను ఇంట్లో వున్నట్టే లేదు. రోజు గడవడం మహా కష్టంగా వుంది. లంచి చేసుకోవాలని కూడా అనిపించలేదు. హరి ఫోను చేసి అడిగితే "తిన్నాను" అంది. బావురుమని ఏడవాలని వుందని చెప్పాలనిపించింది కానీ చెప్పలేదు.

తపతి గుర్తొచ్చింది. పిలిచి చూద్దాం అని ఫోను చేసింది.

తపతి ఇంట్లోనే వుంది, "హలో"

"నేను గీతని"

"ఓ. నేనే అనుకుంటున్నాను పిలుద్దాం అని. ఏం చేస్తున్నావు?"

"ఏం లేదు."

"రోజు ఏంచేస్తావు ఈవేళప్పుడు?"

"ఏం చేస్తానో నాకే తెలీదు. పనీ లేదు తీరుబడీ లేదు. ఏం చేస్తున్నానో తెలీకుండానే రోజు గడిచిపోతుంది." అంది గీత పేలవంగా నవ్వి.

"నేనింకా లంచి చెయ్యలేదు. రా. ఇద్దరం కబుర్లు చెప్పుకుంటూ తిందాం,"

ఆ పిలుపుకోసమే ఎదురు చూస్తున్నట్టు, "వచ్చేస్తున్నా" అని చెప్పి ఫోను పెట్టేసి, బయల్దేరింది గీత.

***

తపతి ఇల్లు ఊరిపొలిమేరల్లో వుంది. ఇంచుమించు పొరుగూరికిందే లెక్క. చిన్న ఇల్లే కానీ ఇంటి చుట్టూ పూలమొక్కలూ, కూరగాయలతోటతో ఆహ్లాదకరంగా వుంది.

తపతి గుమ్మందగ్గర నిలబడి గీతకోసం ఎదురుచూస్తోంది. తనని సాదరంగా ఆహ్వానించింది. చాలాకాలం తరవాత చిన్ననాటి మిత్రురాలిని కలుసుకున్నట్టుగా వుందే కానీ నిన్నో మొన్నో పరిచయమయిన కొత్తమొహంలా అనిపించలేదు ఇద్దరికీ.

ఆకబురూ, ఈకబురూ చెప్పుకుంటుంటే, గీత అడిగింది, "ఇంత కలుపుగోల్తనం ఒలకబోస్తున్నావు నాదగ్గర. ఊళ్లో మరి నీకీ అప్రతిష్ఠ ఏమిటి? అక్కుపక్షిలా ఒక్కత్తివీ ఈమూల కూచుంటావుట," అంది.

తపతి నవ్వింది, "బాగుంది నీ ఆక్షేపన. పదసౌలభ్యం నీదేనా? ఎవరిమాటో వల్లె వేస్తున్నావా?"

"భాష సొంతం. భావాలు దోచుకున్నాను. బాగుంటే చెప్పు. కాపీరైటు చేసేసుకుంటాను."

"ముందు లంచిమాట చెప్పు. ఏం చేసుకుందాం? ఉప్మావా రవదోశా?"

"జీడిపప్పేసి రవదోశ చేస్తానంటే నేనెప్పుడూ ఒద్దనను."

"ఉప్మాలో వేసుకుంటాం కానీ జీడిపప్పు రవదోశలో ఏమిటి. సరే వేస్తాను, బాగులేకపోతే ఆపాపం నీదే." అంది తపతి వంటింట్లోకి నడుస్తూ.

రవదోశలూ, మిరప్పళ్ల పచ్చడీ గిన్నెల్లో సర్ది, రెండు కంచాలూ, మంచినీళ్లూ గీతకి అందించి, "పద" అంది.

గీత అయోమయంగా చూసింది, "ఎక్కడికి?"

"మా బృందావనంలో వనభోజనాలు" అంది పెరట్లోకి దారి తీస్తూ. భుజాన వేసుకొచ్చిన దుప్పటీ ఓచెట్టుకింద పరిచింది. తపతి పళ్లేలూ, పాత్రలూ అమరుస్తుంటే, గీతకి తనూ సత్యం కాలేజీ ఆవరణలో చెట్టుకింద కూర్చుని మధ్యాన్నాలు టిఫిను తినడం గుర్తుకొచ్చింది. కళ్లు చెమ్మగిల్లేయి.

"అచ్చు మనవూళ్లో వున్నట్టే వుంది," అంది గీత వివరాలజోలికి పోకుండా.

"అవును, నాకూ అంతే. ముఖ్యంగా ఈ రెండు నెలలూ - ఆగస్ట్, సెప్టెంబరు - నులివెచ్చగా ఎండపొడ నోకి జోకొడుతుంటే నిద్దరతూకం - అలాటప్పుడు అసలు మనం ఏదేశంలో వున్నాం అన్న స్పృహ వుండదు" అని, "ఇంతకీ నువ్వు ఇక్కడ ఎలా తేలేవో చెప్పనేలేదు. మేనరికమా?" అనడిగింది తపతి.

"లేదు, ప్లేనురికమే. చూస్తుంటే ఇక్కడికొచ్చిన అమ్మాయిల్లో సగంమంది నాలా వచ్చినవాళ్లేలా వుంది," అంది గీత.

"అంటే?"

"వయసులో వున్న అబ్బాయిలు 'మేం ఇప్పుడే పెళ్లి చేసుకోం' అంటూ అమెరికా వచ్చేస్తారు. ఇక్కడ వంటపనులూ, ఇంటిపనులూ చేసుకోలేక 'పెళ్లి చేసుకుంటాం' అంటూ ఏడాదిలోపునే తిరిగి ఇండియా వచ్చేసి, పెళ్లి చేసుకు వచ్చేస్తారు అంది మాసత్యం. ఆమాటల్లో సత్యం నాకిప్పుడే అర్థమవుతోంది." అంటూ తనపెళ్లి విశేషాలు చెప్పింది గీత.

"తమాషా ఏమిటంటే ఇలా జరిగే పెళ్లిళ్లకి ఏ మూఢమాసాలూ, శూన్యమాసాలూ ఆటంకం అవవు. ఏవేళప్పుడయినా ఓ దివ్యముహూర్తం చూడగల శాస్త్రులుగారు ఎక్కడో అక్కడ దొరుకుతాడు" అంది మళ్లీ హేళనగా నవ్వుతూ.

తపతి గీత మొహంలోకి పరీక్షగా చూస్తూ, "ఏం నీకు ఇష్టంలేదా?" అంది.

"అదేం లేదు. నిజానికి మాఅమ్మ అంది కూడాను. ఇంత హడావుడిగా ఒప్పేసుకోడం ఎందుకు? ఆలోచించుకో," అని.

తపతి మరి ఏప్రశ్నలు వెయ్యలేదు. ఇలాటి నిర్ణయాలకి అనేక కారణాలు.

కొంచెంసేపు అయింతరవాత తపతి నెమ్మదిగా అంది, “ఇందాకా అడిగేవు నేనెందుకు అందరితోనూ కలవనని. వచ్చినకొత్తలో నేనూ ‘అందరిలాగే మనం, మనవాళ్లూ’ అంటూ తపించిపోయేను. నిజానికి ఇప్పుడు తలుచుకుంటే నవ్వొస్తుంది కూడాను. ఇమాన్యూల్ ‘నాతో అమెరికాకి వచ్చేయి’ అని నన్ను పిలిచినప్పుడు, అతను ఏంచెప్పేడో తెలుసా? ‘ఇండియాలోలాగ అమెరికాలో జనులు కాకుల్లా పొడుచుకుతినరని, ప్రతివారూ ఎదటివారి ప్రైవేసీ గౌరవిస్తారనీ.”

“ఇమాన్యూల్ ఎవరు?” గీత అడిగింది.

“నీకు చెప్పలేదు కదూ. మన నోటిదురుసు జనాలనుండి నను బ్రోచి ఎత్తుకొచ్చేసిన దక్షిణనాయకుడు”.

తపతిముఖం, ఆ ముఖంలో వ్యథా గమనించి. గీత మౌనం వహించింది. మనసు మనసుతో స్పందించడానికి మాటలు అక్కరలేదు. ఆ అమ్మాయిమనసు మూలిగింది బాధగా.

తపతే అంది మళ్లీ. “అదంతా మరో పెద్ద కథ. నిజానికి రెండు కథలు. నేను ఇక్కడికి ఎలా వచ్చేనన్నది ఒక ఎత్తూ, ఇక్కడివారిలో ఎందుకు ఇమడలేకపోయాను అన్నది మరొక ఎత్తూ.”

***

తపతి అన్నవరంలో పుట్టింది. తాతలనాటి పాత పెంకుటిల్లూ, ఊరి శివార్ల పుట్టెడు వడ్లు పండే మడిచెక్కాతో బతుకు గడుపుకుంటున్న సంసారం. తపతికి పదిహేనేళ్లు రాగానే తల్లిదండ్రులు పూనుకుని చిన్నమేనమామ చెంగల్రాయుడికిచ్చి పెళ్లి చేశారు. 18 ఏళ్లకి ఇద్దరు పిల్లలతల్లి. చెంగల్రాయుడికి పెళ్లాంసరదాయే కానీ పెళ్లిబాధ్యతలు ఒంటపట్టలేదు. పధ్నాలుగేళ్ల మరదలిమీద మనసు పడి, ఓ రాత్రికి రాత్రి ఆపిల్లని తీసుకుని మద్రాసు పారిపోయేడు. తపతి తల్లి నెత్తీ నోరూ మొత్తుకుంది. ఓపక్కన తోడబుట్టిన తమ్ముడూ మరోపక్కన కన్నకూతుళ్లు ఇద్దరూను. ఆ ప్రబుద్ధుడు నెలరోజులయేక, కోపాలు చల్లారేయని నమ్మకం కుదిరేక అక్కగారికి కబురు చేసాడు తపతిని కూడా పంపిస్తే, అక్కచెల్లెళ్లు ఇద్దరూ ఎంచక్కా ఒక్క పంచన పడివుంటారని. పైగా ఎంతోమంది కవి, గాయక, పండితవరులు ఆవిధంగా ఎంతో సామరస్యంతో సంసారాలు చేసుకుంటున్నారని కూడా చెప్పేడు ఉదాహరణలతో సహా.

“నేను రాను. నన్నూ, నాపిల్లల్నీ నేనే పోషించుకుంటాను” అని తపతి వెళ్లడానికి ఒప్పుకోలేదు.

తపతి పెద్దమామయ్య విశాఖపట్నంలో వున్నాడు. తమ్ముడు చేసినపనికి ఆయన బాధ పడి, తపతినీ పిల్లల్నీ తనదగ్గర పెట్టుకుని సాయం చేస్తానని చెల్లెలికీ, బావగారికీ మాట ఇచ్చేడు. తపతికి తనే పాఠాలు చెప్పి మెట్రిక్ పరీక్షకి కట్టించేడు. పిల్లలిద్దర్నీ స్కూల్లో పెట్టేడు. తపతి నెమ్మదిగా ట్రైనింగు కూడా పూర్తిచేసి విశాఖపట్నంలో ఓ ఎలిమెంటరీ స్కూల్లో టీచరుగా చేరింది. అమ్మదగ్గర నేర్చుకున్న లాలిపాటలూ, మంగళహారతిపాటలూ పాడుకుంటుంటే విని, పెద్దత్తయ్య సంగీతం నేర్చుకోమని ప్రోత్సహించింది. నాలుగేళ్లు తిరిగేసరికి, స్కూల్లో టీచరుగానూ, సాయంత్రం సంగీతం పాఠాలు చెప్పుకుంటూనూ, తనకాళ్లమీద తాను

నిలబడగలశక్తి సంపాదించుకుంది. స్కూలికి దగ్గరగా, ఓ వాటా అద్దెకి తీసుకుని పిల్లల్తో ఆయింట్లోకి మారిపోయింది. పెద్దమామయ్య, అత్తయ్యల ఆశిస్సులతో.

విశాఖపట్నం ఎంత పట్నం అయినా, పాతరాతియుగం తత్త్వాలకి తక్కువ లేదు. ఏ పేరంటానికో, గుడికో వెళ్లినప్పుడు వాళ్లూ వీళ్లూ అడిగే ప్రశ్నలు "అయితే మీఆయన ఎక్కడున్నాడిప్పుడూ?", "మీచెల్లెల్నయినా ఏలుకుంటున్నాడా?" అనో, "మీఆయన్ని ఇక్కడ చూశాం," "అక్కడ చూశాం," "ముగ్గురు పిల్లలుట" ... అంటూ ఏదో వంక కెలుకుతూనే వుంటారు. వాళ్లబాధ పడలేక తపతి చాలావరకు తనపనే తనలోకంగా గడుపుకొస్తోంది.

***

తపతి వుంటున్న ఇంటియజమాని గురునాథంగారు వ్యాపారి. ఆయనకి నానారకాల జాతీయ, అంతర్జాతీయ వ్యాపారాలు వున్నాయి. ఆ సందర్భంగా వారింటికి విదేశీయులు వస్తూంటారు. అలాటివారిలో ఇమాన్యూల్ ఒకడు. అతను మూడువారాలకి అని వచ్చినా, మద్రాసూ, బొంబాయి, కలకత్తా తిరుగుతూ గురునాథంగారింట పట్టుమని వారం రోజులు కూడా వుండలేదు. అయినా అతనికి ఎందుకోగానీ తపతిని చూడగానే సదభిప్రాయం ఏర్పడింది. గురునాథంగారు కూడా తపతి ధీమంతురాలని చెప్పేరు. ఆవారంరోజులూ సరిపోయేయి అతనికి తపతిమీద అభిమానం పెంచుకోడానికి. అవిడ సాయంత్రాలు పిల్లలకి సంగీతం పాఠాలు చెబుతున్నప్పుడు వచ్చి కూర్చున్నాడు నాలుగు రోజులపాటు అదే పనిగా. ఓరోజు మంచి పాట పాడమని అడిగి పాడించుకున్నాడు.

"మీకంఠం ఎంతో మధురంగా వుంది. కచేరీలు చేస్తారా?" అని అడిగేడు.

"కచేరీలు చేసే స్థాయి లేదు" అని చెప్పింది. అంతే వారి పరిచయం.

ఒకరోజు తపతి పంచలో కూర్చుని కొడుకు వాసుకి లెక్కలు చెప్తోంది. ఇమాన్యూల్ వచ్చి కొంచెం ఎడంగా, కూర్చున్నాడు. తపతి చిన్నగా నవ్వి, పాఠం పూర్తి చేసి, "బావున్నారా?" అంది మర్యాదకి. గత రెండురోజుల్లోనూ ఇది నాలుగోసారి అతను ఇలా వచ్చి కూర్చోడం. తపతికి కాస్త ఎబ్బెట్టుగా అనిపించింది కూడాను.

కానీ అతనినడవడిలో తప్పు పట్టవలసిందేమీ లేదు. వెకిలివేషాలు లేవు. అంచేత పొమ్మనలేకపోతోంది.

"బావున్నాను" అన్నాడతను తూచి మాటాడుతున్నట్టు.

తపతికి ఏం మాటాడాలో తోచలేదు. "మద్రాసులో మీపని అయిందా?" అంది ఏదో ఒకటి మాటాడాలన్నట్టు.

"అయింది." అని ఇమాన్యూల్ ఒక నిముషం ఆగి, నిదానంగా, "ఆదివారం వెళ్లిపోతాను" అన్నాడు.

"అమెరికాకేనా?"

అవునన్నట్టు తలూపేడు. మళ్లీ రెండునిముషాలు నిశ్శబ్దం. వాసు లెక్కలు చెయ్యడం పూర్తయింది. పుస్తకాలు తీసుకుని, ఆడుకోడానికి వెళ్తున్నానని తల్లికి చెప్పి వెళ్లిపోయాడు.

"మీతో ఒక విషయం మాట్లాడాలని వచ్చేను" అన్నాడు ఇమాన్యూల్.

"చెప్పండి" అంది తపతి చిన్నగా నవ్వి. తనకిది అలవాటే. తన ముఖవిశేషమేమో చాలామందే వస్తుంటారు తనదగ్గరికి, 'మీతో మాటాడాలి' అంటూ. తను నిశ్శబ్దంగా వింటూనో, వింటున్నట్టు మొహం పెట్టుకునో కూర్చుంటుంది. చాలామందికి తాము మాటాడడమే ముఖ్యం. ఎదుటివారు వింటున్నారా లేదా అన్న ధ్యాస వుండదు. ఆవిషయం తపతికి అనతికాలంలోనే తెలిసిపోయింది.

"నేను నాసంగతి మాటాడ్డానికి రాలేదు," అన్నాడు తపతి మనసులో మాట గ్రహించినట్టు.

తపతి తలూపింది సరేనన్నట్టు.

ఇమాన్యూల్ చెప్పదలుచుకున్న విషయానికి నాందిగా, "గురునాథంగారు మీసంగతి చెప్పేరు," అన్నాడు.

తపతి "ఏమని" అని అడగలేదు. సుమారుగా ఆయన ఏం చెప్పివుంటారో తనకి అవగతమే.

ఇమాన్యూల్ కి కొంత సమయం పట్టింది ఎలా సంభాషణ పొడిగించాలో తెలీక. తపతి మౌనం అతనికి ఇబ్బందిగా వుంది. ఆమెమొహంలోకి పరీక్షగా చూస్తూ, "నాతో అమెరికా వచ్చేయండి," అన్నాడు.

తపతి తృళ్లిపడి అతనివేపు చూసింది వేళాకోళానికి అంటున్నాడేమోనని.

లేదు. అతను చాలా సీరియస్గా అన్నాడని అతనిమొహమే చెబుతోంది. మాటాడకుండా వూరుకుంది.

ఇమాన్యూలే మళ్లీ అన్నాడు, "మీకు ఇక్కడి పరిస్థితులు కంటకప్రాయంగా వున్నాయని గురునాథంగారు చెప్పేరు. మీబతుకేదో మీరు బతుకుతున్నా చుట్టుపక్కలవాళ్లు వూరుకోరు. మిమ్మల్ని చేసుకున్న మామా, ఆయన తీసుకుపోయిన మీచెల్లెలిమాటా పదే పదే తెచ్చి మిమ్మల్ని బాధిస్తున్నారు అని చెప్పేరు. ఆయనకి మీరంటే చాలా అభిమానం. మీరు సుఖపడాలని ఆయన కోరుకుంటున్నారు. ఎందుకో చెప్పలేను కానీ నాక్కూడా మీరు ఇలా చిత్రవథకి గురి కావడం బాధగా వుంది. పైగా పిల్లలు ఎదిగి వస్తున్నారు. వాళ్లని కూడా స్కూల్లోనూ వీధిలోనూ ఎవరో ఒకరు ఏదో ఒక మాట అంటారు. దాంతో వాళ్లకీ బాధే. అంచేత చెబుతున్నాను. మీరు ఈరొంపిలోంచి బయట పడండి, నేను సాయం చేస్తాను."

తపతి పెద్ద షాకు తిని, తేరుకుని అతని మాటలు వినసాగింది. పిల్లలవిషయంలో అతనన్నమాట నిజమే. వాసు ఎదిగివస్తున్నాడు. ఆమధ్య ఒకసారి స్కూలికి వెళ్లనని మొరాయించేడు. వాడికి నచ్చచెప్పి పంపేసరికి తాతలు దిగొచ్చేరు.

కూతురు ఇంకా చిన్నదే కానీ మరో రెండేళ్లు పోయేసరికి ఆపిల్ల ఎన్నిదెబ్బలు తట్టుకోవలసివస్తుందో చెప్పడం కష్టం. అవి ఇంకా పైస్థాయిలో వుంటాయి, సందేహంలేదు.

"మీకు ఇష్టమయితే మీరు అమెరికా వచ్చే ఏర్పాట్లు నేను చేస్తాను. మరొకమాట. నేనేమీ మీనుండి కోరడంలేదు. మీరు అక్కడికొచ్చి నిలదొక్కుకునేవరకే నాపూచీ. తరవాత మీ దారి మీదీ నాదారి నాదీ. అలా రాసిచ్చేస్తాను కూడా కావాలంటే."

తపతి స్థాణుపై కూర్చుండిపోయింది. తన హోల్ మొత్తం జీవితాన్ని ఒక్కసారిగా తల్లక్రిందులుగా మార్చేసేసలహా ఏదో పోరుగూరు పెళ్లాం రమ్మన్నంత తేలిగ్గా చెప్తున్నాడు అతను!

"ఆలోచించుకుని చెప్పండి. మీరు ఒప్పుకుంటే రేపే పెళ్లి."

"పెళ్లా?" అంది తపతి కెవ్వుమని కేకేయడం తరువాయిగా.

"అపార్థం చేసుకోకండి. వీసాకోసం మాత్రమే అది. నేను మిమ్మల్ని ఏవిధంగానూ ఇబ్బంది పెట్టను. గురునాథంగారితో కూడా మాట్లాడేను," అతను కూడా ఎవరో తరుముకొస్తున్నట్టు, గుక్క తిప్పుకోకుండా చెప్పేడు,

తపతి అతను చెప్తున్న ప్రతి వాక్యానికి అదిరిపడుతోంది. "గురునాథంగారికి తెలుసా?"

"మరి పెళ్లికి పెద్దలు ఎవరో ఒకరు వుండాలి కదా."

అప్పటికి తపతికి కొంచెం తెలివొచ్చింది. "మా పెద్దమామయ్యతో మాటాడాలి," అంది.

"అవును. గురునాథంగారు ఆమాట కూడా చెప్పేరు. మీరు మీ పెద్దమామయ్యగారితో కూడా మాటాడే చెప్పండి. నేను ఎల్లుండి వెళ్లిపోవాలి. అంచేత పెళ్లి జరిగితే రేపే జరగాలి," అనేసి వెళ్లిపోయాడు ఇమాన్యూల్.

తపతి అక్కడే కూర్చుంది ఆలోచిస్తూ. ఎవరితోనైనా మాటాడాలి అనిపిస్తోంది. ఎవరితో మాట్లాడడం? ఎవరైనా ఏం చెప్తారు? అయితే "బాగుంది వెళ్లిపో," అంటారు. లేకపోతే, "బుద్ధి గడ్డి తిందేమిటి? అతను రారమ్మనడమూ, నువ్వు జంయ్యిమని లేచిపోవడమూనా? దేశం కాని దేశం. తీరా అక్కడికెళ్లింతరవాత అతను నిన్ను నట్టేట్లో ముంచేస్తే ఏం చేస్తావు?" అంటూ చీవాట్లేస్తారు మొహం వాచేలా. అవన్నీ విన్న తరవాతయినా అటో ఇటో తేల్చుకోవలసింది తనే!

తపతికి చిన్ననవ్వు కూడా వచ్చింది. అమెరికా వెళ్లాలని తపించిపోతున్నవారు బోలెడుమంది వున్నారు. తన స్నేహితులలోనే నలుగురున్నారు. వాళ్లకి ఈమాట చెప్తే "నువ్వు వెళ్లకపోతే చెప్పు, నేను వెళ్తాను" అని ఎగిరి గెంతేస్తారు. తనేమో కలలో కూడా అనుకోలేదు. కానీ ఆ అవకాశం తనని వెతుక్కుంటూ వచ్చింది. ఇది తనకి అవకాశమా కాదా అన్న మాట అటుంచి. ప్రాణం తెరిపిన పడుతుందన్న ఇమాన్యూల్ మాటలో చాలా నిజం వుంది. అంతకంటె ముఖ్యం ఇది పిల్లలకి మంచి అవకాశమే. మరి అమ్మా, నాన్నా ఒప్పుకుంటారా? అసలు నిజంగా అతన్ని నమ్మవచ్చునా? గురునాథంగారినే అడిగితే మంచిది అనుకుని లేచింది తపతి. నీట మునిగిపోతున్నవాడు గరికపోచని అంది పుచ్చుకున్నట్టు. రెండడుగులు వేసిందో లేదో ఇమాన్యూల్ ఎదురయేడు.

"ఏమంటారు?"

తపతికి క్షణకాలం ప్రపంచం గిర్రున తిరిగింది కళ్లముందు. గురునాథంగారు కానీ పెద్దమామయ్య కానీ ఏం అంటారు అనిపించింది. పెద్దలంతా పంచాంగాలు చూసీ, పురోహితులని సంప్రదించీ పెట్టిన సుముహూర్తం, చిన్నమామయ్య పెళ్లిపీటలమీద చేసిన ప్రమాణాలూ ఏమయేయి? హఠాత్తుగా ఎక్కళ్లేని మొండిధైర్యం ఉప్పెనగా ముంచుకొచ్చి మనసునిండా ముసురుకుంది. "సరే" అంది తపతి.

"మంచిది. నేను ఇప్పుడే వెళ్లి గురునాథంగారితో చెప్తాను పెళ్లి ఏర్పాట్లు చెయ్యమని. మీరు వెళ్లి మీ మామయ్యగారికి చెప్పండి. మీరు అనుమానం ఏమీ పెట్టుకోవద్దు. నేను మిమ్మల్ని ఏవిధంగానూ ఇబ్బందిపెట్టను. మీనుంచి నేను ఆశించేదేమీ లేదు," అన్నాడు మరొకసారి ప్రమాణం చేస్తున్నట్టు.

అతని ఆతురత చూస్తే తను ఎక్కడ మనసు మార్చుకుంటుందో అని భయపడుతున్నట్టుంది. తపతి మళ్లీ నవ్వుకుంది. నిజానికి భయపడవలసింది తను!

ఏమాటకామాటే చెప్పుకోవాలి. ఇమాన్యూల్ గురునాథంగారితో మాటాడడం చాలా తృప్తినిచ్చింది. ఆయన మంచీ చెడ్డా తెలిసినవారు.

అనుకున్నట్టుగానే సింహాద్రి అప్పన్న సమక్షంలో, గురునాథంగారి ఆధ్వర్యంలో, మామయ్య, అత్తయ్య చేతులమీదుగా తపతిపెళ్లి ఇమాన్యూల్తో అయిపోయింది మర్నాడు.

తపతితండ్రీ, బామ్మా ఆడదానికి రెండోపెళ్లి ఏమిటని రాద్ధాంతం చేసి పెళ్లికి రాలేదు. మామయ్యనీ, గురునాథంగారినీ తిట్టిపోశారు తనకూతురి జీవితం నాశనం చేసేరనీ, తనని తలెత్తుకు తిరగనియ్యకుండా చేశారనీ. "నీ అన్నదమ్ములిద్దరూ నాకూతురిబతుకు మంటగలిపేరని" తల్లిని తిట్టినతిట్టు తిట్టకుండా తిట్టేరు.

తల్లి మాత్రం "నువ్వూ, నీపిల్లలూ ఎక్కడో అక్కడ చల్లగా వుంటే చాలమ్మా" అంటూ వచ్చి దీవించింది మనసారా.

పెళ్లయినతరవాత, ఇమాన్యూల్ వీసాకి కావలసిన సమాచారం అంతా తీసుకుని, అమెరికా వెళ్లగానే స్పాన్సార్ కాయితాలు పంపిస్తానని చెప్పి వెళ్లిపోయాడు. ఆతరవాత రెండువారాలూ తపతి జరిగింది "కలయో, వైష్ణవమాయయో, నే తపతిని గానో" అనుకుంటూ గడిపింది.

ఇమాన్యూల్ ఇచ్చిన మాటప్రకారం అమెరికాలో దిగగానే ఏర్పాట్లు మొదలుపెట్టి కావలసిన కాయితాలు పంపించేడు. ఆకాయితాలు చూసాక, తపతికి ఇది కల కాదని నమ్మకం కుదిరింది. రెండునెలల రెండురోజులకి తపతి అమెరికావాసిని అయిపోయింది ఇద్దరు పిల్లలతో.

ఆలస్యం చెయ్యకుండా, ఆమెని టెక్నికల్ కాలేజీలో కంప్యూటర్ బేసిక్స్ కోర్సులో చేర్పించేడు. రెండేళ్లపాటు ఆర్థికసహాయం చేస్తాననీ, ఆతరవాత తనదారి తనదేనని చెప్పేడు. అన్నమాట నిలబెట్టుకున్నాడు. పిల్లల్ని కూడా స్కూల్లో చేర్పించేడు. తపతి కంప్యూటర్ బేసిక్స్ పూర్తి చేసి ఓ బాంకులో డేటా ఎంట్రీ ఆపరేటర్గా చేరింది.

ఇమాన్యూల్ తనవ్యాపారం చూసుకుంటూ, దేశాలంట తిరుగుతున్నాడు. మధ్య మధ్యలో వచ్చి తపతి యోగక్షేమాలు కనుక్కుంటున్నాడు.

ఓరోజు తపతిని కూర్చోబెట్టి, "నేను నీకు ఇచ్చిన మాటప్రకారం చేశాను. నీకు ఒక మార్గం ఏర్పడింది. నాపని అయిపోయింది. నేను కూడా తిరగడం మానేసి ఒకచోట స్థిరపడదాం అనుకుంటున్నాను," అన్నాడు.

తపతి మాటాడకుండా వింటూ కూర్చుంది.

"నాకు జర్మనీలో మంచి అవకాశం వచ్చింది. నేను అక్కడే వుండిపోదాం అనుకుంటున్నాను. మీరూ, పిల్లలూ ఈ ఇంట్లోనే వుండొచ్చు మీకు ఇష్టమయినన్నాళ్లు. ఇల్లు చూసుకోండి. రిపేర్లూ, టాక్సులూ, అవీ మీదే బాధ్యత. అదే అద్దెకింద జమ కట్టుకుంటాను." అన్నాడు.

అకస్మాత్తుగా తన మొత్తం జీవితానికి ఆధారమయిన పట్టుకొమ్మ టుప్పున విరిగిపోయినట్టు అనిపించింది. మరోపక్క ఆశ్చర్యంకూడా. మళ్లీ మరొకసారి కలయో వైష్ణవమాయయో అనుకోవాల్సొచ్చింది. ప్రతిఫలం అడక్కుండా ఓ రైడివ్వొచ్చు. ఓపూట భోజనం పెట్టొచ్చు. ఇంత ఇల్లు వదిలేస్తారా ఎవరైనా?!

ఇమాన్యూల్ వదిలేశాడు. అతను వెళ్లిపోయేక, తపతే ఇంటిపన్ను కట్టడం, రిపేర్లు చేయించడం చూసుకుంటోంది. మరేవిధమయిన లెక్కలూ, పత్రాలూ లేవు. పిల్లలు వాళ్ల బతుకులు వాళ్లు బతుకుతున్నారు. కొడుకు ఆర్.ఓ.టీ.సీలో చేరి, మెకానికల్ ఇంజినీరు అయి, మినియాపొలిస్ లో స్థిరపడ్డాడు. కోడలు కూడా ఇంజినీరే. కూతురు సుధ బి.కాం. చేసింది. అల్లుడు బాంక్ మేనేజరు. వాళ్లిద్దరూ హూస్టనులో వుంటున్నారు.

***

గీత అవాక్కయి వింటూ కూర్చుంది. చెక్కు చెదరని ప్రసన్నవదనంతో సదా కనిపించే ఈ తపతి ఇంతటి విషాదాన్ని కడుపులో దాచుకుందంటే నమ్మ శక్యం కావడంలేదు. గీతకి తపతిమీద గౌరవం మరింత పెరిగింది ఈకథ విన్నతరవాత.

తపతి అదేమీ గమనించనట్టు అంది, "చెప్పేను కదా ఇమాన్యూల్ నన్ను ఇక్కడికి రమ్మన్నప్పుడు చెప్పిన మాట 'ఇక్కడ ఎవరిబతుకులు వారివే. ఇండియాలోలాగ వేరేవాళ్లు నీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోర'ని. అతను ఏ సామాజిక సమస్యలు వుండవని చెప్పేడో అవి లేని ప్రదేశమే లేదు నిజానికి. నాకు ఇక్కడికి వచ్చేకే తెలిసిందది. అతనికి తెలీని మరో లోకం ఇక్కడ వుందని అతనికి తెలీలేదు."

"తెలుగువాళ్లు తెలుగువాళ్లే అంటావు దిగంతాలకేగినా," అంది గీత నోరు పెగుల్చుకుని.

"తెలుగువాళ్లు అందరూ అనడంలేదు. అలాగే తెలుగువాళ్లే కాదు అమెరికనులలోనూ వున్నారు అలా పొడిచి పొడిచి అడిగేవాళ్లు. స్మాల్ టాక్ అంటారు. పరిచయాలు పెంచుకోడానికి మార్గం అంటారు. 'ఎందుకొచ్చేవు, ఎలా వచ్చేవూ, అరేంజిడు మారేజేనా' అంటూ నసపెట్టి చంపుకుతినేవాళ్లు చాలామందే తటస్థపడ్డారు నాకు. మానవనైజం అనుకుని వూరుకోవాలి."

గీత ఆలోచిస్తోంది. నాలుగో పదో ప్రశ్నలు వేసి ఒకమనిషి తత్త్వం అర్థం చేసుకోడం సాధ్యమా?

"కానీ అమెరికన్లు అడిగినప్పుడు వాళ్లు పైవాళ్లు, వాళ్లకి అర్థం కాదు, పొమ్మని వూరుకోగలను. కానీ మనవాళ్లలో ఈ తత్త్వం తట్టుకోడం కష్టం. ఇక్కడికొచ్చేక మనవాళ్లకి ఒ చిత్రమయిన మనస్తత్త్వం ఏర్పడుతుంది. అది అర్థం చేసుకోడానికి టైమొక్కటే చాలదు. కొన్నిరకాల అనుభవాలు కూడా కావాలి."

"నాకూ అవుతూనే వున్నాయి అనుభవాలు" అంది గీత.

"లేదులే. వేరే రకం అనుభవాలు కావాలి. అలాటి అనుభవాలు కలక్కుండా చూసుకోడమే గొప్ప తెలివి. వచ్చినకొత్తలో నేను కూడా అందరిలాగే ప్రతివారితోనూ ఎంతో స్నేహంగా వుంటూ ఎవరికేం కావలసినా, కనీసం నాకు చేతనయిన సాయం చేస్తూ వుండేదాన్ని. కారణం కొంతవరకూ ఇమాన్యూల్ నాకు చేసినసాయం కావచ్చు. అవసరంలో వున్నవారిని ఆదుకుని ఆయన ఋణం తీర్చుకుంటున్నానన్న సంతృప్తి అనుకంటాను. క్రమేణా అర్థమయింది ఇక్కడా వున్నాయి తరతమ తేడాలు. మనవూళ్లలోలాగ కొట్టొచ్చినట్టు కనిపించవు. ఇక్కడ అతినాజూగ్గా, కనీ కనిపించకుండా వుంటాయి. మనమంతా తెలుగులం, మన జాతినీ, సంస్కృతినీ పోషించవలసినవారం అంటూ ఊకదంపులు ఎదుట వున్నంతసేపే. తీరా అవసరం వచ్చినప్పుడు చూస్తే తెలుస్తాయి అసలు రంగులు. ఇక్కడా వున్నాయి గణాలు - ఊరునిబట్టీ, ఉద్యోగాల్నిబట్టీ, తాహతులనిబట్టీ, పలుకుబడిని బట్టీ. అందులో ఇమిడిపోవడం, నిలదొక్కుకు నిలబడగలగడం ఒక కళనుకో," అంది తపతి.

గీత నిట్టూర్చి, "పొద్దు పోతోంది. వెళ్తాను. హరిగారు పిలుస్తారేమో. నేను ఫోను తియ్యకపోతే గాబరా పడిపోతారు" అంది.

తపతి కూడా "సరే, పద", అంటూ లేచింది.

***

ఇమాన్యూల్ ఇల్లు తనకి వదిలేసి వెళ్లిపోయింతరవాత తపతి ఉద్యోగం చేసుకుంటూ, చిత్రకళ నేర్చుకోడం మొదలు పెట్టింది. వాళ్ల ఆఫీసులోనే మరో సెక్షనులో పని చేస్తున్న జేమ్స్ పార్ట్ టైం ఆర్టు టీచరు. అతను నేర్పుతానన్నాడు.

తపతి పార్టీలు అట్టే ఇవ్వదు కానీ ఏడాదికోసారి బాగా తెలిసినవాళ్లనీ, తననీ తన బతుకునీ ఆక్షేపించనివారినీ పిలుస్తూంటూంది కాఫీకో భోజనానికో. ఓసారి భాగ్యంగారి ఇంట్లో గాయత్రిగారిని కలిసింది. ఆవిడ కూడా పార్టీలంటే అట్టే వుత్సాహం చూపరని తెలిసింతరవాత మరి కొన్ని సంగతులు తెలిశాయి.

గాయత్రీ, సోమలింగం దంపతులకి ఇద్దరు మగపిల్లలూ, ఒక ఆడపిల్లా. ఆయన పదేళ్లక్రితం అమెరికా వచ్చేడు కెమిస్ట్రీలో పి.హెచ్.డీ చెయ్యడానికి, అతనికీ గైడుకీ పడక రిసెర్చి సాగలేదు. మరో రెండేళ్లపాటు ఇక్కడా అక్కడా రిసెర్చిస్కాలరుగా గడిపేడు. రాను రాను ఫండ్సు తగ్గిపోయి అతనికి జరగడం కష్టం అయిపోయింది. దాంతో టాక్సీ నడపడం మొదలుపెట్టేడు. గాయత్రిగారు ఓ బాంకులో టెల్లరుగా చేరి, నాలుగురాళ్లు తెస్తోంది. గుట్టుగా సంసారం సాగించుకుంటున్నారు.

మగపిల్లలు బాగానే చదువుకుంటున్నారు కానీ అమ్మాయి చిత్ర పరిస్థితి వేరు. స్థానికభాషలో రిటార్డెడ్ చైల్డ్. గాయత్రికి మొదట తెలీలేదు. అందరిపిల్లల్లాగే స్కూలికి పంపించేరు. నాలుగు రోజులయేక, తల్లికి స్కూలినించి పిలుపు వచ్చింది.

"చిత్ర అందరు పిల్లల్తో కలవడంలేదు, అసలు మనలోకంలో వున్నట్టే లేదు. ఆ అమ్మాయిని ఇవాల్యుయేట్ చేయించాలి" అని చెప్పారు స్కూలు ప్రిన్సిపాలుగారు. "స్పెషల్ ఎడ్యుకేషను స్కూల్లో పెట్టండి" అని కూడా సలహా ఇచ్చారు.

స్పెషల్ ఎడ్ స్కూలికి పంపే తాహతు లేదు సోమలింగం దంపతులకి. అంచేత చిత్రని ఇంట్లోనే వుంచుకుని, ఇద్దరిలో ఒకరు ఇంట్లో వుండడానికి అనువుగా వాళ్ల దినచర్యలు మార్చుకుని కాలక్షేపం చేస్తున్నారు. అలాటి పరిస్థితుల్లో జనాలకి జవాబులు చెప్పుకోలేక గాయత్రిగారు ఎవరింటికీ రారు. వచ్చినా పిల్లని తీసుకురారు.

ఒకసారి తపతి గాయత్రిగారిని పిలిచి, చిత్రని కూడా తీసుకురమ్మని చెప్పింది. తపతికి చిత్ర పరిస్థితి అర్థం అవుతుంది. సామాజికంగా తనూ, mental disorder మూలంగా ఆ అమ్మాయీ ఒకే నావలో పయనిస్తున్నారని అవిడఅభిప్రాయం. ఆరోజు పార్టీకి గాయత్రినీ, చిత్రనీ చిత్రహింసలు పెట్టరని అనుకున్నవాళ్లని మాత్రమే పిలిచింది. ఆమాట గాయత్రిగారికి సూచనప్రాయంగా తెలియజేసింది కూడాను. గాయత్రిగారికి కూడా తపతి అంటే మంచి అభిమానమే. అనవసరంగా ఒకరి జోక్యం కలగజేసుకోదు, తనబతుకేదో తను బతుకుతోంది అని. అంచేత ఆరోజు చిత్రని తీసుకువచ్చారు తపతి ఇంటికి.

వచ్చినవాళ్లు మధ్యగదిలో కూర్చుని వుండగా, చిత్ర లేచి అటూ ఇటూ తిరుగుతూ పక్కగదిలోకి వెళ్లింది. అక్కడ రంగులూ, కుంచెలూ, కాన్వాసుమీద సగం వేసిన బొమ్మా వున్నాయి. చిత్ర అవి చూసి ఓ కుంచె తీసుకుని ఆ బొమ్మ పూర్తి చెయ్యడం మొదలెట్టింది.

కొంచెం సేపయినతరవాత గాయత్రి చిత్రకోసం అటూ ఇటూ చూసి, కనిపించకపోతే పక్కగదిలోకి వచ్చి చిత్ర చేస్తున్న పని చూసింది. ఆవిడ గాభరా పడిపోతూ. చిత్రచేతిలోంచి కుంచె లాక్కుని, విసుక్కుంటూ పిల్లని ఓ దెబ్బ వేసింది. చిత్ర ఏడవడం మొదలెట్టింది. ఏమిటి గలాభా అని తపతి వచ్చింది. తపతిని చూసి గాయత్రి, "మీరేం అనుకోకండి. ఇందుకే నేనెక్కడికీ తీసుకురాను పిల్లని." అంది వేదనతో.

తపతి "నో, నో. ఫరవాలేదండీ. మీరు గాభరా పడకండి" అంది బొమ్మవేపు పరిశీలనగా చూస్తూ. తన చిత్రం నాశనం అయిపోయిందని బాధ పడుతోందేమోనని గాయత్రి మరింత బాధ పడిపోతూ క్షమాపణలు చెప్పుకోసాగింది.

"ఫరవాలేదండీ, మీరేం బాధ పడకండి" అని తపతి మరోసారి ఆవిడకి చెప్పి, పక్కగదిలో వున్న జేమ్సుని పిలుచుకొచ్చింది.

చిత్ర నెమ్మదిగా వెక్కుతోంది ఓమూల చేరి.

గాయత్రి అయోమయంగా చూస్తోంది. జేమ్సుని చూసి ఆయనచేత కాన్వాసు ధర కట్టిస్తోంది కాబోలు అనుకుని, "ధర నేను ఇచ్చుకుంటానమ్మా, ఎంతవుతుందో చెప్పండి" అంది.

"అయ్యో, లేదండీ. మీరలా అనుకోకండి" అని ఆవిడకి ధైర్యం చెప్పి, "మీ చిత్రకి చిత్రకళలో మంచి నైపుణ్యం వున్నట్టుందండీ ఈ బొమ్మ చూస్తుంటే" అంది.

జేమ్స్ కాన్వాసువేపు పరీక్షగా చూస్తూ, "అవును. విలక్షణమయిన నైపుణ్యం కనిపిస్తోంది" అన్నాడు.
"మీ అమ్మాయికి మంచి చిత్రకారిణి అయే లక్షణాలు వున్నాయి. నేర్పించండి" అని కూడా చెప్పేడు.
అలా చిత్ర చిత్రకళా నైపుణ్యం గుర్తించడం జరిగింది ఆపూట.
ఆమాట గాయత్రికి ఆనందమూ, బాధా కూడా కలిగించేయి, "ఆర్ట్ కాలేజీకి పంపే స్తోమతు మాకెక్కడ నాయనా" అంది ఉసూరుమంటూ.
ఆతరవాత వారంరోజులనాడు తపతీ, జేమ్సూ చిత్రవిషయం మళ్లీ మాటాడుకున్నారు. జేమ్సు చిత్రకి ఉచితంగా పాఠాలు చెప్తానన్నాడు.
"ఇల్లు దూరం కదా. దాన్ని ఒక్కదాన్నీ పంపలేం. మాకు తీసుకురావడానికి వీలవదు" అంది గాయత్రి.
"నేను మంగళవారాలు మీయింటివేపు వేరే పనిమీద వస్తూ వుంటాను. అప్పుడే మీ అమ్మాయికి కూడా పాఠాలు చెప్తాను" అన్నాడు జేమ్స్.
గాయత్రీ, సోమలింగం పరమానందపడిపోయారు. నిజానికి తపతి కూడా ఆశ్చర్యపోయింది. ఏదో మాటవరసకి కదిపి చూద్దాం అనుకుంది కానీ ఆయన అంత ఉత్సాహం చూపుతాడనుకోలేదు.
"మీ ఇద్దరి ఋణం సప్తజన్మలెత్తినా తీర్చుకోలేను" అంది గాయత్రి రుమాలుతో కళ్లు ఒత్తుకుంటూ.
కొంతకాలం బాగానే గడిచింది. మొదట్లో ఎందుకయినా మంచిదని జేమ్స్ వచ్చేసమయానికి ఆవిడ ఇంట్లోనే వుంటూ వచ్చింది. దరిమిలా నమ్మకం కుదిరేక తనమానాన తను పనికి వెళ్లడం మొదలెట్టింది.
ఆరునెలలకి చిత్రలో మార్పు కనిపించింది లీలగా. కాస్త మనుషుల్లో పడుతున్నట్టే అనిపించింది. గాయత్రీ, సోమలింగం, తపతీ, జేమ్స్ కూడా బ్రహ్మానందపడిపోయేరు.

***

రోజులు ఎప్పుడూ ఒక్కలాగే జరగవు. జరిగితే కథే లేదు.
ఒకరోజు జేమ్స్ వచ్చేక, గాయత్రి మామూలుగా బాంకుకి వెళ్లింది. తిరిగి వచ్చేసరికి చిత్ర ఇంట్లో లేదు. గాభరా పడిపోతూ, అయినవాళ్లకీ కానివాళ్లకీ ఫోనుమీద ఫోను చేసింది ఎవరైనా ఎక్కడయినా చూసేరేమోనని. తపతికి కూడా చేసింది. తపతి హడావుడిగా జేమ్స్ సెక్షనుకి వెళ్లి చూసింది. అతను వారంరోజులు శలవు పెట్టేడన్నారు.
తపతి నిర్ఘాంతపోయింది ఏం జరిగివుంటుందో వూహించుకునేపేళకి. గాయత్రిగారికి ఎలా చెప్పడం ఈసంగతి? చెప్పకుండా వుండడం మాత్రం ఎలా సాధ్యం?
తపతి పదినిముషాలు ఆలోచించి ఫోను తీసి, మళ్లీ పెట్టేసింది. గాయత్రిగారింటికి బయల్దేరింది స్వయంగా చెప్పడానికి. దారిపొడుగునా ఆలోచిస్తూనే వుంది. జేమ్స్ ఎందుకిలా చేసేడు? తనతో మాటమాత్రం ఎందుకు చెప్పలేదు? గాయత్రికి ఎలా చెప్పడం జేమ్స్ చిత్రని లేవదీసుకు పోయేడని? ఆవిడ బాధలో ఎన్నిమాటలేనా అనొచ్చు. తను భరించగలదా? భరించక చేసేది మాత్రం ఏముంది? ఇప్పుడు చెయ్యవలసిన కార్యం ఏమిటి? ... ఆలోచిస్తూ వాళ్లింటికి చేరింది.

గాయత్రి హాల్లో కూర్చునివుంది కుమిలిపోతూ. సోమలింగం ఫోనులు చేస్తున్నాడు. జేమ్స్ చిత్రని షాపుకో బజారుకో తీసికెళ్లేడేమో సరదాగా అని వాళ్ల ఆశ.

తపతిని చూసి గాయత్రి మండిపడింది. "నువ్వతన్ని పరిచయం చెయ్యకపోతే మాకీ దౌర్భాగ్యం పట్టేది కాదు" అంటూ.

తపతికి ఏం మాట్లాడాలో తోచలేదు. ఆవిడ అన్నమాట నిజమే మరి. అంతవరకూ జరిగిన మంచి అంతా తృటికాలంలో తుడిచి పెట్టుకుపోయింది. తరవాత నెమ్మదిగా చెప్పింది. "జేమ్స్ ఆఫీసులో శలవు పెట్టేడంటున్నారు. చిత్రని తీసుకుని పొరుగూరు వెళ్లేడేమో ..." అంది వీలయినంత సున్నితంగా ధ్వనిస్తూ.

గాయత్రి గారింటి పొరుగున వున్న హెన్రీ వచ్చి, సానుభూతితో పోలీసు రిపోర్టు ఇవ్వమని సలహా ఇచ్చేడు, సోమలింగం "ఏమోనండీ. అదెక్కడుందో కూడా నాకు తెలీదు. ఏం అడుగుతారో, ఏంచెప్పాలో" అన్నాడు, "రండి నేను తీసుకెళ్తాను" అని ఇద్దర్నీ తన కార్లో తీసుకెళ్లేడాయన పోలీసు స్టేషనుకి.

అక్కడ వాళ్లు "తప్పిపోయి ఇరవైనాలుగ్గంటలు అయితే కానీ రిపోర్టు తీసుకోం" అన్నారు. ఇంకా "మాకిలాటివి వారానికి ముప్పై వస్తాయి. నూటికి తొంభైపాళ్లు తెలిసినవాళ్లే తీసుకెళ్లి వుంటారు. లేదా పిల్లలే అలిగి, పారిపోయి, నాలుగు రోజులు పోయేక తిరిగి వచ్చేస్తారు" అన్నారు.

"మాపిల్ల అలాటిది కాదు. దానికి ఈ అలకలూ చిలకలూ తెలీవు" అని మొత్తుకున్నాడు సోమలింగం.

హెన్రీ పరిస్థితులు వివరించీ, కాస్త బెదిరించీ రిపోర్టు రాయించేడు. ఆఖరికి ఓ సార్జెంటు రిపోర్టు తీసుకుని, "చూస్తాం లెండి" అన్నాడు.

మాట వుచితం కనక ఇచ్చేసేరు కానీ పోలీసులు చేసిందేమీ లేదు. వాళ్లకి ఇది high profile కేసు కాదు. కొన్నివందల "కోన్కిస్కా"లలో చిత్ర మరో కోన్కిస్కా. వేలకి వేలు రివార్డులిచ్చే వాళ్లయితే పత్రికలూ, పోలీసులూ కూడా హుషారుగా పని చేస్తారు.

తపతికి పుష్కలంగా అక్షింతలు పడ్డాయి. గాయత్రీ, సోమలింగం మాత్రమే కాక, ఊళ్లో భారతీయులు కూడా అనరానిమాటలు అన్నారు. ఆవిడే పని గట్టుకుని వూళ్లో వాళ్లందరినీ మూకవుమ్మడిగా అవమానించినట్టు బాధ పడిపోయేరు. తపతి జవాబులు చెప్పుకోలేక వాళ్లని తప్పించుకు తిరుగుతోంది.

***

నాలుగు నెలలతరవాత, జేమ్స్ తపతికి ఓ కార్డు రాసి పడేశాడు. అతని వివరణ ఏమిటంటే, ఇంట్లో చిత్రకి అన్నలపోరు ఎక్కువయింది. వారికి ఈ "స్లో" చెల్లెలు ఒక ప్రత్యేకత సాధించడం కంటకప్రాయం అయింది. తల్లీ తండ్రీ ఆఅమ్మాయి విషయంలో ఎక్కువ శ్రద్ధ తీసుకుంటున్నారు. తనని ఏడిపించడానికి బొత్తిగా వీలు చిక్కడంలేదు. ఆసంగతి తల్లిదండ్రులకి తెలుసో తెలీదో జేమ్స్కి అర్థంకాలేదు. అతను వాళ్లతో మాటాడితే బాగుండేదేమో. కానీ అప్పట్లో అతనికి తోచిన పరిష్కారం వాళ్లకి చెప్పకుండా ఆపిల్లని తీసుకు న్యూయార్క్ వెళ్ళిపోవడం.

తనకి తనే చిత్రకి ఏజంటు అయిపోయి. ఆ అమ్మాయిచేత బొమ్మలేయించి చిన్న చిన్న దుకాణాల్లోనూ, రోడ్డువారలా అమ్మి రోజులు గడుపుకుంటున్నారుట. "బాగానే వున్నాం" అని రాసేడు కానీ ఎడ్రెసూ, ఫోన్ నెంబరూ ఇవ్వలేదు.

***

తపతి చెప్పిన కథంతా విని గీత, "పోన్లే. చిత్ర జీవితం బాగుపడ్డట్టే కదా" అంది.

"లేదు. అలా ఎవరూ అనుకోలేదు. నా గతం అంతా తవ్వి తీసి, 'పెళ్లి మీద పెళ్లి చేసుకున్నది చాలక వూళ్లో ఆడపిల్లలనందరినీ చెడగొడుతోంది' అన్నారు. 'నీ కూతురయితే ఇలా చేస్తావా?' అని నన్ను రొకాయించేరు. ఆపైన 'ఆజాత్తీరే అంత' అని జేమ్సునీ అతని జాతినీ కూడా దుమ్మెత్తి పోశారు. గీతకంటె పదిహేనేళ్లు పెద్దవాడు. దాన్ని వాడుకున్నన్నాళ్లు వాడుకుని, నట్టేట్లో ముంచేస్తాడు అంటూ జరుగుతాయో జరగవో తెలీనివన్నీ ఊహించేసుకుంటూ రాద్ధాంతం చేసేరు."

గీత నిర్ఘాంతపోయింది. "నిజంగా అంత ఘోరంగా మాటాడేరా?" అంది నమ్మలేనట్టు.

తపతి పేలవంగా నవ్వింది, "అవే మాటలు కావులే. వీరంతా నాగరీకులు కదా. నాజుగ్గానే అయినా గట్టిగానే కొట్టేరు. అప్పట్నించీ నేను అందరికీ దూరంగా వుంటున్నాను. నా అదృష్టం ఈ ఇల్లు కూడా వూరికి కాస్త దూరమే కనక నాజోలికి ఎవరూ రారు," అంది.

"తల్లిదండ్రులయినా సంతోషించొచ్చు కదా పిల్లజీవితం మెరుగయింది అనీ, ఎక్కడో అక్కడ సుఖపడుతోందని."

"అదే నాబాధ కూడాను. 'సంతోషించుదాం' అన్న తాపత్రయంకంటే ఉన్నవీ లేనివీ ఊహించుకుని బాధ పడడంలోనే వాళ్లు ఎక్కువ ఆనందం అనుభవిస్తున్నారేమో అనిపించింది నాకు."

"పోనీ నువ్వేం అనుకుంటున్నావో చెప్పు? చిత్రజీవితం బాగుపడింది అనుకుంటున్నావా? లేదా?"

"ఏం. ఇప్పుడు నువ్వు కూడా నన్ను దులుపుతావేమిటి?"

గీత నవ్వేసింది తేలిగ్గా.

తపతి ఆలోచిస్తూ, అడ్డంగా తలూపింది, "నాకూ తెలీదు. చిత్రే చెప్పాలి ఆప్రశ్నకి సమాధానం."

***

హరికి ఆఫీసులో ఒత్తిళ్లూ, ప్రయాణాలూ అధికం అయి ఇంట్లో వుండే సమయం తరుగుతోంది క్రమంగా. అదే స్థాయిలో గీతా తపతిలమధ్య ఆత్మీయత పెరుగుతోంది. సంగీతంతో పాటు కంప్యూటరుమీద పని చెయ్యడం కూడా నేర్చుకుంటోంది గీత తపతిదగ్గర.

హరి వుద్యోగంలో ఆటుపోటులు గీతకి చెప్పడంలేదు. పనిగొడవలో పడి హరీ, తపతి సాన్నిధ్యంలో గీతా గమనించలేదు ఇద్దరిమధ్య కనిపించని నీడలు పొరలు పొరలుగా పేరుకుంటున్నాయని.

ఒకరోజు హరి ఇంటికి త్వరగా వచ్చేశాడు దివాలా పడ్డమొహంతో.

"ఏమయింది?" అంది గీత కంగారు పడుతూ.

"ఉద్యోగం పోయింది," అన్నాడు హరి నీరసంగా సోఫాలో కూలబడి. వాళ్లాఫీసులో కొంత కాలంగా చర్చలు జరుగుతున్నాయి. మొదట్లో "కంపెనీ అభివృద్ధికోసం అవసరమైన మార్పులు చేస్తున్నాం" అన్నారు. తరవాత "అభివృద్ధి ప్రణాళిక వేస్తున్నాం" అన్నారు. తరవాత మరో పెద్దకంపెనీతో "చేతులు కలుపుతున్నాం" అన్నారు. ఆ "చేతులు కలపడం"లో భాగంగా కొంతమంది ఉద్యోగస్థులకి మంగళం పాడి ఇళ్లకి తోలేశారు. అలా ఇళ్లకి తోలివేయబడినవారిలో హరి ఒకడు.

గీత అతని పక్కనే కూలబడింది. "ఇప్పుడేం చెయ్యడం? ఇది పోతే దీని తాతలాంటిది మరొకటి వస్తుంది. ఇంతకంటె మంచిదే వస్తుంది" - ఏవేవో మాటలు మనసులో మెదులుతున్నాయి కానీ ఒక్కమాటా నోట్లోంచి వూడిపడడంలేదు. అతనెప్పుడూ తనఉద్యోగం సంగతి గీతతో చర్చించలేదు. ఎంతసేపూ, "నీకేం కావాలి" అని అడగడమే తప్ప తనజీవితంలో "ఇది జరుగుతోంది" అని ఎప్పుడూ చెప్పలేదు. ఇప్పుడు కొత్తగా మొదలు పెట్టాలంటే ఎలా మొదలు పెట్టాలో గీతకి తెలీడంలేదు.

ఓ అరగంట అయినతరవాత, "నేను ఇప్పుడే వస్తాను. ఫరవాలేదులే. ఇది కాకపోతే మరో వుద్యోగం, నువ్వేం బెంగ పెట్టుకోకు" అనేసి గబగబా వెళ్లిపోయేడు.

గీతకి మనసంతా గజిబిజిగా వుంది. అతను ఎక్కడికి వెళ్తున్నాడో, ఏం చేయబోతున్నాడో అర్థం కాలేదు. ఓ గంటసేపు అలా కూర్చుని, తపతికి ఫోను చేసింది.

తపతి ఫోను తీసుకుని, సంగతి విని, "నువ్వేం బెంగ పెట్టుకోకు. హరికి మంచి అర్హతలు వున్నాయి. అనుభవం వుంది. ఇది కాకపోతే మరో ఉద్యోగం తొందరలోనే దొరుకుతుందిలే" అంది. ఆమాటలు పలికిన తపతికీ వింటున్న గీతకీ కూడా పేలవంగానే తోచేయి. నిజంగా విషమపరిస్థితుల్లో ఇరుక్కునప్పుడు మాటలు ఎంత బోడిగా వుంటాయో తెలిసింది.

గీత ఫోను పెట్టేసి ఆలోచిస్తూ కూర్చుంది చాలాసేపు. హరి తిరిగి వచ్చేసరికి రాత్రి తొమ్మిది దాటింది. "ఎక్కడికి వెళ్లేర"ని తను అడగలేదు. అతను చెప్పలేదు. కానీ మొహంలో మాత్రం ఇందాకా వున్నంత దిగులు లేదు. బహుశా తనలాగే అతను కూడా ఏ స్నేహితుడితోనో కాస్సేపు తనబాధ వెళ్లబోసుకుని వచ్చేడేమో అనుకుంది.

***

హరి సీరియసుగా ఉద్యోగాలకోసం ప్రయత్నిస్తున్నాడు. తెలిసినవాళ్లందరికీ ఫోను చేస్తున్నాడు.

గీత తపతితో మాటాడడం తగ్గింది. మాటాడాలని వుంది కానీ ఏంవుంది మాటాడ్డానికి అనిపిస్తోంది. పైగా ఇల్లు వదిలి ఎక్కడికి వెళ్లడానికి మనస్కొప్పడంలేదు, తాను చెయ్యగలిగింది ఏం లేకపోయినా.

ఓరోజు గీత చెక్కుబుక్కు చూస్తుంటే హరి సుమతికి రెండువేలకి చెక్కు రాసినట్టు కనిపించింది. బాంకుకాయితాలు చూస్తే ఆమొత్తం తిరిగి వచ్చిన జాడల్లేవు. దాదాపు ఏడాది పైనే అయింది. హరిని అడిగింది.

"అవును. ఎప్పుడో అవసరం అంటే ఇచ్చేను" అన్నాడు.

"తిరిగి ఇచ్చేశారా?"

"ఏమో ఇవ్వలేదు కాబోలు. నాకు జ్ఞాపకం లేదు. పిలిచి అడుగు," అన్నాడు.

గీత మొదట మొహమాటపడింది. తరవాత తెగించి పిలిచింది, సుమతి సరదాగానే మాటాడింది డబ్బు విషయం వచ్చేవరకూ. గీత డబ్బుమాట ఎత్తేసరికి బిగిసిపోయింది.

"హరి మిమ్మల్ని అడగమన్నాడా?" అంది విసురుగా.

గీతకి అర్థం కాలేదు. హరికీ తనకీ మధ్య అరమరికలు లేవు. అతనిచ్చిన అప్పు అతనే అడగాలని తను అనుకోలేదు. అసలు అలాటి రూల్సున్నాయని కూడా తనకి తెలీదు.

"అది కాదండీ. చెక్కుబుక్కు బాలెన్సు చేస్తున్నాను. మాకు వేరు వేరు ఎకౌంట్లు లేవు" అంది క్షమాపణగా.

సుమతి శాంతించలేదు. "హరికివ్వండి ఫోను. ఈ గేములేమిటో అతన్నే అడుగుతాను," అంది ఇంకా గట్టిగా.

"సారీ. నాదే పొరపాటు. ఆయన ఇంట్లో లేరు. వచ్చింతరవాత చెప్తాను. మీరూ మీరూ చూసుకుందురు గానీ" అని ఫోను పెట్టేసింది.

హరి వచ్చింతరవాత చెప్తే, హరి కూడా ఆశ్చర్యపోయేడు. సుమతి ఎందుకంత దురుసుగా మాట్లాడిందో అతనిక్కూడా అర్థం కాలేదు. ఆతరవాత సుమతి ఒకటి రెండుసార్లు కనిపించినా ముభావంగానే వుంది గీతతో.

ఆ తరవాత నెలరోజులనాడు రాధ బజారులో కనిపించి, "టేషూ, సుమతిల పెళ్లికి రాలేదేం?" అని అడిగింది.

వాళ్లు షికాగోలో బాలాజీ గుడిలో పెళ్లి చేసుకున్నారుట రెండువారాలక్రితం. గీతకి పెళ్లి అయినట్టే తెలీదు. "మేం పిలవబడలేదు" అంది చిన్నగా నవ్వుతూ.

స్నేహాలు ఇంత తేలిగ్గా ఎగిరిపోతాయా అనుకుంటూ గీత బాధ పడింది. తనమాట వదిలేసినా హరికీ వాళ్లకీ చాలాకాలంగా స్నేహం కదా. అదేనా ఎందుకు గుర్తు పెట్టుకోలేదు సుమతి? మనసంతా వికలమయిపోయింది. తపతిని పిలిచి చెప్పింది.

"అంతే మరి ఇక్కడ స్నేహాలు," అంది తపతి నిరామయంగా.

కొంచెంసేపూరుకుని, "సుమతీ, టేషూ మిమ్మల్ని ఎందుకు పిలవలేదో నాకు తెలీదు కానీ ఒక్కమాట మాత్రం చెప్పగలను. ఈదేశం వచ్చేక మనుషులు మారిపోతారు. ఓపక్కన మనవాళ్లతో కలవాలని వుంటుంది. మనవాళ్ల మొహాలు కనిపిస్తే మనసు విచ్చుకుంటుంది. మరోపక్క ఇక్కడి సాంప్రదాయాలకి అలవాటు పడతారు. ఎవరిబతుకు వారికి గుట్టు. తమసంగతులు ఎవరూ మాటాడరు. కానీ మరొకరిగురించి మాటాడడానికి మాత్రం ఏ ప్రైవేసీలు లేవు. మనదేశంలో అలాక్కాదు. స్వ, పర బేధం లేదు. ఎక్కడికక్కడే ఎప్పటికప్పుడే మనసులో వున్నదేదో ఎవరు ఎదురుగా వుంటే వారి ముందే

వెళ్లబోసుకుంటాం. మనకి అదే గొప్ప థెరపి. ఇప్పుడు తెలిసిందా నేను వీళ్లందరికీ దూరంగా వుండడానికి కారణం?" అంది తపతి.

సుమతి మనస్తత్త్వం ఏమయివుంటుందో, ఆమె ప్రవర్తన ఎలా అర్థం చేసుకోడమో తెలీక చాలా కాలం ఆలోచిస్తూనే వుంది గీత. మనసంతా కలత బారిపోయింది. తపతి మాటలేమీ ఊరట కలిగించలేదు. ఆఖరికి నాలుగు కాయితాలు ముందేసుకుని కూచుంది. తొమ్మిదికి మొదలు పెట్టింది. పన్నెండయినా లంచి తినడానికయినా లేవాలనిపించలేదు. రెండు అయేసరికి ఆరుపేజీలు రాసింది. కథ సుమారుగా పూర్తయింది. నాలుగుసార్లు చదివింది. తనకి బాగానే వుంది. మరి ఒరులెవరైనా చదివేలా వుందా?

తపతిని పిలిచి, తను ఇంట్లోనే వుందని స్థిరం చేసుకుని, వెళ్లింది.

"కథ రాసేను చూడు" అంది కాయితాలు అందిస్తూ.

"నువ్వు కథలు రాస్తావని నాకు తెలీదే!"

"నాకూ తెలీదు. కథలు అని బహువచనం వాడకు. ఇదే మొదలు. ఏదో మనసులో బాధ రాయాలనిపించింది. రాసేను. ఎలా ఉందో చెప్పు. నేను కాఫీ పెడతాను," అంది గీత వంటింట్లోకి నడుస్తూ.

తపతి ఐదునిముషాల్లో చదివేసింది. "బాగా రాసేవు. మొదటికథ అంటే నమ్మడం కష్టం."

"నిజంగా?"

"నిజంగానే. నిజం చెప్పాలంటే ఎప్పుడయినా అంతే అవుతుంది. మనసులో గట్టిగా గుచ్చుకున్న బాధ కలంలోకి జారుతుంది. పాఠకులమనసున హత్తుకుంటుంది. చిత్తశుద్ధితో రాసిన రచనలకి స్పందించినట్టు ఊకదంపుగా రాసినకథలకి స్పందించరు పాఠకులు."

ఇద్దరూ కూర్చుని, కాఫీ చప్పరిస్తూ, "ఇక్కడ బాగుంది," "ఇక్కడ మారిస్తే బాగుంటుంది" "మూడోపేరా ముందుకి తెస్తే బాగుంటుంది" అంటూ దానికి మెరుగులు దిద్దేరు.

ఎనిమిదవుతుంటే, హరి ఫోను చేశాడు, "ఇవాళ గీత ఇంటికి వచ్చే సూచనలేమయినా వున్నాయా?" అంటూ.

ఇద్దరూ మొహాలు చూసుకుని నవ్వుకున్నారు.

"మీరు కూడా ఇక్కడికే రండి. భోంచేసి పోదురు గానీ. గీత రచయిత్రిగా ఆవిర్భవించిన సందర్భంలో పార్టీ" అంది తపతి.

హరి వచ్చి, "నువ్వు కథలు రాస్తావని నాకు తెలీదే" అన్నాడు.

కథ చదివినప్పుడు అతనికి అర్థం అయింది సుమతి ప్రవర్తన గీతని ఎంతగా గాయపరిచిందో. పైగా అతనికి నచ్చినవిషయం - గీత చాదస్తంగా అందులో పేర్లూ వూర్లూ వున్నవి వున్నట్టుగానో, గుర్తు పట్టేలాగానో వెకిలిగా చిత్రించలేదు. ఉన్న ఊరూ, కన్నతల్లీ, ఇల్లూ, వాకిలీ, సమస్తం, వదులుకుని, పరాయిదేశం వచ్చి, పుట్టుకతో వచ్చిన వాసనలు వదులుకోలేకా, స్థానికమర్యాదలతో రాజీపడలేకా సతమతమయే ఒకానొక

మనస్తత్త్వాన్ని సున్నితంగా ఆవిష్కరించింది. అందుకు అతను గీతని మెచ్చుకోకుండా వుండలేకపోయాడు.

ముగ్గురూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేస్తుంటే, గీతకి మనసు తేలిక పడింది. హరి ఉద్యోగం పోయినతరవాత ఇదే తొలిసారిగా అతనిమొహంలో ఏమాత్రమో కళ కనిపించడం. నాకథ సాధించిన ఘనవిజయం అదే. ఓ గంటసేపయినా అతని దృష్టి మరోవేపు మళ్లించగలిగడం అన్నట్టు తపతివేపు చూసింది.

తపతి చిరునవ్వుతో తలూపింది.

***

హరి ఉద్యోగం పోయి నెలరోజులవుతోంది. కొన్ని యుగాలు అయినట్టు వుంది గీత ప్రాణానికి. ఇద్దరికీ కటకటగానే వుంది. అలాటి దుర్భర సమయంలో తపతి పిలిచి ఓ చల్లనిమాట చెప్పింది,

"మాబాంకులో చిన్న వుద్యోగం వుంది. చేస్తావా?".

గీతకి హోహో అని అరవాలనిపించింది. ఉద్యోగం! తనకే! ఒక్క ఉదుటన ఎగిరిపడింది. వెంటనే "నాకా? ఉద్యోగమా?" అంది తను సరిగ్గా విందో లేదో అని.

"అవును. నీకే. చిన్నదే. పార్ట్ టైమ్. నీకు కాలక్షేపంగా వుంటుందని చెప్తున్నాను. నీ కంప్యూటర్ విద్య ఉపయోగించుకోడానికి అవకాశం" అంది తపతి.

అంతలోనే హరిపరిస్థితి గుర్తొచ్చి గీత చప్పున చల్లారిపోయింది. "హరిగారు ఏం అంటారో" అంది సందేహిస్తూ. ఉద్యోగంకోసం వెతుకుతున్నది ఆయనా. ఉద్యోగం వెతుక్కుంటూ వచ్చింది తననీ! గీతకి అంతా మాయగా వుంది.

"ఆయన్ని అడిగే చెప్పు," అంది తపతి.

హరిని అడిగితే అతను "నీ యిష్టం" అన్నాడు.

గీత చిక్కులో పడింది. ఆయనకి ఉద్యోగం లేనిసమయంలో తను వుద్యోగంలో చేరడం? అది ఆయనకి చిన్నతనంగా వుంటుందేమో? ఇంతవరకూ తను ఉద్యోగం చేసే ప్రసక్తి రాలేదు. ఇంట్లో వున్నప్పుడు విసుగేసినరోజులు గుర్తొచ్చాయి. ఉద్యోగం అంటూ వుంటే ఆ వంకనయినా వీధిలోకి వెళ్లొచ్చు రోజూ. చూడగా చూడగా తను ఉద్యోగంలో చేరడంలోనే ఎక్కువ లాభాలు కనిపిస్తున్నాయి.

"మీరేం అనుకోనంటేనే చేర్తాను" అంది మళ్లీ.

"నేనేం అనుకుంటాను? అనుకోడానికేముంది? నీ యిష్టం. నీక్కావాలనుకుంటే చేరు" అన్నాడతను.

గీత ఉద్యోగంలో చేరడానికే నిశ్చయించుకుంది. హరి మనసులో ఏముందో కానీ పైకి మాత్రం పొక్కలేదు.

గీత వుద్యోగంలో చేరినతరవాత మాత్రం ఇద్దరికీ బాగానే వుందనిపించింది. ముఖ్యంగా ఇద్దరూ ఒకరికోసం ఒకరు బాధపడుతూ ఇరవైనాలుగ్గంటలూ ఎదురెదురుగా ముఖముఖాలు చూసుకుంటూ కూర్చోడంకంటే ఇదే నయం అనిపిస్తోంది. ఎవరికి వారు ఊపిరి తీసుకోడానికి కాస్త వీలు చిక్కింది.

ఉద్యోగ ప్రయత్నాల్లో హరీ, కొత్త ఉద్యోగంలో గీతా పడిపోయారు. గీతకి వచ్చే ఆదాయం చిన్నదే అయినా, తృప్తిగా వుంది. తల్లి మాటలు గుర్తుకొచ్చేయి. "మనిషికి వున్నది బలం, పశువుకి తిన్నది బలం" అనేది ఆవిడ. గీతకి చేతిలో పడ్డ నాలుగు రాళ్లూ తనకి ఎంతో తృప్తినిస్తున్నాయి.

***

మూడు నెలలు గడిచిపోయేయి.

మేనమామ రమణ ఫోను చేశాడు. ఆయన ఏడాదిపాటు కంపెనీపనిమీద జర్మనీలో వుండి ఇప్పుడు తిరిగి వచ్చేడు న్యూయార్కుకి.

మామయ్య గొంతు వినేసరికి ప్రాణం లేచొచ్చింది గీతకి.

"బాగున్నావా?" అని ఆయన కుశలప్రశ్నలేస్తూంటే, పూర్వపురోజులు గుర్తొచ్చేయి. "హరి ఎలా వున్నాడు?" అని ఆడిగాడు.

గీత క్షణం తటపటాయించి, "బాగానే వున్నారు" అంది.

ఆయన మళ్లీ "వుద్యోగం బాగుందా?" అని సూటిగా అడిగినప్పుడు మాత్రం "పోయింద"ని చెప్పక తప్పలేదు.

ఆయన అయ్యో అని, "నేను కూడా చూస్తాను. అతను ఇంటికొచ్చేక నన్ను పిలవమని చెప్పు" అన్నాడు.

"నువ్వు కొత్తగా వచ్చినప్పుడు నేనిక్కడ లేను. లేకపోతే మాయింట్లో దిగేపని. ఇప్పుడైనా రండి. ఇక్కడ ఉద్యోగావకాశాలు ఎక్కువ. ఏదేనా చూసుకోవచ్చు" అని కూడా చెప్పాడు.

"సరే. చెప్తాను" అంది.

రాత్రి హరి వచ్చేక చెప్పింది మామయ్య పిలిచిన సంగతి. అతను ముభావంగా "ఆహ్" అన్నాడు. ఆ తరవాత నట్టుతూ "మనని న్యూయార్కు రమ్మన్నారు" అంది.

హరి మళ్లీ ఊఁ అనేసి వూరుకున్నాడు. ఆఖరికి భోజనాలవేళ చెప్పింది, మామయ్య ఉద్యోగంవిషయంలో సాయం చేస్తానన్నాడని.

గీత భయపడినట్టే అయింది, "నా వుద్యోగం పోయిందని ఆయనకి చెప్పేవా?" అంటూ ఎగిరిపడ్డాడు.

ఎప్పుడూ లేదు అతను అలా అరిచేసరికి గీతకి కళ్లనీళ్లు తిరిగేయి. లేచి వంటింట్లోకి వెళ్లిపోయింది. గిన్నెలు తీసి, ఫ్రిజ్లో పెట్టేసి, కంచాలూ, గ్లాసులూ డిష్వాషరులో పడేసి, తిన్నగా పడగ్గదిలోకి వెళ్లిపోయింది.

హరికి బాధ అనిపించింది అలా తనమీద అరిచినందుకు. పాపం తనేం చేసింది, వున్నమాటే కదా చెప్పింది. లేచి పడగ్గదిలోకి వచ్చి, "నువ్వెళ్లు. నేను మరోసారి వస్తాను" అన్నాడు నెమ్మదిగా.

ఇద్దరికిద్దరూ "నేనేం చెయ్యలేకపోతున్నానే" అన్న బాధతో గిలగిల్లాడుతున్నారు.

"నేను ఒక్కదాన్నీ వెళ్లను. ఇద్దరం తరవాతే వెళ్దాంలెండి" అంది గీత అటు ఒత్తిగిలి.

హరి, “సరే” అనేసి మళ్లీ ముందుగదిలోకి వెళ్లిపోయేడు. దిగులు పడిపోతున్న గీతని చూస్తుంటే అతనికి చాలా బాధగా వుంది. తను ఎదురుగా లేకపోతే బాగుండుననీ, కనీసం నాలుగు రోజులయినా ఆమామయ్యగారింటికో మరోచోటికో వెళ్లిపోతే బాగుండును అని హరి ఆశా, కోరికాను.

హరి బాధపడితున్నాడని గీతకి కష్టంగా వుంది. అతను కూడా వస్తే, ఉద్యోగం విషయంలో మామయ్య సాయం చేస్తాడు కదా అని గీత ఆశా, కోరికాను.

హరి ఫోనుమీద అర్థరాత్రి దాటేవరకూ స్నేహితులందరితో మాటాడుతూనే వున్నాడు. వాళ్లు కూడా వెళ్లమనే సలహా ఇచ్చారు. “గీతకి వూరు చూపించినట్టూ వుంటుంది. మళ్లీ వుద్యోగంలో చేరితే ఎలాగా టైము దొరకదు కదా,” అన్నారు. “అక్కడ అవకాశాలు కూడా చూసుకోవచ్చు అన్నమాట కూడా నిజమే కదా” అన్నారు.

హరి ఎటూ తేల్చుకోకుండానే, రమణ మళ్లీ ఫోను చేశాడు మర్నాడు వుదయమే.

ఫోను తీసుకుని. తప్పనిసరిగా మాటాడాల్సివచ్చింది.

“మీ పెళ్లికి మేం రాలేదు కదా. ఇప్పుడయినా చూస్తాం, రండి ఇద్దరూ” అన్నాడు రమణ చనువుగా.

“అలాగేలెండి, చూద్దాం.”

“చూద్దాం అంటే కాదు. నాక్కూడా ఇప్పుడే కొంచెం తీరిక వూరు చూపించడానికి. తప్పకుండా రావాలి.”

హరి ఆలోచిస్తూ, “అలాగేలెండి. టికెట్లు కనుక్కుని ఫోను చేస్తాను. ఇదుగో. గీతకి ఫోను ఇస్తున్నా, వుండండి” అని చెప్పి గీతని పిలిచి “మీ మామయ్య” అంటూ ఫోను అందించాడు.

గీత మరో రెండు నిముషాలు మాటాడి ఫోను పెట్టేసింది. హరి మళ్లీ అరుస్తాడేమో అనుకుంది కానీ అతనేమీ అనలేదు. న్యూయార్క్‌కి టికెట్లు తీసుకున్నాడు.

“పీటర్నీ, సూసన్నీ కూడా చూద్దాం” అంది గీత. ఇక్కడ అడుగెట్టగానే పరిచయమయిన తొలిజంట అని వాళ్లంటే ప్రత్యేకాభిమానం.

“వాళ్లు విడిపోయారు. పీటర్ బెర్క్లీ వెళ్లిపోయాడు. సూసన్ ఎక్కడుందో తెలీదు”.

గీతకి అయ్యో అనిపించింది. చూసింది ఒక్కపూటే అయినా ఆప్తులెవరికో అన్యాయం జరిగినట్టు బాధ పడింది.

న్యూయార్క్‌లో రమణ airportకి వచ్చి ఎంతో ఆప్యాయంగా ఇద్దరినీ తీసుకెళ్లేడు ఇంటికి. గీత ఇక్కడ దిగినరోజున తను లేనందుకు మరోసారి విచారం వెలిబుచ్చాడు. ఆయన భార్య ఎమిలీ కూడా ఎంతో ఆదరంగా మాటాడింది. వాళ్లబ్బాయి సిలికాన్వాలీలో సాఫ్టువేరు ఇంజినీరుట. గోడమీద ఆ అబ్బాయి, అతని భార్య, వారి పాప ఫొటోలు వున్నాయి.

న్యూయార్క్ మనదేశంలోలాగే కిక్కిరిసి పోయివుంటుంది. కార్లూ, జనాలతో. ఆపైన నభోమండలాన్నంటుతూ భవనాలూ .... రమణ గీతకీ, హరికీ statue of liberty, museum చూపించాడు గీతకి అవన్నీ చూస్తుంటే ఏదో మాయలోకంలో వున్నట్టు అనిపించింది.

“బ్రాడ్వేలో పెపిన్ షో చూద్దాం రేపు సాయంత్రం” అన్నాడు రమణ.

“నాకు కాఫీ హోటల్లో ఇంగ్లీషే అర్థం కావడంలేదు. బ్రాడ్వేలో ఏం చూస్తాను?” అంది గీత.

“అలా కాదులే. పూర్తిగా అర్థం కాదేమో కానీ చూడు అదొక ప్రత్యేకమయిన అనుభవం.” అంటూ అసలు ఆ నాటకాలు ఎలా మొదలయాయో, వాటి విశిష్టత ఏమిటో వివరించి, పెపిన్ కథ కూడా చెప్పేడు.

మొత్తంమీద వెళ్లడానికే నిశ్చయించుకున్నారు. ఎమిలీ కూడా కొంత వివరణ ఇచ్చింది. చూసింతరవాత మాత్రం చాలా బాగుంది అనే అనిపించింది గీతకి. మన స్టేజి నాటకాల్లోలాగ ఈ నటులకి ఎంత దీక్ష వుండాలో అనుకుంది. ప్రతిరోజు ఇదే తమ నటనకి పరాకాష్ఠ అన్నంత నియమనిష్ఠలతో ప్రదర్శించాలి.

“నీమాట నిజమే మామయ్యా! బాగుంది మ్యూజికల్” అంది రమణతో.

కథలో ప్రధానాంశం తనని బాగా ఆకట్టుకుంది. ఏదేశం, ఏకాలం అయినా సాహిత్యంలో విశేషం మౌలికమయిన విలువలు ఒకటే అవడం. “అధికారం, ధనకనకవస్తువాహనాలు కాదు మనిషికి ఆత్మానందాన్ని ఇచ్చేవి” అన్న సందేశం అమెరికాలో వినిపిస్తుందని గీత కలలో కూడా అనుకోలేదు. “సాహిత్యంలోనూ, సంగీతంలోనూ సందేశం అదే అయినా మనం ఇంతదూరం వచ్చింది కూడా ఆ ధనకనకవస్తువాహనాలకోసమే కదా. మనజీవితాల్లో ప్రతిఫలించే గొప్ప సదసత్సంశయం లేదా సంఘర్షణ ఇదేనేమో” అనుకుని నిట్టూర్చింది.

మర్నాడు రమణ హరిని వాళ్ల ఆపీసుకి తీసుకెళ్లి వాళ్ల బాస్, విలియమ్స్కి పరిచయం చేశాడు. ముగ్గురూ లంచికి వెళ్లారు. విలియమ్స్ పరోక్షంగా యదాలాపంగా అడుగుతున్నట్టే అడుగుతూ హరి చదువూ, అనుభవం వివరాలు కనుక్కున్నాడు. తరవాత తాము షికాగోలో బ్రాంచి తెరవాలనుకుంటున్నామని చెప్పి, “మీకేమైనా ఆసక్తి వుందా?” అని అడిగేడు.

హరి వివరాలు అడిగాడు.

“ఇంకా ప్రాథమికదశలోనే వుంది. మళ్లీ మాటాడుకుందాం ఆవిషయాలు. మీకార్డు ఇవ్వండి.” అని, “ఈరోజు సాయంత్రం ఆర్టు షోవుంది, రాకూడదూ?” అన్నాడు మాట మారుస్తూ.

విలియమ్స్ వాళ్ల అబ్బాయి రాబర్ట్ ఒక తెలుగు టీచరుదగ్గర పెయింటింగు నేర్చుకుంటున్నాడనీ, ఆసాయంత్రం సర్టిఫికేట్ల ప్రదానం, ఆర్టు ఎగ్జిబిషనూ జరగబోతున్నాయనీ రమణ వివరించేడు.

“తప్పకుండా వస్తాం” అన్నాడు హరి విలియమ్సో.

మళ్లీ కలుసుకుందాం అని చెప్పి ఉభయపక్షాలూ శలవు పుచ్చుకున్నారు.

హరి రమణకి కృతజ్ఞతలు చెప్పేడు.

“నాదేముంది. నీ అర్హతలు ఆయనకి నచ్చినట్టున్నాయి” అన్నాడు.

***

ఆసాయంత్రం అందరూ ఆర్ట్ ఎగ్జిబిషనుకి వెళ్లేరు. అక్కడ కారిడర్లో విలియమ్స్, రాబర్టుతోనూ, భార్యతోనూ కనిపించాడు. రమణబృందం అతనిదగ్గరికి వెళ్లి, పరిచయాలు అయేక, అబ్బాయిని అభినందించారు.

విలియమ్స్ రాబర్టు తెలివితేటలూ, సకలవిద్యలలోనూ ఆకుర్రాడి నైపుణ్యం అరగంటసేపు వర్ణించాడు - సాకర్, పియానో, ట్రాక్ ఎండ్ ఫీల్డ్, పెయింటింగ్, ఇంకా లిటరేచర్ క్లబ్ అన్నిటిలోనూ తొలిరాంకులో మెరిసిపోతున్నాడుట.

“వాడు పిల్లాడిలా నిష్పూచీగా ఆడుకోడం ఎప్పుడు? వాడికి బాల్యం అన్నది లేకుండా చేస్తున్నారు” అంది గీత హరితో చిన్నగా.

“తల్లిదండ్రులఆశలు అలా వుంటాయి మరి. వాడికి గల అవకాశాలు పరిచయం చేస్తున్నారనుకో. ప్రతి రంగంలోనూ వేలు పెడితే, ఎందులో రాణిస్తాడో తెలుస్తుందని కావచ్చు” అన్నాడు హరి సమాధానాలు వెతుకుతూ.

అందరూ మాటాడుకుంటూ బొమ్మలు వున్న గదిలో కొంచెంసేపు తిరిగేరు. పిల్లలు వేసిన బొమ్మలు ఓపక్కనా, పీత్రో బెహన్జ్ వేసిన బొమ్మలు మరో పక్కన అమర్చేరు. ఆవిడ వేసినవన్నీ ప్రకృతిదృశ్యాలు. ప్రతిచిత్రంలోనూ ఛాయామాత్రంగా ఏదో ఒక మూల, ఆకులమధ్యనో, మబ్బులమధ్యనో రెండు కళ్లు లీలగా గోచరమయేయి గీతకి. ఆకళ్లలో వ్యథ హృదయవిదారకంగా వుంది. గీతకి చూస్తున్నకొద్దీ గుండెలు పిండేసినట్టు అనిపించసాగింది. గుండెల్లో నీరసం ఆవహించింది.

“నేను వెళ్లి హాల్లో కూర్చుంటాను” అంది బయటికి నడుస్తూ. .

“ఏం? బొమ్మలు బాగులేవూ? ఇంకా అటువేపు మనం వెళ్లనేలేదు” అన్నాడు గీతమొహంలోకి తేరి చూస్తూ, మళ్లీ వెంటనే, “ఏమిటి అలా వున్నావు? ఒంట్లో బాగులేదా? సోడా తాగుతావా?” అన్నాడు కంగారుగా.

రమణ కూడా “ఏమిటి? ఏమయింది? రా, ఇక్కడ కూర్చో” అన్నాడు తలుపుదగ్గరున్న కుర్చీ చూపిస్తూ.

గీత సిగ్గు పడిపోయి, “ఏం లేదు. ఒక్క క్షణం కళ్లు తిరిగినట్టనిపించింది అంతే. బాగానే వుంది, ఏంలేదు” అంటూ వాళ్లిద్దరినీ శాంతపరిచింది.

ఇంతలో మీటింగు మొదలయిందని వచ్చి చెప్పాడు ఒక అబ్బాయి.

విలియమ్స్, రాబర్టూ, తల్లీ మొదటివరసలో కూర్చున్నారు, సర్టిఫికేట్లు పొందబోతున్న మరో ఎనిమిదిమంది పిల్లలూ, వాళ్ల తల్లిదండ్రులూ కూడా తమకి కేటాయించిన మొదటి రెండు వరసలలో సర్దుకున్నారు. ఆవెనక మూడోవరసలో రమణా వాళ్లూ కూర్చున్నారు.

జేమీభాయి స్టేజిమీదకి వచ్చి, సభాసదులకి నమస్కారం చేసి, సర్టిఫికేట్లు పొందిన పిల్లల సృజనాత్మకశక్తిని మెచ్చుకుని, వాళ్లని మనస్ఫూర్తిగా అభినందించి, కార్యక్రమం వివరించాడు. పీత్రో బెహన్జ్ అనారోగ్యకారణాలవల్ల ఉపన్యాసం ఇవ్వటోవడంలేదనీ, స్టేజిమీదకి వచ్చి విద్యార్థులకి స్వయంగా సర్టిఫికేట్లు ఇస్తుందనీ చెప్పేడు. ఆతరవాత, ఎగ్జిబిషను హాల్లో రిసెప్షను వుంటుందనీ, అందరూ రిసెప్షనుకి వచ్చి పార్టీ జయప్రదం చేయవలసిందనీ కోరేడు. పీత్రో బెహన్జ్ ఆటోగ్రాఫ్ చేసిన బొమ్మలు ఈరోజు కొన్నవారికి తగ్గింపుధర అని ప్రకటించేడు.

తరవాత లోపలికి వెళ్లి, పీత్రో బెహన్జీని నడిపించుకు వచ్చేడు. ఆవిడ అతనిమీద వాలి గాలిలో తేలిపోతున్నట్టు నడుస్తూ వచ్చింది.

అయిదు నిముషాల్లో బహుమతి ప్రదానాలు అయిపోయాయి. వెంటనే జేమీభాయి ఆమెని నడిపించుకుంటూ లోపలిగదిలోకి తీసుకుపోయేడు.

తిరిగొచ్చి మరోసారి అందర్నీ అభినందించి రిసెప్షనుకి పదమన్నాడు. అక్కడ గుమ్మందగ్గర ఓ బల్లదగ్గర cash box వుంది. జేమీభాయి హడావుడిగా అటూ ఇటూ తిరుగుతూ, అందరితో కలివిడిగా మాటాడుతూ, ఒకొక బొమ్మ ప్రత్యేకత వివరిస్తూ అమ్మకాలు సాగించేడు. విలియమ్స్, రమణా చెరో బొమ్మా కొన్నారు.

హరి సందిగ్ధావస్థలో పడ్డాడు. తాను బొమ్మ కొంటే విలియమ్స్‌ని "ఇంప్రెస్" చెయ్యడానికి పనికొస్తుందా లేదా అన్న సందేహం ఒకటీ. రెండోది గీతకి ఇష్టమవునా కాదా అన్నది. ఎగ్జిబిషను హాల్లో గీత ప్రవర్తన తలపుకొచ్చింది. గీతకి ఆ బొమ్మలు ఇంట్లో పెట్టుకోడం ఇష్టం అవునో కాదో ... చాలాసేపు ఆలోచించినమీదట, కొనే వుద్దేశం విరమించుకున్నాడు.

ఆనాటి అతిథులు దాదాపు అందరూ అమెరికనులే. వాళ్లు పీత్రో బెహన్జీ కళనీ, బోధనాశక్తినీ తెగ మెచ్చుకుంటున్నారు. తమపిల్లలు ఆవిడదగ్గర నేర్చుకున్నందుకు హర్షం వెలిబుచ్చారు. నాలుగు బొమ్మలు అమ్ముడు పోయేయి ఆరోజు.

కుకీస్, ఛీజ్ ముక్కలూ కొరుకుతూ, కోకు తాగుతూ మాటాడుకుంటున్నారు.

“అద్భుతం, అమోఘం”

“ఇంతటి నైపుణ్యం సామాన్యులకి రాదు. పీత్రో బెహన్జీ అసామాన్యురాలు.”

“ఆవిడకి జేమీభాయి దొరకడం ఆవిడ అదృష్టం.” అని కొందరు మెచ్చుకుంటుంటే, ప్రతివాదనలు చేశారు కొందరు.

“ఏం అదృష్టం? అపురూపంగా మూడో అంతస్థులో మూసిపెట్టేడు ఆవిడని, గడపదాటి అడుగు పెట్టనివ్వడు. పదిరకాల మందులు. ఏదో నీరోలాజికల్ డిసార్డరు అంటారు. మా ఫ్రెండ్సు అతన్ని నల్లమందుభాయీ అంటారు. అందుకే మాఅబ్బాయి చేర్తానంటే నేను ఒప్పుకోలేదు” అన్నాడు ఒకాయన. ఆయన మరో స్నేహితుడి కూతురు సర్టిఫికేటు పొందుతోందని వచ్చేడు.

“అసలు ఆస్కూలు అతనే నడుపుతున్నాడుట. కరెస్పాండెన్సు కోర్సులు. ఇంటికి విడియోలు పంపిస్తాడు. ఫోనులో సలహాలు ఇస్తాడు. ఉత్తరాలకి అతనే జవాబులిస్తాడు. ఆవిడ మాట్లాడగా విన్నవారు కానీ చూసినవారు కానీ లేరు.”

“ఆర్భాటం మాత్రం బాగానే చేస్తాడు. ఊరి పొలిమేరల్లో ఇల్లూ, ఊళ్లో స్టూడియో, కారూ, వ్యానూ, ఇంటర్నెట్లో పాఠాలూ, న్యూస్ లెటరూ, ఎగ్జిబిషన్లూ, ... “

గీతా, హరీ మొహాలు చూసుకున్నారు. ఇద్దరికీ మనసులో ఏవో అనుమానాలు వచ్చేయి కానీ ఆమాట ఎవరితోనూ అనలేదు. అందరూ ఇళ్లకి బయల్దేరేరు.

గీత రాబర్టుని మరోసారి అభినందించి, తను సర్టిఫికేటు అందుకుంటున్నప్పుడు తీసిన ఫొటో కాపీ కావాలని అడిగింది.

విలియమ్స్ "మీ ఐడి ఇవ్వండి. ఈమెయిలు చేస్తాను" అన్నాడు.

గీత ఐడి ఇచ్చి మరిచిపోవద్దని మరోసారి చెప్పింది.

***

రాత్రి హరికీ గీతకీ కూడా నిద్ర పట్టలేదు ఒకంతట.

హరి ఉద్యోగంగురించి మథనపడుతుంటే, గీతని చిత్రగురించిన ఆలోచనలు వదలడంలేదు.

అర్ధరాత్రి దాటింది. "ఏమిటి ఆలోచిస్తున్నావు?" అని అడిగేడు హరి.

"ఆలోచించినకొద్దీ ఆవిడ చిత్రేనేమో అనిపిస్తోంది." అంది.

"ఏమో మరి. "

గీత కొంచెంసేపు మాటాడలేదు.

"అవున్లెండి. నాకు మాత్రం చిత్రే అనిపిస్తోంది. తపతిమాటలు - ఆమెవయసూ, నీరోలాజికల్ కండిషనూ, అతను పదిహేనేళ్లు పెద్దవాడు .. ఇవన్నీ తలుచుకుంటే ఆ అమ్మాయిలాగే వుంది. చిత్రే అయితే ఇక్కడ ఆఅమ్మాయికి ఎలా వుంది? బొమ్మలు వేసుకోడం తనకి ఆనందం ఇచ్చే పనయితే, తనమటుకు తనకి సంతోషంగానే వుండాలి కదా. మరి సంతోషంగా వుందా?"

"మరో కథ రాస్తావా?" అన్నాడు హరి నెమ్మదిగా.

"ఏమో" అంది గీత

తొలిసారి రాసినప్పుడు తాను ఒక మంచి కథ రాసేనన్న నమ్మకం కుదిరింది. ఓ చిన్నతెలుగు సైటుకి పంపింది. రెండు నెలలతరవాత ఆ సైటువారు ప్రచురించారు. మంచి వ్యాఖ్యలే వచ్చేయి. ఆ ఉత్సాహంలో మరో రెండు కథలు రాసింది. కానీ అవి బాగున్నట్టు అనిపించలేదు. అయినా ఆశ చావక తపతికి చూపించి అడిగింది.

తపతి చదివి, ''ఫరవాలేదు,'' అంది.

''మొదటి కథకీ, వీటికీ తేడా ఏమిటంటావు?''

''మొదటి కథలో ఒక స్నేహితురాలి ప్రవర్తన, ఒక సంఘటన నీమనసులో గట్టిగా నాటింది. నీవ్యథ ఆ కథలో వ్యక్తమయింది. ఈరెండు కథల్లో ఏదో రాయాలన్న తపనే కానీ ఒక అనుభవం, దానికి అనుగుణంగా నీ స్పందనా ఏమీ లేదు.''

''అవును కాబోలు'' అనుకుంది గీత ఆలోచిస్తూ.

''ఏదేనా పత్రికకో సైటుకో పంపించు. బాగుందనుకుంటే వేసుకుంటారు. లేకపోతే లేదు.'' అంది తపతి.

గీత రెండు నిముషాలు ఆలోచించి, బుట్టదాఖలా చేసింది ఆకాయితాలు.

''అయ్యో అదేమిటి. నామాటలే వేదవాక్యాలుగా తీసుకోకు.''

''ఎవరో ఎడిటర్ చేసేపని నేనే చేస్తే పోలా'' అంది గీత నవ్వుతూ.

గీత ఆ సంఘటన తలపుకొచ్చి, "రాయగలనో లేనో" అంది ఆలోచిస్తూ.

హరి తన ఆలోచనల్లో వుండి గీత మాటలు వినిపించుకోలేదు.

మర్నాడు ఉదయం ఏదో కతికి, బయల్దేరుతుంటే, షికాగోలో మేనేజరు ఉద్యోగంగురించి రమణ హరిని మళ్లీ అడిగేడు, "మీకు ఇష్టమేనా? ఇష్టమే అంటే నేను మరోసారి విలియమ్సుతో మాట్లాడతాను," అన్నాడు.

"మాట్లాడండి. నిజం చెప్పాలంటే మేనేజిరియల్ పోస్టు కంటే ప్రాజెక్టులలో పని చెయ్యడమే నాకు ఎక్కువ ఇష్టం," అన్నాడు హరి సందిగ్ధంగా.

"నిజమేలెండి. కానీ ఏవుద్యోగం లేకపోవడం కంటే ఏదో ఒక ఉద్యోగం నయం కదా, ప్రస్తుతానికి ఇది తీసుకుని, మీకు నచ్చిన వుద్యోగం తీరిగ్గా వెతుక్కోవచ్చు," అన్నాడు రమణ.

"అదీ నిజమేలెండి. కనుక్కోండి"

"కనుక్కుంటాను. వేరే అవకాశాలు కూడా చూస్తాను. మీ రెస్యూమె కాపీ పంపండి నాకు."

గీత ఫొటోసంగతి కూడా ఆయనకి గుర్తు చేయమని మరోసారి చెప్పింది.

తరవాత ఇద్దర్నీ రమణ కారులో ఎక్కించుకుని, airpportకి బయల్దేరాడు.

***

ఇంటికి తిరిగి వచ్చేక హరి తన రెస్యూమే తిరగరాయడం మొదలు పెట్టేడు.

గీత తపతికి ఫోను చేసి విశేషాలు చెప్పింది. పీత్రో బెహన్జీ సంగతి కూడా చెప్పింది.

"ఎలా వుంది? ఏం చేస్తోంది? నువ్వు మాటాడేవా తనతో?" అంటూ తపతి ఆతృతగా వెయ్యి ప్రశ్నలేసింది.

"ఏమో, తలొకరూ తలో మాటా, అసలు తను చిత్ర అవునో కాదో కూడా తెలీదు కదా. నాకేం అర్థం కావడం లేదు. ఫొటో అడిగేను ఆవిడగారి శిష్య పరమాణువుని. అది వచ్చేక, నువ్వే చూసి చెప్పు" అంది.

ఫొటో వచ్చింతరవాత. గీత ప్రింటు తీసుకుని తపతి ఇంటికి వెళ్లింది.

తపతి ఫొటో చూస్తూ, "చిత్రలాగే వుంది. కాస్త చిక్కినట్టుంది. హెయిర్ స్టైల్ మార్చింది కానీ చూస్తున్నకొద్దీ చిత్రే అనిపిస్తోంది," అంది సాలోచనగా.

ఇంక ఇప్పుడేం చెయ్యడం అన్నది పెద్ద ప్రశ్న. అసలు ఆ అమ్మాయి చిత్రే అని గట్టిగా చెప్పడానికి లేదు. చిత్రే అయితే ఆపిల్లజీవితం అక్కడ ఎలా వుంది? జేమ్స్ తనని బాగా చూసుకుంటున్నాడా? లేక మందులిచ్చి తనచెప్పుచేతల్లో పెట్టుకున్నాడా? ఒకవేళ అదే నిజమయితే అందులో తన పాలు ఎంత? గాయత్రిగారికి చెప్పడమా? మరిన్ని వివరాలు తెలిసేవరకూ వేచి వుండమా? - తపతి తనకి తనే ప్రశ్న మీద ప్రశ్న వేసుకుంటూ మథన పడుతోంది. ఆఖరికి చెప్పడానికే నిశ్చయించుకుని ఫోను తీసింది.

అవతలినించి గాయత్రి "హలో".

"నేనండీ. తపతిని"

"ఆఁ. తపతీ, బాగున్నారా? మా అమ్మాయి సంగతి ఏమైనా తెలిసిందా?" అన్నారావిడ ఆతృతగా. మునుపటి ఆవేశం లేదు ఆ కంఠంలో.

తపతి మనసు గిజగిజలాడింది. నెమ్మదిగా చెప్పింది, "అదేనండీ. ఆమాట చెప్పడానికే పిలిచాను. నాస్నేహితురాలు ఒకావిడ న్యూజెర్సీ వెళ్లి నిన్ననే వచ్చింది. చిత్రని చూడలేదు కానీ తనగురించి విందిట. వాళ్లిద్దరూ బాగానే వున్నారుట. చిత్ర వేసిన బొమ్మలు బాగానే అమ్ముడు పోతున్నాయిట."

"మీస్నేహితురాలు ఎక్కడ విందిట? ఏమని? ఎడ్రెసు కనుక్కోగలరా? ఒక్కమాటు మాట్లాడతాను" అందావిడ బొంగురుగొంతుతో.

తపతి వెంటనే, "నేనూ అదే అనుకుంటున్నానండీ. ప్రయత్నిద్దాం. అక్కడ తెలిసినవాళ్లెవరైనా కనుక్కుని చెప్పగలరేమో చూస్తాను. మీరు ధైర్యంగా వుండండి. తప్పకుండా కనుక్కుందాం" అని మరో పది నిముషాలు సర్వవిధాలా నచ్చచెప్పి ఫోను పెట్టేసింది.

గీత చెప్పినవిషయాలు తననే కలవరపెడుతున్నాయి. జేమ్స్ చిత్రని మందులిచ్చి తన చెప్పుచేతల్లో పెట్టుకున్నమాట నిజమే అయితే ఆ మాట ఆ తల్లికి ఎలా చెప్పడం? నిజం అవునో కాదో తెలీని మాటలు చెప్పి ఎందుకు ఆవిణ్ణి క్షోభ పెట్టడం అన్న అభిప్రాయంతో పూర్తి వివరాలు చెప్పలేదు. న్యూయార్క్ అని కూడా చెప్పలేదు.

***

గీత ఉద్యోగంలో చేరిన తరవాత హరి ఉద్యోగంగురించి మరీ మథనపడసాగేడు. ఆ విలియమ్స్ ఏదో ఒకటి త్వరగా తేల్చితే బాగుండునని మహా ఆరాటంగా వుంది. పైకి తేలకపోయినా గీత ఉద్యోగం అంతరాంతరాల ముల్లయి కెలుకుతోంది. ఆ మధ్య ఒకసారి టేషు మాటాడుతూ, "పోన్లే, కనీసం మీఆవిడ నాలుగు రాళ్లు తెస్తోంది కదా" అన్నాడు. ఎంత సర్దుకుపోదాం అన్నా అలాటి ఎత్తిపొడుపులు వినడం చేతకావడంలేదు.

గోరుచుట్టుమీద రోకటిపోటు. ఇండియానించి టెలిగ్రాం వచ్చింది. పోస్టాఫీసువాళ్లు ఫోనులో పిలిచి, ఇంట్లో ఎవరూ లేకపోతే, మెయిల్ చేశారు ఆవార్త.

హరి టెలిగ్రాం చూసి, టైం చూశాడు. గీత వచ్చే టైమవుతోంది.

గీత ఇంట్లో అడుగు పెడుతూనే హరిని అట్టే చూసి ఆగిపోయింది.

గీత లోపలికి వచ్చేవరకూ ఆగి, హరి నెమ్మదిగా "ఇంటినించి టెలిగ్రాం వచ్చింది" అన్నాడు.

"టెలిగ్రామా?" అంది గీత దడగడ కొట్టుకుంటున్న గుండెలతో.

"మీ అమ్మ గారు పోయారని" అన్నాడు కాయితం అందిస్తూ.

గీత నిశ్చేష్టురాలయి కూర్చుండిపోయింది. రప్మని మొహమ్మీద కొట్టినట్టయింది. అమ్మ పోయిందన్నమాట తలకెక్కడంలేదు. ఏదో జరిగింది. ఎవరికో జరిగింది. ... ఎలా పోయింది? ఎందుకు ఇలా జరిగింది? అలా ఎంతసేపయిందో చెప్పడం కష్టం.

ఆఖరికి హరే అన్నాడు, "వెళ్తావా?"

గీత వెర్రిగా చూసింది అతనివేపు. అవును. అమ్మని చూడాలి. వెంటనే వెళ్లాలి. అమ్మా, నేనొచ్చానమ్మా అని చెప్పాలి. ...

ఇంతలో భాగ్యంగారు ఫోను చేశారు. వూరికే హలో చెప్పడానికి పిలచారు.

హరి ఫోను తీసుకుని సంగతి చెప్పాడు. ఆవిడ అయ్యో అని బాధ పడి, నేనొస్తానండీ అని చెప్పి ఫోను పెట్టేశారు. ఆతరవాత హరి తపతిని పిలిచి చెప్పేడు.

తపతి అయ్యో అని నొచ్చుకుని, చిత్రని వాళ్లమ్మదగ్గర విడిచేసి వస్తానని చెప్పింది.

భాగ్యంగారు మరి కొంతమంది స్నేహితులకి కూడా చెప్పేరు విషాదవార్త. సాయంత్రం ఏడయేసరికి చాలామందే పోగయేరు గీతకి సానుభూతి చూపడానికి.

గీత మాత్రం రాయిలా కూర్చింది. బుద్ధీ, మనసూ కూడా గడ్డ కట్టుకుపోయేయి.

హరి మళ్లీ గీత దగ్గరికొచ్చి "టికెట్ సంగతి చూస్తాను" అన్నాడు.

నిజానికి అతనిమనసులో జరుగుతున్నది మరొక సంఘర్షణ. ఇండియా ప్రయాణానికి ఇది అనువైన సమయం కాదు. నిల్చున్నపాళాన ఇండియా వెళ్లడం అంటే మాటలు కాదు. ఏ బందరో, కాకినాడో వెళ్లడంలాటిది కాదు కదా. ముందు టికెట్ చూసుకోవాలి. టికెట్కి డబ్బు చూసుకోవాలి. గీత ఇప్పుడు బయల్దేరి వెళ్లినా, తను చేరేవేళకి శవం కూడా వుంచుతారో లేదో.

హరి ఆలోచనలకి వాగ్రూపం ఇచ్చేరు అక్కడ చేరిన జనాలు.

"మరి ప్రయాణం అవుతున్నారా గీతగారు?"

"ఇంత హఠాత్తుగా ప్రయాణం అంటే టికెట్ చాలా అవుతుందేమో."

"అయినా నువ్వెళ్లి చేసేదేముంది. మంచంలో వుంటే అదో దారి. అంతా అయిపోయినాక ఏముంది. కట్టెయినా వుంచుతారో లేదో!"

"మరే. ఆస్తులూ, నగలూ ఏమయినా వుంటే అదో దారి ..."

"ఆహా. నగలుంటే మాత్తరం వుంచుతారేంటి అక్కడున్నోళ్లు. మా అత్తగారు పోయినప్పుడు అట్లనే అయింది. ఒంటినిండా ఒంటెడు నగలు అచ్చు కనకమాలక్ష్మి మాదిరి వుండేది. మేం దిగేనాటికి నల్లపూసలు తప్ప మరేమీ కనిపిచ్చలేదు"

గీతకి ఉప్పెనగా దుఃఖం ముంచుకొచ్చింది. తపతి గీతచెయ్యి పుచ్చుకుని లేవదీసి, పక్కగదిలోకి తీసుకుపోయింది. తరవాత ముందుగదిలోకి వచ్చి, అక్కడ వున్నవాళ్లందరినీ పంపించేసింది అవసరం అయితే పిలుస్తాం అని చెప్పి.

భాగ్యంగారు వంటింట్లోకి వెళ్లి కాఫీ పెట్టి, తీసుకొచ్చారు, "ఓ గుక్క తాగమ్మా." అంటూ.

గీత కప్పు తీసుకుని పక్కన పెట్టేసింది. ఆవిడ గీత బుజంమీద చెయ్యేసి, చిన్నగా తట్టి, తరవాత పిలవమని తపతితో చెప్పి శలవు తీసుకున్నారు.

హరి తపతిని పక్కకి పిలిచి, "ఏం చెయ్యమంటారు? నాకేం తోచడం లేదు" అన్నాడు.

"ప్రయాణం మాటా?"

హరి అవునన్నట్టు తలూపేడు.

"గీతని మరోసారి అడిగి చూడండి."

"ఏమని అడగను? తనకి వెళ్లాలనే వుంటుంది. నాకూ తెలుసు. కాని పరిస్థితి చూడండి. నాకా వుద్యోగం లేదు. తనా ఇప్పుడే కొత్తగా చేరింది. వెళ్లి మాత్రం ఏం చేస్తుంది? వాళ్లెవరో అన్నమాట కటువే అయినా నిజమే. టికెట్ దొరికి, తను అక్కడికి చేరేసరికి శవమయినా చూడడం అవుతుందో లేదో తెలీదు."

"అవునండీ. గీతతో మీరే చెప్తే బాగుంటుంది."

హరి నెమ్మదిగా వచ్చి, "నువ్వు వెళ్తానంటే టికెట్ సంగతి కనుక్కుంటాను." అన్నాడు. మిగతా విషయాలు మాటాడడానికి అతనికి నోరు రాలేదు. డబ్బుకి వెనకాడి, తల్లి కడసారి చూపులు లేకుండా చేశాడన్న అప్రతిష్ఠ తను భరించలేడు.

గీత నెమ్మదిగా మనలోకంలోకి వచ్చింది. "నేను వెళ్లి చేసేదేముందిలెండి" అంది.

హరి మళ్లీ వచ్చి "గీత తరవాత చూద్దాం అంటోంది" అన్నాడు తపతితో.

తపతి నిట్టూర్చింది. ఇదే దేశంలోనే వుంటే ఇలా జరుగునా? ఆఘమేఘాలమీద తల్లిపక్కన వాలి వుండును. ఇలాటి సందర్భాలలోనే పరాయిదేశంలో వున్న మనబతుకులు ఎంత దౌర్భాగ్యమో వ్యక్తమయేది. "ఎంత సంపాదించి మాత్రం ఏంలాభం?" "చివరికింతే గదా!" లాటి వైరాగ్య ప్రవచనాలు ఎంత వద్దనుకున్నా తలలో మెదలకమానవు.

రెండోరోజు గీత ఆఫీసుకి బయల్దేరింది.

"రెండు రోజులు శలవు పెట్టకూడదూ?" అన్నాడు హరి.

ఇంట్లో వుంటే మరీ బాధగా వుంది. కనీసం అక్కడ పనిలో కాస్త ఉపశాంతి పొందొచ్చు. "లేదులెండి, వెళ్తాను" అంటూ వెళ్లిపోయింది.

గీత అలా అనడంలో ఆశ్చర్యం లేదు. బాంకులో సహోద్యోగులు తనని గౌరవంగా చూస్తున్నారు. తన కంప్యూటర్ ప్రజ్ఞ కూడా బాగా పనికొస్తోంది. కంప్యూటరుమీద ఎవరికి ఏ చిన్నకష్టం వచ్చినా తను తీర్చిపెడుతోంది. మేనేజరుకి తనంటే మంచిఅభిప్రాయం ఏర్పడింది. తన తెలివితేటలూ, చాకచక్యం చూసి త్వరలోనే తనని లోను ఆఫీసరు చేస్తానన్నాడు. కొత్త స్నేహాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా mortgage విభాగంలో పని చేస్తున్న కీషాకి తనంటే ఎంతో అభిమానం. ఇంతకుముందు హరిలోకమే తనలోకం. తన

స్నేహాలన్నీ హరిద్వారా కలిగినవే. ఇప్పుడు కేవలం తనని చూసి తన స్నేహం కోరేవారు కనిపిస్తున్నారు. గీతకి ఒక అస్తిత్వాన్నిచ్చింది ఆ ఉద్యోగం.

***

ఓ నెలరోజుల పోయేక, విలియమ్స్ ఫోను చేశాడు. షికాగోలో బ్రాంచి ఏర్పాట్లకి తాను షికాగో వస్తున్నాననీ, హరి కూడా షికాగో వస్తే వివరాలు మాటాడుకోవచ్చనీ.

"సరే. తప్పకుండా వచ్చి మిమ్మల్ని కలుస్తాను," అన్నాడు హరి.

హరి శుక్రవారం బయల్దేరి షికాగో వెళ్లేడు. ఆదివారం సాయంత్రం తిరిగి వస్తానని చెప్పేడు.

శనివారం మధ్యాన్నం ఏంతోచక తపతికి ఫోన్ చేసింది గీత. అవతలినుంచి ఏజవాబూ లేదు. బయటికి వెళ్లిందేమోననుకుని, సాయంత్రంవరకూ ఆగి మళ్లీ చేసింది. కాస్త చీకటి పడ్డాక మళ్లీ చేసింది. మామూలుగా తపతి ఆవేళప్పుడు ఎక్కడికీ వెళ్లదు. గీతలో తలెత్తిన అనుమానం పెనుభూతంగా రూపు దిద్దుకోసాగింది. ఒకవేళ ఒంట్లో బాగులేదేమో. ఒక్కర్తే వుంటుంది. ఏమైనా జరిగితే … అమ్మో … నన్ను పిలవొచ్చు కదా. ..

గీత ఉండబట్టలేక, రాధని పిలిచి చెప్పింది. ఆవిడ "అనుకోకుండా పిల్లలదగ్గరికి వెళ్లాల్సొచ్చిందేమో. మీరేం కంగారు పడకండి. అంత ప్రమాదం అయితే ఆవిడే తప్పకుండా పిలిచి చెప్పివుండేవారు కదా" అంది.

గీత ఉండబట్టలేక కారు తీసుకుని తపతిఇంటికి బయల్దేరింది.

తలుపు తట్టి చూసింది. మనిషి అలికిడి లేదు. గరాజులోకి తొంగి చూసింది. కారు అక్కడే వుంది. దిక్కు తోచక అటూ ఇటూ చూస్తుంటే, ఎదురింటాయన మొక్కలకి గొప్పులు తవ్వుతూ కనిపించేడు. ఆయన్ని అడిగితే, రెండురోజులుగా తనకీ కనిపించలేదనీ, పోలీసులకి రిపోర్టు ఇవ్వమనీ సలహా ఇచ్చేడు. తనయింట్లోనించి ఫోను చెయ్యమన్నాడు. గీత గాభరా పడిపోతూ ఆయన్నే పిలవమంది.

పావుగంటలో రెండు పోలీసుకార్లూ, నలుగురు పోలీసులూ, ఆంబులెన్సూ, లక్ష ప్రశ్నలూ..

"ఆవిడ వయసెంత? ఇంగ్లీషు వచ్చునా? కళ్లు కనిపిస్తాయా? చెవులు వినిపిస్తాయా? ఆరోగ్యసమస్యలు ఏమైనా వున్నాయా? ఎమర్జెన్సీ రూంలో వాకబు చేసారా? … "

ఒకొక ప్రశ్నతో గీతగుండెలు అంచెలంచెలుగా దిగజారిపోతున్నాయి. అది చూసి, పొరిగింటాయన జవాబులివ్వడం మొదలు పెట్టేడు. దాంతో పోలీసులు తమ జోరు కాస్త తగ్గించేరు.

ఇంతలో ఇంటిముందు టాక్సీ ఆగింది. తపతి, దిగి వస్తుంటే పోలీసులు అడ్డుపడ్డారు.

గీత ఒక్క ఉదుటున లేచి, పరుగెత్తుకు వెళ్లి తపతిని కౌగలించుకుని, "ఎక్కడికెళ్లావు? నాకెందుకు చెప్పలేదూ? చచ్చినంత పనైంది నాకు" అంటూ అరిచేసింది.

"ఏమైంది? ఈ పోలీసులేమిటి?" అంది తపతి కూడా కంగారు పడిపోతూ.

తపతి క్షేమంగానే వుందని మొట్టమొదట గ్రహించింది పక్కింటాయన. పోలీసులకి ఆవిడే తపతి అనీ, వాళ్లు వెళ్లిపోవచ్చుననీ చెప్పి పంపించేసి, తపతికి సూక్ష్మంగా వివరించేడు సంగతులు.

“మీరు నాయందు అంత శ్రద్ధ చూపినందుకు కృతజ్ఞతలు. మీకు శ్రమ కలిగించినందుకు క్షమాపణలు.” అని చెప్పి ఆయన్ని పంపించేసి, “ఇంట్లోకి పద. కథంతా చెప్తాను” అని గీతకి చెప్పి, టాక్సీవాడికి డబ్బులిచ్చేసి, వెనక సీటులో వున్న చిత్రనీ, ట్రంకులో వున్న సూటుకేసునీ తీసుకుని వచ్చింది.

గీతకి తాను చూసిన పీత్రో బెహన్జీ చిత్రే అని అర్థమయిపోయింది.

తపతి చిత్రని బాత్రూంలోకి తీసుకెళ్లి మొహం కడుక్కురమ్మని చెప్పి, గీతతో “కాఫీ పెట్టు, బట్టలు మార్చుకు వస్తాను” అంది.

గీత తపతిని మింగేసేలా చూస్తూ వంటగదిలోకి నడిచింది. పోలీసులముందూ, పక్కింటాయనముందూ తన పరువు పోయిందని మహామంటగా వుంది ఆవిడకి.

జరిగింది ఏమిటంటే ...

తపతికి అర్థరాత్రి న్యూయార్క్ ఫోనొచ్చింది. “ఇక్కడ పీత్రో అన్న పేరు గల ఒక చిన్నది ఆపదలో వుందనీ, కాంటాక్ట్ నెంబరుగా మీ నెంబరు ఇచ్చింది” అనీ చెప్పారు.

తపతి నాలుగు ప్రశ్నలు వేసి, ఆ అమ్మాయి చిత్రే అని నిశ్చయించుకుని, వెంటనే బయల్దేరి వస్తున్నానని చెప్పి, దొరికిన ప్లైటు తీసుకుని న్యూయార్క్ చేరుకుంది.

వారంరోజులకిందట ఆక్సిడెంటయి, జేమ్స్ లేక జేమీభాయి ప్రాణాలు అక్కడికక్కడే పోయేయిట. చిత్రకి నా అన్నవాళ్లు ఎవరూ వున్నట్టులేదనీ, మందబుద్ధి అనీ పొరుగువాళ్లు సోషల్ వెల్ఫేర్ వాళ్లని పిలిచారు. వాళ్లొచ్చి చిత్రని తాత్కాలికంగా గ్రూపుహోంలో పెట్టేరు. చిత్రకి ఎందుకు ఎలా తోచిందో చెప్పలేం కానీ తపతిని పిలవాలని తోచింది. ఆవిడ తనకి తొలిసారి ఇచ్చిన పెయింటు బ్రష్షూ, ఫోన్నెంబరూ ఓ చిన్నపెట్టెలో పదిలంగా దాచుకుంది. గ్రూపుహోంలో సూపర్వైజరు ఆపిల్ల పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోడానికి ప్రయత్నిస్తున్న సందర్భంలో ఆ పెట్టె చూపించి, ఆనెంబరు పిలుస్తానంది. సూపర్వైజరు మొదట రూల్సొప్పవని గునిసినా, చిత్ర వేసిన బొమ్మలు చూసి, రూల్సు వంచి, తపతిని పిలవడానికి ఒప్పుకుంది. తపతికి పిలుపు రాగానే ఫ్లైటు అందుకున్నందున గీతకి చెప్పే అవకాశం లేకపోయింది. అక్కడికి వెళ్లింతరవాత ఫోను చేద్దాం అనుకుంది కానీ అక్కడ చూసుకోవలసిన వ్యవహారాలు తలమునకలు కావడంతో గీతని పిలవడానికి వీల్లేకపోయింది.

తపతి గాయత్రిని పిలిచి చెప్పింది. గాయత్రీ, సోమలింగం ఆదరా బాదరా వచ్చేరు గుండె గోక్కుంటూ.

“ఎన్నాళ్లకి కళ్లబడ్డావు తల్లీ, మళ్లీ నిన్ను చూడనేమోనని కటకటలాడిపోతున్నాను” అంది తల్లి కన్నీళ్లతో.

“మమ్మల్నెందుకు పిలవలేదూ?” అంటూ కసురుకున్నాడు తండ్రి. “మీకు ఫోన్కాల్ రాగానే మాకు చెప్పవలసింది” అన్నాడు తపతితో.

“తరవాత చూసుకుందాం ఆగొడవలు. పదండి, ఇంటికెళ్దాం” అంది గాయత్రి.

చిత్ర కదల్లేదు. తండ్రి చెయ్యి పుచ్చుకు లేవదీయబోతే, తోసేసింది.

కొంత తర్జనభర్జనలయేక, ''రెండు రోజులు ఇక్కడ వుండనివ్వండి. కాస్త స్తిమితపడితే తనే వచ్చేస్తుంది'' అంది తపతి.

చిత్రమొహంలో చిన్న వెలుగురేఖ మెరిసింది.

తల్లిదండ్రులు చిన్నబుచ్చుకుని వెళ్లిపోయేక, తపతి గీతవేపు తిరిగి ''ఏం చేద్దాం?'' అంది.

''బాగుంది. నన్నడిగితే నేనేం చెప్పగలను?''

''మరెవర్ని అడగను? నీకు పిల్లల్లేరు. నాకు వున్న ఇద్దరూ వాళ్లబతుకులు వాళ్లు బతుకుతున్నారు. వాళ్లకి నేను చెయ్యవలసిందేమీ లేదు. అంచేత ఇప్పుడు ఈ చిట్టితల్లి బాధ్యత మనిద్దరిదీను.''

''నామొహంలాగే వుంది నీలాజిక్కు.''

''నీమొహానికేం బహుసుందరంగా వుంది. అలాగే నాలాజిక్కూను. చెప్పు ఏంచేద్దాం?.''

గీత ఆలోచిస్తూ, ''నువ్వు మొదట జేమ్స్ని పరిచయం చేసినప్పుడు ఈ సుందరకాండ అంతా ఊహించలేదు కదా. నువ్వన్నట్టే రెండ్రోజులు ఊరుకుంటే ఆపిల్లే చెబుతుందేమో,'' అంది.

***

వారం గడిచింది. ఇంటికెళ్లడానికి చిత్రలో చిన్నమెత్తు సుముఖత అయినా కనిపించడంలేదు.

ఓరోజు తపతి ఏదో రాసుకుంటుంటే చిత్ర నెమ్మదిగా వచ్చింది. సాధారణంగా ఆ అమ్మాయి తనగదిలోకి రాదు. అసలు తను ఇంట్లో వున్నట్టే లేదు.

తపతి నవ్వుతూ, ''రా'' అంది పుస్తకాలు పక్కకి జరిపి, మంచంమీద చోటు చేస్తూ.

చిత్ర మంచంఅంచున కూర్చుని, మాటాడకుండా ఓకవరు అందించింది తపతికి.

''ఏమిటది?'' అంటూ తపతి కవరు తీసి చూసింది, అవి గవర్నమెంటు బాండులు పాతికవేలకి. తపతి అదిరిపడింది అవి చూసి. ''ఎక్కడివీ ఇవి? నీకెలా వచ్చేయి?'' అంది.

క్షణకాలం ఇదెక్కడి గొడవ అని కూడా అనిపించకపోలేదు. డబ్బు అనగానే అ తల్లిదండ్రులు ఏమంటారో, ఏమనుకుంటారో అన్న ప్రశ్న ఉదయించకమానదు కదా. రోజులు సాఫీగా సాగిపోతున్నాయి అనుకున్నప్పుడల్లా ఏదో ఓ కలకలం. తపతి ఏ నిర్ణయానికీ రాకముందే గాయత్రి పిలిచింది. అన్నలు ఇద్దరూ చెల్లెలు తిరిగొచ్చిందని తెలిసి వచ్చేరుట. ''మీకు ఫరవాలేదంటే వస్తాం'' అంది గాయత్రి.

''రండి, తప్పకుండాను, సాయంత్రం రండి'' అని చిత్రకి చెప్పింది, ''మీ అన్నలు వస్తున్నారు నిన్ను చూడ్డానికి'' అని.

చిత్ర ఊఁ అంది. అంతే.

వాళ్లు వచ్చి ఆమాటా ఈమాటా మాట్లాడుతుండగా తపతి బాండ్స్ విషయం చెప్పింది. అనుకున్నంతా అయింది.

''ఇంతకాలంగా బిజినెస్ చేస్తున్నారు, అందులోనూ న్యూయార్కులో. పాతికవేలేనా? కనీసం రెండు లక్షలుండాలి'' అన్నాడు పెద్దన్న.

తపతి చిరాకునణుచుకుని, "అదంతా నాకు తెలీదు. అయినా ఇక్కడి సంపాదనలు మీకు మాత్రం తెలీపేమిటి? అన్నీ అప్పులే కదా. ఇంటిమీద అప్పూ, కార్లమీద అప్పూ, క్రెడిట్ కార్డులమీద అప్పులూ - అంతా ప్రొబేటుకోర్టులో వుంటుంది. మీరే చూసుకోండి. ఈ బాండ్స్ వున్నాయని నాకు తెలీనే తెలీదు ఇంతవరకూ. అవి మీచెల్లెలి ఇష్టం." అంటూ ఆ కోర్టు వ్యవహారాల ఫోన్ నెంబరిచ్చింది.

"చెల్లెల్ని తమ ఇంటికి తీసుకుపోతాం" అన్నారు అన్నలిద్దరూ.

చిన్నన్న ప్రోగ్రామరు. చిత్రకి సైటు తయారుచేసి, తను వేసిన బొమ్మలు అక్కడ అమ్ముతాను అన్నాడు.

గాయత్రి ఒప్పుకోలేదు. "ఇంతవరకూ అయిన నాటకం చాలు. ఏ సైటులూ వద్దు. అమ్మకాలూ వద్దు. దానిమానాన దాన్ని బతకనియ్యి" అంది.

"జేమ్స్ లాగ మనం పిల్లని ఓ భారీపరిశ్రమ చెయ్యక్కర్లేదు. కానీ దాని బొమ్మలు పదిమందీ చూసి ఆనందిస్తే దానికి తృప్తే కదా" అన్నాడు తండ్రి.

తపతి చిత్రని పక్కకి పిలిచి "ఏమంటావు?" అని అడిగితే, "మీయిష్టం" అంది ఆ అమ్మాయి. చిత్ర కనీసం ఈ మాత్రమయినా అభిప్రాయంలాటిది వెలిబుచ్చడం ఇదే తొలిసారి.

"మీ చిన్నన్న నిజంగా మనస్ఫూర్తిగా నమ్మి చెబుతున్నట్టుంది" అంది తపతి.

చిత్ర మాటాడలేదు. ఇహ తప్పదు. తనే ఏదో ఒక నిర్ణయం చేయాలి. "అలాగే. ఆలోచిద్దాంలెండి" అని వాళ్లకి నచ్చచెప్పి పంపేసరికి తాతలు దిగొచ్చారు.

***

హరి ఆదివారం రాత్రి తిరిగొచ్చేడు. "ఉద్యోగం ఖాయం. పదిరోజుల్లో చేరాలి," అన్నాడు పొంగిపోతూ.

గీత కూడా సంతోషించింది, హమ్మయ్య, కష్టాలు గట్టెక్కేయి అనుకుంటూ. తపతిని పిలిచి చెప్పింది. ఆవిడ హరికి అభినందనలు తెలిపింది.

హరి హుషారుగా స్నేహితులనందర్నీ పిలిచి చెప్పేడు. వాళ్లందరూ అభినందించి పార్టీ ఇవ్వాలని గట్టిగా చెప్పేరు. వూరు వదిలి వెళ్లిపోతున్నందుకు విచారం వెలిబుచ్చేరు. అయినా షికాగో ఎంత దూరం కనక అని సమాధానాలు చెప్పుకున్నారు.

పలకరింపులూ, అభినందనలూ, విచారాలు వెలిబుచ్చడాలూ అయింతరవాత, హరి గీతతో అన్నాడు, "మనం షికాగోకి మార్చాలి కాపురం," అని.

అప్పుడు తలకెక్కేయి గీతకి రాబోయే పరిణామాలు. మొదటిది తన ఉద్యోగం.

"అంటే ఇక్కడ నాఉద్యోగానికి తిలోదకాలు" అంది. పెళ్లిచూపులనాడు ఇలాటి సంభాషణే జరిగింది తమ ఇద్దరిమధ్య. కానీ హరికి గుర్తున్నట్టు లేదు.

"అయితేనేం. అక్కడ మరోటి చూసుకోవచ్చు అంతగా కావాలనుకుంటే," అన్నాడు తేలిగ్గా, కాయితాలు చూసుకుంటూ.

గీతకి మనసు చివుక్కుమంది. గొప్పఉద్యోగం కాకపోవచ్చు కానీ తనకొక ప్రత్యేకతని తెచ్చిపెట్టింది అది. ఆమాట హరికి తెలీలేదు. జీవితంలో రెండోసారి సర్వస్వం వదిలేసుకు పోతున్న భావన కలిగింది. ఆరోజంతా ముభావంగానే వుంది.

మర్నాడు హరి మాధవుకి ఫోను చేస్తే రాధ తీసింది ఫోను. ఆయన ఇంట్లో లేరని చెప్పి, "షికాగో ప్రయాణం ఎప్పుడు?" అని అడిగింది యదాలాపంగా.

కొత్త ఆఫీసు కనక చూసుకోవాల్సినవి చాలా వుంటాయనీ, వెంటనే చేరాలనీ అన్నాడు.

"గీతగారికి ఇక్కడ వుద్యోగం బాగుంది. వదిలేసి పోవడం పాపం ఆమెకి కష్టం అనుకుంటా" అంది రాధ.

"ఏం కష్టం అండీ? ఆమాత్రం వుద్యోగాలు ఎక్కడ దొరకవు కనక,"

"అవుననుకోండి," అని, మాధవు వచ్చేక చెప్తానని చెప్పి ఫోను పెట్టేసింది.

హరికి ఓ పావుగంట పట్టింది రాధమాటల్లో అంతరార్థం. గీత లివింగ్రూంలో కూర్చుని టీవీ చూస్తోంది. కాస్సేపు ఆలోచించి, "మీ ఆఫీసులో మనం ఊరు మారుతున్నాం అన్న మాట ఇప్పుడే చెప్పకు. కొన్నాళ్లు చూద్దాం. నువ్వు ఇక్కడే వుండి నీపని చూసుకో. కొత్త ఉద్యోగం ఎలా వుంటుందో తెలీదు కదా. నేను చిన్న ఇల్లు తీసుకుని అక్కడ వుంటూ, నా పని చూసుకుంటాను. వీకెండ్స్ వస్తాను. అక్కడి వ్యవహారం ఓ కొలిక్కి వచ్చేక చూద్దాం" అన్నాడు.

"సరే"నంది గీత.

***

'మరి పార్టీ ఎప్పుడండీ" అంది రాధ గీతని పిలిచి.

"చూద్దాం లెండి" అంది గీత. పార్టీ ఇవ్వకూడదని కాదు కానీ చాకిరీ తలుచుకుంటే సరదాగా లేదు.

"చూద్దాం అంటే ఒప్పుకోంవండీ. మీరు అట్టే కష్టపడక్కర్లేదు లెండి. మేం అంతా లేం? అచలని పిలుద్దాం." అంది.

సాంప్రదాయాలు అంచెలంచెలుగా మారిపోతున్నాయి. ఇంటావిడే వంటంతా చెయ్యడం, పాట్లక్కులూ తగ్గి, కేటరింగు మొదలయింది.

"అచల ఎవరూ?"

"కేరళ అమ్మాయి. కేటరింగ్ చేస్తోంది చదువూ, బతుకూ సాగించుకోడానికి."

"సరే. నెంబరివ్వండి. పిలుస్తాను."

హరి కూడా "చాలామందిని పిలవాలి. అంచేత అచలని పిలవడమే మంచిది. నువ్వు ఒక్కదానివీ చెయ్యలేవు" అన్నాడు.

గీతకి మొదట అంతగా నచ్చలేదు. మనలాగే ఇక్కడ గొప్పచదువులూ, ఉద్యోగాలకోసం వచ్చినవాళ్లని వాడుకోడం ఏమిటని. కానీ మళ్లీ ఆ అమ్మాయే చేస్తానంటోంది కదా, ఇది కూడా సాయమే అనుకుని పిలచింది.

ఫోను తీస్తూనే, అచల సంతోషంగా "అలాగే ఆంటీ. ఎప్పుడు?" అని అడిగింది.

"వచ్చేవారం కాక పైవారం. దాదాపు నలభైమంది వుంటారు. పిల్లా, పెద్దా. అంతా మనవాళ్లు కారు. అమెరికనులు కూడా వుంటారు. అంచేత వంటలు అన్ని రకాలూ - కారంగానూ, తియ్యగానూ, ఉప్పగానూ, చప్పగానూ, అలా ..." అంది గీత వివరాలు చెప్తూ.

"అలాగే ఆంటీ. నాకు అలవాటేలెండి. మీరు మెన్యూ చెప్తే, మిగతా సంగతులు నేను చూసుకుంటాను" అంది అచల.

"మరి ఛార్జీ మాట చెప్పండి. ఎంత అవుతుందో, నేనేం చెయ్యాలో."

"చూద్దాంలెండి మీరు మెన్యూ చెప్పండి"

"అలా కాదు. నాకు ఇదంతా కొత్త కదా. అంచేత అడుగుతున్నాను"

"ఏం చేస్తానో దాన్నిబట్టి చెప్తానండీ. మొదటిసారి 10 పర్సెంటు డిస్కౌంటు. మీకు 15 పర్సెంటు ఇస్తాలెండి."

గీత తెల్లబోయి, "అయ్యో, నేను తగ్గింపుధరలకోసం అడగడంలేదండీ. ఎంత తీసుకుంటారు అని అడిగేనంతే. నాకు డిస్కౌంటు ఇవ్వక్కర్లేదు" అంది.

అచల ఒక్క క్షణం ఆగి, "మన ఇండియన్సు అంతా డిస్కౌంటు అడుగుతారండి" అంది.

గీతకి చిరాకేసింది, "రిఫరల్ ఫీ కూడా అడుగుతారా?"

"ఒకొకప్పుడు. రాధగారు అలా కాదులెండి" అంది అచల.

అచల సాధారణంగా మనవంటలే చేస్తుంది కనక కస్టమర్లు అందరూ మనవాళ్లే. నిజానికి హోటల్ వాళ్లకంటే తక్కువే తీసుకుంటుంది. అయినా అందులో బేరాలు, మనం, మనం అంటూ వేలకి వేలు సంపాదిస్తున్నవాళ్లు కూడా గీచి గీచి బేరాలు పెట్టడం గీతకి హేయంగా అనిపించింది. "పాపం ఆ డబ్బుకోసమే కదా ఆ అమ్మాయి ఒప్పుకుంటోంది ఈ కూలిపనికి" అన్న జ్ఞానం ఎవరికీ వున్నట్టు లేదు. ఆక్షణంలో గీతకి విపరీతమయిన ఏహ్యభావం కలిగింది మనవాళ్లమీద. ఆ కక్షతోనే పార్టీ సూక్ష్మంగా ముగించేయాలన్న తలపు కూడా కలిగింది.

హరి ఒప్పుకోలేదు. "మనం ఇచ్చే చివరిపార్టీ ఇది. చాలామంది వస్తారు. పైగా నువ్వు వంటకాలు తగ్గిస్తే అచలకే కదా నష్టం. తక్కువ చేస్తే తక్కువ ఆదాయం" అన్నాడు.

గీతకి నిజమే అనిపించింది.

మొత్తమ్మీద పార్టీ ఘనంగానే జరిగింది. అచల అమెరికనులకీ, ఇండియనులకీ, అమెరికాభోజనాలు అలవాటయిన ఇండియనులకీ, పిల్లలకీ, పెద్దలకీ రకాలవారీగా వంటకాలు చేసి అందర్నీ సంతోషపెట్టింది షడ్రుచులతో. చాలా బాగున్నాయని వచ్చినవాళ్లందరూ మెచ్చుకున్నారు.

అచల ఏమీ తినలేదు. అది చూసి, గీత "అవియల్, బిసిబిళ్లహోగి అన్న, సాంబారూ అవీ చాలా రుచిగా వున్నాయండీ. కొంచెం తిని చూడండి," అంది నవ్వుతూ ఒకప్లేటులో వంటకాలన్నీ పెట్టుకొచ్చి.

అచల కూడా నవ్వుతూ, "నేనే చేసేను కదా ఆంటీ, తినాలనిపించదు." అంది, ప్లేటు తీసుకుంటూ.

“అలా అయితే, మిమ్మల్ని మరోరోజు భోజనానికి పిలిచి, నేనే వంట చేసి పెడతాను.”

పార్టీకి తపతి చిత్రని తీసుకొచ్చింది. చిత్రతోపాటు అచలా మరో అబ్బాయి ఓ వారగా కూర్చుని, అక్కడ చేరినవాళ్లనందరినీ చూస్తున్నారు సినిమా చూస్తున్నట్టు. అబ్బాయి సన్నగా, నాజుగ్గా. పచ్చని పసిమిరంగుతో సంస్కృతనాటకాల్లో రాకుమారి వేషానికి తగుతాడు అనిపించేలా వున్నాడు.

"ఎవరతను?" అని గీతని అడిగితే, “గణపతి రూమ్మేటుట. ఆయనే తీసుకొచ్చాడు. యూనివర్సటీలో యం.యస్. చేస్తున్నాట్ట” అంది.

“సునాద అద్భుతంగా పాడతాడు. అతన్ని ఓ పాట పాడమనండి” అన్నారెవరో. తపతి ‘ఎవరా సునాద’ అనుకుంటూ చుట్టూ చూస్తే, చిత్ర పక్కన నిశ్శబ్దంగా కూర్చుని వున్న సుకుమారుడే అని అర్థం అయింది. అతని మిత్రబృందం అతన్ని రెక్కపుచ్చుకు గది మధ్యలోకి లాక్కొచ్చి, పాడు పాడంటూ గోల పెట్టేరు.

అతను మొహమాటపడుతూనే గళం విప్పి, “కలగంటి, కలాగంటి కమలారేకులవంటి కన్నులూ గల స్వామి కనుపించెనే” అని పాడుతుంటే, కోకిలలు పలికేయి. అంతవరకూ గలగల్లాడుతూ కబుర్లు చెప్పుకుంటున్నవాళ్లందరూ మాటలాపేసి విన్నారు ఆశ్చర్యంగా. అద్భుతంగా ఉందని అంతకుముందు విననివారు మరొక్క పాట, మరొక్క పాట అంటూ దాదాపు గంటసేపు అతనిచేత పాడించుకుని మరీ విన్నారు.

చిత్ర మొహం విప్పారింది. తపతి అది చూసి తీసుకురావడం మంచిదే అయింది అనుకుంది మనసులో.

“సంగీతం నేర్చుకున్నారా?” గీత సునాదని అడిగింది.

“లేదండీ. మా అమ్మ గొప్ప విద్వాంసురాలు. కచేరీలు చెయ్యలేదు కానీ చేస్తే సుబ్బలక్ష్మి, వసంతకుమారిగారల స్థాయిలో వుండేది. మా నలుగురు అక్కయ్యలు కూడా గాయనీమణులే. రేడియోల్లోనూ అక్కడా చిన్న చిన్న కచేరీలు చేస్తూంటారు. మాయింట కిటికీలూ తలుపులూ కూడా కదిలిస్తే కిర్రుమనవు సరసనాదాలే తప్ప లేపాక్షిలో స్థంభాల్లాగ. నాది మాత్రం శృతపాండిత్యం.”

“సునాద పేరు బాగుంది కొత్తగా. మీకు అతికినట్టు సరిపోతుంది.”

సునాద నవ్వేడు. “మాఅమ్మ అసలు సరిగమపదని అని పెట్టాలనుకుందిటండీ. మానాన్నగారు మరీ పొడుగ్గా వుంది అంటే కుదించి సనిద అందిట. అదే దరిమిలా సునాద అయిపోయింది. ఈమధ్య ఒక టెల్గూ పండిట్జీ శ్రీనాథ ప్రకృతి అనీ సునాద వికృతి అనీ చెప్పేడు నాకు.”

గీత నవ్వింది. చిత్ర అతనివేపు తదేకంగా చూస్తోంది. సునాద చాలాసేపు అక్కడే కూర్చుని వాళ్లిద్దరితో చాలాసేపు కబుర్లు చెప్పేడు. తను ఇండియానుంచి చాలా టేపులు తెచ్చుకున్నాడుట. తనకి కర్ణాటక సంగీతం ఎక్కువ అర్థం అవుతుందిట కానీ హిందూస్థానీ సంగీతం ఎక్కువ ఇష్టంట.

“నాకు అంత పాండిత్యం లేదులెండి. నాకు తెలీదు” అంది గీత.

“కిషోరీ అమోంకర్ సంగీతం విన్నారా ఎప్పుడయినా?”

"లేదు. పేరు కూడా వినలేదు."

"నేను మీకు టేపు ఇస్తాను. వినండి. మీకే తెలుస్తుంది."

మిగతా అతిధులతో మాటాడకపోతే బాగుండదని, గీత "ఇప్పుడే వస్తాను" అని లేస్తూంటే తపతి వచ్చింది. ఆవిడ కూడా సునాద సంగీతాన్ని చాలా మెచ్చుకుంది. ఇద్దరూ సంగీతజ్ఞులే కనక ఇంకా పైస్థాయిలో సాగింది సంభాషణ.

వచ్చినవారందరూ ఒకొకరే మెల్లిగా లేచి శలవు తీసుకునేసరికి పదకొండు దాటింది.

***

వారంరోజులనాడు గీత ఏదో రాసుకుంటుంటే సునాద ఫోన్ చేశాడు. "మీకు కిషోరీ అమోంకర్ టేపులు ఇస్తానన్నాను కదండీ. మీకు ఓ రెండు నిముషాలు ఖాళీ అంటే తీసుకొస్తాను" అన్నాడు.

"రండి, ఖాళీయే" అని ఫోను పెట్టేసింది ఆశ్చర్యపోతూ. మాటవరసకి అన్నాడు అనుకుంది కానీ నిజంగా తెస్తాడు అనుకోలేదు.

శనాదివారాలు తప్పిస్తే హరి ఇంట్లో వుండడంలేదు కనక సునాద వస్తానంటే మంచి కాలక్షేపమే అనిపించింది. అరగంటలో వచ్చేడు అతను. ఎలాగా భోజనంవేళే కనక భోంచేయమంది.

"మీకేం ఇబ్బంది కాకపోతే వుంటాను" అన్నాడు.

"నాకు ఇబ్బంది లేదు. అన్నం వండుతాను. కూరా, పులుసూ, leftovers మీకు అభ్యంతరం లేకపోతే" అంది గీత నవ్వి.

ఆతరవాత సునాద అప్పుడప్పుడు గీతయింటికి వస్తూనే వున్నాడు. తపతి మూలంగా పునరుద్ధరింపబడిన తన సంగీతం సునాదస్నేహంలో పదును తేలుతోంది. శృతపాండిత్యం అన్నాడు కానీ సంగీతపరిజ్ఞానం అతనికి బాగానే వుంది. చాలా పుస్తకాలు చదివేడు. వారానికి రెండురోజులు సాధన చేస్తాడుట. ఓరోజు తపతితో ఆమాట చెప్తే, "అవును, మాయింటికి కూడా వస్తూ వుంటాడు" అంది.

మొదటిసారి వచ్చినప్పుడు గీతలాగే తపతి కూడా ఆశ్చర్యపోయింది. సాటి అబ్బాయిలతో సినిమాలకీ, పార్టీలకీ, ఫుట్బాల్ చూడ్డానికీ తిరక్కుండా ఇదేమిటి అని.

మొదటిసారి వచ్చినప్పుడు అనుకోకుండా వచ్చేడుట. తపతి వాకిట్లో కలుపుమొక్కలు తీస్తోంది. కారాగితే ఎవరా అనుకుంటూ తలెత్తి చూసింది. సునాద కనిపించేడు.

"సారీ అండీ. పిలిచి రావాల్సింది. ఊరికే రోడ్లంట తిరుగుతూ ఇటొచ్చేను. మీకు ఇబ్బంది అంటే లోపలికి రాను. తరవాత ఎప్పుడేనా వస్తాను" అన్నాడు గబగబా.

తపతి నవ్వుతూ, "ఫరవాలేదండీ. నేనూ ఏం పనిలేకే కలుపు తీస్తున్నాను. రండి" అని లోపలికి తీసుకెళ్లింది.

సునాద సోఫాఅంచున కూర్చుని, "నాకు మరీ చిరాగ్గా వున్నప్పుడు, కార్లో నాలుగు మంచి టేపులు పడేసుకుని కంట్రీరోడ్లమీద కార్లో తిరుగుతానండీ. మీరు ఇక్కడ వున్నారని తెలుసు కానీ మీరేం అనుకుంటారో అని ఎప్పుడూ రాలేదు. గీతగారు మీగురించీ, చిత్రగారిగురించీ చెప్తూ వుంటారు" అన్నాడు.

తపతి "బాగుంది మీ కాలక్షేపం. కాఫీ తాగుతారా, టీనా?" అంది.

సునాద, "అవేవీ తాగనండీ. మంచినీళ్లివ్వండి. చిత్ర గారేరీ?" అన్నాడు చుట్టూ చూస్తూ.

"వెనక వరండాలో వుంది. పిలుస్తానుండండి"

"వద్దులెండి. ఆవిడ ఏమైనా పనిలో ఉన్నారేమో?"

తపతికి, గీతఇంట్లో పార్టీరోజు గుర్తుకొచ్చి, "ఫరవాలేదు. మీరూ రండి. ఏం చేస్తోందో చూద్దాం" అంది అటు నడుస్తూ.

చిత్ర అక్కడ లాన్ ఛెయిర్లో కూర్చుని వుంది. తపతివెనక వస్తున్న సునాదని చూసి చిన్నగా నవ్విందో, నవ్వినట్టు తపతికి అనిపించిందో! సునాద ఆపక్కన మరో కుర్చీలో కూర్చున్నాడు. తపతి లోపలికి వెళ్లింది ఏదో పనుందని. పావుగంట తరవాత చూస్తే, వాళ్లిద్దరూ వరండాలో లేరు.

చిత్రగదిలో చూసింది. చిత్ర ఏదో బొమ్మ గీసుకుంటోంది. సునాద కొంచెం దూరంలో కూర్చుని చిన్నగా కూనిరాగం తీస్తున్నాడు. తపతిని చూసి, సునాద పాట ఆపి, "ఎంత అద్భుతంగా వేస్తారండీ చిత్రగారు. ప్రతిచిత్రంలోనూ ఏవో రెండు కళ్లు గుండెల్ని సూటిగా తాకుతాయి. ఎలా వచ్చిందో అంత నైపుణ్యం ఆమెకి" అన్నాడు.

తపతి ఉలికిపడింది ఆమాటకి. వెనక గీత కూడా ఇదే మాట అంది చిత్ర వేసిన బొమ్మలగురించి. బహుశా ఆకళ్లు కనిపించడానికి ప్రత్యేకమయిన కళాహృదయం వుండాలేమో అనుకుంది.

కనీసం నెలకోసారి అయినా వస్తుంటాడుట వాళ్లింటికి. తపతికి సంగీతంలో అభినివేశం వుందని తెలిసినా తనతో మాటాడడుట. ఎక్కువ చిత్రతోనే గడుపుతాడుట.

"ఏమిటి మాటాడతాడు ఆ అమ్మాయితో?"

"ఏమో. నేనంతగా పట్టించుకోడంలేదు. వాళ్లిద్దరికీ నచ్చింది. ఎలా, ఎందుకు, ఏమిటి అంటూ నేనెందుకు గొడవ చెయ్యడం." అని ఓ క్షణం ఆగి, "అసలు మాటాడుకుంటున్నట్టు కనిపించదు. ఆ పిల్ల చిత్రాలు గీసుకుంటూ వుంటుంది. ఇతనేమో పాడుకుంటూ కూచుంటాడు. ఏదేనా పెడితే తింటారు. లేకపోతే మంచినీళ్లేనా అడగరు" అంది తపతి చిన్నగా నవ్వుతూ.

"గాయత్రిగారికి తెలుసా? మళ్లీ కథ మొదటికి రాగలదు,"

"తెలీదనుకుంటాను. నేనయి చెప్పలేదు. నేనూ మొదట నీలాగే అనుకున్నాను. కానీ నాకేం ప్రమాదం కనిపించడంలేదు. పాపం, ఆపిల్ల మాత్రం మనిషి కాదూ. అతనిసాన్నిహిత్యంలో ఊరట పొందుతోంది. నేనెందుకు అది పాడుచెయ్యడం? గొడవయితే అప్పుడే చూసుకుందాం."

అటు చిత్ర చిన్నన్న కూడా చెల్లెలికి చేతనయిన సాయం చెయ్యడానికి పూనుకున్నాడు. ముందు చెప్పినట్టుగా ఒక వెబ్సైటు పెట్టి, చెల్లెలిబొమ్మలు పోస్ట్ చేస్తున్నాడు, తపతి స్కాన్ చేసి ఇస్తోంది. అయితే ముందులాగా పెద్ద హడావుడి ఏమీ లేదు. నెట్లో ఎవరేనా కావలిస్తే కాపీలు తీసుకోవచ్చు. ఒరిజినల్పెయింటింగు కావాలంటే కొనుక్కోవచ్చు. డబ్బేమయినా వస్తే తపతికి పంపించేస్తాడు. తపతి చిత్రపేరుమీద వేరే ఎకౌంటుపెట్టి ఆ డబ్బు దాస్తోంది. ఆరునెలలు గడిచేయి. వూళ్లో ఓ చిన్న షాపు యజమాని ఆ సైటు చూసి, ఒక బొమ్మ కొని వాళ్ల స్టోరులో పెట్టుకున్నాడు.

సునాద అది చూసి, తపతికి చెప్పేడు. “మీరు ఫరవాలేదంటే, నేను చిత్రని తీసుకెళ్లి ఆ స్టోరులో గోడమీద ఆబొమ్మ చూపిస్తాను” అన్నాడు. మళ్లీ “మీరు కూడా వస్తే బాగుంటుంది” అన్నాడు.

తపతి గాయత్రికి చెప్పింది. గాయత్రికి సునాద విషయం తెలిసింది కానీ తను చేసేదేమీ లేదని తెలుసుకుని, తపతిమీదా, దైవంమీదా భారం వేసి ఊరుకుంది. కనీసం పిల్ల కళ్లముందు వుంది అని తృప్తి పడింది.

అందరూ కలిసి ఆ స్టోరుకి వెళ్లేరు. చిత్రమొహంలో చిన్న మెరుపు కనిపించింది. కోటివరహాలు సాటి రావు ఆ మెరుపుకి. తపతీ, గాయత్రీ, సోమలింగం, సునాద - అందరూ పొంగిపోయేరు.

“మీకు థాంక్స్ చెప్పాలి” అంది తపతి సునాదతో.

“నాకెందుకండీ. బొమ్మలు నలుగురికళ్లలో పడేసింది వాళ్ల అన్న. కొన్నది ఆయనా. ఆయనకి చెప్పండి థాంక్స్” అన్నాడు సునాద.

ఆ షాపు యజమాని, “నాక్కూడా చెప్పక్కర్లేదండీ. నాకు నిజంగానే ఆ బొమ్మ నచ్చింది.”

పక్కనే వున్న ఆయనభార్య “మాకు ఒక అబ్బాయి వున్నాడు. ఆరేళ్లు. వాడు కూడా special needs child. చాలామంది డాక్టర్లకి చూపించేం. పరీక్షలూ, స్పెషల్ స్కూలూ, ఖర్చులమాట అడక్కండి. మీరు పరిష్కారం తేలిగ్గానే కనుక్కున్నట్టున్నారు” అంది.

“ఈ స్థితిలో చాలా రకాలుంటాయి అనుకుంటానండీ. చిత్ర సమస్య మరీ అంత తీవ్రం కావచ్చు” అంది తపతి.

***

ఓరోజు సునాద “ఇక్కడ స్పెషల్ ఎడ్ స్కూలికి చిత్రని తీసుకెళ్దామండీ” అన్నాడు తపతితో.

“ఎందుకూ?”

“నాకూ తెలీదు. వూరికే చూపిద్దాం అనిపించింది. అంతే. మీకు ఇష్టంలేకపోతే వద్దులెండి.”

చిత్రబొమ్మ కొన్న షాపుయజమాని భార్య చెప్పినమాటలు విన్నప్పట్నుంచీ, అక్కడ ఏంచేస్తారో చూడాలని వుంది సునాదకి. చిత్ర అక్కడ ఎలా స్పందిస్తుందో చూడాలని వుంది. తపతి సరే తీసుకెళ్లమంది.

సునాద అక్కడ ప్రిన్సిపాలుతో మాట్లాడి, వాళ్లు చెప్పినరోజున చిత్రని తీసుకుని వెళ్లేడు.

పిల్లలు వేస్తున్న బొమ్మలు చూస్తూ చాలాసేపు గడిపింది చిత్ర అక్కడ. ఓ చిన్న అబ్బాయి పక్కన నిలబడి, చెయ్యి పట్టుకుని ఆ అబ్బాయి వేస్తున్న బొమ్మ దిద్దించింది. అది చూసి సునాద మురిసిపోయేడు. ఇంటికొచ్చి ఆమాటే చెప్పేడు తపతితో.

"చిత్ర అక్కడ పిల్లలకి పెయింటింగు నేర్పుతుందేమో" అన్నాడు ఆతరవాత.

"చిత్రకి డిగ్రీలు లేవు కదా. వాళ్లొప్పుకోరేమో."

"లేకపోవడమేమిటి? న్యూయార్కులో స్కూలు నడిపిందిట కదా. గీతగారు చెప్పేరు. ఇప్పుడు కొన్ని బొమ్మలు కూడా అమ్ముడు పోయేయి. అంతకంటే ఏం కావాలి," అని సునాద హుషారుగా అప్పటికప్పుడు కంప్యూటరుమీద చిత్ర రెస్యూమే తయారు చేసేశాడు. చిత్ర నైపుణ్యం, స్కూలు నడపడంతో పాటు ఆమె మేధ లోపంగురించి కూడా పేర్కొన్నాడు. స్కూలికి స్వయంగా తీసుకెళ్లి ప్రిన్సిపాలుకి ఇచ్చేడు.

ప్రిన్సిపాలు గీత అర్హతలు చూసి, సునాద మాటలు విని, "చిత్రకళలో ఒక ప్రత్యేకమయిన స్థాయి చేరుకుంది అంటున్నారు కనక వాలంటీరుగా తీసుకుంటాం," అన్నారు.

సునాద అదే చాలు అని వాళ్లకి పుష్కలంగా కృతజ్ఞతలు చెప్పి, ఇంటికొచ్చేడు.

తపతి ఆలోచనలో పడింది. చిత్రని అక్కడికి తీసుకెళ్లడం, తీసుకురావడం ఒక సమస్య. ఆపైన ఇప్పుడు వెట్టిచాకిరీకి ఒప్పుకుంటే తరవాత వాళ్లు జీతం అంటూ ఇస్తారా అన్నది రెండో ప్రశ్న. కానీ అన్నిటికంటే ముఖ్యమయినది చిత్ర మనుషులలో పడడానికి ఇది ఉత్తమమార్గం. గీతనడిగితే, తను కూడా అదే అంది.

సునాద బోలెడు సరదాపడిపోతూ "పంపించండి మేడమ్" అంటున్నాడు. అతడి వుత్సాహం చూస్తుంటే తపతికీ, గీతకీ కూడా ఆశ్చర్యంగానే వుంది. అనేకవిషయాల్లో ఎంతో అమాయకంగా కనిపించే ఈకుర్రాడిలో ఇంత చురుకుదనం ఎక్కడిదా అని. అతన్ని ఎలా అంచనా కట్టాలో అర్థం కాలేదు. చిత్రని వారానికి ఒకరోజు స్కూలికి పంపడానికి అంగీకారం తెలిపింది తపతి.

***

ఒకరోజు తపతీ గీతా మాటాడుకుంటుంటే, గీత ఇంట్లో పార్టీమాట వచ్చింది.

గీతకి కూడా బాగుంది ఆరోజు. అచల వంటకాలతో అందర్నీ సంతోషపెడితే, సునాద సంగీతంతో ప్రాణం పోశాడనీ చెప్తూ, "నాకు అప్పటికప్పుడు బయల్దేరి ఇండియా వెళ్లిపోవాలనిపించింది" అంది దిగులుగా.

"ఇండియా అంటే గుర్తొచ్చింది. మ.తె. సమావేషాలు త్వరలోనే." అంది తపతి.

"మాతేసమావేషాలా?" అంది గీత అయోమయంగా.

"మన తెలుగు సమావేశాలు. సూక్ష్మంగా మా.తే.వేషాలు అంటాం నాలాటివాళ్లం. నాలుగేళ్లకోమారు కవులూ, గాయకులూ, పండితులూ, పామరులూ, ఒకరేమిటి సకలజనులూ కలుస్తారు అక్కడ."

"నువ్వు వెళ్తున్నావా?" అడిగింది గీత.

"లేదులే. ఒకసారి వెళ్లేను నేను వచ్చినకొత్తలో. వీలయితే మీరిద్దరూ వెళ్లండి. ఒకసారి చూడడానికి బాగానే వుంటుంది. పైగా నీకు అనంతం గారు అభిమాన రచయిత కదా. ఆయన వస్తున్నారుట" అంది తపతి.

అనంతంగారు అర్ధశతాబ్దిగా తన కథలతో తెలుగు పాఠకులని అలరిస్తున్న సుప్రసిద్ధ రచయిత. ఆయన వస్తున్నారంటే గీతకి కాస్త చురుకు పుట్టింది. కలుసుకుని ఆయనరచనలగురించి మాట్లాడాలని ఎన్నాళ్లనుంచో కోరిక తనకి.

"మా పిన్నికొడుకు కూడా వస్తున్నాడు. నీకు తెలుసేమో మీవూరివాడే రంగారావని. సుమారుగా నీవయసే వుంటుంది," అంది తపతే మళ్లీ.

గీత "ఎందుకు తెలీదూ, హైస్కూల్లో నా క్లాస్మేటు. యస్సెల్సీ పాసయినతరవాత నాకు అమెరికా రావడానికి ఉపాయాలు కూడా ఉపదేశించేడు. అతను అన్నట్టు కాకపోయినా ఇక్కడే తేలేను అనుకుంటే నవ్వొస్తోంది" అని ఆనాడు ఇంట్లో జరిగిన రభస చెప్పింది. మళ్లీ "అతనికి సాహిత్యంలో ప్రవేశం వుందని నాకు తెలీదే." అంది ఆలోచిస్తూ.

"సాహిత్యం అనేం లేదు. అన్నిరంగాల్లో ప్రముఖులూ వస్తారు. ఆతనేదో వ్యాపారం చేస్తున్నట్టు."

"ఏం వ్యాపారం?"

"ఏదో ఇంపోర్ట్ ఎక్స్పోర్ట్ మన గుజ్జనగూళ్ల ఆటలోలాగే ఇక్కడివి అక్కడికీ, అక్కడివి ఇక్కడికీ సరఫరా చెయ్యడం. వెళ్లి చూడు. అదొక అనుభవం," అంది తపతి.

ఆ రాత్రి హరిని అడిగింది "ఏదో మన తెలుగు సమావేశాలు అవుతున్నాయిట. వెళ్దామా?"

"నీకు నచ్చవులే అలాటివి."

"ఎందుకలా అనుకుంటున్నారు?"

"చూస్తున్నాను కదా నీధోరణి. నీకు ఇక్కడ మనవాళ్లని చూస్తే చులకన."

గీతకి కోపం వచ్చింది. "అదేమిటి? నేనెప్పుడన్నాను ఆమాట?" అంది..

"వేరే అనక్కర్లేదు. ఒకపక్కన వీళ్ల మనస్తత్త్వాలు అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నాను అంటావు. మరోపక్కన మనవాళ్లు అచ్చంపు తెలుగుతనం నిలుపుకోడం లేదని దెప్పుతావు. వీళ్లందరూ అమెరికా ఆచారాలూ, అలవాట్లూ, పాటిస్తూ తెలుగు సంస్కృతి మర్చిపోతున్నారంటూ బాధపడిపోతావు. నీసంగతులు వాళ్లు మాటాడితే నీకు నొప్పి. నువ్వూ, తపతిగారూ చిత్రవిషయంలో కలగజేసుకోడం కొందరికి అలాటి తప్పుగానే కనిపిస్తుందని నీకు తోచదు."

గీత అతన్ని అట్టే చూస్తూ కూర్చుండిపోయింది. తనని అతను ఇంత నిశితంగా పరిశీలిస్తున్నాడని ఇంతవరకూ తెలీనేలేదు తనకి. ఆక్షణానికి కోపం వచ్చినా, అతనన్నమాటలో తప్పు లేదనే అనిపించింది. ఇక్కడి తెలుగువారి తీరుతెన్నులు తనకి నచ్చడంలేదు, నిజమే. అయితే అతను అన్నట్టు వాళ్లని పూర్తిగా కొట్టిపారేయలేదు. అర్థం చేసుకోడానికే ప్రయత్నిస్తోంది. ఆమాటే అంది.

"నేను మనవాళ్లందరినీ తప్పు పట్టడంలేదు. వీళ్లలో వచ్చినమార్పుని ఎలా అర్థం చేసుకోవాలా అని ఆలోచిస్తున్నానంతే. పోనీండి. నాకు వీళ్ల ధోరణి నచ్చలేదన్నమాటే నిజం. ఇలా పదిమంది మనవాళ్లు

చేరినచోట చూస్తే నాకేమైనా ఎక్కువ అర్థం అవుతుందేమో. మీరు కూడా ఒక్కసారే వెళ్లేనంటున్నారు. మరి మీరెందుకు రెండోసారి వెళ్లలేదూ?" అంది.

"నావూరూ, నాభాషా, నాఇల్లూ అంటూ గిరి గీసుకు, మడిగట్టుకు కూర్చోవాలంటే నాకు జరుగుతుందా? నేను ఇంతదూరం వచ్చింది ఇక్కడ నారంగంలో నాప్రజ్ఞాపాటవాలు నిరూపించుకోడానికి. నాకు అదే ముఖ్యం. ఎవరికైనా రోజుకి ఇరవైనాలుగ్గంటలే. నేను నా ఇరవైనాలుగ్గంటలూ నాఉద్యోగానికే సమర్పించుకోవాలి. పూర్వం మనవాళ్లు బ్రిటిషువాళ్లని నీరాజనాలు పట్టేరు. ఇప్పుడు ఇక్కడ మనం అమెరినులని నీరాజనాలు పడుతున్నాం, చెయ్యాలి. పైగా, దేశంలో మనకి స్థానబలం ఉండేది. ఇక్కడ అది కూడా లేదు," అన్నాడు హరి అలసిపోయినట్టు సోఫాలో వెనక్కి వాలి.

అతను చెప్పని మరో కారణం సాధారణంగా ఆ సమావేశాలకి హాజరు అయేవాళ్లు రెండు రకాల జనాలు. పిల్లలు వున్నవాళ్లు పిల్లలకి తాము నేర్పిన తెలుగు పాటలూ, డాన్సులూ ప్రదర్శించుకోడానికి వస్తారు. రిటైరయినవాళ్లూ, రిటైరవబోయేవాళ్లు రాగల సాధకబాధకాలు చర్చించుకోడానికీ, తమసంపాదనలు సద్వినియోగం చేసే ఉపాయాలు చర్చించుకోడానికీ వస్తారు. తనలాటి మధ్యవయస్కులకి ఆ సమావేశాలకంటే ముఖ్యమైన వ్యాపకాలు వుండడంచేత అక్కడ కనిపించరు.

అతనిమొహంలో నిస్పృహ చూసి గీత అవాక్కయిపోయింది. గీత మళ్లీ సమావేశాలమాట ఎత్తలేదు.

రెండురోజుల తరవాత హరే మళ్లీ ఆ ప్రసక్తి తెచ్చి, "నీకు అంత సరదాగా వుంటే వెళ్దాంలే." అన్నాడు.

ఆతరవాత ఫోనెక్కి ఆచూకీలు లాగి తన స్కూలు మిత్రులూ, కాలేజీ మిత్రులూ, తనలా ఇతర వ్యాపకాలున్న మిత్రులనీ వాకబు చేసి ఆరుగురు వస్తున్నారని తెలుసుకున్నాడు. అది చాల్లెమ్మనుకుని, గీతని పిలిచి, "నీ పట్టుచీరెలు ఇస్త్రీ చేసుకో. బంగారునగలు మెరుగులు దిద్దుకో. సంగీతం సాధన చేసుకో. తెలుగుసభలకి మనం హాజరవుతున్నాం" అన్నాడు.

"డాన్సు చెయ్యక్కర్లేదా?" అంది గీత వెక్కిరిస్తూ.

"వద్దులే."

***

మ.తె. సమావేశాలు పెద్ద పేరున్న హోటలులో ఏర్పాటు చేశారు. ఉత్తర అమెరికాలో తెలుగువారే కాక కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్నించీ ప్రత్యేకంగా ఈ సమావేశాలకోసమే వచ్చినవారు కొందరయితే, వేరేపనులమీద వచ్చి, ప్రయాణం పొడిగించుకున్నవారు కొందరు, ఇంకా ఇండియానించి ప్రత్యేకంగా ఆహ్వానింపబడినవాళ్లే కాక కొడుకులనీ, కోడళ్లనీ, కూతుళ్లనీ, అల్లుళ్లనీ, మనవల్నీ, మనవరాళ్లనీ, పుట్టినవాళ్లనీ, పుట్టబోయేవాళ్లనీ చూడ్డానికి వచ్చినవాళ్లూ వున్నారు. ఆరెండురోజులూ ఆంధ్రదేశానికి మిర్రర్సైటులా వుంది అక్కడ. జనసమూహంతో కోలాహలంగా కలకల్లాడిపోతూంది ఆ ప్రాంతం. పెద్దింట పెళ్లంత సంరంభం.

ఉదయం ఇడ్లీ వడ ఫలహారాలు అయింతరవాత పిట్సుబర్గునించి వచ్చిన ఆచార్యులవారు వేదపాఠాలతో, వినాయకపూజతో సమావేశం ప్రారంభించారు. మద్రాసునుంచి వచ్చిన సుప్రసిద్ధ సినీగాయకి వందేమాతరం పాడింది. స్థానికమేయరు అమెరికాలో తెలుగువారు చేస్తున్న అద్వితీయసేవని కొనియాడారు.

ఆంధ్రప్రదేశ్నించి వచ్చిన ఆర్థికమంత్రిగారు దేశానికి యన్నారైలు చేసిన, చేయగల సేవలగురించి పదినిముషాలు మాటాడేరు. మనపిల్లలకి ఆంధ్రాలో మెడికల్ కాలేజీల్లోనూ, ఇంజినీరింగ్ కాలేజీల్లోనూ సీట్లు ఏర్పాటు చేస్తాం అని వాగ్దానం చేశారు. తరవాత మ.తె.అధ్యక్షులు ప్రవాసాంధ్రులు రెండుదేశాలకీ చేస్తున్నసేవ ప్రస్తుతించారు. మనదేశం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు చెప్పారు.

ఆతరవాత వివిధవిషయాలపై వేరు వేరు సెషన్లు వేరు వేరు గదుల్లో జరగబోతున్నాయని ప్రకటించేరు.

యువరచయిత్రి ''దుర్భర'' సెషన్కి చాలామంది హాజరయేరు. ఈమధ్య ఆంధ్రదేశంలో ఆవిడపేరు మారుమ్రోగుతోంది.

చిన్నమ్మాయే. పాతికేళ్లుంటాయేమో. ఆవిడ ఎంచుకున్న విషయం ''తెలుగులో అశ్లీలాలు''. స్వీయకవితతో మొదలు పెట్టింది ఉపన్యాసం.

అన్యాయం. అక్రమం

పురుషుల దౌర్జన్యం

ఘోరాతిఘోరం

అది కడిగేయడం నా ధ్యేయం

విరుచుకుపడతాను

అంటూ ఓ పదినిముషాలు కవితలు చదివి, విషయంలోకి దిగింది. సాహిత్యంలో అశ్లీలాలు, సంగీతంలో అశ్లీలాలు, సినిమాల్లో, నాటకాల్లో, దేవాలయశిల్పాల్లో ... ఉదాహరణ మీద ఉదాహరణ ఇస్తూ వర్ణించుకుంటూ పోతోందే తప్ప అసలువిషయంలో ఆవిడకున్న అవగాహన ఏమిటో దానిమీద ఆవిడ అభిప్రాయం ఏమిటో అంతుబట్టలేదు శ్రోతలకు. కొందరు ముఖముఖాలు చూసుకున్నారు.

కొందరు తల్లులు కాస్త తెలుగొచ్చిన పిల్లల్నీ, తెలుగు రాకపోవడం చేత ''వాటీస్ షీ సేయింగ్'' అని అడుగుతున్న పిల్లల్నీ బయటికి లాక్కుపోయేరు. తదితరులు దిక్కులు పిక్కటిల్లేలాగ కరతాళధ్వనులు చేశారు.

మధ్యాన్నం మళ్లీ అచ్చమయిన తెలుగుభోజనం, పూర్ణాలూ, బొబ్బట్లతో. దాన్ని లంచి అనలేం. తెలుగు పడుచులు కొంగులు బిగించి వడ్డిస్తుంటే ఆహూతులు సుష్టుగా భుజించారు.

భోజనాలబల్లదగ్గర గీతకి ఎదురుగా కూర్చున్నాయనే అనంతంగారు. గీతకి అయాచితంగా లభ్యమయిన అధిక బహుమతి ఆరోజు,

''మీకథలు నేను చాలా ఇష్టంగా చదివేదాన్ని చిన్నప్పుడు'' అంది గీత ఆయన్ని గుర్తుపట్టి.

ఆయన చిన్నగా నవ్వేరు. "మీరు నన్ను గుర్తు పట్టడమే ఆశ్చర్యం. ఇంకా కథలు కూడా గుర్తు పెట్టుకున్నారంటే మరీ ఆశ్చర్యం."

"అలా అనకండి. మంచి కథలంటే కలకాలం నిలిచేవనే కదా అర్థం. మీకథలకి ఆ విలువుండబట్టే కదా మిమ్మల్ని వీరు పిలవడం జరిగింది," అంది గీత ఉత్సాహంగా.

అనంతంగారు పెదవి విరిచి, తలాడించేరు. ఆ అభినయానికి ఎన్నేనా అర్థాలు చెప్పుకోవచ్చు.

"మీరు ఈమధ్య రాస్తున్నట్టు లేదు. ఎందుకు మానేశారు?"

"మానేశారు అంటే మీకు పత్రికలలో నాపేరు కనిపించుటలేదు అన్న అర్థంలో అయితే సరే. కానీ స్ఫూర్తిగల మెదడు ఎప్పుడూ పని చేస్తూనే వుంటుంది."

"మీమాట నిజమే అని ఒప్పుకుంటాను. ఎందుకు ప్రచురించడం మానేశారో చెప్పండి."

"ఇదేమిటి, నన్ను ఇంటర్వ్యూ చేస్తున్నారా?" అన్నారాయన నవ్వుతూ.

గీత సారీ చెప్పి, "అది కాదండీ. ఈ దేశం వచ్చేక ఇలా కథలగురించి, ముఖ్యంగా మీకాలం కథలగురించి మాట్లాడే అవకాశాలు బొత్తిగా లేకుండా పోయేయి. నిజంగానే నాకు మీకథలంటే చెప్పలేనంత అభిమానం. మీమాటల్లోనే చెప్పాలంటే పడిచచ్చేదాన్ని మీకథలకోసం. ఆరోజుల్లో మీతో మాట్లాడాలని కూడా చాలా కుతూహలంగా వుండేది నాకు. మరి ఇప్పుడు ఆ అవకాశం వచ్చింది. ఎలా వదులుకోమంటారు చెప్పండి."

"సరే అడగండి. ఏదో రమ్మన్నారని వచ్చేనే కానీ నాకూ మీలాగ రచనలమీద గౌరవంతో మాటాడాలనుకున్నవారు ఎవరూ కనిపించలేదు ఇక్కడ. నేను మాత్రం ఎలా వదులుకోను ఈ అవకాశాన్ని? అడగండి."

"అదేం మాటండీ. మీమీద గౌరవంతోనే కదా పిలిచారు."

"నమ్మకంతోనే అంటున్నారా ఆమాట? ఒక్కసారి చుట్టూ చూడండి."

గీత చుట్టూ చూసింది. చిన్న చిన్న గుంపులుగా విడిపోయారు అతిథులందరూ. ప్రతి చిన్నగుంపులోనూ మధ్య వెలుగుతున్నవారు ప్రముఖ రాజకీయవేత్తలూ, వాణిజ్యవేత్తలూ, ఇజాలతో, భేషజాలతో కుస్తీపట్లు పడుతున్న వర్థమానరచయితలూ, సినీనటులూను. వారికున్న ప్రతిపత్తీ, గుర్తింపూ సంస్కృతిపరమయిన విలువలు దృష్టిలో పెట్టుకుని చిత్తశుద్ధితో రాస్తున్న రచయితలకి దొరకడం కష్టం. గీతకి అర్థం అయింది అనంతంగారి అభిప్రాయం. అనంతంగారి కళ్లు క్షణంసేపు దుర్భర పేరుతో రాస్తున్న యువరచయిత్రిమీద నిలిచి తప్పుకున్నాయి. ఆవిడచుట్టూ ఊపిరి సలపకుండా వున్నారు జనం.

"మీరు వేటిని సంస్కృతిపరమైన విలువలు అంటారు?" అని ప్రశ్నించింది గీత.

"సంస్కృతిపరమయిన రచనలంటే నాదృష్టిలో మానవత్వపు విలువలు చాటుతూ ఏకాలానికి అయినా ఏదేశానికయినా వర్తించగలకథలు. అంటే 'శ్రీరాముడు మంచి రాజు, హరిశ్చంద్రుడు సత్యవ్రతుడు' అంటూ ఓటిమాటలు చాటమని కాదు నేను చెబుతున్నది. ఈమధ్య వస్తున్న రచనల్లో ఔద్ధత్యం ఎక్కువగా

కనిపిస్తోంది. ఒక కులాన్నో, మతాన్నో, సంస్థనో, రాజకీయనాయకుణ్ణో, వినాయకుణ్ణో - ఎవరో ఒకరిమీద ఒక నినాదాన్ని ఆశ్రయించుకుని విరుచుకుపడడమే ఘనంగా పరిగణింపబడుతోంది. అలా రాసినవారికే ఈనాడు కనకపు సింహాసనాలు. విమర్శకులదృష్టిలో అవే సాంఘికప్రయోజనం గల రచనలు.''

''మీ దృష్టిలో కావా? ఒక ఆశయంకోసం రాసిన కథలు, సాంఘికప్రయోజం దృష్టిలో పెట్టుకు చేసినరచనలు, ఆ ప్రయోజనం తీరేక నిలవవని మీ అభిప్రాయమా? తాత్కాలికం అంటారా?''

''అది కాదు నేనంటున్నది. సాహిత్యానికి కొలమానాలు వున్నాయి. నాలుగువీధుల కూడలిలోనో, నీలాటిరేవులోనో సిగపట్లగోత్రాలకి దిగి జనాలు తిట్టుకున్నప్పుడు అశ్లీలాలు పుష్కలంగా వుంటాయి. వాస్తవం అనో, పాత్రోచితం అనో ఆ తిట్లు వున్నవి వున్నట్టు రాయడం ఒకపద్ధతి. రెండో పద్ధతి ఆమాటలు వాడకుండా ధ్వనితో, వక్రోక్తితో అన్యాపదేశంగా ఆ వాతావరణాన్ని రచనలో సృష్టించగలగడం. నా దృష్టిలో రెండోదే క్లిష్టతరమయినదీ, అభిలషణీయమయినదీ సాహిత్యంలో.''

''మీరంటున్న మొదటిపద్ధతి ఈమధ్య బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. దిగంబరకవులతో మొదలయిందనుకుంటాను. కేవలం వాదనకోసమే అనుకోండి మీరయితే ఆ పద్ధతిని ఎలా సమర్థిస్తారు?''

''నేను సమర్థించను కానీ వారివాదన చెప్తాను. వారిదృష్టిలో అది ముల్లుని ముల్లుతోనే తీయడంలాటిది. దేశాన్ని ఒక తీవ్రమైన రుగ్మత పట్టి పీడిస్తున్నప్పుడు, దానిని ఎదుర్కోడం కూడా అదే స్థాయిలో జరుగుతుందని, గుండె ఆగిపోయినప్పుడు షాక్ ట్రీట్మెంట్ ఇచ్చినట్టు. అది నా అభిప్రాయంలో రిపోర్టింగ్ కావచ్చు కానీ సాహిత్యం అనిపించుకోదు. రచయితల, మేధావుల కర్తవ్యం సత్యాన్వేషణ, జీవితంలో లోతుపాతులు పరిశీలించి, విశ్లేషించి, భిన్నదృక్పథాలని సమీకరించి, వాటిని సమన్వయపరుచుకుంటూ హృద్యంగమంగా, రసవత్తరంగా ఒక నీతిని ప్రతిపాదించడం సమర్థుడయిన రచయిత చెయ్యాలి. ప్రజలని కర్తవ్యోన్ముఖులని చెయ్యాలంటే, కర్తవ్యం ఏమిటో ఆలోచించుకోగల సామర్థ్యం ఇవ్వాలి వాళ్లకి. అంతేకానీ, మీ కర్తవ్యం ఇదీ అంటూ ప్రజలతరఫున రచయితలు నిర్ణయాలు చెయ్యడం భావ్యం కాదు. సిద్ధాంతాలు చేసే పని అదే. అందుకే వాటిని ఆశ్రయించి చేసే రచనలు ఏకోన్ముఖంగా వుంటాయి. రెండోకోణం ఆవిష్కరించవు. వాటిలో లోపం అసమగ్రత,'' అంటూ అనంతంగారు ఆగేరు.

గీత వింటూ ఆలోచనల్లో పడిపోయింది. ఆయన మాటల్లో తర్కం అర్థం కాలేదు. తనని బాధిస్తున్న ప్రశ్న నేరుగా అడిగేసింది. ''మీదృష్టిలో ఆ అమ్మాయిరచనలకి విలువ ఉందా లేదా?''

''మీరు అడుగుతున్నది అశ్లీల రచనలగురించి.''

గీత అటువేపు చూసింది. దుర్భరచుట్టూ చాలా పెద్దగుంపే వుంది. ఆప్రాంతంలో కుర్చీలన్నీ నిండిపోయేయి. కుర్చీలు చాలక కొందరు తమ ప్లేట్లు పట్టుకుని నిల్చునే ఆవిడ మధురభాషణలు వింటున్నారు.

''హోరుమని ఘోషిస్తూనూ దుర్భాషలతోనూ సంఘంలో కుళ్లు కడిగేయడం సాధ్యం కాదనే నేను అనుకుంటాను. అలా రాసేవాళ్లు ఏకాలంలోనూ వున్నారు. 30లలో చలం రాసాడు. 60లలో దిగంబరకవులు రాసారు. ఆరచనలవల్ల సంఘం మారిపోయిందా? అలా మారిపోయి వుంటే ఇప్పుడు మళ్లీ

అలా రాయవలసిన అవుసరమే లేదు. జనసామాన్యంలో ఆరచనలు తాత్కాలికమయిన ఉత్సాహమో, ఉద్రేకమో, జుగుప్సో కలిగిస్తాయి. మేధావులకి చర్చలకి ఉపయోగపడతాయి. కానీ మనస్తత్త్వాల్లో మార్పు, అవసరమయిన మార్పు అవసరమయిన స్థాయిలో తేలేవు అని నాఅభిప్రాయం. మన సాహిత్యంలో ధ్వనికీ (suggestion), వక్రోక్తికీ (indirect communication) ప్రత్యేకమయినస్థానం వుంది. అది రచయితకి పాఠకులమేథయందు గల నమ్మకానికి సాక్ష్యం. పరోక్షంగా అలంకారాలద్వారా, ధ్వనిద్వారా చెప్పినవిషయాన్ని పాఠకులు ఆలోచించుకుని, ఆకళించుకుని తమభావనలు రూపు దిద్దుకోవాలని రచయిత కోరుతాడు. మీరు ముందు చెప్పిన వాస్తవికరచనలకి షాక్ వాల్యూ మాత్రమే. పాఠకులమీద ఆవి వేసే ముద్ర తాత్కాలికమే.''

గీత చుట్టూ చూస్తూ, ''అయ్యో మనం చూసుకోనేలేదు. అందరూ వెళ్లిపోయారు. పదండి. వరండాలో మాట్లాడుకుందాం. నన్ను బాధిస్తున్న మరో ప్రశ్న కూడా అడిగేస్తాను. 60లనాటి కథారచయిత్రులమీద మీ అభిప్రాయం ఏమిటి?''

అనంతంగారు కూడా లేస్తూ, ''వాళ్ల పరిధిలో వాళ్లు బాగా రాసారనుకుంటాను. మళ్లీ పరిధి అంటే ఏమిటి అని సాగదియ్యకండి. నేనే చెప్పేస్తాను,'' అన్నారు.

గీత నవ్వి, ''మీకు నా సంగతి బాగా తెలిసిపోయినట్టుంది.'' అంది.

''ఆహా'' అన్నారాయన నవ్వుతూ.

''అది కాదమ్మా. నేను కూడా రచయిత్రులమీద వస్తున్న విమర్శలు చూస్తున్నాను. నాకు అర్థమయినవి రెండు విషయాలు. ఒకటి - ఏ ఒకరిద్దరో తప్పించి, సామూహికంగా రచయిత్రులకి సామాజికఅవగాహన లేదని. అది నేను ఒప్పుకోను. రచయిత్రులు సంసారంలో ఒడిదుడుకుల గురించి, నిత్యజీవితంలో ఈతిబాధలగురించి రాశారు. ఆసంసారంలో ఆడవారూ వున్నారు, మొగవారూ వున్నారు. కొడుకులూ, కూతుళ్లూ, అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్లూ, తల్లిదండ్రులూ, పిల్లలూ, అమ్మమ్మలూ, బామ్మలూ, తాతయ్యలూ - వీళ్లందరూ ఆసంసారంలో భాగమే. ఎవరిపరిధి వారిది. కొమ్మూరి వేణుగోపాలరావు హౌస్సర్జన్మీద రాస్తే, రావిశాస్త్రి కోర్టుకథలు రాసేరు. ఎవరికి పరిచయమయిన లోకం వారు, ఎవరు గమనించిన సత్యం వారు ఆవిష్కరిస్తారు. రచయిత్రులు నాలుగ్గోడలమధ్య జీవితాన్ని ప్రతిభావంతంగా ఆవిష్కరించారు. అందుకే పాఠకులదృష్టిని విజయవంతంగా ఆకట్టుకోగలిగారు. రచయిత్రులు చేసినవి వ్యష్టి రచనలు. కుటుంబరావులాటివారు చేసినవి సమష్టి రచనలు. మన సమాజాన్ని సమగ్రంగా అర్థం చేసుకోడానికి రెండు దృక్పథాలూ అవుసరమే.

రెండోది శిల్పం. మన విమర్శకులందరూ పాశ్చాత్య విమర్శనాపద్ధతులనే తిరుగులేని కొలమానాలుగా తీసుకున్నారు. కానీ మన సాహిత్యరీతులు మర్చిపోయేరు. మనది మౌఖిక సాహిత్యం. మనం కథలు 'చెప్తాం'. మనరచయిత్రులు ఆ విధానమే అవలంబించేరు. కాయితమ్మీద రాసినప్పుడు కూడా వాళ్లు కథలు 'చెప్పేరు.' అందుకే కథ చదువుతుంటే వాళ్లు ఎదురుగా వుండి మాట్లాడుతున్నట్టు వుంటుంది

కానీ వేదిక ఎక్కి ఉపన్యాసం ఇస్తున్నట్టు వుండదు. ఆనాటి రచయిత్రులలో చాలామందికి పాశ్చాత్యసాంప్రదాయంతో పరిచయం లేదు. అదే వారిపాలిట వరమూ, శాపమూ కూడా అయింది.''

గీత చేతులు జోడించి, ''చాలా విషయాలు చెప్పారండీ. ధన్యవాదాలు'' అంది.

అనంతంగారు కూడా నమస్కరించి శలవు పుచ్చుకున్నారు.

గీత చుట్టూ చూసింది. హరి ఎక్కడికో మాయమయిపోయాడు తన స్నేహితులతో. అందరూ గుంపులుగా చేరి వారి అభిమానవిషయాలు మాట్లాడుకుంటున్నారు. కాస్త దూరంగా ఒకాయన ఒక్కరూ పచార్లు చేస్తున్నారు. తెలిసినమొహంలా వుందే అని కొంచెంసేపు ఆలోచిస్తే జ్ఞాపకం వచ్చింది. రెండుదశాబ్దాలకి ముందు ఆంధ్రప్రేక్షకులహృదయాలు దోచుకున్న కథానాయకుడు. ఇదే దేశంలో అయితే ఊపిరి సలపకుండా చుట్టిముట్టి వుండేవాళ్లు అభిమానులు ఆయన్ని. ఇక్కడ ఆయనవేపు చూసేవారే కనిపించడంలేదు. ప్రస్తుతం వీరంతా ఈక్షణంలో గొప్పవారిగా చెలామణి అవుతున్నవారిచుట్టూ చేరి సరససల్లాపాల్లో మునిగివున్నారు. హరి చెప్పినట్టు స్థానబలం మరి.

రాత్రి వినోదప్రదర్శన. మద్రాసులో ప్రఖ్యాతి చెందిన బాలనర్తకి ప్రదర్శనతో మొదలవుతుందని కార్యదర్శి చెప్పేరు మైకు దగ్గరికొచ్చి. ఆ అమ్మాయిని పరిచయం చేస్తూ, 'రెండోయేటే అడుగు వెయ్యడంలోనే ఆ పాప నాట్యకళావైదుష్యం కనిపించేసింద'నీ, 'తొమ్మిదో యేట అరంగేట్రం చేసి, ఇప్పటికి కొన్ని వందలప్రదర్శనలు దేశమంతటా ఇచ్చేసింద'నీ చెప్పేడు. ఇప్పుడు అమెరికాలో కూడా ప్రదర్శనలిచ్చేసి 'విదేశాల్లో కూడా ప్రదర్శనలిచ్చిన ఘనత సాధించింది' అన్నాడు.

అమ్మాయి స్టేజిమీదకొచ్చింది. మంచి కళగలముఖం. ఆపైన ఎనలేని ఆహార్యంతో ధగద్ధగాయమానంగా మెరిసిపోతోంది. నాట్యం మొదలయింది. సభకి నమస్కారం చేసి నాట్యం మొదలు పెట్టింది.

గీత చుట్టూ చూసింది. ప్రేక్షకులు తన్మయత్వంతో చూస్తున్నారు. గీత పక్కనున్నావిడ ఆపకుండా మెచ్చుకుంటోంది ఆపిల్లని, ''బిడ్డ ముద్దుగుండది. సక్కంగ సేస్తన్నది. మోహినీదేవిమాదిరి వుండది'' అంటూ.

గీత మొదటిసారి ''అవునండీ, బాగుంది'' అంది. రెండోసారి ''బాగుంది'' అంది. ఆవిడ వదలకుండా స్టేజిమీద అమ్మాయిఅడుగులతో సమానంగా ఇక్కడ మెప్పులు కురిపించేస్తూంటే మాత్రం గీతకి ఏమనాలో తోచలేదు.

ఆవిడ అది గమనించినట్టుంది, ''మనాళ్ల పాపే'' అంది.

''ఆఁ?'' అంది గీత అయోమయంగా చూస్తూ.

''ఆపాప, మన కమ్మారమ్మాయే.''

గీతకి గొంతు కొరవడింది. చిన్నగా దగ్గుతూ లేచి బయటికి వెళ్లింది. గోడవార నీళ్ల ఫౌంటెన్ దగ్గర గొంతు తడుపుకుని, వెనుదిరిగి చూస్తే. అక్కడ కొందరు నిలబడి సూర్యచంద్రులు గతులు తప్పగల విషయాలు

చర్చిస్తున్నారు. 'రాబోయే సమావేశం ఎక్కడ పెట్టాలి? తరవాతిప్రెసిడెంటుగా ఎవరిని చెయ్యాలి? ఎవరిని చేస్తే ఎవరికి లాభం?' - వంటివి ద్విగుణీకృతోత్సాహంతో చర్చిస్తున్నారు.

"ఈతడవ సొతుకి పోనిద్దాం" అన్నాడొకాయన ప్రెసిడెంటుగిరీ విషయం ప్రస్తావిస్తూ.

"ఆయనకెట్ల వదిలేస్తామండి? బ్రామిన్సామెను చేసుకున్నడు."

"అయితే ఏమండీ. ఆయన మనవెంపే మొగ్గు సూపుతున్నడు. గోదావరిమండలం నాయుళ్లందరికి ఆయనమాటంటే గురి."

"ఆ వైపుమూలంగ మనకి బ్రామిన్స్ సపోర్టు కూడ వచ్చును."

గీత అటుతిరిగి చూస్తే దూరంగా హరి కనిపించాడు రమ్మని సైగ చేస్తూ. సాక్షాత్తు శ్రీహరి ప్రత్యక్షమయినంత సంతోషంతో అటువేపు నడిచింది. హరి తనస్నేహితులదగ్గర శలవు పుచ్చుకుని, గీతతో కలిసి చిత్రప్రదర్శనశాలవేపు నడిచేడు.

అచ్చంపు తెలుగుదనమ్ము కురియునిచ్చట అనిపించేలా మన చిత్రకారులు, పైడిరాజు, రామారావు, బాపూల చిత్రాలు వున్నాయి అక్కడ. గీత అనంతంగారి మాటలు మననం చేసుకుంటూ, ఆ చిత్రాలు చూస్తూ చాలాసేపు అక్కడే వుండిపోయింది. మనసు పరవశించిపోయింది. ఇదీ మనతెలుగు అంటే అనిపించింది.

మర్నాడు మళ్లీ సెషన్లూ, వినోదప్రదర్శనలూ. గీతా, హరీ కులాసాగా అటూ ఇటూ తిరుగుతూ రోజంతా గడిపేరు. హరి తనస్నేహితులనందర్నీ గీతకి పరిచయం చేసేడు.

రాత్రి మళ్లీ పాటలూ, నాట్యాలూ, నాటకాలూ .... గీతకి నిన్నటి అనుభవంతో వాటిలో ఉత్సాహం పోయింది. హరి "అలా కాదులే. ఈరోజు బాగుంటుంది. ఇక్కడ పుట్టి పెరుగుతున్న పిల్లల పాటలూ, డాన్సులూ కూడా నువ్వు చూడాలి కదా."

గీత అర్ధమనస్కంగానే అతన్ని అనుసరించింది. "నిజమే, మనపిల్లలు ఇక్కడ ఏంచేస్తున్నారో చూడాలి" అనుకుంటూ.

మొదట పిల్లలు పాటలు పాడేరు. తరవాత ప్రహ్లాదనాటకం వేసేరు. గీతకి ఆశ్చర్యం వేసింది. ఇక్కడ గల ఒత్తిళ్లూ, చదువులూ, వ్యాపకాలమధ్య వీళ్లు ఇంత శ్రద్ధగా తెలుగుపాటలూ, మాటలూ నేర్చుకున్నారంటే.

ఆ తరవాత ప్రముఖ కూచిపూడి కళాకారిణి శశికళ నాట్యం. సాంప్రదాయకంగా వెంపటి చినసత్యంగారి దగ్గర నేర్చుకుందిట.

అమెరికాలో ఇంతటి ప్రతిభ వుందని ఎవరేనా చెప్తే గీత నమ్మకపోను. ఈరోజు స్వయంగా కళ్లారా చూసింతరవాత కూడా నమ్మడం కష్టంగా వుంది. ఆపూట గీత మనసు పరవళ్లు తొక్కింది.

"మీమాటే నిజం. నేను ఆలోచించుకోవలసిందీ, చూడవలసిందీ చాలా వుంది" అంది హరితో.

హరి ప్చ్ అన్నాడు ఎటో చూస్తూ.

గత రెండురోజులుగా గీత రంగారావుకోసం వెతుకుతూనే వుంది. ప్రతిసారీ ఎక్కడో దూరంగా కనిపించడం, తీరా దగ్గరికి వెళ్లేవేళకి అతను మరో దిక్కుకి వెళ్లిపోవడం జరుగుతోంది. ఆఖరికి మూడోరోజు అడ్డం వచ్చినవారిందరినీ మర్యాదగానే పక్కకి తోసేస్తూ, అతనిదగ్గరకి చేరుకుంది. ఫ్రెంచి పరిమళాలు గుప్పుమన్నాయి.

"హాయ్" అన్నాడు రంగారావు. గీతని తేలిగ్గానే గుర్తుపట్టాడు. అతనిది మాత్రం బాగా గాలి పోసుకున్న బెలూనులాటి నిండువిగ్రహం. చేతిలో విదేశీ సిగార్, మెళ్లో సన్నని బంగారుగొలుసూ, సిల్కు జుబ్బా, మల్లు పంచె - చూస్తూ నిలబడిపోయింది గీత. అలనాటి స్నేహితుడు కనిపించినందుకు ఆనందంగా వుంది.

"హై" అంది తను కూడా.

"మీ హబ్బీ రాలేదా?"

"వచ్చారు. అదుగో" అంది కాస్త ఎడంగా మరెవరితోనో మాటాడుతున్న హరిని చూపించి. హరి అక్కడ్నుంచే చెయ్యూపేడు.

"ఎనీ కిడ్స్?"

గీత లేరన్నట్టు తలూపి, అతని పిల్లలగురించి అడిగింది.

"ముగ్గురు. ఇద్దరబ్బాయిలూ, ఒక అమ్మాయీ."

"ఏం చదువుతున్నారు?"

"పెద్దవాడు మూడో క్లాసు. మూడేనా? మూడే అనుకుంటాను" అంటూ రెండు క్షణాలు ఇబ్బందిగా చూసి, "ఆ మేటర్సన్నీ మా ఆడాళ్లు చూసుకుంటారు. సంపాదించి పడేయడమే నాడూటీ" అన్నాడు నవ్వుతూ.

ఇంతలో అతన్ని ఎవరో పిలిచారు మరెవర్నో కలవాలంటూ. అతను మళ్లీ కలుస్తాలే అంటూ వెళ్లిపోయాడు అక్కడినుంచీ.

స్థలమహత్మ్యమో కాలమహత్మ్యమో1 అతనిధోరణి గీతకి నిరుత్సాహం కలిగించినమాట మాత్రం వాస్తవం.

ఆదివారం ఉదయం ప్లినరీ సెషన్. కింగ్మేకర్లు తప్పించి మిగతా వారందరూ తిరుగుముఖం పట్టేరు.

గీతా, హరీ airportకి వచ్చేరు. మొదటిరోజు డాన్సు చేసిన అమ్మాయితండ్రి కనిపించాడు గీతకి. అమ్మాయి పక్కనే ఓ షాపుదగ్గర నిలబడి రోలింగ్ స్టోన్స్ పత్రిక చూస్తోంది.

"మీ అమ్మాయికి మంచి నర్తకి అయే లక్షణాలు వున్నాయండి" అంటూ పలకరించింది ఆయన్ని.

ఆ తండ్రి ఏమంత ఆనందించినట్టు కనిపించలేదు. పెదవి విరిచి తలెగరేశాడు. తరవాత నెమ్మదిగా "అందరూ అట్లానే అంటున్నారు" అన్నాడు.

గీతకి ఇంకేం మాటాడాలో తోచలేదు. ఆ పిల్లతండ్రి నెమ్మదిగా తనకథ చెప్పేడు. ముగ్గురు అబ్బాయిలతరవాత ఈ అమ్మాయి కలిగిందిట. చిన్నప్పట్నుంచీ డాన్సంటే సరదా. తల్లీ, తదితరబంధువులపోరు పడలేక డాన్సు చెప్పిస్తున్నాడు. విజయవాడలో మొదలై, హైదరాబాదు, తరవాత మద్రాసు చేరుకునేవరకూ వచ్చింది. "మంచి గురువుంటే ఇంకా బాగా వస్తుంది, ఇంకా బాగా వస్తుంది"

అంటూ పరుగులకి పోయేరు వారిమాటా వీరిమాటా విని. అలాటి పోరుతోనే అప్పుచేసి పిల్లని ఇక్కడికి తీసుకువచ్చేరు.

‘‘పోన్లెండి. ఇక్కడికి రావడంమూలాన పదిమంది కళ్ల బడింది కదా.’’ అందీ గీత సానుభూతిగా.

ఆయన పెలితి నవ్వొకటి నవ్వేడు. ‘‘దాంతోపాటు పదిహేనువేలు అప్పు. ఎలా తీర్చుకుంటానో తెలీదు.’’

‘‘సాయం చెయ్యమని అడిగేరు కదా సెక్రటరీగారు,’’

‘‘చాలినంత రాలేదండీ.’’

గీత నిట్టూర్చింది. ఆయన్ని చూస్తే జాలేస్తోంది. హరి వచ్చి ఫ్లైటుకి టైమయిందన్నాడు. గీత ‘‘వస్తానండీ’’ అని చెప్పి ఆయనదగ్గర శలవు తీసుకుంది.

‘‘ఎలా వున్నాయి సమావేశాలు?’’ అన్నాడు హరి కిటికీసీటు గీతకి వదిలి, తను పక్కసీటులో సర్దుకు కూర్చుంటూ.

గీత ఇదమిత్థంగా చెప్పలేకపోయింది ఆ సమావేశాలు తనకి ఆనందాన్నిచ్చేయో లేదో, తాను ఏమి ఎదురుచూసిందో చెప్పడానికి మాటల్లేవు. అంతా కలగాపులగంగా, గందరగోళంగా వుంది. రెండురోజులు మనవాళ్లమధ్య గడిపేను అన్న తృప్తి కలగలేదు. అనంతంగారిని కలవడం, చిత్రకళాప్రదర్శనా, శశికళ నృత్యం చాలా తృప్తిని ఇచ్చేయి. కానీ దాంతోపాటే ఇదీ అని చెప్పలేని ఏదో లోటు కూడా బాధిస్తోంది!

‘‘బాగానే వున్నాయి’’ అంది హరి ప్రశ్నకి సమాధానంగా.

మర్నాడు తపతితో మాట్లాడుతూ, ఇండియానించి వచ్చిన బాలనర్తకీ, యువ రచయిత్రీ, అనంతంగారితో సాహిత్యచర్చలూ, అన్నీ చెప్పి, ‘‘నాకేమిటో ఆయన అభిప్రాయాలు గందరగోళంగా వున్నాయి. కుటుంబరావు రచనలకీ స్త్రీలరచనలకీ మధ్య గల వైవిధ్యం ఎత్తి చూపి, కుటుంబచిత్రణమీద చిన్న ఉపన్యాసం ఇచ్చేరు. అది అర్థం చేసుకునేంతతెలివితేటలు నాకు లేవు.’’ అంది.

‘‘విమర్శలూ, సమీక్షలూ ఎప్పుడూ అలాగే వుంటాయి. ఇదే సత్యం అని నిర్ధారణగా చెప్పరు. ఆయన అభిప్రాయం ఆయన చెప్పేరు. ప్రతివారూ తాము చెప్పేదీ చేసేదీ కూడా మనసా వాచా నమ్మే చెప్తారు, చేస్తారు.’’

గీతకి మాత్రం నిరుత్సాహంగానే వుంది. ఆతరవాత వరసగా రెండు కథలు రాసింది. ఒకటి చిత్ర కథా, రెండోది బాలనర్తకి కథా. అనంతంగారిమాటలు మనసులో అలా దాచుకుంది. హరికీ, తపతికీ చూపించింది. వాళ్లు ‘‘ఫరవాలేదు, బాగానే వున్నాయి’’ అన్నారు. గీతకి తృప్తిగా లేదు. రెండూ చించిపారేసింది.

‘‘కాయితాలు చించిపారేస్తే ఫరవాలేదు. ఆలోచనలు పారేయకు. మంచికథ రాయడానికి చాలాకాలం పడుతుంది ఒకొకప్పుడు’’ అంది తపతి.

అఖరికి హరితో అంది, ‘‘నాకు ఇండియా వెళ్లాలని వుంది,’’

''అదీ నీ అసంతృప్తికి అసలు కారణం. నీకు ఇంటిమీద మనసు పోయేలా చేసేయి ఆ సమావేశాలు'' అని, ''టికెట్ సంగతి కనుక్కుంటాను. నువ్వు మీ మేనేజరుతో కూడా మాట్లాడు శలవు సంగతి'' అన్నాడు.

***

హరి కూడా 'వెళ్లిరా' అన్నతరవాత, గీత సూపర్వైజరుని కలుసుకుని, "మీరు ప్రమోషను సంగతి మాట్లాడతాను అన్నారు. మనం ఆవిషయం మాట్లాడడానికి వీలవుతుందా? నేను ఇండియా వెళ్ళి వద్దాం అనుకుంటున్నాను. మానాన్నగారిని చూసి చాలాకాలం అయింది," అంది రవంత జంకుతూ.

ఆయన, "అయ్యో తప్పకుండా వెళ్లిరండి. ఫామిలీ ముఖ్యం. మీరు తిరిగివచ్చేక, ప్రమోషనుసంగతి మాట్లాడదాం, ఎన్నిరోజులు వుంటారక్కడ?" అన్నాడు.

"ఎక్కువ రోజులు లేదు, రెండువారాలు వెళ్దాం అనుకుంటున్నాను."

"అలాగే, వెళ్లిరండి. మీకెంత శలవుందో కనుక్కోండి. మిగతా రోజులు తెలుసు కదా, జీతనష్టం," అన్నాడాయన.

గీత సరేనని, థాంక్స్ చెప్పి వచ్చేసింది. ఆ సాయంత్రం హరితో చెప్పింది తనకి శలవు దొరికిందని. ఆరాత్రే బాబాయికి ఫోను చేసింది వస్తున్నానని చెప్పడానికి.

భానుమూర్తి సంతోషంగా, "ఎప్పుడు బయల్దేరుతున్నావు? ఇద్దరూ వస్తున్నారా?" అంటూ ప్రశ్నలవర్షం కురిపించేడు.

తాను ఒక్కదాన్నే వస్తున్నానని చెప్పింది, 'నన్ను మాత్రం అవీ ఇవీ తెమ్మని అడక్కు" అంది.

"నీ మాటతీరు చాలా మారిపోయింది." అన్నాడు భానుమూర్తి.

నెలరోజులనాడు గీత దేశానికి ప్రయాణమయింది. దాదాపు ఆరేళ్లతరవాత. షికాగోలో ప్లేనెక్కుతూంటే దిగులేసింది. "మీరొక్కరూ ఎలా వుంటారో" అంది హరితో.

హరి నవ్వుతూ, "మరేం ఫరవాలేదు. నువ్వు రాకముందు నేనొక్కణ్ణీ వుండలేదేమిటి. నాకేం ఫరవాలేదు కానీ, నువ్వే జాగ్రత్త. ఇక్కడి వాతావరణం అలవాటయినతరవాత అక్కడ ప్రతిదీ చిరాగ్గానే వుంటుంది. మనుషులు మనుషుల్లా కనిపించరు. ఇళ్లు ఇళ్లలా వుండవు కొందరికైతే." అన్నాడు.

"పోదురూ, మీరు మరీనూ" అంది గీత

***

భానుమూర్తి బొంబాయి వచ్చి, గీతని విజయవాడ తీసుకువెళ్లేడు. "రేపు వచ్చి మాయింటికి తీసుకెళ్తాను" అని చెప్పి వెళ్లిపోయాడు అతను.

తండ్రి గీతని చూసి కళ్ల నీళ్లు పెట్టుకున్నాడు, "మళ్లీ నిన్ను చూడనేమో అనుకున్నాను" అంటూ. కామాక్షి పోయినతరవాత ఆయన చాలా డీలా పడిపోయాడు, గీత ఊరు విడిచి పోయిన తరవాత ఈమధ్యకాలంలో చాలా మార్పులు జరిగేయి. తల్లిపోవడం ఒక్కటే కాదు. భానుమూర్తి వాళ్ల ఆఫీసులోనే పనిచేస్తున్న ఉషారాణిని పెళ్లి చేసుకుని వేరింటి కాపురం పెట్టేడు. తల్లిపోయిన యాడాదిలోపున కన్యాదానం మంచిదని

చెల్లెలి పెళ్లి చేసేసేరు ఆర్నెల్లు తిరక్కుండా. ఊళ్లోనే పోస్టాఫీసులో పని చేస్తున్నాడుట ఆ అబ్బాయి. వాళ్లకి ఇద్దరు అబ్బాయిలు. తమ్ముడు బాగా పొడుగెదిగాడు. కాలేజీలో రెండో ఏడు చదువుతున్నాడు. అన్న ఏదో గవర్నమెంటు ఆఫీసులో యూడీసీ. బామ్మ మామూలుగానే మంచంలో మూలుగుతూ పడి వుంది. ఆవిడలో మాత్రమే ఏ మార్పూ కనిపించలేదు గీతకి.

"ఇంటివిషయాలు మీరు రాయకపోతే నాకెలా తెలుస్తాయి? నాన్నకి ఒంట్లో బాగులేదని నాకెందుకు రాయలేదూ?" అంది విసుగ్గా..

"నువ్వు బెంగ పెట్టుకుంటావని నాన్నే రాయొద్దన్నారు" అన్నాడు అన్న.

విశేషాలన్నీ నాన్న చెప్తుంటే పక్కనే కూర్చుని వింది. ఆరేళ్లలో ఇన్ని సంగతులు జరిగివుంటాయని తను అనుకోలేదు. అమెరికాలో తనలోకంలో తను వుండి ఇక్కడ ఏం జరుగుతోంది అన్న ఆలోచన రానేలేదు తనమనసులోకి.

మర్నాడు బాబాయి ఇంటికి వెళ్లింది. పిన్ని సంసారపక్షంగా వుంది. గీతని చూడగానే పాతచుట్టాన్ని పలకరించినట్టుగా మొదలు పెట్టి తన కష్టసుఖాలు ఏకరువు పెట్టింది.

"నాకెప్పుడూ ఏదో ఒక బాధ. తలనొప్పి, నడుంనొప్పి, మోకాళ్లు పట్టేయటం, ఏదో ఒకటి. పిల్లలు ఇద్దరూ రాక్షసులే అనుకో. కింద పెడితే పంటలుండవు, మీద పెడితే వానలుండవు. చంపుకుతింటున్నారు. పనివాళ్లమాట సరేసరి. గట్టిగా మాటంటే చేతిలో గిన్నె అక్కడే పారేసి పోతారు. వాళ్లకి మనమే భయపడాలి. మీ బాబాయిమాట అడక్కు. ఆయనకి ఇంటివాళ్లకంటె వూళ్లో వాళ్లే ఎక్కువ. ఇంటిపనీ, బయటిపనీ అంతా నేనొక్కదాన్నే చూసుకోవాలి .."

గీత వింటూ కూర్చుంది.

తనగోడు అయింతరవాత, ఉషారాణి అమెరికాలో సుఖాలగురించి అడగటం మొదలుపెట్టింది. "అక్కడ అన్నిటికీ మెషీనులుంటాయిుట గదా. మీకు కారుంది కాబోలు. నీకు వేరే కారుందా? ఉద్యోగం చేస్తున్నావుట. ఇక్కడ నేనూ చేస్తున్నాను ఎందుకూ .. చెప్పుకోడానికే. చాకిరీయే తప్ప రెండువారాలయేసరికి నాజీతం ఆయనజీతం అంతా హుళక్కి. అయినా నిత్యా చచ్చేవాడికి ఏడ్చేవాళ్లెవరులే. ... మీరే చేసారంటూ అమ్మానాన్నలమీద పడి ఏడవడానికి కూడా లేదు. లవ్ మేరేజి."

గీతకి మాట తోచలేదు. మౌనంగా వింటూ కూర్చుంది. ఆపూట వాళ్లింట్లో భోంచేసి ఇంటికొచ్చేసింది.

మర్నాడు శివరావు మామయ్యగారికి ఫోనుచేసి కొంచెంసేపు మాట్లాడి, సత్యం నెంబరు తీసుకుంది. సత్యం ఫోను అందుకుని ఎంతో చనువుగా మాట్లాడింది. గుంటూరు ఎప్పుడు వస్తావని అడిగింది. తనకి నలుగురు పిల్లలుట. ఇద్దరు ఆడపిల్లలూ, ఇద్దరు మొగపిల్లలూ. తొలిచూలు ఆడపిల్ల, అత్తగారు ఎంతో ముచ్చట పడిపోయేరుట. "ఆమధ్య నువ్వు రాసినఉత్తరం చూసి ఆవిడ ఎంతో మురిసిపోయేరు," అంది సత్యం.

"ఉత్తరం అందిందన్నమాట. మరి జవాబు రాయలేదేం?"

"ఏంలేదు. బద్ధకం అంతే. రాద్దాం రాద్దాం అనుకుంటూనే రోజులు గడిచిపోయేయి."

నాలుగురోజులాగి, గుంటూరు బయల్దేరింది. శివంమామయ్య బస్టాండుకి కారు పంపించేరు. గీత వాళ్లింట్లో కూర్చుని మాటాడుతుంటే కళ్లు చెమ్మగిల్లేయి. కనకమ్మ ఎంతో ఆప్యాయంగా పక్కన కూర్చుని, "నువ్వూ మీఆయనా బాగున్నారా అమ్మా? నీకక్కడ సుఖంగా వుందా?" అంటూ ప్రశ్నలేసింది.

"బాగానే వున్నాం" అంది గీత.

కనకమ్మే మళ్లీ "ఎక్కడయితేనేముందిలే. అంతా మనం అనుకోవటంలోనే వుంది, సుఖం అనుకుంటే సుఖం, దుఃఖం అనుకుంటే దుఃఖం." అంది.

అక్కడ ఓగంట కూర్చుని, సత్యంయింటికి బయల్దేరింది.

శ్యాం వరండాలో కూర్చుని సాలిటేర్ ఆడుకుంటున్నాడు. గీతని చూసి, "బాగున్నావా? ఎప్పుడొచ్చావు?" అన్నాడు యాదారాపంగా. మునపటి హుషారు లేదు మనిషిలో.

లోపల్నుంచి సత్యం వచ్చింది, "రా, రా." అంటూ. బాగా నునుపు తేలింది. ముస్తాబు కూడా ఓపాలు ఎక్కువే. మునపటి సత్యం కాదు.

పదినిముషాల్లో గీత చాలా సంగతులు గ్రహించింది. పేరుకే శ్యామ్ కానీ వ్యాపారం అంతా తనే చూస్తోందిట. స్థానిక మహిళాసంఘం, లయన్స్ క్లబ్బు, ఇంకా అంతర్జాతీయ సంఘాలూ - తను వేలు పెట్టనివ్యాపకం లేదు. నెలకి నాలుగురోజులు ఇంట్లో వుంటే గొప్పట. ఈరోజు ఏ మీటింగులూ లేకపోవడం గీతరాత బాగుండే అన్నట్టుంది ఆవిడ మాటతీరు చూస్తుంటే. ఆమాటా, ఈమాటా మాట్లాడుతూ, హఠాత్తుగా, "నీకు పిల్లల్లేరుట కదా. విన్నాలే. మాబుజ్జిగాడిని పెంచుకోరాదూ?" అంది.

గీత నిర్ఘాంతపోయింది. తను రైలు దిగింది మొదలు బామ్మా, ఇరుగూ, పొరుగూ - ప్రతివారూ ఏదోవంక పిల్లలప్రసక్తి తెస్తూనే వున్నారు. ఎవరికి తోచిన సలహాలు వారు యిస్తూనే వున్నారు. "ఎందుకు లేరూ?" "వద్దనుకున్నారా? ఆయనే అన్నాడా? నీకు పుట్టిన బుద్ధేనా?" "ఎవరిలోపం? డాక్టర్లని సంప్రదించేరా?" "వెంకన్నకి ముడుపు కట్టుకో" "ఆదేవుడు" "ఈదేవత" "ఆ సామి" "ఈ అమ్మ" - గీతకి తలవాచిపోతూంది.

వాళ్లంతా ఒక ఎత్తు. సత్యం తనకి ఆప్తురాలు. సత్యందగ్గర తనకి మనశ్శాంతి అనుకుంది. కానీ ఈ సత్యం అలనాటి నేస్తురాలు కాదు. ఈమె సత్యవతి మేడమ్, హైక్లాస్ సోషలైటు, పేరు పొందిన సాంఘికసేవాతత్పరురాలు.

గీత మాటాడలేదు.

సత్యమే మళ్లీ రొకాయిస్తూ, "ఏం? నిర్ణయాలు అయిపోయేయేమిటి? మీ చెల్లెలికొడుకుని దత్తత తీసుకుంటావా?" అంది.

గీత తేరుకుని, "లేదు. అసలు మేం ఏమీ అనుకోలేదు" అంది.

"ఇంకేం మరి. ఇప్పుడయినా మొదలుపెట్టు ఆ ఆలోచన. నువ్వు ఇక్కడ వుండగానే తేల్చుకోడం మంచిది. నీకు ఏమైనా అనుమానాలుంటే చెప్పు."

“ఏమోలెద్దూ. ఇప్పుడెందుకు ఆగొడవ. ఇది నేనొక్కదాన్నీ చేసే నిర్ణయం కాదు కదా.” అంది గీత. ఆ తరవాత అట్టేసేపు కూర్చోడానికి మనసొప్పలేదు. “పొద్దు పోతోంది, వెళ్తాను” అంటూ లేచి, “పద, బస్సెక్కిద్దువుగానీ,” అంది.
సత్యవతి సరే పద అంటూ డ్రైవరుని పిలిచింది గీతని బస్టాండుకి తీసుకెళ్లడానికి.

ఆరాత్రి హరి పిలిచాడు ఎలా వున్నావని అడగడానికి. గీత దాదాపు ఏడుపుగొంతుతో జరిగినసంగతి చెప్పింది.. హరి కూడా బాధపడుతూ, “మనకి తోచలేదు ఈ సంగతి.. సరేలే. ఆమాటే చెప్పు. ఇద్దరం ఆలోచించుకోవాలి అని,” అన్నాడు.
తరవాత అత్తవారివూరు వెళ్లి నాలుగు రోజులుండి వచ్చింది.
ఓ సాయంత్రం వరండాలో కూర్చుని ఆలోచిస్తుంటే, మ.తె. సమావేశాల్లో కనిపించిన లెక్కల మాస్టారు గుర్తుకొచ్చేరు. ఆయన గీతకి అయిదోక్లాసులో లెక్కలు చెప్పేరు. తరవాత పి.హెచ్.డీ చేసి అమెరికా వెళ్లేరు. అక్కడ బాగులేదని ఇండియా వచ్చేసి, బెంగుళూరులో ఐఐటీలో చేరేరు. వాళ్లిచ్చే రూపాయలు డాలర్లకి సరితూగడంలేదని మళ్లీ అమెరికా వచ్చేరు. సమావేశాలలో గీతని గుర్తుపట్టి మాట్లాడుతూ, “మాఆవిడ ఇండియా వెళ్లిపోదాం అంటోంది. ఇక్కడ ఎన్నాళ్లుంటానో తెలీదు” అన్నారు.
ఆలోచిస్తూ సరోజ రావడం చూడనేలేదు.
“ఏమిటి నీలో నువ్వే నవ్వుకుంటున్నావు?” అంటూ పక్కన చతికిలబడింది సరోజ. సరోజా, వాళ్లాయన సురేష్ కూడా లెక్కలమాస్టారిలాగే ఇటో కాలూ, అటో కాలూ వేసి కొన్నేళ్లు ఉయ్యాలలూగి, చివరికి జమ్షెడ్పూర్లో స్థిరపడ్డారు. సరోజ పుట్టింటికి వచ్చింది తల్లిని చూడ్డానికి.
గీత ఉలికిపడి, తేరుకుని, “రా, రా. ఎప్పుడొచ్చేవు?” అంటూ కుశలప్రశ్నలేసింది
తరవాత మాట్లాడుతుంటే తనసందేహం వెలిబుచ్చింది. “ఇందాకా నువ్వు అడిగేవు ఏం ఆలోచిస్తున్నానని. ఏంలేదు. ఎక్కడ సుఖం వుంది అని ఆలోచిస్తున్నాను. నువ్వు కూడా రెండులోకాలూ చూసావు కనక చెప్పు. ఏదేశంలో సుఖం వుంది?”
సరోజ నవ్వింది. “అది గొప్ప భేతాళప్రశ్న. జవాబు తెలిస్తే చాలామంది దుగ్ధ తొంబైపాళ్లు వదిలించేయొచ్చు” అని, “అది అంత తేలిగ్గా తేలే ప్రశ్న కాదు గానీ. నువ్వెలా వున్నావు, చెప్పు. ఏంచేస్తున్నావు? పిల్లలేరీ?” అంది.
“సరి. నువ్వు కూడా మొదలెట్టకు సొద. ఛస్తున్నాను జవాబులు చెప్పలేక.” అంది గీత చిరాగ్గా..
“లేదులే. అడగను. నీకు నచ్చినమాటలే చెప్పు.”
గీతమనసు తేలికపడింది. మనసిచ్చి మాటాడే ఆత్మీయురాలు దొరికింది. “పద, అలా కాస్సేపు క్రిష్ణ వొడ్డున తిరిగొద్దాం.” అంది లేస్తూ.

సరోజ గీతవేపు నిదానించి చూసింది. గీత ఆద్యంతాలులేనిప్రశ్నతో కుస్తీ పడుతోంది. సమాధానం ఎవరు చెప్పగలరు?

గీత తండ్రితో 'బయటికి వెళ్తున్నాన'ని చెప్పి, బయల్దేరింది. ఇద్దరూ క్రిష్ణాబరాజి చూస్తూ నెమ్మదిగా నడుస్తున్నారు.

"నువ్వు అడిగినప్రశ్నకి జవాబు ఏం చెప్పాలో నాకూ తెలీదు గీతా. నువ్వు టీవీ చూస్తావా?"

"చాలా తక్కువ. ఏం?"

"ఒక గేం షో వుంది price is right అని. ఆ హోస్టు ఏదో ఒక వస్తువు చూపించి ధర చెప్పమంటాడు పోటీదారుని. ఆపోటిదారు అక్కడ చేరిన ప్రేక్షకులవేపు చూస్తాడు. దాదాపు వందమంది వుంటారు. అందరూ తలో ధరా అరుస్తారు. అంతమంది అన్ని ధరలు చెప్తే దేన్ని నమ్మడమో ఆ పోటీదారుకి ఎలా తెలుస్తుందంటావు?"

"ఏమో లెద్దూ. నాకు తెలీదు. నువ్వే చెప్పు చంపక."

"అదే నేను చెపుతున్నదీను. ఆ అబ్బాయికీ తెలీదు. చివరికి తనకి తోచినధర చెప్తాడు. మరి ఆపని ముందే చెయ్యొచ్చు కదా. ప్రేక్షకులదిక్కు చూట్టం ఎందుకూ అంటే సమాధానం లేదు. జీవితం కూడా అంతే. మనకి కావలసింది పని గట్టుకు మంచిచెడ్డలు ఆలోచించుకోకుండానే నిర్ణయాలు చేసేసుకుంటాం. దానికి మద్దతు ఇచ్చేవారికోసం దిక్కులు చూస్తాం. అది యిచ్చేవారుంటే సంతోషం. లేకుంటే విచారం. మనం చేసేది మనం ఎలాగూ చేస్తాం. నాకు తెలిసిందంతా నేనూ, మాఆయనా, పిల్లాడూ - మేంముగ్గురం వీలయినంత ప్రశాంతంగా రోజులు గడుపుకోటమే. నేను మెడిసన్ పూర్తి చెయ్యలేదు. సురేష్ ఆరోగ్యం ఏమంత మంచిది కాదు. అంచేత నేను అతనితోనే వుంటాను ఎల్లవేళలా, అతను ఎక్కడికి వెళ్తే అక్కడికి వెళ్తాను. మొదట్లో బాబుచిన్నప్పుడు కాస్త కష్టం అయింది కానీ ఇప్పుడాబాధ లేదు. వాడు ఎదిగాడు. నాకింక పూర్తిగా శలవు. మాఇంట్లోనూ వూళ్లూనూ కూడా ఎంతమంది కొరుక్కుతిన్నారో చెప్పలేను. నా తెలివితేటలన్నీ బుగ్గిపాలయేయనీ, నాకు వ్యక్తిత్వం లేదనీ, కొందరు సంఘుసంస్కర్తలయితే నేను స్త్రీవాదాన్ని ఒక దశాబ్దం వెనక్కి మళ్లించానని కోప్పడ్డారు కూడాను. ఈ నొల్లుకబుర్లన్నీ పట్టించుకోకపోతే ఎనలేని శాంతి. నేను సాధించింది అంతే."

సరోజవదనం నిర్మలంగా ప్రకాశిస్తూంది. గీత సరోజచేతిని ఆప్యాయంగా తనచేతిలోకి తీసుకుని, "తెలీదంటూనే చక్కగా చెప్పావు. ఎవరికైనా కావలిసింది అంతే కదా ఆత్మతృప్తి." అంది.

***

గీత ఇండియానించి తిరిగొచ్చేక ఇద్దరూ ఎవరివ్యాపకాల్లో వాళ్లు పడిపోయారు. ముందు అనుకున్నట్టుగానే గీతని ఫుల్ టైం సూపర్వైజరుగా చేశారు వాళ్ల సెక్షనుకి. ఇప్పుడు గీతకి తీరిక లేదు. రోజంతా ఆఫీసులోనే సరిపోతోంది.

హరికంపెనీ కూడా బాగా అభివృద్ధి అయింది. కన్సల్టింగు అనో కొత్త డీల్ అనో ప్రయాణాలు ఎక్కువయేయి హరికి. అంచేత ఒకొకప్పుడు శనాదివారాలు కూడా ఇంటికి రావడంలేదు. ఒకొకప్పుడు గీతనే షికాగో రమ్మంటున్నాడు కంపెనీపార్టీలకి.

"నాకు రావాలని లేదు, మీరు వెళ్లండి" అంది గీత ఒకసారి.

"నువ్వు రాకపోతే బాగుండదు," అన్నాడు.

"అలంకారప్రాయంగానా?"

"అలంకారం అని కాదు. నీ అండదండలు నాకు వుంటేనే కదా నేను ఘనకార్యాలు సాధించగలిగేది."

"మీకు నా పరిపూర్ణ సహకారం వుందని రాసివ్వనా?"

"చూసావా, నీకు హాస్యంపాలు కూడా ఎక్కువే. నువ్విలా మాట్లాడతావనే మా ఆఫీసులోవాళ్లకి నువ్వంటే ఇష్టం."

గీతకి చిరాకేసింది కానీ అణుచుకుని వూరుకుంది. పోచంపల్లిచీరె ఒకటి తీసి కట్టుకుని, బయల్దేరుతుంటే, "యూ ఆర్ బ్యూటిఫుల్" అన్నాడు హరి. ఈమధ్య ఈరకం వాగ్ధోరణి అతనికి బాగా పట్టుబడింది.

గీత మాటాడలేదు. 'ముఖమే కనిపించింది కానీ మనసు కనిపించలేదతనికి. లేక అతను ఆమెమనసులోకి చూడదలుచుకోలేదో, చూడబోతే కనిపించేది భరించడం కష్టం అనేమో' గీత ఆలోచనల్లో పడిపోయింది కారులో కూర్చుని.

రెండున్నరగంటలు ప్రయాణం చేసి, పార్టీ ఇస్తున్న థాంప్సన్గారిఇల్లు చేరుకున్నారు. ఇల్లు పెద్దదే. మిసెస్ థాంప్సన్నుగారికి ఇంటి అలంకరణ అత్యంత ప్రీతికరమయిన కాలక్షేపం. మార్తా స్టూవర్ట్ చూసిందంటే కళ్లు తిరిగాలి. అంత అందంగా అమర్చింది ఆవిడ.

ఆహూతులు అట్టేమంది లేరు. ఎనిమిదిమంది మాత్రమే. న్యూయార్కునించి విలియమ్స్ వచ్చాడు. గీతని ఆనవాయితీ ప్రకారం పలకరించి చిత్ర బాగుందనుకుంటాను అన్నారు. గీత వాళ్లబ్బాయి ఎలా వున్నాడని అడిగింది. తరవాత ఇద్దరూ పక్కనున్నవారితో మాటలు కలిపారు.

థాంప్సన్ ఎవరికి ఏ డ్రింకు కావాలో కనుక్కున్నాడు. గీత తనకి ఏమీ వద్దంటే, జూస్ కానీ సోడా కానీ ఇవ్వనా అని అడిగేడు. జూసు తీసుకుంటానంది గీత.

మిసెస్ థాంప్సన్ వేరుశనగపప్పూ, ఛీజు ముక్కలూ, క్రాకర్సూ తెచ్చిపెట్టింది బల్లమీద డ్రింకులతో పాటు నమలడానికి.

ఇక్కడ కూడా ఆడవారూ మగవారూ జట్లు జట్లుగా విడిపోవడం గీతకి ఆశ్చర్యం వేసింది.

ఓ గంటసేపు కబుర్లు అయేక, దాదాపు ఏడుగంటలకి పెచ్చుపెట్టాల్సినవి పెచ్చుపెట్టి, బల్లమీద ప్లేటులూ, ఫోర్కులూ, మొదలయినవి సర్దింది ఇంటావిడ. మిస్టర్ థాంప్సన్ ఆవిడకి సాయం చేసేడు. అందరూ తమతమ డ్రింకులు పుచ్చుకుని భోజనాలబల్ల దగ్గరికి చేరేరు. ఎవరు ఎక్కడ కూర్చోవాలో మిసెస్

థాంప్సన్ చెప్పింది. వరసగా గిన్నె తరవాత గిన్నె అందుకుంటూ, కొంచెం వడ్డించుకుని తరువాతివారికి అందిస్తూ ఒక రౌండు వడ్డనలు ముగించారు.

భోజనాలయేక, అందరూ లివింగ్రూంలో చేరి కబుర్లు చెప్పుకున్నారు. థాంప్సన్ హాస్యకథలు చెప్పాడు. వచ్చినవాళ్లందరూ గలగల నవ్వేరు. అంతా పద్ధతిప్రకారం జరిగిపోయింది.

తిరుగుప్రయాణంలో హరి గీతతో అన్నాడు, “చూశావా, రానన్నావు కానీ బాగానే ఎంజాయ్ చేసేవు” అని.

గీత “అవున్లెండి” అంది పొడిగా.

“నువ్వు రాకపోతే నేనిచ్చుకోవాలి సమాధానాలు. మనకేవో స్పర్థలున్నాయి అనుకుంటారు. నువ్వు నాకు సపోర్టు ఇవ్వడంలేదనుకుంటారు. ఇంట్లోనే సఖ్యత లేకపోతే ఆఫీసులో సహోద్యోగులతో ఎలా పని చేస్తావు అంటారు. నాకు టీంస్పిరిట్ లేదంటారు” అన్నాడు పరిస్థితి వివరిస్తూ.

గీత నిరామయంగా వింటూ కూచుంది.

వారిద్దరిమధ్య అనుబంధం చిన్నబీట వేసి క్రమంగా ఎడం పెరుగుతోంది కానీ ఇద్దరిలో ఎవరికీ ఆ స్పృహ వున్నట్టు లేదు. ఎవరిపనుల్లో వారు మునిగిపోయారు. అలాటిసమయంలో హరి స్నేహితుడు ఒకాయన ఇల్లు కొనమని సలహా ఇచ్చేడు. అది స్టేటస్ చిహ్నమే కాక ఇన్వెస్ట్మెంటూ, టాక్స్ రైటాఫ్ లాభాలూ కూడా వుంటాయని. సొంతయిల్లు అన్న సుఖం ఒక్కటే కాక హరి ఆదాయానికి అది అవసరం.

గీతతో చెప్తే, “సరే చూద్దాం” అంది తను కూడా.

దాంతో మరో రెండు ప్రశ్నలు - ఎక్కడ? ఎంతలో? షికాగోలో ధరలు చాలా ఎక్కువ. పొలిమేరల్లో అయితే కాస్త నయం కానీ ఇద్దరూ చెరోవేపూ ప్రతిరోజూ గంటలతరబడి రోడ్డుమీదే బతకాలి. పైగా ఊపిరాడని జనం. అంతూ పొంతూ లేకుండా కోలాహలం. పోనీ, మధ్యేమార్గంగా రాక్ఫర్డులో చూద్దాం అనుకున్నారు కానీ అక్కడ మార్కెట్ బాగులేదు. ఇల్లు అప్రీషియేట్ అవవు. అమ్మబోతే పెట్టుబడి కూడా గిట్టుబాటు కాకపోవచ్చు. చూడగా చూడగా మాడిసనే నయం అనిపించింది. దాదాపు పదేళ్లుగా most livable city గా పేరు తెచ్చుకుంది. ఆఖరికి మాడిసన్లోనే ఇల్లు చూడ్డానికి నిశ్చయించుకున్నారు.

హరి హనుమయ్యగారికి ఫోను చేశాడు సలహా అడగడానికి. వాళ్లు ఇక్కడ చాలాకాలంగా వున్నారు కనక ఆనుపానులు చెప్పగలరని.

ఆయన “నేను ఇల్లు కొని ఇరవైఏళ్లయింది కదండీ. అప్పటికీ ఇప్పటికీ మార్కెట్ చాలా మారిపోయింది. దామోదరంగారు ఈమధ్యనే కొన్నారు. ఆయన్ని కనుక్కోండి” అని దామోదరం నెంబరు ఇచ్చారాయన.

హరి ఎప్పుడో ఒకసారి హనుమయ్యగారింట్లోనే దామోదరాన్ని చూశాడు కానీ అట్టే పరిచయం లేదు.

దామోదరానికి ఫోన్ చేస్తే ఆయన ఇల్లు కొనడంలో కష్టసుఖాలమీద పావుగంట ఉపన్యాసం ఇచ్చి, తనకి తెలిసిన ఒక ఇండియన్ రియాల్టరు ఉన్నాడని చెప్పి పేరూ, ఫోన్నంబరూ ఇచ్చాడు హరికి. అతను బెన్నీపేరుతో చెలామణి అవుతున్న బ్రహ్మానందం, “ఏజంట్లు వెంటనే పోనెత్తరు. వాళ్లు చాలా బిజీగా

వున్నారని మనం అనుకోవాలని వాళ్ల తాపత్రయం. ఆసంగతి అందరికీ తెలుసు అని వాళ్లక్కూడా తెలుసు. అయినా అదో తంతు. ఒకటి రెండు రోజుల్లో పిలుస్తాడు లెండి" అన్నాడు దామోదరం.

తరవాత హరి బెన్నీని పిలిచాడు. అనుకున్నట్టుగానే ఆన్సరింగ్ మెషీను పలికింది.

మర్నాడు బెన్నీ ఫోన్ చేశాడు హరికి. "ఎక్కడ కలుసుకుందాం మాట్లాడడానికి?" అని అడగాడు లాంఛనప్రాయంగా.

"మీరే చెప్పండి. మీ ఆఫీసుకి రమ్మంటే వస్తాం. లేదా మీరు మాయింటికి వచ్చినా సరే,"

బెన్నీ తనే వాళ్లింటికి వస్తానని చెప్పాడు. అలా అయితే వాళ్ల జీవనసరళి కూడా కొంతవరకూ తెలుసుకోవచ్చని. శనివారంఉదయం పదిగంటలకి కలుసుకోడానికి నిశ్చయించుకున్నారు ఉభయులూ.

అనుకున్నట్టుగానే శనివారం వచ్చాడు బెన్నీ. రెండునిముషాలు పిచికోలుకబుర్లు అయింతరవాత ఆయన మొదలుపెట్టాడు, "మామూలుగా 'మీపరిస్థితి చెప్పండి' అని అడగడం ఆచారం. కానీ నేను మాత్రం మరోవిషయం మాట్లాడాలి మీతో ముందస్తుగా. నేను ఇండియనులతో పని చెయ్యడం మానేసి మూడేళ్లయింది." అన్నాడు.

"అదేమిటండీ. ఎంచేత?"

"అదే చెప్తాను. తరవాత మీకు ఇష్టమయితే ఇళ్లు చూపిస్తాను."

"అదీ ముఖ్యమే. మీకూ మాకూ మధ్య సామరస్యం వుంటేనే కదా పని సవ్యంగా సాగేది. చెప్పండి" అన్నాడు హరి.

"మీకు నానెంబరు ఇచ్చింది దామోదరంగారేనా?" అని అడిగాడు బెన్నీ.

"అవునండీ."

"ఆయనకి రియలెస్టేట్ లైసెన్సుంది అని మీకు తెలుసా?"

"తెలీదు. ఆయనకి లైసెన్సుంటే మీకెందుకు రిఫర్ చేసేరు మరి?"

"అదే చెప్పబోతున్నాను. ముందు మనం స్పష్టం చేసుకోవలసినవిషయం అదే. నాకు చాలా ముఖ్యం కూడాను. నేను మనవాళ్లతో బిజినెస్ ఎందుకు మానుకున్నానంటే,," అంటూ మొదలెట్టి, ఆయన చెప్పిన చాలా పెద్ద కథ సారాంశం ఏమిటంటే -

ఇల్లు కొనటం చాలా పెద్ద మొత్తంతో కూడిన వ్యవహారం కనక 'మనం ఎక్కడ బోల్తా పడతామో' అన్న భయం సహజం. ప్రతిఒక్కరికీ తమడాలర్లకి సంపూర్ణంగానో ఇంకా ఎక్కువగానో విలువ రాబట్టుకోవాలన్న తాపత్రయం కూడా సహజమే. అందుకు నేను తప్పుబట్టను. కానీ తకరారొచ్చేది వాళ్ల అర్థంలేనిఅనుమానాలతో. వారికి మొట్టమొదట అడ్డొచ్చేది పిరికితనం. ఊబిలో ఇరుక్కుంటున్నామేమో, మోసపోతామేమో అని ప్రతివారికీ అనుక్షణం అపనమ్మకమే. అంచేత విషయసేకరణ మొదలెడతారు. కనిపించినప్రతివారినీ వాకబుచేస్తారు. ఎవరేం చెప్పినా నమ్ముతారు.

రెండో మెట్టు "మన"వాడు అంటే నాతో చర్చలు సాగించడం. ఏ భజనకో భోజనానికో పిలవడంతో మొదలవుతుంది. మాటవరసకే 'మార్కెట్ ఎలా వుంది' అంటూ ప్రారంభిస్తారు. 'మేం ఇల్లు కొందాం అనుకుంటున్నాం' అంటారు. ఆమాట ఏ ఏజంటుకయినా కర్ణపేయమే కదా. నేను ఎంతో వుత్సాహంగా వాళ్లు అడిగినవిషయాలన్నీ చక్కగా వివరిస్తాను - ఏప్రాంతంలో ఇళ్లధరలు పెరుగుతున్నాయి, ఇరుగుపొరుగుల సాంఘికస్థాయి ఏమిటి లాటివి. వారివల్ల నేను ఎంతోకొంత కమిషన్ సంపాదించగలను అనుకుని ఓపిగ్గా వాళ్లతో తిరుగుతాను. కొత్తయిళ్లూ, పాతయిళ్లూ చూపిస్తాను. బిల్డర్లతో మాట్లాడతాం, స్థలాలు చూపిస్తాను. మాఆఫీసులో కూడా నేను తప్పకుండా ఆబిజినెస్ తెస్తాననే ఆశిస్తారు. 'మనం, మనం, తెలుగువాళ్లం. లేదా భారతీయులం. ఒకరికొకరు అండగా వుండాలి' అంటూ వాళ్లు నాకు అప్పుడప్పుడు గుర్తు చేస్తుంటారు. ఏడాదో రెండేళ్లో ఇలా లాగుతారు. హఠాత్తుగా వాళ్లు పిలవడం మానేస్తారు. నేను పిలిస్తే ఫోను తియ్యరు. అప్పుడు తెలుస్తుంది వాళ్లు మరో రియాల్టరుద్వారా కొనేశారని. ఇంతకాలం నేను తిరిగిన తిరుగుడే కాక, నాపరువుకూడా పోతుంది మా ఆఫీసులో. ఈయనకి వాళ్ల దేశీజనాలలోనే పరపతి లేదు అన్న పేరు నాకు వచ్చేసింది ఇలాటి 'మనవాళ్ల' మూలంగా. ఇలా నానెత్తిన చేతులు పెట్టినవారిలో దామోదరంగారిది పెద్ద ఖాతా."

గీతా, హరీ తెల్లబోయారు. వ్యాపారప్రపంచంలో విశేషంగా అనుభవంగల హరి కూడా నమ్మలేకపోయాడు. మనవాళ్లలో లుకలుకలున్నాయని తెలుసు కానీ ఈస్థాయిలో వున్నాయని అనుకోలేదు అతను. ఘోరం!

"మరి ఆయనే కదా మీ ఎడ్రెస్ ఇచ్చింది?" అన్నాడు హరి ఇంకా నమ్మకం కుదరక.

"అదేనండీ మిగతా కథ. ఆయనకి ఆ ఇల్లు కొనడంతో రియలెస్టేటు విద్య పట్టువడిపోయింది. లైసెన్సేముంది మూడునెలలు క్లాసులూ, ఐయిదుగంటలు పరీక్ష. అంచేత లైసెన్సు తీసేసుకున్నాడు. ఇలా ఫోన్నెంబరు ఇచ్చేయడం తేలిక కనక ఇచ్చేస్తుంటాడు. అప్పుడు ఆయన క్లయింటులవెంట తిరగఖ్కర్లేదు నాలాగ. ఇప్పుడు చూడండి. మీరేం అనుకుంటారు? దామోదరంగారు ఎంత మంచివాడు, మనవాళ్లకి సాయం చెయ్యాలని తపిస్తున్న సహృదయుడు అనుకుంటారు. నేను చెయ్యవలసినపనంతా చేస్తాను. ఆయనకి 20 శాతం రిఫరల్ ఫీ. ఆయనకదీ లాభం. మీరు కొనకపోతే ఆయనకి వచ్చే నష్టం ఏమీ లేదు."

"సారీ" అన్నాడు హరి.

గీత లేచి వంటింట్లోకి వెళ్లింది కాఫీ పెట్టడానికి.

బెన్నీ ప్చ్ అని చప్పరించి, "అంచేత ఈ 'మనవాళ్లు' స్పిరిటు నాలో చచ్చిపోయింది. సాధారణంగా మనవాళ్లెవరయినా పిలిస్తే వాళ్లని మరో అమెరికను ఏజంటుకి అప్పగించేస్తాను. నాదగ్గర ఇన్ని పోకులు పోయే ఈ మనవాళ్లు అమెరినులదగ్గర పిల్లిపిల్లలకంటె అన్యాయం. ఇంత ఘోరంగా మాటాడుతున్నాడేమిటి అనుకోకండి. వాళ్ల శ్రమలాటిదే కదా నా శ్రమకూడా అని వాళ్లు అనుకోరు. అది చూస్తే నాకు మంట. మళ్లీ నెలనెలా భజనలకి మాత్రం హాజరు ఆదామోదరంతో సహా. అందుకే నేను రాను అక్కడికి. ఎందుకొచ్చిన భజనలు చిత్తశుద్ధిలేని శివపూజలు."

"అందరూ అలాగే ఉండరు కదండీ" అన్నాడు హరి నెమ్మదిగా.

"ఆమాటా నిజమేనండీ. వున్నారు వుత్తములు కూడా. మీరూ కలిసేరేమో, రూపా, సేనాపతీ, అలాగే ఉషా వర్మా, రామన్ దీపికా .... అందులో రూపా వాళ్లూ ఇంకో మెట్టు పైకి వెళ్లి, బిల్డరు నన్ను కమిషన్ తగ్గించుకోమంటే, వాళ్లు అడ్డుపడి నా కమిషను నాకు పూర్తిగా ఇప్పించేరు. అలాటివారిని పొద్దున్నే తలుచుకుని దణ్ణం పెట్టుకుంటాను. కానీ దురదృష్టవశాత్తు నన్ను మట్టి కరిపించినవాళ్లే ఎక్కువ."

"మాకు అవన్నీ తెలియవులెండి. మేం మీతో మొదలుపెడితే మీచేతులమీదుగానే ఇంటివాళ్లం అవుతాం. నేను కూడా బిజినెస్ చేస్తున్నాను. వ్యాపారంలో నీతి ముఖ్యం అని నేను నమ్ముతాను," అన్నాడు హరి.

గీత కాఫీ, పకోడీలు తీసుకొచ్చింది.

"కేవలం సందేహం తీర్చుకోడానికే అడుగుతున్నాను. అమెరికనులతో అలాటి బాధలుండవా?" అని అడిగింది గీత.

"ఉంటారండీ వాళ్లలో కూడా. ఎటొచ్చీ వాళ్లు 'మనం మనం' అంటూ హరికథలు చెప్పరు కదా. బిజినెస్ అనే మొదలుపెడతారు. అటో ఇటో తేల్చేసుకుంటాం తేలిగ్గానే."

"సరేలెండి. చెప్పేను కదా మాతో మీకు అలాటి పేచీలుండవు. నాకంత ఓపిక కూడా లేదు."

"నేను కూడా మీరలాటివారు కారనే విన్నాను. అందుకే ఇంత దూరం వచ్చేను. మీరు సరేనంటే పని మొదలుపెడదాం. లేకపోతే ఇంతవరకూ నేను చెప్పిన హరికథకీ గీతగారిపకోడీలకీ చెల్లు. నాదారిన నేను పోతాను. మీరు మరో ఏజంటుని చూసుకోండి."

హరి గీతవేపు చూశాడు. ఇద్దరూ బెన్నీద్వారానే ఇల్లు కొనడానికి నిశ్చయించుకున్నారు. బెన్నీకి కూడా వీళ్లు తనచేత గడ్డి కరిపించరన్న నమ్మకం కుదిరింది.

"సరే అయితే. ముందు అప్పిచ్చేవాడితో మాట్లాడాలి మీరు. మీకు ఎంత అప్పు పుడుతుందో మొదట్లోనే తెలుసుకోడం ముఖ్యం. నేను ఒక ఫోన్నెంబరు ఇస్తాను. ఈయనతోనే మాట్లాడాలనేం లేదు. మీకు ఇంకెవరైనా తెలిసిన లెండరుంటే వారితోనే మాట్లాడండి." అంటూ ఒక నెంబరు ఇచ్చి, మళ్లీ ఫోను చేస్తానని చెప్పి బెన్నీ వెళ్లిపోయాడు.

బెన్నీ ఇచ్చిన నెంబరుకి వెంటనే ఫోన్ చేశాడు హరి.

''సాయంత్రం రావడానికి వీలవుతుందా? ఆరు గంటలకి రాగలరా? లేదంటే ఐయిదు అయినా సరే. ఈలోపున నేను కొంత సమాచారం సేకరించి వుంచుతాను'' అంటూ వివరాలు తీసుకున్నాడు లెండరు.

ఆసాయంత్రమే హరీ, గీతా లెండరుని కలుసుకున్నారు.

అతను "మీ క్రెడిట్ రేటింగ్ బాగుందండీ" అని చెప్తూ, వాళ్లు చెప్పిన విషయాలన్నీ రాసుకుంటూ, ''మీకు క్రెడిట్ కార్డులు ఎన్ని వున్నాయి?'' అని అడిగాడు.

''వుంటాయి పదో పన్నెండో. ఏ షాపుకి వెళ్లినా ఉచితంగా దానం చేసేవి అవే కదా.''

''అవన్నీ కత్తిరించేయండి. లేకపోతే మీకు దొరికే అప్పు మొత్తం తగ్గిపోతుంది.''

"వాటిమీద అప్పులేం లేవండి."

"లేకపోయినా, ప్రతికార్డుకీ ఇంత చొప్పున తగ్గించేస్తారు మీకు ఇవ్వబోయే అప్పులో," అని సలహా ఇచ్చి, "మరొక సందేహం. మీరు ఎవరికో మూడు వేలు అప్పు ఇచ్చినట్టు కనిపిస్తోంది. అది మళ్లీ వసూలు చేసినట్టు లేదే" అన్నాడు.

హరి ఆశ్చర్యపోయాడు. "అది చేబదులుగా ఇచ్చింది. నా పెర్సనల్ విషయం" అన్నాడు.

లెండరు, "అవుననుకోండి. ఇక్కడ కనిపించింది కనక సెటిల్ చేసుకోడమే మంచిది. వాళ్లని అడగగలరా మీకు ఇప్పుడు అవసరం అని?" అన్నాడు ఆయన.

హరి సరే మాట్లాడతానని చెప్పి, ఇంటికి వచ్చేశాడు. తరవాత టెషుకి ఫోను చేస్తే, "సుమతి అంతా అదోరకం. నేను వచ్చి చెక్కు ఇచ్చేస్తాలే. పదినిముషాల్లో వస్తాను," అన్నాడు.

హరి మళ్లీ బెన్నీని పిలిచి తమకి ఎంత అప్పు పుట్టగలదో చెప్పేడు.

"సరే ఆరేంజిలో మీకు కొన్ని ఇళ్లు చూపిస్తాను శనివారం వెళ్దాం ఇళ్లు చూడ్డానికి. అవి మీకు నచ్చకపోవచ్చు. కానీ మీకు ఎలాటిఇల్లు నచ్చుతుందో నాకు ఒక అభిప్రాయం ఏర్పడుతుంది, తరవాత మీకు నచ్చగలవు అనుకున్నవి ఎంచుకుని చూపించగలను" అన్నాడు బెన్నీ. ఇంటిగురించి తెలుసుకోవలసినవిషయాలు - అసలు అమ్మేవాడికి ఆ యిల్లు అమ్మడానికి హక్కులున్నాయా, ఇంటిమీద ఎన్ని అప్పులున్నాయి, ఆయిల్లు కట్టడం పటిష్టంగా వుందా వంటి విషయాలూ కూడా సందర్భానుసారం చెప్పుకుంటూ వచ్చేడు.

అనుకున్న శనివారంనాడు పదిగంటలకి బెన్నీ వచ్చి, హరినీ, గీతనీ తనకారులో ఎక్కించుకుని బయల్దేరారు ఇళ్లు చూడడానికి. హరికి పెద్దఇల్లు ఆధునికమయిన హంగులతో కావాలి. గీతకి చిన్నఇల్లయితే చాకిరీ తక్కువ, ప్రాణానికి హాయి అని వుంది.

వాళ్లు ఇళ్లమీద చేస్తున్న వ్యాఖ్యలని బట్టి, "సరేనండీ. ఇప్పుడు నాకు కొంత అర్థం అయింది మీకు ఎలాటి ఇల్లు నచ్చగలదో. వచ్చేవారం మళ్లీ వెళ్దాం. అప్పుడు మీకు నచ్చగలవు అనుకున్నవి చూపిస్తాను" అన్నాడు బెన్నీ.

మొత్తంమీద ఒకఇంటిమీద ఇద్దరికీ ఏకాభిప్రాయం కుదిరింది. నెల తిరిగేసరికి ఇల్లు కొని గృహప్రవేశం చేసేరు.

***

ఇల్లు కొని యాడాది అయింది. గీత పనిచేస్తున్న బాంకులో పెద్దమార్పులు వచ్చేయి భారీ ఎత్తున. ఇదంతా మీమంచికే అంటూ ధైర్యం చెప్పేరు యజమానులు వుద్యోగస్థులకి. ఆతరవాత మూడువారాల్లో చాలామందికి ఉద్వాసన చెప్పేరు రెండువారాల జీతం చేతిలో పెట్టి. గీతఉద్యోగం పోలేదు కానీ కిందిస్థాయికి దించి, తనపైన కొత్తగా డిగ్రీ పుచ్చుకు వచ్చిన యువకుడిని వేశారు. కొత్తబిచ్చగాడు పొద్దెరగడు అన్నట్టు అదిరిపడుతున్నాడు ఆ అబ్బాయి. ముందు మేనేజరు మంచీ చెడ్డా, ఆనూపానూ తెలిసిన అనుభవజ్ఞుడు. ఈ కుర్రమేనేజరుకి రూళ్లు వల్లె వేయడం వచ్చు కానీ పని సాధించడం తెలీదు.

గీతకి చిరాగ్గా వుంది.

హరిపరిస్థితి అందుకు పూర్తిగా వ్యతిరేకం. అతనికంపెనీ అంచెలంచెలుగా పెరిగిపోతోంది. దేశంలోనే కాక విదేశాల్లో కూడా కన్సల్టింగ్ చేస్తున్నాడు.

అలాటిరోజుల్లోనే "మాకుర్రబాసుతో మాహా చిరాగ్గా వుంది." అంది గీత ఓరోజు.

"వదిలెయ్. పెధవ్వుజ్జోగం," అన్నాడు హరి కాయితాలు చూసుకుంటూ.

గీతకి గట్టిగా తగిలింది "పెధవ్వుజ్జోగం" అన్న మాట. హరి అంత తేలిగ్గా తీసిపారేస్తాడు అనుకోలేదు ఇంతవరకూ. తనది పెద్దవుద్యోగం కాకపోవచ్చు కానీ తనకి తృప్తినిస్తోంది. ఒకరకంగా గౌరవం తెచ్చిపెట్టింది. ఆఫీసులో అందరూ తనని ప్రత్యేకంగా చూస్తారు. కంప్యూటరులో ఎవరికి సమస్య వచ్చినా తను రిపేరు చేసిపెడుతోంది. అంతేకాక కీషాలాటి స్నేహితులు ఆవుజ్జోగంవల్లే దొరికారు. హరికి ఇది అర్థం కాలేదు అన్నసంగతి ఇప్పుడు అవగతమయింది గీతకి. మనసు విరిగింది. తను న్యూయార్క్ airportలో దిగినరోజు గుర్తొచ్చింది. 'ఈదేశంలో నాకు నేనే దిక్కు' అన్న భావనకి విత్తు పడింది ఆక్షణంలో.

వారంరోజులనాడు హరికి హాంకాంగులో పెద్ద ప్రాజెక్టు వచ్చింది. గీతతో చెప్పాడు.

"బాగుంది" అంది నిర్లిప్తంగా.

"నీకు బాంకులో చిరాగ్గా వుంది అన్నావు కదా. హాంకాంగ్ వచ్చెయ్ నాతో" అన్నాడు.

"అక్కడ నేనేం చేస్తాను? మీకేమో ఊపిరాడని పని" అంది నెమ్మదిగా.

"ఏం చెయ్యక్కర్లేదు. నువ్వు చెయ్యకపోతే జరగదేమిటి? అక్కడ నీలాటి 'వైఫులు' చాలామందే వుంటారు. ఏవో కాలక్షేపాలు వుంటాయి" అన్నాడు.

గీత మాట్లాడకుండా అక్కడినించి లేచి వెళ్లిపోయింది. గీతకి ఎంత ఆలోచించినా ఏం చెయ్యాలో తోచడంలేదు. బాధగా అనిపించినా హరి మాటల్లో కొంత నిజం లేకపోలేదు. అతనితో వెళ్తే మరో దేశం చూసినట్టుంటుంది కదా. కానీ ఇక్కడ వుద్యోగంతో తాను పొందుతున్న తృప్తిని అంత తేలిగ్గా వదిలేసుకోగలదా? కొత్తసూపర్వైజురుని తలుచుకుంటే వెళ్లిపోవాలనిపిస్తోంది. పోనీ సరోజకి ఉత్తరం రాస్తేనో … తను మాత్రం ఏం చెప్తుంది? 'నీకు ఏది బాగుంటే అదే చెయ్యి' అంటుంది. నిజానికి గేంబోకథ చెప్పినప్పుడే చెప్పేసింది .. యేతావాతా నిర్ణయించుకోవలసింది తనే అని.

మర్నాడు "ఇప్పుడు కాదులెండి తరవాత చూద్దాం. ఇప్పటికి మీరు వెళ్లిరండి" అంది.

"సరే, నీయిష్టం" అన్నాడు హరి.

హరి వెళ్లిపోయేక, గీత మళ్లీ తనపనిలో పడిపోయింది.

వారంరోజులయింది. కొంచెంసేపు ఏదో పుస్తకం చదువుకుని పడుకోబోతూంటే ఫోనొచ్చింది. హాంకాంగ్నించి హరి చేసాడు.

“ఓహ్, వాహ్, గీతా, గీతా, guess what, great news, amazing. Struck a million dollar deal!” అంటూ గబగబా, హుషారుగా, హడావుడిగా, ఆనందాతిరేకాలతో అరిచేడు ఫోనులోనే.

“గ్రేట్. కంగ్రాట్స్” అంది గీత కూడా సంతోషంగా. హరి పడ్డ పాట్లకి ఫలం కనిపించిందని సంతోషించింది.

“మరి ఎప్పుడు తిరిగి వస్తున్నారు?” అని అడుగుతుండగానే లైను కట్టయిపోయింది. జవాబులేదు. హరి మళ్లీ ఫోను చేస్తాడేమో అని చాలాసేపు చూసింది. కాని మళ్లీ ఫోను మోగలేదు. తనే చేస్తే ఎంగేజిడు. రెండుసార్లు చేసి చూసి, సరే స్నేహితులందరికీ శుభవార్త చెప్తున్నాడు కాబోలు అనుకుంది.

చాలాసేపు ఆలోచిస్తూ పడుకుంది - హరి కానీ మరొకరు కానీ అమ్మా, నాన్నా, ఇల్లూ, వాకిలీ, పాడీ పంటా, తోబుట్టువులూ, స్నేహితులూ -అందర్నీ, అన్నిటినీ వదులుకుని ఇక్కడికి రావడం ఇందుకే కదా. తమ కలలు పండించుకోడానికే. పాపం నానా అవస్థలూ పడ్డాడు ఇలాటి డీలుకోసం. ఇదే ఇండియాలో వుంటే ఇలాటి అవకాశం రావడానికి, ఈ స్థాయి చేరుకోడానికి సప్తజన్మలెత్తాలి.

తెల్లవారుఝామున చిన్న కునుకు పట్టింది. ఇంతలో ఎవరో తలుపు తట్టేరు. ఇంతరాత్రివేళ ఎవరై వుంటారా అనుకుంటూ తలుపు తీసింది.

ఎదురుగా హరి సహోద్యోగి థాంప్సన్ నిలబడి వున్నాడు. అతనిమొహం చూస్తూనే గీతగుండెల్లో చిన్నవణుకు ప్రారంభమయింది. కాళ్లలో సత్తువ హరించుకుపోయింది. తలుపు గట్టిగా పట్టుకుంది.

“మే ఐ కమిన్” అంటూ ఆయన లోపలికి అడుగేసి, గీత చెయ్యి పుచ్చుకుని నడిపిస్తూ సోఫాదగ్గరికి తీసుకొచ్చేడు. గీత సోఫాలో కూలబడింది.

“హరి చాలా మంచివాడు. అపారమయిన తెలివితేటలు గలవాడు” అన్నడు థాంప్సన్.

“ఏం జరిగింది?” అంది గీత నూతిలోంచి మాటాడుతున్నట్టు.

“హార్ట్ ఎటాక్.”

“అసలేం జరిగింది?”

“హార్ట్ ఎటాక్. క్షణాలమీద ప్రాణం పోయింది.”

తరవాత నెమ్మదిగా వివరాలు చెప్పేడు. ముందురోజు ఫోనులో మాట్లాడుతూ పడిపోయాడు. చాలాసేపటివరకూ ఎవరూ చూడలేదు. చూసేసరికి ప్రాణంపోయింది. తాను సాధించిన ఘనవిజయం, ఆ ఆనందంలో పుచ్చుకున్న షాంపేనూ కలిసి అతనికి ప్రాణాంతకం అయేయిట.

“మీ వాళ్లెవరైనా వున్నారా ఇక్కడ?” అని అడిగాడు థాంప్సన్. తపతినెంబరిచ్చింది గీత.

తపతి సంగతి విన్న వెంటనే బయల్దేరి వస్తున్నానని చెప్పి ఫోను పెట్టేసింది. తరవాత చిత్రని వాళ్ల అమ్మగారిదగ్గర వదిలి వచ్చింది. మామయ్య రమణని పిలిస్తే ఆన్సరింగు మెషినొచ్చింది.

తపతి వచ్చేవరకూ వుండి థాంప్సన్ వెళ్లిపోయాడు. వెళ్లేముందు కంపెనీలో హరికి రావలసిన మొత్తం లెక్కలు కనుక్కుని చెప్తానన్నాడు. గీత తలూపింది.

పదిగంటలయేసరికి ఊళ్లో చాలామందికి తెలిసింది. పన్నెండయేసరికి ఇంటినిండా జనం. కొందరు ఏవో వంటకాలు చేసి తీసుకొచ్చారు. ఇండియాకి ఫోను చేసారు.

తరవాత ఏం చెయ్యాలి? గీతకి ఎవరు సాయం వుంటారు? ఇండియానించి ఎవరైనా వస్తారా? హరి విల్లు ఏమైనా రాశాడా? ఆస్తివ్యవహారాలు గీతకి ఏమైనా తెలుసా? గీతకి ముందెలా జరుగుతుంది? ఇక్కడే వుంటుందా? ఇండియా వెళ్లిపోతుందా?

ప్రశ్నలు ... ప్రశ్నలు .., ప్రశ్నలు ..

హాల్లో కూర్చుని అందరూ తలో సలహా ఇస్తున్నారు. సలహాలు పుచ్చుకోడానికి గీత అక్కడ లేదు. మంచంమీద కూర్చుంది తలుపులేసుకుని. మనసంతా శూన్యంగా వుంది. ఇంతకాలం గడిచిపోయింది రేపెలా అన్న ప్రశ్న లేకుండా. ఇప్పుడు హఠాత్తుగా క్షణాలమీద మొత్తం బతుకు కుప్పకూలిపోయింది ఇసకమేడలా. క్షణంలో సగంసేపు పట్టలేదు. కాలమేఘాలు కమ్ముకొచ్చేశాయి. చుట్టూ గాఢాంధకారం.

రేపెలా గడుస్తుంది అని కాదు తన బాధ. ఇప్పటికిప్పుడు అర్జంటుగా తనకి కావలసింది 'ఎందుకిలా జరిగింద'న్న ప్రశ్నకి సమాధానం. ఎవరు చెప్పగలరు? మనసులో ఒక మూల ఆయనమాట విని ఆయనతో వెళ్లివుంటే బాగుండేదేమో అని కూడా అనిపించింది. కానీ అది తనకేమీ ఉపశమనం కలిగించడంలేదు. ...

ముందుగదిలో చేరినవారందరినీ పంపించేసి, తపతి వచ్చి పక్కన కూర్చుంది. గీత వెర్రిగా తపతివేపు చూసి, ఆమె వొడిలో వాలి, నిశ్శబ్దంగా కుమిలిపోసాగింది.

మర్నాటికి కొన్ని విషయాలు అవగతమయేయి. ఇండియానించి రాగలవారెవరూ లేరు. తల్లి లేదు .తండ్రి పెద్దవాడయిపోయాడు. ప్రయాణంచేసేస్థితిలో లేరాయన. అన్నకి శలవు లేదు. చెల్లెలు సంసారం వదిలి రాలేదు. అత్తగారు, "నేనేం చెయ్యగలను. నాకేం తెలుసు. ఇక్కడే కాశీకెళ్లి తిలోదకాలు విడుస్తాను" అంది.

రెండోరోజు హరికాయం హాంకాంగ్నించి వచ్చింది. హనుమయ్యగారూ, మాధవూ, పూనుకుని దహనం చేయించేరు. వాళ్ల సలహాలన్నిటికీ తలూపింది గీత.

***

ఈతంతులన్నీ ముగిసేసరికి వారంరోజులు పెట్టింది. గీతకి ఇంట్లో వుండడం కష్టంగా వుంది. తపతి అక్కడే వుంది పదిరోజులు. వూళ్లో తెలుగువాళ్లు రోజూ వచ్చి కాస్సేపు కూర్చుని వెళ్తున్నారు. ఏపూటకాపూట భోజనాలు తెస్తున్నారు. ఇందరిమధ్య గీతకి ఏకాంతం లేదు. అభిమానాలు చూపించుకోడానికి ఇంత విషాదం కావాలా అనిపిస్తోంది. అంతకంటే అసలయిన విషాదం తనే వీరందరికీ దూరంగా వుంటూరావడం. ఇప్పుడు మాత్రం వీరందరూ చూపే అభిమానంనుండి తప్పుకునే మార్గం కనిపించడంలేదు. అది మరీ బాధగా వుంది. తనకి కావలసింది వారిచ్చే ఓదార్పు కాదు. తనకి కావలసిందేమిటో, అది చెప్పడం ఎలాగో గీతకి తెలీడంలేదు. తపతితో ఆమాటే అంది.

"నువ్వు మళ్లీ ఆఫీసుకి రాకూడదూ?" అంది. ఇప్పటికే బోలెడు శలవులయిపోయేయి ఇండియా వెళ్లిరావడానికి,

గీత మేనేజరుని పిలిచి వస్తున్నానని చెప్పి, వెళ్లింది. తొలిరోజు ఆఫీసులో అడుగెట్టగానే అందరూ సానుభూతి చెప్పేరు. గీత బల్లమీద పెద్ద పువ్వులగుత్తి పెట్టేరు. ఏమాత్రం పరిచయం లేనివారు కూడా ఓమారు తనబల్లదగ్గర ఆగి, I'm so sorry అంటుంటే గీతకి ఏమిటో ఎబ్బెట్టుగా వుంది.

ఆతరవాత డబ్బు వ్యవహారాలు మొదలయ్యేయి. హరికంపెనీవాళ్లు దివాలా తీశాం అని ప్రకటించేరు. ఇంటికొచ్చి ఇన్ని కబుర్లు చెప్పిన థాంప్సన్ అయిపులేడు. మాధవు కోర్టుకి ఎక్కుదాం అన్నాడు కానీ హనుమయ్యగారు అది మంచిదికాదని వారించేరు. పెద్ద కంపెనీలతో పేచీ పొట్టేలు కొండతో ఢీకొనడంవంటిది అన్నారు. హరిరాబడి హుష్ కాకీ అన్నంత తేలిగ్గా ఎగిరిపోయింది. బాంకులో తన అంతంతమాత్రం. రోజు గడుపుకోవచ్చు కానీ ఇంత ఇల్లు భరించడం మాత్రం అయేపని కాదు.

గీత బెన్నీని పిలిచి ఈ ఇల్లు అమ్మేసి చిన్న ఇంట్లోకి మారేమార్గం చూపించమని అడిగింది. ఆయన కూడా జరిగినదానికి నొచ్చుకుని, తనకి చేతనయిన సాయం చేస్తానని మాటిచ్చాడు.

"నిజం చెప్తున్నాను. ఇల్లు కొని ఏడాది కూడా కాలేదు. మీకు నష్టం రాకుండా అమ్మడానికి ప్రయత్నిస్తాను. లాభం వస్తుందనుకోను." అన్నాడు బెన్నీ.

"సరే. ఎలా వీలయితే అలా చెయ్యండి" అంది గీత, కాయితాలమీద సంతకాలు పెట్టి.

క్రమంగా చాలామంది రావడం తగ్గించేసినా, భాగ్యంగారు మాత్రం అప్పడప్పుడు వచ్చి కొంచెంసేపు కూర్చుని వెళ్తున్నారు. గీత భజనకి రాదని, ఆవిడే ప్రసాదం తెచ్చి ఇస్తున్నారు.

"కాస్త మనశ్శాంతిగా వుంటుంది. ఒక్కసారి వచ్చి చూడండి భజనకి," అన్నారావిడ ఓరోజు.

గీత ఇబ్బందిగా మొహం పెట్టి, "చెప్పేను కదండీ. నాకు బాబామీద నమ్మకం లేదు. నన్ను ఒదిలేయండి" అంది.

"బాబా అనే అనుకోకండి. ఏదేవుడేనా ఒకటే కదా. భజనపాటలు అందరు దేవుళ్లగురించీను. మనసుకి కాస్త ఊరట. మార్పుగా కూడా వుంటుంది. ఇలా ఒక్కరూ వుంటే మనసుకి ఇంకా బాధ," అన్నారావిడ.

గీత సరేలెండి అంది కాదనే ఓపిక లేక.

ఆదివారం రెండుగంటలకి అని చెప్పారావిడ. గీత కాస్త ఆలస్యంగా వెళ్లి అందరికంటే వెనక కూర్చుంది. భజన అయిపోగానే ఒకరిద్దరు పలకరించారు. గీత ముక్తసరిగా సమాధానాలు చెప్పి, వెళ్లొస్తానని భాగ్యంగారికి చెప్పి బయల్దేరబోతుంటే, ఓ మూడేళ్ల పాప గీత దగ్గరికి వచ్చింది చేతులు చాచి ఎత్తుకోమంటూ.

గీత చిన్నగా నవ్వి, పాపని ఎత్తుకుని, చుట్టూ చూసింది.

అచల వచ్చి, హాయ్ ఆంటీ అంటూ పాపని తీసుకుంది.

"మీ పాపా?" అనడిగింది గీత ఆశ్చర్యపోతూ. అచలకి పిల్లలున్నారని అనుకోలేదు ముందు చూసినప్పుడు.

"అవును ఆంటీ. ఇండియాలో మాఅమ్మవద్ద వుండింది. ఇప్పుడే తీసుకొచ్చుకున్నాం" అంది.

"మీరు మాపిన్నిలా వుంటారు కొంచెం. పాపకి ఆమెవద్ద బాగా అలవాటు. అంచేత మీదగ్గరకొచ్చింది" అంది అచల.

గీత నవ్వి, పాపని రెండు నిముషాలు ఎత్తుకుని అచలతో మాట్లాడి ఇంటికొచ్చేసింది.

నాలుగురోజులు పోయేక, ఓ సాయంత్రం అచల పాపని తీసుకుని వచ్చింది. వస్తూ వస్తూ నాలుగు పుస్తకాలు తెచ్చింది. భగవద్గీత, ఉపనిషత్సారం, వేదసారం ...

గీత "చూస్తాలెండి, సాధారణంగా నాకిలాటివి చదవాలనిపించదు" అని, పాపవేపు తిరిగి, "నీపేరేమిటి?" అని అడిగింది.

"గగన" అంది ముద్దుగా పాప, రెండు చేతులూ చాచి ఆకాశం చూపుతూ.

"బాగుంది పేరు. ఆకాశం అంత ఎత్తుకి ఎదిగిపోతుందనా అర్థం?" అంది గీత.

"చూస్తున్నారు కదా ఆంటీ. ఒక్కక్షణం నేలమీద నిలవదు కాలు. సిసింద్రీ." అంది అచల.

"పుట్టగానే తెలిసిందేమిటి సిసింద్రీ అవుతుందని."

"పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది కదా ఆంటీ. లేకపోతే పేరు ఎలాగా పెట్టేరు కదా, నిలబెట్టుకుందాం అని అలా ఎగిరిపడుతుంటుందేమో.."

"అద్సరే గానీ ఈపుస్తకాలు ఇప్పుడు వద్దు. నేనిప్పుడేం చదివే మూడ్లో లేను. కావలిసినప్పుడు నేనే అడుగుతాను. మీదగ్గరే వుండనీండి" అంది గీత.

అచల ఒప్పుకోలేదు. "మీరు చదివితీరాల్సిందే ఆంటీ. లేకపోతే ఈ సిసింద్రీని ఇక్కడ వదిలేసి పోతాను. అప్పుడు మీరే నన్ను వెతుక్కుంటూ రావాల్సివస్తుంది" అంది.

గీతకి కనిపించినపుస్తకంవల్లా చదివేఅలవాటు లేదు. స్పీడురీడింగు అసలే లేదు. రోజుకి యాభైపేజీలు చదివితే గొప్ప. ఒక వాక్యం చదివి దాన్నిగురించి ఆలోచిస్తూ పది నిముషాలు గడుపుతుంది.

ఆఖరికి ఆచల పోరుపడలేక ఓ సాములారి పుస్తకం తీసుకు చదివింది. అతి సామాన్యమయిన విషయాలే. మనదేశంలో కూరగాయలమనిషికి కూడా వుంటుంది ఆపాటి పరిజ్ఞానం. గీతకి అర్థం కానిది అచలకి ఈపుస్తకాలమీద అంత ఆసక్తి ఎలా ఏర్పడిందా అని. ఆమాటే అడిగింది ఓరోజు.

"మాయింట్లో మా అమ్మకీ నాన్నకీ నమ్మకాలు లేవు. అంచేత మేం ఏ నమ్మకాలూ, పూజలూ లేకుండానే పెరిగాం. ఇక్కడికి వచ్చినతరవాత నాకు పెద్ద కష్టం వచ్చేసింది. ప్రతివారూ మనదేశం, మనమతం, మనఆచారాలూ గురించి అడుగుతారు. పిడుక్కీ బియ్యానికీ ఒకటే మంత్రం అనీ సరదాకబుర్లయినా అదే, పెద్ద చర్చయినా అదే. నాకు తెలీదంటే ఎలా చూస్తారో చెప్పక్కర్లేదు కదా. మీరూ చూసేవుంటారు భాగ్యంగారింట్లో భజనలకి వస్తారు ఫ్రాంక్లిన్ అని అమెరికన్. ఆయనకి హిందూమతం గురించి తెలిసింది

చూస్తే నాకు తల తిరిగిపోయింది. నాడీమండలం, సహస్రారపద్మం, ఆత్మబోధ అంటూ గుక్క తిప్పుకోకుండా మూడుగంటలు ఉపన్యాసం ఇవ్వగలరాయన. ఆ అవమానం భరించలేక నేను కూడా పుస్తకాలు చదివేసి తెలిసేసుకోవాలి అని నిశ్చయించేసుకున్నాను" అంది అచల.

గీత నవ్వింది. "బాగుంది. కారణం ఏదయినా జ్ఞానసముపార్జన మంచిదే."

"అంతే కాదు. కిందటేడు నాకొక కేరళ అమ్మాయి కనిపించింది. పన్నెండేళ్లవరకూ ఇండియాలోనే పెరిగిందిట. మేం కలుసుకున్న మొదటిరోజున మామూలుగానే మొదలెట్టేం ఏవూరంటే ఏవూరంటూ. మా అమ్మా, నాన్నా ఇక్కడికి వచ్చినప్పుడు నాకు ఏడాది కూడా నిండలేదు. అయినా నాకు ఆంధ్రప్రదేశ్ ఒక రాష్ట్రం అని తెలుసు. మరి నేను కేరళ అంటే ఆ అమ్మాయి ఏమందో తెలుసా?"

"ఢిల్లీ పక్కనా అని అడిగిందా?"

"అలా అన్నా బాగుండు. 'ఏదో చిన్నవూరు కాబోలు, ఎప్పుడూ వినలేదు' అంది. అంచేత నేనిప్పుడు అడిగినవాళ్లకీ అడగనివాళ్లకీ కేరళ ఒక రాష్ట్రం అనీ, అక్కడ చాలామంది చదువుకున్నవాళ్లు వున్నారనీ చెప్పేస్తూంటాను."

"బాగుంది కథ. నాకు నాడీమండలం అవీ తెలీవు కానీ ఈపుస్తకాల్లో వున్నపాటి తెలుసు. నాచిన్నప్పుడు మాఅమ్మతో పురాణకాలక్షేపాలకి వెళ్తూండేదాన్ని. అంచేత నన్ను ఈపుస్తకాలు చదవమని పోరు పెట్టకండి" అంది గీత.

అచల నవ్వేసి, "సరేలెండి ఆంటీ" అని వెళ్లిపోయింది. కానీ అప్పడప్పుడు రావడం మానలేదు. క్రమంగా పాపకి గీతదగ్గర బాగా అలవాటయింది.

ఒకసారి గీతని అడిగింది శనివారం తాను ఎక్కడికో వెళ్లాలనీ, బేబీసిటర్ దొరకలేదనీ, "పాపని మీదగ్గర వదిలిపెట్టనా ఒక్కపూట" అని.

గీత సరేనంది.

"ఆంటీని ఊరికే ఊదర పెట్టకు," అని చెప్పింది అచల పాపతో.

"నాదగ్గర అల్లరి చెయ్యదులెండి"

"అవునాంటీ. నామొహంమీదే రాసుంది 'బాదర్ మీ' అని తాటికాయలంత అక్షరాలతో".

అచల వెళ్లిపోయిన తరవాత, గీతకి ఏంచెయ్యాలో తోచలేదు. కార్టూనులు చూస్తుందేమోనని టీవీ పెట్టింది. కానీ గగనకి టీవీ చూస్తూ కూర్చునేంత స్థిమితం లేదు. నిప్పులు తొక్కినట్టు ఇల్లంతా దాట్లేస్తూ గీతని క్షణం కూర్చోనివ్వలేదు. ఆడుకుంటుందేమోనని అచల తెచ్చినబొమ్మలు ఇచ్చింది కానీ ఏ ఒక్క ఆటవస్తువుతోనూ అయిదునిముషాలు కూడా ఆడుకోలేదు ఆ పిల్ల. నాలుగుకాయితాలూ, రంగుపెన్సిళ్లూ ఆపిల్లముందు పడేసింది. నాలుగుగీతలు గియ్యడం, ఇదేమిటి, అదేమిటి అంటూ గీతని అడగడం.

రెండుగంటలయేసరికి గీతకి నీరసం వచ్చింది. ఇండియాలో తన చిన్నతనం గుర్తొచ్చింది. తెల్లారి లేస్తే పొద్దు పోయేవరకూ తను ఎక్కడుందో కూడా తెలిసేది కాదు అమ్మకి. కొబ్బరాకులతోనూ కాగితప్పడవలతోనూ గంటలతరబడి ఆడుకోగలిగింది. ఇప్పుడు ఈపిల్లలు?

ఆలోచిస్తూండగా, గగన వచ్చి తనఒళ్లోకి వాలి, మొహంలో మొహం పెట్టి కొంటెగా చూడసాగింది.

గీత చిన్నగా నవ్వుతూ, పాప రెండు చెంపలూ తనచేతిలోకి తీసుకుని "ఎందుకలా అల్లరి చేస్తావు?" అని అడిగింది.

పాప కళ్లు చికిలించి, "నాకు అదే బాంతుంది" అనేసి, గీత చేతులు తోసేసి, గదిలో గిరగిర తిరగడం మొదలెట్టింది బొంగరంలా.

గీత నవ్వుకుంది, "నిజమే. ఎవరేనా అంతే కదా,"

***

హరిలేని జీవితానికి అలవాటు పడుతోంది గీత క్రమేణా. తనని ఓదార్చడానికి వచ్చేవారి సంఖ్య కూడా తగ్గుముఖం పట్టింది.

తపతి ఓరోజు మాటల్లో "నాస్నేహితురాలు హాలీ అని ఇదివరకు మాడిసన్లో వుండేది. శనివారం మాయింటికి వస్తోంది." అంది గీతతో.

"ఎక్కడినించి?"

"వాషింగ్టన్నించి, నువ్వు కూడా రా. కలుద్దువుగానీ. ఆవిడకి మనసంస్కృతి అంటే చాలా అభిమానం."

"సరే ఆదివారం వస్తాను."

ఆదివారం గీత వచ్చేవేళకి, హాలీ, తపతీ పెరట్లో చెట్టుకింద కూర్చుని వున్నారు.

"హాలీ మధురలో మూడేళ్లు గడిపింది. ఆవిడ పీహెచ్డీ విషయం కర్మ. తమిళం చక్కగా మాట్లాడుతుంది," అంది తపతి ఆవిడని పరిచయం చేస్తూ.

హాలీ నవ్వింది, "హా, చక్కగా మాట్లాడడం, తపతికి హాస్యంగా వుంది" అంది తేలిగ్గా.

గీత హాలీవేపు చూసింది. కాలంలో బాగానే వుండి వుండాలి, ఇప్పుడు మాత్రం ఎముకలగూడులా వుంది, గట్టిగా గాలేస్తే తూలిపడుతుందేమో అన్నట్టు. తలకి స్కార్ఫ్ చుట్టుకుంది. ఓపిక తెచ్చుకుని మాట్లాడుతోంది. కాని తను జాలి పడుతునట్టు కనిపిస్తే బాగుండదు. మామూలుగా వున్నట్టు కనిపించడానికి అవస్థ పడుతోంది. తపతి మాత్రం మామూలుగానే మాట్లాడుతోంది. తనకి ఎలా సాధ్యం అయిందో మరి. బహుశా వారిమధ్య అనుబంధం అలాటిదేమో.

గీత పడుతున్న అవస్థ హాలీ గమనించనట్టు తనపాట్న తను మాట్లాడసాగింది. గీతకి అమెరికా ఎలా వుందని అడిగింది. ఇండియాలో ఎక్కడినుంచి వచ్చేరని అడిగింది. మీరిద్దరూ ఎలా కలిసారని అడిగింది.

తరవాత తనఇండియా అనుభవాలు చెప్పసాగింది. "మీనాక్షీదేవాలయంలో బ్రాహ్మణులకి తప్ప ప్రవేశం లేదు. నాకు అది తమాషాగా అనిపించింది."

“ఎందుకు? దాదాపు అన్ని దేవాలయాల్లో అది మామూలే,” అంది గీత.
“అక్కడే కదా మధ్వాచార్యులవారు గుడిగోపురం ఎక్కి గాయత్రీమంత్రం, కులమత ప్రమేయాలు లేకుండా, సకలజనులకీ వినిపించేలా గానం చేసింది. ఆయన ఉపదేశసమయంలో వారిగురువు గాయత్రీమంత్రానికి బ్రాహ్మణులు మాత్రమే అర్హులనీ, శాస్త్రవిదులనుండి మాత్రమే పొందాలనీ చెప్పేరుట, రామానుజాచార్యులు ‘ఈమంత్రం బ్రాహ్మణేతరులకి ఇచ్చినందున నేను నరకానికి పోవలసివస్తే అది నాకు సమ్మతమే’ అని గుడిగోపురం ఎక్కి సకలజనులకూ వినిపించేరుట. అలాటిది మరి ఆ గుడిలోనే అబ్రాహ్మణులకి ప్రవేశం లేదంటే ఆయన ఉపదేశాలను వారు గౌరవించలేదనే కదా అర్థం.”
హాలీ కొంచెం ఆగి, ఓగుక్క నీళ్లు తాగి, మళ్లీ మొదలు పెట్టింది. “తిరపతి వెళ్లినప్పుడు మొదటిసారి అంతే అయింది. రెండోసారి వెళ్లేవేళకి రూల్సు మారిపోయేయి. ‘తిరపతిదేవుడు దేవుడు కాడు అని నేను అనను’ అని రాసిస్తే చాలు, లోపలికి రానిస్తాం అన్నారు. అంటే ఈ ఆంక్షలు శిలాశాసనాలు కావనీ, ఏ ఆచార్యులో, స్వాములో తమకి తోచినట్టు మార్చుతారనీ తెలుస్తోంది.”
గీతకి ఆవిడవాదన కంటే ఆవిడకి ఈ సాంప్రదాయాల్లో గల ఆసక్తి ఆశ్చర్యంగా అనిపించింది.
“మీ రిసెర్చి కర్మ మీదట కదా. ఏమని సిద్ధాంతీకరించేరు?”
“ఇదమిత్థంగా నేనేమీ సిద్ధాంతాలు చెయ్యలేదు ఆవిషయంలో. మేం ఎంత చదివినా, ఎంత ప్రయత్నించినా బయటివాళ్లమే కదా. మీకు అర్థమయినట్టు మాకు అర్థం అవడం సాధ్యం కాదు.”
“అదేనా మీ సిద్ధాంతం?”
“కాదు. మీరు ‘కర్మ’ అన్న పదాన్ని యే యే సందర్భాల్లో ఎన్ని విధాలుగా వాడుతున్నారో తరిచి చూడడానికి ప్రయత్నించేను. అంతే.”
“అవుననుకోండి. కానీ మీరు ఏదో ఒక అభిప్రాయానికి రావాలి కదా.”
హాలీ నవ్వింది. “ఏకటీక లేదని అర్థమయింది. అంతే. వ్యక్తిని బట్టీ, సమయాన్ని బట్టీ, సందర్భాన్నిబట్టి అనేకవిధాల అన్వయించుకుంటున్నారు ఆపదాన్ని. ఆ సౌకర్యం వుండబట్టే ఆపదం అంత ప్రాచుర్యంలోకి వచ్చి వుండొచ్చు. ఈరోజు నేను ఇక్కడ మీతో కూర్చోడం నాకర్మ, నాకాన్సర్ కూడా నాకర్మే. కానీ ఈ రెండుసందర్భాలలోనూ రెండు రకాల అర్థాలు స్ఫురిస్తాయి కదా. నేను ఇక్కడికి రావాలని పని గట్టుకు వచ్చేను. అందులో నా సంకల్పం వుంది. నాకు కాన్సర్ రావడంలో నాసంకల్పంలేదు. ఇంకా ఆలోచిస్తే నాకు ఇక్కడికి రావాలనిపించడం కూడా కర్మవల్లనేనేమో. పూర్వజన్మలో మీరు నాకు బంధువులయివుండాలి,” హాలీ చిన్నగా నవ్వింది.
గీత ఆశ్చర్యానికి అంతులేదు. ఈహాలీ మాటలు వింటుంటే ఈవిడకి మనమతంలో ఇంత ఆసక్తి ఎలా వచ్చిందా అని.
తపతి మౌనంగా వాళ్ల సంభాషణ వింటూ కూర్చుంది.
“మీకు పూర్వజన్మలో నమ్మకం వుందా?”

“నమ్మకం అని గట్టిగా చెప్పలేను కానీ ఏదో ఒక శక్తి మనని నడిపిస్తూ వుండి వుండాలి. నాకు ఈ బుద్ధి ఎందుకు పుట్టిందో చెప్పలేం కనక. నేను మధురలో వున్నప్పుడు, ఆ గుడివెనక ఒక జ్యోతిష్కుడు వుండేవారు. ఆయన గతాగతాలను ఖచ్చితంగా చెప్పగలరని చాలామంది నమ్ముతారు. ఒకసారి వెళ్లేను ఆయనతో మాట్లాడడానికి. నేను పూర్వజన్మలో ఆ ఆలయంలోనే దేవదాసిని అనీ, అందుచేతనే నాకు అక్కడికి తిరిగి రావాలన్న కోరిక కలిగిందనీ అన్నారాయన.”

“మీకూ అలాగే అనిపిస్తోందా?”

“మరొకరకంగా చెప్తాను. ఆమాట నాకు మనశ్శాంతినిచ్చింది. సైన్సు ప్రతి సంఘటనకీ, ప్రతి వస్తువుయొక్కపరివర్తనకీ కారణాలు చెప్పలేనంతకాలం మనం మరొక శక్తి వుందని ఒప్పుకోక తప్పదు ఏపేరు పెట్టి పిలిచినా. నేను ఇక్కడికి రావడానికి కారణం తపతిసౌజన్యం అనుకుంటే, ఆవిడసౌజన్యానికి కారణం తనకి అనుభవమయిన మరొక సంఘటన అవాలి. ఆ సంఘటనకి కారణం మరొక అనుభవం. .. ఇలా తవ్వుకుంటూ పోతే నిజంగా ఎక్కడ మొదలు అన్నదానికి సమాధానం లేదు తలకావేరిలా.”

“మీరు చూశారా తలకావేరి?”

“అదే చెపుతున్నా. కావేరీనది పుట్టినస్థలం అని ఒక స్థలం చూపిస్తారు. కాని ఆస్థలంలోకి నీరు ఎలా వచ్చిందన్నదానికి సమాధానం లేదు కదా,” హాలీ తల అడ్డంగా వూపింది నిస్పృహతో.

తపతి లేచింది, “భోజనం తీసుకొస్తాను” అంటూ.

“నా భోజనం ఫ్రిజ్లో ఎడమవేపు వెనక్కి పెట్టేను. కొంచెం వేడి చేస్తే చాలు” అని తపతితో చెప్పి గీతవేపు తిరిగి, “నేను చాలాకాలం వెజిటేరియనునే. ఈమధ్య డాక్టరు మీటు తినాలన్నాడు ప్రొటీను చాలడంలేదని.” అంది క్షమాపణగా.

“దానికేముందిలెండి. ఇప్పుడు అందరికీ ఏమిటి తింటాం అన్నది వ్యక్తిగతం అయిపోయింది. కనీసం ఈవిషయంలో కులధర్మాలపట్టింపులు రూపుమాసినందుకు సంతోషించాలి” అంది గీత.

భోజనాలయిన తరవాత, హాలీ తపతిని భగవద్గీతలో ఒక అధ్యాయం చదవమని అడిగింది.

తపతి గిన్నెలూ, పళ్లేలూ తీస్తుంటే, గీత కూడా రెండు గిన్నెలు అందుకుంది. ఇద్దరూ అవి లోపల పెట్టి తిరిగి వచ్చేరు. తపతి భగవద్గీత తీసి, “ఏ అధ్యాయం?” అని అడిగింది హాలీని.

“మీ ఇష్టం.”

తపతి పురుషోత్తమయోగం చదువుతుంటే, హాలీ పద్మాసనం వేసి, కళ్లు మూసుకుని, ధ్యానముద్రలో కూర్చుంది.

గీతకి పట్టలేని ఆశ్చర్యంగా వుంది వారిద్దరినీ చూస్తుంటే. తపతి పరిచయం అయి ఇంతకాలం అయినా ఆమెలో ఈకోణం తను మున్నెన్నడూ చూడనేలేదు. మనం ఒకరిని తెలుసు అనుకుంటాం కానీ, మనకి తెలీని కోణాలు ఇంకా ఎన్నో అనిపించింది ఆక్షణంలో.

తపతీ, హాలీ కలిసి ఆపూట సృష్టించిన వాతావరణంలో గీత పరవశించిపోయింది.

***

హాలీ వచ్చి వెళ్లిన తరవాత తపతిలో ఏదో మార్పు కనిపించింది గీతకి. పిలుపులు తగ్గిపోయాయి. పట్టి చూస్తే నీరసించినట్టు కనిపిస్తోంది. మరుపూ, చెరుపూ కూడా.

"ఏం అలా వున్నావు? ఒంట్లో బాగులేదా?" అని అడిగింది గీత ఓరోజు.

"ఏం లేదు. బాగానే వున్నాను," అంది తపతి.

"నిన్న పిలుస్తానన్నావు, పిలవలేదేం?"

"పిలుస్తానన్నానా?" అంది తపతి ఎటో చూస్తూ.

ఒకవేళ హాలీగురించి ఆలోచిస్తూ మనసు పాడుచేసుకుంటోందేమో అనుకుని, "నీరసంగా కనిపిస్తున్నావు. ఓసారి డాక్టరుని చూడరాదూ" అంది..

"చూస్తాలే" అంది కానీ తపతి డాక్టరుదగ్గరికి వెళ్లలేదు, ఆఖరికి గీతే పట్టుబట్టి ఎపాయింటుమెంటు తీసుకుంది.

రెండువారాలపాటు రకరకాల టెస్టులు చేసి, బ్రెయిన్ ట్యూమర్ అని నిర్ణయించేరు. "ఫరవాలేదు. బినైన్ ట్యూమర్. సర్జరీతో నయమవుతుంది. మీవాళ్లు ఎవరేనా వున్నారా?" అని అడిగేడు డాక్టరు.

పిల్లలున్నారనీ, మాట్లాడతాననీ చెప్పి తపతి ఇంటికొచ్చేసింది. తరవాత కొడుకు వాసుని పిలిచి చెప్పింది. ఆ అబ్బాయి వెంటనే వస్తానని చెప్పి రెండోనాటికి దిగేడు.

వాసు గీతకి కృతజ్ఞతలు చెప్పేడు తల్లిని డాక్టరుదగ్గరికి తీసుకెళ్లి ముదరకముందే కనుక్కున్నందుకు.

తల్లితో "నాతో వచ్చేయ్. అక్కడే చేయిస్తాను సర్జరీ." అన్నాడు.

తపతికి నచ్చలేదు ఇక్కడినించి కదలడం. "అక్కడికెందుకూ? ఇక్కడ నాకు అలవాటయిన డాక్టరు. ఆయనకి నాపరిస్థితి అంతా బాగా తెలుసు. ఇక్కడే చేయించుకుంటాను సర్జరీ" అంది.

"నువ్వు ఆరోగ్యంగా వున్నన్నాళ్లూ, నీకు ఇక్కడే బాగుంది కదా అని వూరుకున్నాను. కానీ నీకు బాగులేనప్పుడు, నువ్వు ఇక్కడ ఒక్కదానివీ వుంటానంటే ఒప్పుకోను. నువ్వు నాతో రావాల్సిందే," అన్నాడు వాసు.

"అవును. అదే మంచిది" అంది గీత కూడా. అన్నీ బాగానే వున్నప్పుడు ఎవరెక్కడున్నా ఫరవాలేదు. కష్టకాలంలో కొడుకులూ, కూతుళ్లే ఆదుకోవాలి. అందే కానీ మనసులో బాధగానే వుంది. తపతి వెళ్లిపోతుందనుకుంటే.

తపతికీ అంతే. ఈదేశం వచ్చినదగ్గర్నుంచీ ఇక్కడే వుంది. ఇదే తనకి పుట్టినిల్లూ, మెట్టినిల్లూ అయింది. అందులోనూ గీత బాగా అలవాటయిపోయింది. వూరు వదిలి వెళ్లిపోడం కష్టం. కానీ, వాసు పట్టుబడుతున్నాడు.

ఓపూట వాదోపవాదాలు అయినతరవాత, తపతి వాసుతో వెళ్లడానికే నిశ్చయమయింది. ఇంక మూటా ముల్లే సర్దుకోడం, అప్పగింతలు ...

హరి పోయినప్పటినించీ చిత్ర తల్లిదగ్గరే వుంది. తపతి ఇమాన్యూల్ని పిలిచి తన ఆరోగ్యంసంగతి చెప్పి, ఇల్లు ఏంచేయమంటారని అడిగింది.

ఆయన అయ్యో అని బాధ పడి, వాసుదగ్గరికి వెళ్తున్నందుకు సంతోషించి. ఇల్లుమాట మీయిష్టం అన్నాడు. ఆవిడ ఏంచేసినా తనకేమీ అభ్యంతరం లేదన్నాడు.

తపతి గీతతో "నువ్వు ఎలాగా చిన్నింటిలోకి మారాలనుకుంటున్నావు కదా. ఈయింట్లో వుండు" అంది.

గీతకి అభ్యంతరం చెప్పడానికి ఏమీ కనిపించలేదు. కాస్సేపు ఆలోచించి, "నీ యిల్లు నీపిల్లలకి చెందాలి కానీ నేనేమిటి మధ్యన" అంది.

"నాయిల్లేమిటిలే. నేనేం కొన్నానా, కట్టించేనా. నాకూ వుచితంగా వచ్చిందే కదా. అంచేత నేను మరొకరికి ఇచ్చేయడమే ధర్మం. ఆ మరొకరు నువ్వే ఎందుకు కాకూడదూ? దేవుడు చల్లగా చూసి, నా పిల్లలిద్దరూ బాగానే వున్నారు. నేను ఇవ్వకపోతే వాళ్లకి జరగదనేం లేదు."

సరేనంది గీత.

"మీరు మాయింటికి రావాలి ఆంటీ" అని మరీ మరీ చెప్పేడు వాసు గీతకి.

తపతి వెళ్లిపోయినతరవాత ఓరోజు అచల వచ్చింది. "నాకు కాలిఫోర్నియాలో ఉద్యోగం వచ్చింది, అక్కడికి మారిపోతున్నాం" అంది.

"సంతోషం అచలా. అభినందనలు," అంది గీత.

"మీరు కాలిఫోర్నియా రావాలి ఆంటీ." అంది అచల.

"అలాగేలే. ముందు మీరు వెళ్లి ఇల్లూ వాకిలీ చూసుకు స్థిరపడండి."

"ఊరికే వస్తాను అంటే కాదు అంటీ. తప్పకుండా రావాలి" అంటూ గీతచేత ప్రమాణం చేయించుకు కానీ వదిలిపెట్టలేదు ఆ అమ్మాయి.

***

గీత పుస్తకం పట్టుకు కూర్చుంది. కళ్లు పేజీమీద వున్నాయి కానీ మనసు లేదు.

అచల పట్టుబట్టి "ఈ పుస్తకం మీరు చదివితీరాల్సిందే, చదవకపోతే వూరుకోను. పరీక్ష పెడతాను" అంటూ గొడవ చేసి ఇచ్చిన పుస్తకం.

తను "అలాగే, అలాగే" అంటూ ఇన్నాళ్లూ జరుపుకొచ్చింది. కానీ ఈమధ్య మనసు అస్సలు బాగుండడంలేదు. తనజీవితంలో భాగస్వాములు హరీ, తపతీ. ఇద్దరూ కూడా మాటా పలుకూ లేకుండా మాయమయిపోయేరు. తను ఇంతకాలం జరిగేది చూస్తూనూ, జరగనిదానికి విచారించకుండానూ కాలం గడిపేసింది. ఇప్పుడు ఏదో బలమైన శక్తి తనని దిగలాగుతోంది.

ఆలోచనల్లో మునిగిపోయిన గీత నింగిని కువకువలు వినిపించి తలెత్తి చూసింది.

కొంగలు బారులు తీరి కోణాకారంలో ఎగిరిపోతున్నాయి క్వాంయిక్వాంమంటూ. శిశిరం ప్రారంభం కాగానే దక్షిణాదికి తరలిపోయిన పక్షులు తిరిగొస్తున్నాయి వసంతం వస్తోందని చాటుతూ. అవి పట్టిన కోణాకారం చూడముచ్చటగా వుంది కవాతువేళ సుశిక్షితులయిన సైనికులబారుల్లా.

గీతకి ఎప్పుడో ఎక్కడో చదివిన పాఠం గుర్తొచ్చింది. చాతకపక్షులు ఆకాశంలో వర్షపు చినుకులకోసం నిరీక్షిస్తూ తలకిందులుగా ఎగురుతూ వుంటాయిట. వర్షపుచినుకులు స్వచ్ఛతకి పెట్టింది పేరు. అంత స్వచ్ఛమయిన నీరు అయితేనే అవి గ్రహిస్తాయి కాబోలు. ఆ చినుకులు కలుషితం కాకముందే, కింద పడకముందే అంబరవీధిలోనే అందుకోవాలని వాటి తపన. అంటే ఆ పక్షులకి అంతటి పరిజ్ఞానం వుందనుకోవాలి.

గీతతలలో తామరతంపరగా ఆలోచనలు చెలరేగేయి. తను కూడా అలాటి స్వచ్ఛమయిన, పరిపూర్ణమయిన జీవితంకోసమే ఎదురు చూసిందా? అన్న సందేహం కలుగుతోంది ఇప్పుడు.

తను జీవితంలో కోరుకున్నది ఏమిటి? పుట్టుకా, చదువూ, పెళ్లీ, .. ఒకదానితరవాత ఒకటి లెక్కల్లో స్టెప్పుల్లా జరిగిపోయాయి. సత్యం తననిగురించి అన్నమాట నిజమే. జరుగుతున్నది చూస్తూ, జరుగుతున్నసంఘటనల్లో తనజోక్యం లేకుండా, తోలుబొమ్మ ఆడినట్టు నిర్వికారంగా తనపాత్ర నిర్వహించింది. ఏ ఒక్కవస్తువుకోసమూ తనకి తనయి ప్రయత్నించలేదు. ఏటివాలులో గరికపోచలా కొట్టుకొచ్చేసిందంతే. అమెరికాకి రావడం కూడా అలా కొట్టుకుపోవడంలో భాగమే. అందరిలాగా "నేనొక మనిషిని, నేను సాధించవలసింది ఇది" అని ఎందుకు అనుకోలేదు తను?

బుచ్చిబాబు చివరికి మిగిలేది జ్ఞాపకాలే అన్నారు. కానీ తనకి అలా అనిపించడంలేదు. తనజీవితంలో ప్రవేశించిన వాళ్లందరూ కేవలం జ్ఞాపకాలు కారు. ప్రతివొక్కరికీ తన జీవితాన్ని రూపు దిద్దడంలో పాలుంది. శివంమామయ్యా, కనకమ్మత్తా చదివించేరు, పెళ్లి చేసేరు ఏ ప్రతిఫలాపేక్షా లేకుండా.

సత్యం పరిచయంలో లోకరీతి కొంతవరకూ తెలిసింది.

శ్యామ్ మేకపోతు గాంభీర్యానికి అర్థం ఏమిటో తెలియజేశాడు.

సరోజ మెడిసన్లో చేరిందే కానీ అదే గమ్యం చేసుకోలేదు. తనకి కావలసిందేమిటో, అది ఎలా సమకూర్చుకోవాలో తెలుసుకుని తనజీవితం తాను దిద్దుకుంది.

హరి కూడా అంతే. తనకి ఏం కావాలో, ఎలా సాధించుకోవాలో తెలిసినవాడు. స్వతహాగా మంచివాడే కానీ తనకీ అతనికీ మధ్య ఆత్మీయమైన బాంధవ్యం ఏర్పడలేదు. కానీ అతన్ననడానికీ లేదేమో. తనకేం కావాలో తనకే తెలీలేదు. కారణం ఏదయినా ఇద్దరిమధ్య ఆత్మీయత లేకుండా పోయింది.

తపతి పరిస్థితులని అర్థం చేసుకుని నిర్ణయాలు చేసుకోగల సమర్థురాలు. తపతిలో ఆగుణం తనకి బాగా ఉపకరించింది. అచల, తనకంటే దాదాపు 15 ఏళ్లు చిన్నది అయినా జీవితం అంటే స్థిరమయిన అభిప్రాయాలు వున్నాయి ఆఅమ్మాయికి.

తెలివితక్కువపిల్ల అనిపించుకున్న చిత్ర కూడా తన నైపుణ్యాన్ని స్పష్టం చేసింది తన భాషలోనే. చిత్రలేఖనంద్వారా తన వ్యక్తిత్వాన్ని నిరూపించుకుంది.

హాలీ తన కర్మని మనసా నమ్మి స్వీకరించింది తను కోరుకున్నది అది కాకపోయినా.

భాగ్యంగారి నమ్మకాలు మరొక రకం. ఆవిడ నమ్మకాలలో సందేహాలు లేవు.

మూడేళ్ల గగనని తలుచుకుంటే నవ్వొస్తోంది. "నాకు అల్లరి చెయ్యడం బాగుంటుంది" అని చెప్పగలిగింది.

వీళ్లందరూ తనమార్గం నిర్దుష్టం చేసుకోడానికి కారణభూతులు అయేరు. జీవితంలో అనేకకోణాలు -- సంగీతం, సాహిత్యం, ధార్మికం, ఆధ్యాత్మికం, లౌక్యం - పరిచయం చేసేరు.

తను కూడా చాతకపక్షులు వానచినుకులకోసం ఎదురు చూసినట్టు ఒక నిర్దుష్టమయిన, స్వచ్ఛమయిన బతుకుకోసం ఎదురు చూస్తూ ఇంతకాలం గడిపేసింది. అంతే. వానచినుకులు కురియడం అయాచితంగా, ఒకరి ప్రమేయం లేకుండా జరుగుతుంది. తను కూడా అలాగే తన అభీష్టమేదో అది దానంతట అదే వచ్చి ఒళ్లో వాలుతుందని ఎదురు చూసినట్టు ఇప్పుడు తెలుస్తోంది.

"నాజీవితంలో ప్రవేశించిన ప్రతిఒక్కరికీ ధ్యేయం వుంది. నేను మాత్రం చాతకపక్షిలా వాటంతట అవే కురిసే వానచినుకులకోసం ఎదురు చూస్తున్నాను" అనుకుంది గీత నిట్టూర్చి.

తన జీవితంలో అన్నిటికంటే ఘోరమయిన విషాదం అదేనేమో - నాకు ఫలానాది కావాలి అని నిర్ణయించుకోలేకపోవడం, దానికోసం ప్రయత్నించకపోవడం.

తపతీ, అచలా గీతని మర్చిపోలేదు. అప్పుడప్పుడు పిలిచి మాట్లాడుతూంటారు. రారమ్మని పిలుస్తూంటారు. గీతకి ఆనందంగా వుంటుంది తనయందు ఇంత అభిమానం చూపించేవారు వున్నారని తలుచుకున్నప్పుడు.

***

ఊరికి ఉత్తరపు పొలిమేరల్లో ఒక చిన్న ఇంటిముందు పంచలో కూర్చుని గీత వంచిన తల ఎత్తకుండా వొళ్లో లాప్టాప్ పెట్టుకుని టైపు చేస్తూంటుంది ఏవేళప్పుడు చూసినా.

ఆదారిన పోయేవారు ఓమారు అటు చూసి ముందుకి సాగి పోతూంటారు.

ఒకరోజు ఒకాయన అడిగాడు, "ఏమిటి రాస్తున్నావు?"

"చరిత్ర"

"ఎందుకు?"

"నా తృప్తికోసం."

"ఏళ్లతరబడి చూస్తున్నాను .... ఎప్పుడు అవుతుంది?"

"అవదు. చరిత్రకి అయిపోవడం ఏమిటి?."

***

నిడదవోలు మాలతి సాహిత్య వ్యాసంగం.

పుస్తకాలుః

1. *నిజానికీ ఫెమినిజానికీ మధ్య కథల సంకలనం.* (Vizainagaram: BSR Foundation, 2005)

2. *A Spectrum of My People: A Collection of short stories from Andhra Pradesh,* translated by Malathi Nidadavolu. Mumbai: Jaico, 2006

3. All I Wanted was to Read and other stories. 2008. (available only in the U.S.)
4. *Telugu Women Writers, 1950-1975. A Unique Phenomenon in the History of Telugu fiction. (A Critical study.)* 2008 (available only in the U.S.)
5. *Quiet and Quaint: Telugu Women's writing, 1950-1975. Hyderabad*: Potti Sreeramulu Telugu University, 2009.
6. *From my Front Porch: An Anthology of short stories by Telugu writers*, translated by Malathi Nidadavolu. Delhi: Central Sahitya Akademi, 2009.

Websites:
www.thulika.net, devoted exclusively to Telugu fictiNidadavolu Malathion by Telugu writers and analytical articles on Telugu fiction.
http://tethulika.wordpress.com. తెలుగులో మాలతి కథలూ, వ్యాసాలూ, కవితలూ..

http://enghulishthulika.wordpress.com. ఇంగ్లీషులో మాలతి కథలూ, వ్యాసాలూ, కవితలూ.

రచయిత్రి వివరాలు:

తెవికిలో - నిడదవోలు మాలతి
On en.wikipedia.org - Nidadavolu Malathi